
'మట్టిని నమ్ముకున్న వ్యక్తి రాబోయే రోజుల్లో ధనవంతుడు కావాలి'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 5.50

సంపుటి: 16 సంచిక: 160

బుధవారం 30-8-2023


SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



మిగిలింది వారమే..

'చంద్రయాన్‌-3 మిషన్‌' చివరి దశకు చేరింది. చంద్రుడి ఉపరితలంపై వివిధ లోహాలతో పాటు సల్ఫర్‌ ఉన్నట్లు రోవర్‌ ప్రజ్ఞాన్‌ తాజాగా నిర్ధారించింది. హైడ్రోజన్‌ కోసం అన్వేషణ సాగిస్తోంది. అలాగే చంద్రుడి ఉపరితలంపై మట్టి స్వభావాన్ని విశ్లేషించనుంది. మరో 7 రోజుల్లో అది అందించే సమాచారంపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.

6లో



యూటీ హోదా శాశ్వతం కాదు

జమ్మూకశ్మీర్‌కు కల్పించిన కేంద్రపాలిత ప్రాంత హోదా శాశ్వతం కాదని కేంద్రం సుప్రీంకోర్టుకు తెలిపింది.

- వివరాలు 6లో



'ఆసియా' సమరానికి సై

నేటి నుంచి ఆసియా కప్‌ వన్డే టోర్నీ. బరిలో ఆరు జట్లు. తొలి పోరులో నేపాల్‌తో పాక్‌ 'ఢీ'. భారత్, పాక్‌ 3 సార్లు తలపడే అవకాశం.

- వివరాలు 12లో



రాహుల్‌ యూరప్‌ పర్యటన

రాహుల్‌గాంధీ సెప్టెంబర్‌లో యూరప్‌ దేశాల్లో పర్యటించనున్నారు. ఫ్రాన్స్, బ్రస్సెల్స్, ఓస్లోలో జరిగే వివిధ కార్యక్రమాల్లో పాల్గొంటారు.

- వివరాలు 6లో



ఆయుర్దాయానికి కాలుష్య కాటు

ప్రపంచంలోనే అత్యంత కలుషిత నగరం ఢిల్లీ అని తేలింది. ఢిల్లీవాసులు ఆయుర్దాయంలో 11.9 ఏళ్లు కోల్పోతున్నారు.

- వివరాలు 6లో

'నామ్‌'కే వాస్తే లిస్ట్‌!

అభ్యర్థుల వడపోతపై వాడీవేడిగా ప్రదేశ్‌ ఎన్నికల కమిటీ సమావేశం

పేర్లు చూసి టిక్కు పెట్టాలా?

ఆశావహుల పూర్తి వివరాలేవీ లేకుండా టికెట్లపై ఎలా నిర్ణయం తీసుకోవాలన్న సీనియర్లు

మళ్లీ నివేదిక ఇవ్వాలని సూచన

- పొత్తులపై ఆచితూచి నిర్ణయం తీసుకోవాలన్న సభ్యులు.. గతంలో మాదిరిగా ఓట్లు బదిలీ కావడం లేదనే చర్చ
- అభ్యర్థుల షార్ట్‌లిస్ట్‌ ప్రక్రియ సెప్టెంబర్‌ 2కు వాయిదా.. 4 నుంచి 6 వరకు స్క్రీనింగ్‌ కమిటీ పర్యటన
- సీడబ్ల్యూసీ తొలి భేటీ హైదరాబాద్‌లో నిర్వహించాలని తీర్మానం



గాంధీభవన్‌లో జరిగిన సమావేశంలో పాల్గొన్న నేతలు జానారెడ్డి, మధుయాష్కీగౌడ్, వీహెచ్, భట్టి విక్రమార్క, రేవంత్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొన్నాల, మహేశ్‌కుమార్‌గౌడ్‌

60 చోట్ల భారీగా దరఖాస్తులు

కాంగ్రెస్‌ టికెట్ల కోసం దరఖాస్తుల ప్రక్రియను పరిశీలిస్తే.. 60 నియోజకవర్గాల్లో భారీ సంఖ్యలో దరఖాస్తులు వచ్చాయి. 45 నియోజకవర్గాల్లో 10 మందికి పైగా దరఖాస్తు చేసుకోగా, 5 నియోజకవర్గాల్లో 9 చొప్పున, 10 నియోజకవర్గాల్లో 8 చొప్పున దరఖాస్తులు వచ్చాయి. కొడంగల్, జగిత్యాలలో కేవలం ఒక్క దరఖాస్తు మాత్రమే రాగా, మిగిలిన చోట్ల 2 నుంచి 7 వరకు వచ్చాయి. అత్యధికంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లెందులో 32 దరఖాస్తులు రావడం గమనార్హం.

సాక్షి, హైదరాబాద్‌: వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల వడపోతపై మంగళవారం జరిగిన ప్రదేశ్‌ ఎన్నికల కమిటీ (పీఈసీ) సమావేశం వాడీవేడిగా జరిగింది. సీనియర్‌ నేతలు కొందరు పలు అంశాలపై సందేహాల పేరిట ఆగ్రహం వ్యక్తం చేశారు. టీపీసీసీ ఇచ్చిన ఆశావహుల జాబితాలో పేర్లు తప్ప ఎలాంటి సమాచారం లేకపోవడంపై జానారెడ్డి, జీవన్‌రెడ్డి, పొన్నాల లక్ష్మయ్యలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. పోటీ చేయడానికి దరఖాస్తు చేసుకున్న వారి వివరాలేవీ లేకుండా కేవలం జాబితా ఇచ్చేసి టిక్కులు పెట్టమంటే ఎలా అంటూ మండిపడ్డారు. ఒక కుటుంబంలో ఒకరికంటే ఎక్కువ టికెట్ల అంశంపై సీనియర్‌ నేతల మధ్య వాగ్వివాదం చోటు చేసుకున్నట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో పీఈసీ వడపోత కార్యక్రమాన్ని సెప్టెంబర్‌ 2వ తేదీకి వాయిదా వేసింది. ఆ రోజు జరిగే సమావేశంలో తుది నిర్ణయం తీసుకుందామని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి నేతృత్వంలో గాంధీభవన్‌లో జరిగిన భేటీలో నిర్ణయం తీసుకున్నారు. ఈ సమావేశంలో పీఈసీ సభ్యులు భట్టి విక్రమార్క, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, జీవన్‌రెడ్డి, దామోదర రాజనర్సింహ, పొన్నాల లక్ష్మయ్య, వి.హన్మంతరావు, శ్రీధర్‌బాబు, జగ్గారెడ్డి, సీతక్క, మహేశ్‌కుమార్‌గౌడ్, అంజన్‌కుమార్‌ యాదవ్, షబ్బీర్‌ అలీ, మధుయాష్కీ గౌడ్, రేణుకా చౌదరి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, బలరాం నాయక్, సంపత్‌కుమార్, వంశీచంద్‌రెడ్డి, ప్రేంసాగర్‌రావు, సునీతారావు, శివసేనారెడ్డి, బల్మూరి వెంకట్, మిద్దెల జితేందర్‌లు పాల్గొన్నారు. అభ్యర్థుల ఖరారులో అనుసరించాల్సిన మార్గదర్శకాలు, వచ్చే ఎన్నికలకు ఎలాంటి వ్యూహాలు రూపొందించాలి, ఇతర

మిగతా 2వ పేజీలో ▶

గ్యాస్‌ బండ రూ. 200 తగ్గింది



ఎన్నికల ముందు కేంద్ర మంత్రివర్గం కీలక నిర్ణయం	ఓనం, రాఖీపౌర్ణమి సందర్భంగా మహిళలకు మోదీ సర్కారు కానుక

నేటి నుంచి దేశవ్యాప్తంగా అమల్లోకి రానున్న తగ్గింపు ధర

'ఉజ్వల యోజన' లబ్ధిదారులకు సైతం వర్తింపు

"వంటగ్యాస్‌ సిలిండర్‌ ధర తగ్గింపు నిర్ణయానికి ఎన్నికలతో ఎలాంటి సంబంధం లేదు. ఇది ఓనం, రక్షాబంధన్‌ పండుగల సందర్భంగా మహిళలకు మోదీ ప్రభుత్వం ఇస్తున్న కానుక.

- అనురాగ్‌ ఠాకూర్, కేంద్ర సమాచార, ప్రసారశాఖ మంత్రి

6లో

ప్రజలపై ఆర్థిక భారం తగ్గించడమే లక్ష్యంగా చేపట్టిన చర్యల్లో భాగంగానే గ్యాస్‌ సిలిండర్‌ ధరను తగ్గించాం. ప్రజల సంక్షేమంపై ప్రభుత్వ చిత్తశుద్ధి, అంకితభావానికి ఇదొక నిదర్శనం.

- కేంద్ర ప్రభుత్వం

ఏబీపీఎస్‌కు మారితేనే ఉపాధి కూలి జమ



జాతీయ ఉపాధిహామీ చట్టం కింద ఉపాధి పొందాలంటే తప్పనిసరిగా ఆధార్‌ ఆధారిత చెల్లింపు బ్రిడ్జి సిస్టమ్‌ (ఏబీపీఎస్‌)కు మారాల్సిందే. గతంలో మూడు నాలుగు పర్యాయాలు ఈ డెడ్‌లైన్‌ మారినా, ఇకపై ఎలాంటి పొడిగింపులు ఉండవని తెలుస్తోంది. ఆగస్టు 31 వరకే బ్యాంక్‌ ఖాతా ఆధారిత, ఆధార్‌ ఆధారిత పద్ధతుల్లో పేమెంట్స్‌ చేస్తారు. ఇకపై ఏఈపీఎస్‌ కాకుండా, సెప్టెంబర్‌ 1 నుంచి ఏబీపీఎస్‌ అనుసరిస్తున్నారనే విషయాన్ని గమనించాలని అధికారులు చెబుతున్నారు.

- వివరాలు 5లో

ఇక్కడా మహిళలకు.. 'ఆర్టీసీ'లో ఉచితం!



ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం'.. ఇప్పుడు ఈ అంశంపై రాజకీయ పార్టీలు దృష్టి సారించాయి. కర్ణాటకలో కాంగ్రెస్‌ అధికారంలోకి రావడానికి ఈ హామీ కీలకభూమిక పోషించిందనేది రాజకీయ విశ్లేషకుల అంచనా. కాగా అదే తరహాలో తెలంగాణలోనూ ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం హామీని మేనిఫెస్టోలో పెట్టే అంశం కాంగ్రెస్‌ పరిశీలనలో ఉంది. మరోపక్క.. దీనిపై ఆలోచన చేయాలంటూ తాజాగా బీఆర్‌ఎస్‌ నేతలు కూడా మంత్రుల దృష్టికి తెస్తున్నారు.

- వివరాలు 3లో

న్యూస్‌రీల్‌

75 గజాల్లో 'జీ+1' నిర్మాణం అనుమతికి 4 మార్గాలు



ప్లాట్‌ ఏరియా 75 చదరపు గజాలలోపు ఉండే జీ+1 భవన నిర్మాణ అనుమతికి నాలుగు సులభమైన మార్గాలు ఉన్నాయని ప్రభుత్వ ప్రత్యేక ప్రధానకార్యదర్శి అర్వింద్‌కుమార్‌ పేర్కొన్నారు. టీఎస్‌ బీపాస్‌ ద్వారా ఈ రిజిస్ట్రేషన్‌ ప్రక్రియ పూర్తి చేయవచ్చని తెలిపారు.

- వివరాలు 14లో

615 'ఎలక్ట్రిక్‌' చార్జింగ్‌ కేంద్రాలు!



గ్రేటర్‌ హైదరాబాద్‌ మినహా రాష్ట్రంలోని 615 ప్రాంతాల్లో పబ్లిక్‌ ప్రైవేటు భాగస్వామ్య పద్ధతిలో ఎలక్ట్రిక్‌ వాహనాల చార్జింగ్‌ కేంద్రాల ఏర్పాటుకు ప్రైవేటు వ్యక్తుల నుంచి రెడ్కో దరఖాస్తులను ఆహ్వానించింది. గ్రేటర్‌లో ఇప్పటికే 90 కేంద్రాలు వినియోగంలోకి వచ్చాయని తెలిపింది.

- వివరాలు 5లో

1901 తర్వాత అత్యంత పొడి ఆగస్ట్‌

దేశవ్యాప్తంగా తీవ్ర వర్షాభావ పరిస్థితులు కొనసాగుతున్నాయి. ఆగస్ట్‌ నెలలో వర్షాలు ఇంత తక్కువగా నమోదు కావడం 1901 తర్వాత ఇదే మొదటిసారని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) తెలిపింది. - 6లో


జూనియర్‌ అసిస్టెంట్‌ గ్రేడ్‌-2 పరీక్ష రద్దు

14లో

సింగరేణికి హైకోర్టు షాక్‌

శాశ్వత నివాసితులైతే స్థానికులే..

- నాలుగేళ్లు ఇక్కడే చదవాలన్న నిబంధన వారికి వర్తించదు
- ఎంబీబీఎస్, బీడీఎస్‌ అడ్మిషన్లపై హైకోర్టు కీలక తీర్పు
- స్థానిక కోటాలో సీట్లు కేటాయించాలని హెల్త్‌ వర్సిటీకి ఆదేశం



సాక్షి, హైదరాబాద్‌: వైద్య విద్య సీట్ల భర్తీకి సంబంధించి హైకోర్టు కీలక తీర్పు వెలువరించింది. శాశ్వత నివాసితులైన విద్యార్థులను స్థానికులుగానే పరిగణించాలని స్పష్టం చేసింది. దీనిప్రకారం 2023–24 ఎంబీబీఎస్, బీడీఎస్‌ సీట్లను భర్తీ చేయాలని కాళోజీ నారాయణరావు హెల్త్‌ యూనివర్సిటీని ఆదేశించింది. అయితే ప్రభుత్వ అధికారి జారీ చేసిన ఏదైనా స్థానిక సర్టిఫికెట్‌ను వర్సిటీకి సమర్పించాలని పిటిషనర్లకు చెప్పింది. తీర్పు వెలువరించిన తేదీ నుంచి వారం రోజుల్లోగా సర్టిఫికెట్‌ను అందజేయాలని పేర్కొంది. ఈమేరకు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్‌ అలోక్‌ అరాధే, జస్టిస్‌ వినోద్‌కుమార్‌ ధర్మాసనం మంగళవారం ఉత్తర్వులు వెలువరించింది.

ఆ నిబంధన వర్తించదు

'తెలంగాణ మెడికల్, డెంటల్‌ కాలేజీల అడ్మిషన్‌ నిబంధనలు–2017లోని 3 (iii)(బీ) ప్రకారం విద్యార్థిని స్థానికుడిగా పరిగణించాలంటే అర్హత పరీక్ష(నీట్‌)కు ముందు నాలుగేళ్లు తెలంగాణలోనే చదివి ఉండాలని చెబుతోందని.. ఈ నిబంధన రాజ్యాంగంలోని ఆర్టికల్‌ 14ను ఉల్లంఘిస్తోందని న్యాయస్థానం అభిప్రాయపడింది. ఇలాంటి నిబంధనను తప్పుబడుతూ గతంలో సుప్రీంకోర్టు పలు

మిగతా 2వ పేజీలో ▶



నాణేనికి అటు.. ఢిల్లీలో డ్రామా!

- ఎంపిక చేసుకున్న విలేకరుల సమావేశంలో బీజేపీపై చంద్రబాబు ప్రేమ బాణాలు.. తాను మొదటి నుంచి కేంద్రంలో పొత్తులోనే ఉన్నాడట..
- రెండో రోజూ హస్తినలో మోదీ సర్కారుపై ప్రేమ ఒలకబోసిన చంద్రబాబు

10లో



టీచర్‌ పోస్టుల లెక్కలు వేరయా!

విద్యాశాఖ లెక్క తేల్చింది	ప్రభుత్వం ప్రకటించింది
22,000	13,000
నియామకం జరిగేవి	5,000

పేపర్‌పై హేతుబద్ధీకరణే కారణమా?

వివరాలు 3లో

క్లుప్తంగా...

నేడు 'పట్నం' పదవీ బాధ్యతల స్వీకరణ



సాక్షి, హైదరాబాద్: డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ సచివాలయంలో బుధవారం మధ్యాహ్నం రెండుగంటలకు రాష్ట్ర సమాచార, పౌర సంబంధాలు, గనులు, భూగర్భ వనరులశాఖ మంత్రిగా పట్నం మహేందర్‌రెడ్డి పదవీ బాధ్యతలు స్వీకరించనున్నారు. మంగళవారం ఆయాశాఖల అధికారులు మంత్రిని మర్యాద పూర్వకంగా కలిసి సత్కరించారు. మంత్రిని కలిసిన వారిలో సమాచారశాఖ డైరెక్టర్ రాజమౌళి, అడిషనల్ డైరెక్టర్ నాగయ్య కాంబ్లీ, జాయింట్ డైరెక్టర్ జగన్, శ్రీనివాస్, వెంకటరమణ, డీడీలు మధుసూదన్, రాజారెడ్డి, సీఐఈ రాధాకిషన్, మీడియా అకాడమీ కార్యదర్శి వెంకటేశ్వర్‌రావు తదితరులున్నారు. ఈనెల 24న రాష్ట్రమంత్రిగా పట్నం మహేందర్‌రెడ్డి ప్రమాణ స్వీకారం చేసిన విషయం తెలిసిందే.

పారామెడికల్ కోర్సుల్లో ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్

ప్రభుత్వ ఉత్తర్వుల జారీ

సాక్షి, హైదరాబాద్: ఆర్థికంగా వెనుకబడిన తరగతులకు (ఈడబ్ల్యూఎస్) కల్పించే 10 శాతం రిజర్వేషన్‌ను.. పారా మెడికల్ కోర్సులకు వర్తింపజేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. బీపీటీ, ఎంపీటీ, ఎంఎస్సీ (నర్సింగ్), పీబీ బీఎస్సీ (నర్సింగ్) కోర్సుల్లో రిజర్వేషన్ అమలుకు చర్యలు తీసుకోవాలని కాళోజీ నారాయణరావు ఆరోగ్య విశ్వవిద్యాలయానికి రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ ఆదేశాలు జారీ చేసింది. తాజా నిర్ణయంతో బీపీటీలో 69 సీట్లు, ఎంపీటీలో 6 సీట్లు, ఎంఎస్సీ నర్సింగ్‌లో 25 సీట్లు, పీబీబీఎస్సీలో 23 సీట్లు ఆ కేటగిరీ విద్యార్థులకు రిజర్వ్ కానున్నాయి. ఇప్పటికే ఎంబీబీఎస్, బీడీఎస్, ఆయుష్, అనుబంధ హెల్త్ సైన్స్, బీఎస్సీ నర్సింగ్ సీట్లలో 10 శాతం రిజర్వేషన్లను ప్రభుత్వం అమలు చేస్తోంది. ఎంబీబీఎస్‌లో 203 సీట్లు, ఇతర పారా మెడికల్ కోర్సుల్లోని కాంపిటెంట్ కోటాలో 648 సీట్లు రిజర్వ్ అవుతాయి. ఆర్థికంగా వెనుకబడిన తరగతుల విద్యార్థులకు అవకాశాలు కల్పించే ఉద్దేశంతో సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు 10 శాతం రిజర్వేషన్లు కేటాయించాలని నిర్ణయించినట్టు వైద్య ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు తెలిపారు.

ప్రభుత్వాస్పత్రుల్లో ఏడాది పాటు పనిచేయాల్సిందే..

మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ ఆదేశాలు



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని 26 ప్రభుత్వ మెడికల్ కాలేజీల ఆస్పత్రుల్లో 1,159 స్పెషలిస్ట్ డాక్టర్లకు కంపల్సరీ గవర్నమెంట్ సర్వీస్ కింద ఏడాది కాలంపాటు పోస్టింగ్ ఇస్తూ మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ ఆదేశాలు జారీచేశారు. పీజీ వైద్యవిద్య పూర్తి చేసినవారు తప్పనిసరిగా ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఏడాది పాటు పనిచేయాల్సి ఉంటుంది. ఈ నిబంధన మేరకు మెరిట్ ఆధారంగా రెండు రోజుల పాటు కౌన్సెలింగ్ నిర్వహించి, వారు కోరుకున్న టీచింగ్ హాస్పిటల్‌లో అవకాశం కల్పించింది. జనరల్ సర్జరీ, జనరల్ మెడిసిన్, ఆర్థో, గైనిక్, ఈఎన్టీ, అనస్థీషియాసహా మొత్తం 24 రకాల ప్రత్యేక వైద్యసేవలు వీరి ద్వారా ప్రజలకు అందనున్నాయి. స్పెషలిస్టు డాక్టర్ల రాకతో గ్రామీణ ప్రజలకు మరింత నాణ్యమైన వైద్యసేవలు అందనున్నాయి.

పీజీ కోర్సుల్లో ప్రవేశాలకు మొదటి విడత కౌన్సెలింగ్

ఉస్మానియా యూనివర్సిటీ (హైదరాబాద్): రాష్ట్రంలోని వర్సిటీల్లో వివిధ పీజీ కోర్సుల్లో ప్రవేశాలకు మొదటి విడత కౌన్సెలింగ్ (రిజిస్ట్రేషన్) షెడ్యూల్‌ను మంగళవారం విడుదల చేశారు. టీఎస్‌సీపీఈటీ-2023 అర్హత సాధించిన అభ్యర్థులు సెప్టెంబర్ 5 నుంచి 15వ తేదీ వరకు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్లు, 19న సర్టిఫికెట్ వెరిఫికేషన్స్, 20 నుంచి 22 వరకు వెబ్‌ఆప్షన్స్, 23న వెబ్ ఆప్షన్ ఎడిటింగ్, 26న సీట్లు పొందిన విద్యార్థుల మొదటి జాబితా విడుదల, 29న సీట్లు సాధించిన విద్యార్థులు ఆయా కాలేజీల్లో రిపోర్ట్ చేయాల్సి ఉంటుంది. అక్టోబర్ 1న రెండో విడత కౌన్సెలింగ్‌కు రిజిస్ట్రేషన్లు ప్రారంభం కానున్నట్లు కన్వీనర్ పాండురంగారెడ్డి తెలిపారు.



పెద్దల వ్యాక్సినేషన్‌కు.. పరేషాన్!



సాక్షి, హైదరాబాద్

వివిధ రకాల అంటురోగాల నివారణ కోసం పిల్లలకు వ్యాక్సిన్లు వేయిస్తూ ఉంటాం. అలాగే పెద్దలకూ పలు రకాల జబ్బులు రాకుండా వ్యాక్సిన్లు ఉంటాయి. కానీ వాటిని తీసుకునేవారు చాలా తక్కువ. ఇలాంటి వ్యాక్సిన్లపై అవగాహన లేకపోవడం ఒక కారణమైతే.. టీకాలు అంటే కేవలం పిల్లలకేననే అభిప్రాయం మరో కారణం. 'అసోసియేషన్ ఆఫ్ ఫిజీషియన్స్ ఇన్ ఇండియా (ఏపీఐ)', ప్రముఖ పరిశోధన సంస్థ ఇప్సోస్‌లు సంయుక్తంగా నిర్వహించిన అధ్యయనంలో ఈ వివరాలు వెల్లడయ్యాయి. భారతదేశంలో వయోజనుల వ్యాధి నిరోధక టీకాల స్వీకరణ తక్కువగా ఎందుకు ఉందన్న అంశంపై హైదరాబాద్ సహా దేశవ్యాప్తంగా 16 నగరాల్లో ఈ అధ్యయనం నిర్వహించారు. 50 ఏళ్లు దాటిన వయోజనులు, వారి సంరక్షకులు, వైద్యులను కలసి సర్వే చేశారు. ఈ సందర్భంగా.. 50 ఏళ్లు, ఆపై వయసున్న వారిలో 71 శాతం మందికి వ్యాక్సినేషన్ గురించి అవగాహన ఉన్నా.. కేవలం 16 శాతం మంది మాత్రమే వయోజన వ్యాక్సిన్లను తీసుకున్నట్టు తేలింది. దీనికి రోగులు, వైద్యులు పలు రకాల కారణాలు చెప్తుండటం గమనార్హం.

ఎన్నో వ్యాధులకు నివారణ టీకాలున్నా.. అవగాహన సున్నా

- వీటి గురించి తెలిసినా తీసుకుంటున్నవారు చాలా తక్కువ
- టీకాలంటే పిల్లలకేననే అభిప్రాయం
- ఏపీఐ, ఇప్సోస్ సంయుక్త అధ్యయనంలో వెల్లడి
- వయోజన ఇమ్యునైజేషన్‌కు ఎలాంటి మార్గదర్శకాలు లేవంటున్న వైద్య నిపుణులు
- కోవిడ్ టీకా తరహాలో అవగాహన చేపట్టాల్సిన అవసరం ఉందని వెల్లడి

హైదరాబాదీల్లో అవగాహన ఉన్నా..

హైదరాబాద్ నగరంలో 50 ఏళ్లు దాటిన వయోజనుల్లో 53% మంది తమకు వ్యాక్సినేషన్ గురించి అవగాహన ఉందని చెప్పారు. కానీ వారిలో కేవలం 4% మందే వయోజన వ్యాక్సిన్లు తీసుకున్నారు. హైదరాబాద్‌లో 67 శాతం మంది కోవిడ్ కాకుండా ఇతర వ్యాధులు టీకాలు వేయాల్సినంత తీవ్రంగా లేవని భావిస్తున్నారు. పెద్దల్లో 67 శాతం, వారి సంరక్షకుల్లో 82% మంది వయోజన వ్యాక్సిన్‌లు అందుబాటు ధరల్లో లేవని చెప్తున్నారు. ఇక 81శాతం మంది టీకాలు తీసుకోవాలని వైద్యులు చెప్తే విశ్వసిస్తామని చెప్పారు. కానీ తమకు వైద్యులు వ్యాక్సిన్లను సిఫార్సు చేశారని 7 శాతం మందే చెప్పడం గమనార్హం. జాతీయ స్థాయిలో సగటున 16 శాతం వైద్యులు వయోజన వ్యాక్సినేషన్‌ను సిఫార్సు చేస్తున్నట్టు సర్వేలో తేలగా.. దక్షిణాదిలో వారు 10 శాతమే.

పెద్దల్లో అవగాహన కల్పించాలి

పిల్లల్లో రోగనిరోధకత ఆవశ్యకతను ప్రజలు బాగానే అర్థం చేసుకున్నప్పటికీ పెద్దల్లో అవగాహన లేదు. సందర్భాన్ని బట్టి టెటనస్ టాక్సాయిడ్, యాంటీ-రేబిస్ టీకా వంటివి మినహా పెద్దలు ఇతర వ్యాక్సిన్లను అవసరాలకు తగ్గట్టుగా తీసుకోవడం లేదు. దీనిపై అవగాహన కల్పించాల్సి ఉంది.

- బిపిన్ కుమార్ సేథీ, అసోసియేషన్ ఆఫ్ ఫిజీషియన్స్ ఆఫ్ ఇండియా ప్రతినిధి

మార్గదర్శకాలు ఏవీ లేక..

వయోజన ఇమ్యునైజేషన్‌కు సంబంధించి ఎలాంటి మార్గదర్శకాలు లేకపోవడం వల్ల.. వ్యాక్సినేషన్‌పై ప్రజల్లో ఆసక్తి లేదని సర్వేలో పాల్గొన్నవారిలో 90 శాతానికిపైగా వైద్యులు చెప్పారు. తమకంటూ ఉన్న కొన్ని పరిమితుల వల్ల కూడా పెద్దలకు వ్యాక్సినేషన్ గురించి చర్చించే పరిస్థితి లేదని పేర్కొన్నారు. ఇక నివారణ కంటే చికిత్సకు రోగులు ప్రాధాన్యత ఇస్తారని భావించడం కూడా ఒక కారణమేనని అంటున్నారు. పెద్దల్లో 69 శాతం మంది, వారి సంరక్షకుల్లో 76 శాతం మంది వయోజన టీకా గురించి వైద్యులను ఎప్పుడూ అడగలేదని.. అవసరమైతే వైద్యులే తమకు సిఫార్సు చేస్తారని భావిస్తున్నామని సర్వేలో వెల్లడించారు. వయోజనులు టీకా తీసుకోవడం పెరగాలంటే.. కోవిడ్ వ్యాక్సినేషన్ కోసం చేపట్టిన తరహాలో అవగాహన చర్యలు చేపడితే ప్రయోజనం ఉంటుందని వయోజనుల్లో 55 శాతం, వారి సంరక్షకుల్లో 48 శాతం మంది అభిప్రాయపడ్డారు.

అపోహలతోనూ దూరం..

వయోజన వ్యాక్సినేషన్ గురించి ఉన్న కొన్ని అపోహలు పెద్దలు టీకాలు తీసుకోకుండా నిరోధిస్తున్నట్టు అధ్యయనంలో వెల్లడైంది. దశలవారీగా వ్యాక్సిన్ డోస్‌లను తీసుకుంటే.. తాము అతిగా టీకాలపై ఆధారపడేలా మారుతామని వయోజనుల్లో 50 శాతానికిపైగా నమ్ముతున్నారని తేలింది. వయోజనుల్లో 58%, వారి సంరక్షకుల్లో 62% మంది రోగాల నుంచి రక్షించుకోవడానికి టీకా కంటే మెరుగైన మార్గాలు ఉన్నాయని భావిస్తున్నారని వెల్లడైంది.

'షింగిల్స్'పై అవగాహన లేదు

పెద్దల్లో వచ్చే ప్రధానమైన, వ్యాక్సిన్ ద్వారా నివారించగల వ్యాధి షింగిల్స్. దీని నివారణ గురించి ప్రజల్లో అవగాహన తక్కువగా ఉన్న నేపథ్యంలో.. ఈ అంశంపై విడిగా సర్వే నిర్వహించారు. పిల్లల్లో చికెన్‌పాక్స్‌కు కారణమయ్యే వైరస్ వల్ల పెద్దవారిలో షింగిల్స్ వ్యాధి వస్తుంది. చర్మంపై కురుపులతో నొప్పి, బాధాకరమైన పరిస్థితి కొన్ని వారాల నుంచి నెలల పాటు ఉంటుంది. షింగిల్స్‌కు, ఇతర చర్మ సంబంధ సమస్యల మధ్య తేడాను గుర్తించడం కష్టం. దీంతో రోగ నిర్ధారణ ఆలస్యమై చికిత్స ప్రభావం తక్కువగా ఉంటుంది. అధ్యయనంలో పాల్గొన్నవారిలో 72 శాతం మందికి ఈ వ్యాధి గురించి తెలియదు. ఒకవేళ దీనికి గురైనా, మళ్లీ వచ్చే అవకాశం ఉంటుందని.. వ్యాక్సిన్ల ద్వారా దీన్ని నివారించవచ్చని 73శాతం మందికి తెలియదని సర్వేలో తేలింది.

'ధూపదీప నైవేద్యం' రూ.10 వేలు

- చిన్న ఆలయాలకు ఇచ్చే నిధులను పెంచిన రాష్ట్ర సర్కారు
- ఇందులో పూజాదికాలకు రూ.4 వేలు.. అర్చకులకు రూ.6 వేలు!



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర దేవాదాయ శాఖ ఆధీనంలోని అతి తక్కువ ఆదాయ వనరులున్న చిన్న ఆలయాలకు ధూపదీప నైవేద్యం పథకం కింద నిధులను ప్రభుత్వం పెంచింది. ఆ ఆలయాలకు ఇప్పటి వరకు ఇస్తున్న రూ.6 వేలను రూ.10 వేలకు పెంచుతూ దేవాదాయ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ధూపదీప నైవేద్యం పథకం కింద గుర్తించిన 6,541 ఆలయాలకు ఇది వర్తించనుంది. ఈ పథకం ప్రారంభమైన కొత్తలో ఒక్కో ఆలయానికి రూ.2,500 ఇచ్చేవారు. తర్వాత రూ.6 వేలకు పెంచారు. అందులో రూ.2 వేలు ఆలయంలో పూజాదికాల ఖర్చుకు, మిగతా మొత్తాన్ని అర్చకుడి కుటుంబ పోషణ కోసం అందించేవారు. ఇప్పుడీ మొత్తాన్ని రూ.10 వేలకు పెంచటంతో.. పూజాదికాలకు రూ.4 వేలు, అర్చకుల కుటుంబాలకు రూ.6 వేలు వినియోగించుకునే వీలుంటుందని అంటున్నారు. ఈ పథకం పరిధిలోకి మరిన్ని ఆలయాలను తీసుకురావాలన్న ప్రతిపాదన ఉంది. ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. కాగా.. తెలంగాణ బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ సభ్యుడిగా పాత్రికేయుడు విష్ణుదాస్ శ్రీకాంత్‌ను నియమిస్తూ ప్రభుత్వ సీఎస్ శాంతికుమారి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.

సాంస్కృతిక సారథి కళాకారులకూ ఊరట

ప్రభుత్వ పథకాలపై ప్రజల్లో అవగాహన కల్పించే విధుల్లో ఉన్న సాంస్కృతిక సారథి కళాకారుల వేతనాలను ప్రభుత్వం పెంచింది. తెలంగాణ ఉద్యమ సమయంలో ఊరూరా తిరిగి ప్రజల్లో చైతన్యం కలిగించిన 583 మంది కళాకారులతో.. రాష్ట్ర అవతరణ తర్వాత సాంస్కృతిక సారథి బృందాన్ని ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. వీరికి ప్రస్తుతం రూ.24,514గా ఉన్న వేతనాలను రూ.31,868 చేసింది. 2021 జూన్ 1వ తేదీ నుంచే ఈ పెంపు వర్తిస్తుందని పేర్కొంది. ప్రభుత్వ నిర్ణయం పట్ల సాంస్కృతిక సారథి కళాకారులు హర్షం వ్యక్తం చేశారు. అన్ని జిల్లాల్లో సీఎం కేసీఆర్ చిత్రాలకు స్వర-క్షీరాభిషేకాలు నిర్వహించాలని నిర్ణయించామని కళాకారుల ప్రతినిధులు తెలిపారు.

రాష్ట్రంలో కొత్తగా 20 కేజీబీవీలు

- రికరింగ్ బడ్జెట్‌గా రూ. 60 లక్షలు మంజూరు
- ఉత్తర్వులు జారీ చేసిన విద్యాశాఖ



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో కొత్తగా 20 కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయా (కేజీబీవీ)లను రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేయబోతోంది. ఈ దిశగా మంగళవారం విద్యాశాఖ జీవో జారీ చేసింది. వీటి ఏర్పాటుకు రికరింగ్ బడ్జెట్‌గా రూ.60 లక్షలను మంజూరు చేస్తున్నట్లు పేర్కొంది. జిల్లాల విభజన అనంతరం కొత్తగా ఏర్పడిన మండలాల్లో 20 కేజీబీవీలను ఏర్పాటు చేయాల్సి ఉంది. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదనలు రూపొందించగా, ఆయా ప్రతిపాదనలకు ఆమోదం లభించింది. రాష్ట్ర ఆవిర్భావం సమయంలో 2014లో రాష్ట్రంలో 391 కేజీబీవీలుండేవి. 2017-18లో కొత్తగా 84 కేజీబీవీలను మంజూరు చేశా రు. దీంతో రాష్ట్రంలో కేజీబీవీల సంఖ్య 475కు చేరింది. తాజాగా మంజూరైన వాటి తో వీటి సంఖ్య 495కు చేరింది. వీటిల్లో 245 కేజీబీవీల్లో ఇంటర్ విద్య, మరో 230 కేజీబీవీలను పదోతరగతి వరకు నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే.

కొత్తగా ఏర్పాటు చేసినవి ఇవే..

మావల (ఆదిలాబాద్), బీర్‌పూర్, బుగ్గారం (జగిత్యాల), కొత్తపల్లి, గన్నేరువరం (కరీంనగర్), దంతాలపల్లి (మహబూబాబాద్), మహ్మదాబాద్ (మహబూబ్‌నగర్), నార్సింగి, నిజాంపేట, హవేలి, ఘన్‌పూర్ (మెదక్), నిజామాబాద్ (సౌత్), నిజామాబాద్ (నార్త్), నాగలిగిద్ద, మొగ్గుంపల్లి, వట్‌పల్లి, గుమ్మడిదల, చౌటకూరు (సంగారెడ్డి), దూల్మిట్ట (సిద్దిపేట), చౌడాపూర్ (వికారాబాద్).

ఆన్‌లైన్ వర్చువల్ హియరింగ్‌కు 'రెరా' శ్రీకారం

రియల్ ఎస్టేట్ ఫిర్యాదుల పరిష్కారానికే అంటున్న చైర్మన్ ఎన్.సత్యనారాయణ



సాక్షి, హైదరాబాద్: 'రియల్ ఎస్టేట్' ఫిర్యాదుల సత్వర పరిష్కారానికి ఆన్‌లైన్ వర్చువల్ హియరింగ్ (దృశ్య శ్రవణ) విధానానికి శ్రీకారం చుట్టినట్టు రెరా (రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ అథారిటీ) చైర్మన్ ఎన్.సత్యనారాయణ తెలిపారు. ఈ మేరకు ఆన్‌లైన్ వర్చువల్ హియరింగ్ విధానాన్ని ఆయన రెరా కార్యాలయంలో సభ్యులు జె.లక్ష్మీనారాయణ, కె.శ్రీనివాసరావులతో కలిసి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఓ ఫిర్యాదుదారుడు ఇచ్చిన అర్జీని ఆన్‌లైన్‌లోనే విచారణ జరిపారు. రెరా పూర్తిస్థాయిలో ఏర్పడిన 40 రోజుల్లోనే వర్చువల్ హియరింగ్ విధానాన్ని ప్రారంభించామన్నారు. ప్రపంచంలో ఎక్కడ ఉన్నా, వృద్ధాప్యంలో ఉండి హియరింగ్‌కు హాజరు కాలేని పరిస్థితుల్లో ఉన్నవారు, వర్చువల్ విధానంలో హియరింగ్‌కు హాజరు కావొచ్చని తెలిపారు. తద్వారా త్వరితగతిన ఫిర్యాదులకు పరిష్కారం లభిస్తుందన్నారు. రెరా నిబంధనలు రియల్‌ఎస్టేట్ వ్యాపారులు విధిగా పాటించాలని సత్యనారాయణ కోరారు.

మూడు రియల్ ఎస్టేట్ ప్రాజెక్టులకు షోకాజ్ నోటీసులు

రెరా రిజిస్ట్రేషన్ పొందకుండా శ్రీ లక్ష్మీనరసింహ కంట్రీ-3 పేరుతో ఆలేరు, యాదాద్రిలో వెంచర్లు చేపట్టిన 'నాని డెవలపర్స్'సంస్థకు 'రెరా'షోకాజ్ నోటీసు జారీ చేసింది. అలాగే ఖైరతాబాద్ ప్రేమ్‌నగర్ కాలనీకి చెందిన 'ఆర్నా ఇన్‌ఫ్రా డెవలపర్స్'రెరా రిజిస్ట్రేషన్ పొందకుండా మహేశ్వరం వద్ద ఓపెన్ ప్లాట్లు విక్రయించేందుకు ప్రచారం నిర్వహిస్తుండడంతో షోకాజ్ నోటీసు జారీ చేశారు. కర్మన్‌ఘాట్‌లోని మంద మల్లమ్మ ఎక్స్‌రోడ్డులోని అష్యూర్డ్ ప్రాపర్టీ ప్రైవేట్ లిమిటెడ్ అనే సంస్థ ఆరంబ్, అరణ్య పేరుతో నాగార్జునసాగర్ హైవే, చింతపల్లి, శ్రీశైలం హైవే, ఆమనగల్లు ప్రాంతాల్లో ఓపెన్ ప్లాట్ల బహిరంగ విక్రయాన్ని రెరా రిజిస్ట్రేషన్ పొందకుండా చేపట్టింది. ఈ మేరకు వచ్చిన ఫిర్యాదుతో షోకాజ్ నోటీసు జారీ చేశారు.

ప్రొఫెసర్లకు పునశ్చరణ

- మార్పులపై సమగ్ర అవగాహన
- కొత్త కోర్సులపై సరికొత్త క్లాసులు
- ఎస్సీహెచ్‌ఈ నేతృత్వంలో ప్రణాళిక
- వచ్చే నెల 21 నుంచి నిర్వహణ
- ఉన్నత విద్యా మండలి నిర్ణయం



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాల్లో పనిచేస్తున్న వివిధ విభాగాల అధిపతులు, సీనియర్ ప్రొఫెసర్లకు ప్రత్యేక ఓరియంటేషన్ కార్యక్రమాలు నిర్వహించాలని ఉన్నత విద్యా మండలి నిర్ణయించింది. సెప్టెంబర్ 21 నుంచి మూడు రోజుల పాటు నిర్వహించాలని భావిస్తున్నామని మండలి చైర్మన్ ప్రొఫెసర్ ఆర్ లింబాద్రి తెలిపారు. మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ పునశ్చరణ బాధ్యతలు తీసుకుంటోందని వెల్లడించారు. ఇటీవల జరిగిన ఉన్నత విద్య పాలక మండలి సమావేశంలో ఈ మేరకు చర్చించినట్టు స్పష్టం చేశారు. ఈ వివరాలను లింబాద్రి మంగళవారం మీడియాకు వివరించారు.

అధ్యాపకుల ఆలోచనా ధోరణిని విస్తృతపర్చేందుకు..

దేశవ్యాప్తంగా ఉన్నత విద్య కోర్సుల్లో అనేక మార్పులు చోటు చేసుకుంటున్నాయి. అంతర్జాతీయ విద్యా ప్రమాణాల వైపు వెళ్లాలనే ఆకాంక్ష బలపడుతోంది. ప్రపంచంలోని ప్రఖ్యాత యూనివర్సిటీలు కూడా ఆన్‌లైన్ కోర్సులను అందిస్తున్నాయి. డిజిటల్ యూనివర్సిటీ ప్రాధాన్యత అన్ని స్థాయిలను ఆకర్షిస్తోంది. వివిధ సబ్జెక్టుల మేళవింపుతో, మార్కెట్ అవసరాలకు అనుగుణంగా శాస్త్రీయ విద్యా విధానం విస్తృత స్థాయిలో అందుబాటులోకి వస్తోంది. మరోవైపు ప్రైవేటు యూనివర్సిటీల ఏర్పాటుకూ కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. స్వదేశీ యూనివర్సిటీలు వీటి పోటీని తట్టుకుని నిలబడాల్సిన అవసరం ఏర్పడింది. దీన్ని దృష్టిలో ఉంచుకుని మన రాష్ట్రంలోని యూనివర్సిటీల్లో ఉన్న అధ్యాపకుల ఆలోచనాధోరణిని మరింత విస్తృతపర్చేందుకు ప్రత్యేక ఓరియంటేషన్ చేపడుతున్నట్టు లింబాద్రి తెలిపారు.

శిక్షణ ఇలా...

- విశ్వవిద్యాలయాల్లో పనిచేస్తున్న ప్రధాన విభాగాల ముఖ్య అధికారులను వర్సిటీల వీసీలతో కలిసి ఉన్నత విద్యా మండలి ఎంపిక చేస్తుంది. ఇలా అన్ని యూనివర్సిటీల నుంచి తొలి దశలో వంద మందిని ఎంపిక చేసే అవకాశం ఉంది.
- సీనియర్ అధ్యాపకుడు భవిష్యత్‌లో ఉన్నత విద్యలో కీలకపాత్ర పోషిస్తాడు. ఈ కారణంగా బోధనపై నవీన మెళకువలే కాకుండా, నాయకత్వ లక్షణాలు అవసరం. గ్లోబల్ లీడర్‌గా ఉన్నత విద్యను అర్థం చేసుకునే స్థాయి కల్పిస్తారు.
- మర్రిచెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థలో ఈ దిశగా ప్రత్యేక ఓరియంటేషన్ మెళకువలను నిష్ణాతులు రూపొందిస్తారు. వీటిని అనుభజ్ఞులైన అధికారులు పరిశీలిస్తారు. అర్థమయ్యేలా వివరించే అధికారులతో ప్రత్యేక బోధన తరగతులు నిర్వహిస్తారు.
- అధ్యాపకులతో మొదలయ్యే ఈ పునశ్చరణ తరగతులు తర్వాత దశలో వీసీల వరకూ విస్తరించాలని భావిస్తున్నారు.

'నామ్'కే వాస్తే లిస్ట్!

▶ మొదటి పేజీ తరువాయి

పార్టీలతో పొత్తులు తదితర అంశాలపై రాష్ట్ర కాంగ్రెస్ నేతలు చర్చించారు.

పేర్లిస్తే సరిపోతుందా?

విశ్వసనీయ సమాచారం మేరకు.. సమావేశం ప్రారంభం కాగానే సభ్యులందరికీ నియోజకవర్గాల వారీగా దరఖాస్తుదారుల పేర్లతో కూడిన జాబితా ఇచ్చారు. ప్రతి నియోజకవర్గానికి మూడు పేర్ల చొప్పున టిక్ చేయాలని కోరారు. అయితే జాబితాలో కేవలం పేర్లు మాత్రమే ఉండటంపై జీవన్‌రెడ్డి, జానారెడ్డి, పొన్నాల తదితరులు అభ్యంతరం వ్యక్తం చేశారు. బీసీలకు, మహిళలకు ఎన్ని సీట్లు ఇస్తారన్న అంశంపై ఎలాంటి స్పష్టత లేకుండా, ఆయా నియోజకవర్గాల్లో ఏ వర్గం ఓటర్లు అధికంగా ఉన్నారు? అనే వివరాలు కూడా లేకుండా అభ్యర్థులను ఎలా షార్ట్ లిస్ట్ చేయాలని ప్రశ్నించారు. ఆశావహుల సీనియార్టీ, పార్టీలో హోదా, పూర్వ అనుభవం, పార్టీ కోసం చేసిన సేవ, కులం లాంటి వివరాలేవీ లేకుండా కేవలం పేర్లు చూసి టిక్ పెట్టాలంటే ఎలా పెడతామని జీవన్‌రెడ్డి వ్యాఖ్యానించారు. జానారెడ్డి, పొన్నాల కూడా ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా సామాజిక వర్గాల విశ్లేషణ లేకుండా, ఏ ప్రాతిపదికన ఏ కులానికి టికెట్లు ఎన్ని ఇవ్వాలో నిర్ధారించకుండా, ఆయా నియోజకవర్గాల్లోని సామాజిక వర్గాల ఓటర్లను అంచనా వేయకుండా టిక్కులు చేయడం ఎలా కుదురుతుందని వారు ప్రశ్నించారు. ఆశావహుల పూర్తి వివరాలతో పాటు నియోజకవర్గాల వారీగా ఓటర్ల సామాజిక వివరాలు ఇవ్వాలని, ఇందుకోసం సమగ్ర సర్వే వివరాలను కానీ, ఇప్పటికే ఏఐసీసీకి పంపిన వివరాలను కానీ జత చేయాలని పొన్నాల సూచించారు.

యూత్‌కు ఎన్ని టికెట్లు?

సంగారెడ్డి ఎమ్మెల్యే జగ్గారెడ్డి మాట్లాడుతూ ఎన్ఎస్‌యూఐ, యూత్ కాంగ్రెస్ నేతలకు ఇచ్చే టికెట్లను తొలి జాబితాలోనే ప్రకటించాలని అన్నారు. నియోజకవర్గాల్లో పని చేసేందుకు తగిన సమయం ఇవ్వాలని, ఎన్నికల్లో అన్ని విధాలా వారికి సాయం చేయాలని సూచించారు. యువకులకు ఎన్ని టికెట్లు ఇస్తారో తేల్చాలని మాజీ ఎంపీ అంజన్ కుమార్ యాదవ్ డిమాండ్ చేశారు. కుటుంబంలో ఒకరి కంటే ఎక్కువ టికెట్లు ఇచ్చే పక్షంలో తన కుమారుడు కూడా యూత్ కాంగ్రెస్‌లో చురుగ్గా పని చేస్తున్నందున తనతో పాటు తన కుమారుడికి అవకాశం కల్పించాలని కేంద్ర మాజీ మంత్రి బలరాం నాయక్ కోరారు. బీసీలకు ఎన్ని టికెట్లు ఇస్తారో తేల్చాలని వీహెచ్, మహిళలకు తగిన అవకాశాలు కల్పించాలని రేణుకా చౌదరి అన్నారు. ఈ నేపథ్యంలో ప్రస్తుతానికి ముగ్గురిని షార్ట్‌లిస్ట్ చేసే ప్రక్రియను వాయిదా వేయాలని, సెప్టెంబర్ 2న మరోమారు సమావేశమై అన్ని వివరాలతో కూడిన నివేదికలపై చర్చించి వడపోత చేపట్టాలని పీఈసీ నిర్ణయించింది. కుటుంబంలో ఒకరి కంటే ఎక్కువ మందికి టికెట్లు, బీసీలకు ఎన్ని టికెట్లు ఇవ్వాలి? మహిళలకు ఎలాంటి ప్రాతినిధ్యం కల్పించాలనే అంశాలపై వచ్చే నెల 2న జరిగే సమావేశంలోనే నిర్ణయం తీసుకోవాలని పీఈసీ నిర్ణయించింది.

ఎస్సీ, ఎస్టీ, బీసీలతో తొలి జాబితా: మహేశ్‌కుమార్‌గౌడ్

సమావేశానంతరం టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్‌కుమార్‌గౌడ్ విలేకరులతో మాట్లాడారు. పీఈసీ సమావేశంలో దరఖాస్తుదారుల వివరాలను పరిశీలించినట్టు చెప్పారు. దరఖాస్తుదారుల అన్ని వివరాలతో కూడిన నివేదికలపై చర్చించేందుకు సెప్టెంబర్ 2న పీఈసీ మరోమారు సమావేశమవుతుందని తెలిపారు. 4వ తేదీన స్క్రీనింగ్ కమిటీ రాష్ట్రానికి వస్తుందని, కమిటీ చైర్మన్ మురళీధరన్‌తో పాటు సభ్యులు సిద్ధిఖీ, జిగ్నేశ్ మేవానీలు మూడు రోజుల పాటు రాష్ట్రంలోనే ఉండి అన్ని స్థాయిల్లోని నాయకత్వంతో మాట్లాడి నివేదికలు రూపొందిస్తారని చెప్పారు. తొలి జాబితాలో ఎస్సీ, ఎస్టీ, బీసీలకు చెందిన వారి పేర్లు ఉండాలని పీఈసీలో నిర్ణయం తీసుకున్నామని తెలిపారు.

పొత్తు పొరపాట్లు చేయొద్దు

ఈసారి ఎన్నికల్లో లెఫ్ట్‌తో పాటు ఇతర పార్టీలతో పొత్తుల అంశంపై కూడా పీఈసీ సమావేశంలో చర్చ జరిగింది. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ పొత్తుల విషయంలో ఆచితూచి నిర్ణయం తీసుకోవాలని, తొందరపాటు నిర్ణయాలు తీసుకుని పొరపాట్లకు తావివ్వద్దని సూచించారు. 'గతంలో లాగా ఒక పార్టీ నుంచి ఇంకో పార్టీకి ఓట్ల బదిలీ జరగడం లేదు. మనం పొత్తుల పేరుతో వెళ్లి సీట్లు త్యాగం చేయడం వల్ల ప్రయోజనం లేదు. పొత్తుల విషయంలో జాగ్రత్తగా ఉండాలి..' అని వారు చెప్పినట్టు తెలిసింది.

బీఆర్ఎస్‌కు కౌంటర్ వ్యూహం ఉండాలి

బీఆర్ఎస్ ఇప్పటికే ప్రచార రంగంలోకి దిగిపోయిందని, దళిత బంధు లాంటి పథకాల ద్వారా కొత్తగా నియోజకవర్గానికి మరో 10 వేల ఓటు బ్యాంకు తయారు చేసుకుంటోందని, ఈ ఓటు బ్యాంకును కౌంటర్ చేసేలా పార్టీ వ్యూహం ఉండాలని, వీలున్నంత త్వరగా అభ్యర్థుల వడపోత ప్రక్రియను పూర్తి చేసి త్వరలోనే మొదటి జాబితా విడుదల చేయాలని సమావేశంలో పాల్గొన్న నేతలు చెప్పిన ట్లు సమాచారం. కాగా కొత్తగా ఏర్పాటైన కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) తొలి సమావేశాన్ని హైదరాబాద్‌లో నిర్వహించాలని ఏఐసీసీని కోరు తూ సమావేశంలో తీర్మానాన్ని ఆమోదించారు.

కొనుగోలుదారుల హక్కులు పరిరక్షించాలి

రియల్ వ్యాపారులు, ఏజెంట్లకు రెరా చైర్మన్ సత్యనారాయణ సూచన

సాక్షి, హైదరాబాద్: సొంతింటి కల సాకారం చేసుకోవాలనే కొనుగోలుదారుల హక్కుల పరిరక్షణకు రియల్‌ఎస్టేట్ సంస్థలు జవాబుదారీతనంతో పనిచేయాలని 'రెరా'చైర్మన్ ఎన్.సత్యనారాయణ సూచించారు. మంగళవారం బేగంపేటలోని గ్రాండ్ కాకతీయ హోటల్‌లో అడ్వకేట్స్ అసోసియేషన్ ఫర్ సోషల్ రెస్పాన్సిబులిటీ అండ్ అవేర్‌నెస్, తెలంగాణ రియల్ ఎస్టేట్ రెగ్యులారిటీ అథారిటీ సంయుక్త ఆధ్వర్యంలో రియల్ ఎస్టేట్ వ్యాపారులు, ఏజెంట్లకు ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. క్రెడయ్ అధ్యక్షుడు పి.రామకృష్ణారావు మాట్లాడుతూ రెరా చట్టాన్ని అన్నివర్గాల వారు అవగాహన చేసుకోవాల్సిన అవసరం ఉందని, ప్రతి ఒక్కరూ వినియోగదారులే అన్నారు. చైర్మన్ స్వయంగా రెరా చట్టంలోని పలు సెక్షన్లపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించడంతో పాటు బిల్డర్ల సందేహాలను నివృత్తి చేశారు. ఈ సదస్సులో రెరా సభ్యులు శ్రీనివాసరావు, లక్ష్మీనారాయణ, కార్యక్రమ నిర్వాహకుడు అడ్వకేట్ అసోసియేషన్ ఫర్ సోషల్ రెస్పాన్సిబులిటీ అవేర్‌నెస్ ఫౌండర్ హాజీద్ సుల్తాన్ అలీ, ప్రముఖ రియల్ ఎస్టేట్ వ్యాపారులు, ఏజెంట్లు, న్యాయవాదులు పాల్గొన్నారు.

శాశ్వత నివాసితులైతే స్థానికులే..

▶ మొదటి పేజీ తరువాయి

కేసుల్లో ఉత్తర్వులు కూడా ఇచ్చిందని గుర్తుచేసింది. అయితే ప్రస్తుత పరిస్థితుల్లో ఈ నిబంధనను పూర్తిగా ఎత్తివేయలేమంది. తెలంగాణలోని శాశ్వత నివాసితులకు 3(ఐఐఐ)(బీ) నిబంధన వర్తించదని తేల్చిచెప్పింది. పిటిషనర్ల కేసు.. రూల్ 3(ఐఐఐ)(బీ) కిందకు రాదని యూనివర్సిటీ తరఫు న్యాయవాది కూడా చెబుతున్నారని వ్యాఖ్యానించింది. ఏపీ పునర్వ్యవస్థీకరణ చట్టంలోని సెక్షన్ 95కూ, ఈ రిట్ పిటిషన్ల వివాదానికీ ఎలాంటి సంబంధం లేదని పేర్కొంది. ఈ కేసులో పిటిషనర్లు తాము తెలంగాణలో శాశ్వత నివాసితులమని చెబుతున్నందున, వారు సర్టిఫికెట్ అందజేస్తే మెరిట్ ప్రకారం స్థానిక కోటాలో సీట్లు కేటాయించాలని వర్సిటీని ఆదేశించింది. హైదరాబాద్‌కు చెందిన విద్యార్థి ప్రశంస రాథోడ్ తల్లిదండ్రులిద్దరూ ఉద్యోగులు. విధి నిర్వహణలో భాగంగా చెన్నైకి బదిలీ కావడంతో అతడు అక్కడే ఇంటర్మీడియెట్ చదివారు. ఒకటి నుంచి 10వ తరగతి వరకు తెలంగాణలోనే చదువుకున్నారు. అయితే, ఇంటర్ చెన్నైలో చదివినందున ఆ విద్యార్థిని నాన్‌లోకల్‌గా పరిగణిస్తామని అధికారులు పేర్కొన్నారు. దీంతో ఇంటర్మీడియెట్ స్థానికంగా చదవకుంటే నీట్‌లో లోకల్ కోటా (85 శాతం) కిందికి రారంటూ ప్రభుత్వం తెచ్చిన జీవో 114ను ప్రశంస రాథోడ్ హైకోర్టులో సవాల్ చేశారు. లోకల్‌గా పరిగణించకుంటే కేవలం 15 శాతం సీట్లలోనే తాము పోటీ పడాల్సి ఉంటుందని, ఇది చట్టవిరుద్ధమని చెప్పారు. ఇదే తరహా పిటిషన్లను కలిపి ధర్మాసనం విచారణ జరిపి తీర్పు వెలువరించింది.

సిటీలో నాన్‌స్టాప్ సర్వీసులు

సాక్షి, సిటీబ్యూరో: లాంగ్ రూట్- షార్ట్ జర్నీ. ప్రయాణికులను ఆకట్టుకొనేందుకు ఆర్టీసీ సరికొత్త ప్రణాళికలను రూపొందిస్తోంది. వాహనాల రద్దీ ఎక్కువగా ఉండే రూట్‌లలో కొన్ని నాన్‌స్టాప్ బస్సులను నడిపేందుకు కసరత్తు చేపట్టింది. ఐటీ కారిడార్‌లలో పని చేసే సాఫ్ట్‌వేర్ నిపుణులు, వివిధ రంగాలకు చెందిన ఉద్యోగులు, తదితర రెగ్యులర్ ప్రయాణికుల అవసరాలకు అనుగుణంగా నగరంలోని వివిధ మార్గాల్లో నాన్‌స్టాప్ బస్సులను ఏర్పాటు చేయనున్నారు. వచ్చే నెలలో అందుబాటులోకి రానున్న ఈ-బస్సుల్లో కొన్నింటిని నాన్‌స్టాప్‌గా నడపాలని యోచిస్తున్నట్లు ఆర్టీసీ అధికారి ఒకరు తెలిపారు. ప్రయాణికుల డిమాండ్ ఎక్కువగా ఉండే రూట్‌లను ఇందుకోసం ఎంపిక చేయనున్నట్లు చెప్పారు. మరోవైపు ఈ బస్సులపై వివిధ వర్గాలకు చెందిన ప్రయాణికుల అభిప్రాయాలను తెలుసుకొనేందుకు ఆర్టీసీ ఒక సర్వే కూడా చేపట్టింది. సాధారణ బస్సుల్లో కంటే నాన్‌స్టాప్ బస్సుల్లో కొద్దిగా చార్జీలు పెంచి నడపనున్నారు.

క్లుప్తంగా...

ప్రాణం పోయినా బీఆర్ఎస్, కాంగ్రెస్‌లలో చేరను



అబిడ్స్(హైదరాబాద్): 'నా ప్రాణం పోయినా సెక్యులర్ పార్టీల(కాంగ్రెస్, బీఆర్ఎస్)లోకి వెళ్లను' అని గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ స్పష్టం చేశారు. బీజేపీ టికెట్ వచ్చినా, రాకపోయినా ఇతర పార్టీలలో మాత్రం చేరనని పేర్కొన్నారు. మంగళవారం గోషామహల్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ బీజేపీ అధిష్టానం తనపట్ల సానుకూలంగా ఉందని, సరైన సమయంలో తనపై సస్పెన్షన్ ఎత్తేస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో గోషామహల్ నుంచి తనకే బీజేపీ టికెట్ వస్తుందన్న నమ్మ కం ఉందన్నారు. రెండు పర్యాయాలు ఎమ్మెల్యేగా గెలిచిన తనకు బీజేపీ టికెట్ దక్కకుంటే రాజకీయాల నుంచి కొన్ని సంవత్సరాలు తప్పుకుంటానని, ఇండిపెండెంట్‌గా గానీ, వేరే పార్టీల తరఫున గానీ పోటీచేసే ప్రసక్తి లేదని పేర్కొన్నారు. భారత్‌ను హిందూరాష్ట్రంగా మార్చే పోరాటంలో ఉంటానన్నారు. గోషామహల్ నియోజకవర్గ బీఆర్ఎస్ టికెట్ అంశం మజ్లిస్ పార్టీ చేతుల్లో ఉందని, ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ, ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఒవైసీ చెప్పినవారికే అది దక్కుతుందని ఆరోపించారు.

నేను పార్టీ మారడం లేదు



సాక్షి ప్రతినిధి, మంచిర్యాల/హైదరాబాద్: పెద్దపల్లి మాజీ ఎంపీ, బీజేపీ కేంద్ర కార్యవర్గ సభ్యుడు గడ్డం వివేక్ వెంకటస్వామి తాను పార్టీ మారడం లేదని స్పష్టం చేశారు. ఈ మేరకు ఆయన మంగళవారం ఓ వీడియోను విడుదల చేశారు. ఈనెల 30న తాను కాంగ్రెస్‌లో చేరుతున్నట్లు వచ్చిన వార్తలను ఖండించారు. ఇప్పటి వరకు తాను ఎవర్నీ కలవలేదని పేర్కొన్నారు. గత రెండు రోజులుగా తాను పుణేలో ఉన్నానని చెప్పారు. గతంలో కూడా తాను అమెరికా వెళ్లినప్పుడు ఇలాగే వార్తలు రాశారని గుర్తుచేశారు. కాగా, పెద్దపల్లి లోక్‌సభ పరిధిలో వివేక్ పార్టీ మారుతున్నారంటూ ప్రచారం సాగుతోంది. దీనికి తోడు ఆయన బీజేపీతో అంటీముట్టనట్లు వ్యవహరిస్తున్నారనే కారణాలతో పార్టీ మార్పుపై ప్రచారం జోరందుకుంది.

బీసీల కోసం నా సీటు త్యాగం చేస్తా: కోమటిరెడ్డి



సాక్షి, హైదరాబాద్: బీసీ అభ్యర్థుల కోసం అవసరమైతే తన నల్లగొండ అసెంబ్లీ స్థానాన్ని త్యాగం చేసేందుకు సిద్ధంగా ఉన్నానని భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ప్రకటించారు. మంగళవారం గాంధీభవన్‌లో జరిగిన ప్రదేశ్ ఎన్నికల కమిటీ(పీఈసీ) సమావేశం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ గెలుపు గుర్రాలకే టికెట్లు వచ్చేవిధంగా పీఈసీ కసరత్తు చేస్తుందని చెప్పారు. తన నియోజకవర్గంలో కూడా కాంగ్రెస్ టికెట్ కోసం ఆరు దరఖాస్తులు వచ్చాయని, అన్నిచోట్ల అందరి బలాబలాలు పరిశీలించి సమర్థవంతమైన వారికే టికెట్లు ఇస్తామని పేర్కొన్నారు. ఏఐసీసీతో పీఈసీ సభ్యులు నేరుగా మాట్లాడి అభ్యర్థుల ఖరారు ప్రక్రియ జరపాలన్న ప్రతిపాదన సమావేశంలో వచ్చిందని, దీన్ని అందరూ ఆమోదించారన్నారు. ఎన్నికల ముందు కేటీఆర్ అమెరికా పర్యటన వెనుక ఏదో మతలబు ఉందని సందేహం వ్యక్తం చేశారు.

నేడు సోలాపూర్‌కు హరీశ్, మహమూద్ అలీ

సాక్షి, హైదరాబాద్: బీఆర్ఎస్ ముఖ్యనేతలతో కూడిన ప్రతినిధి బృందం బుధవారం మహారాష్ట్రలోని సోలాపూర్‌లో పర్యటించనుంది. బీఆర్ఎస్ జాతీయ అధ్యక్షుడు, సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు రాష్ట్ర మంత్రులు హరీశ్‌రావు, మహమూద్ అలీ, ఎమ్మెల్సీ ఎల్.రమణ, మహారాష్ట్ర బీఆర్ఎస్ ఇన్‌చార్జ్ కల్వకుంట్ల వంశీధర్‌రావు తదితరులు సోలాపూర్‌లో పర్యటిస్తారు. తెలంగాణ నుంచి వలసవెళ్లి అక్కడే స్థిరపడిన లక్షలాదిమంది పద్మశాలీల ఆధ్వర్యంలో వారి ఆరాధ్యదైవమైన మార్కండేయ రథోత్సవ కార్యక్రమం బుధవారం ఘనంగా జరగనుంది. అక్కడి పద్మశాలీ నేతల ఆహ్వానం మేరకు బీఆర్ఎస్ నేతలు హాజరవుతున్నట్లు పార్టీ వర్గాలు బుధవారం ఓ ప్రకటనలో వెల్లడించాయి. అలాగే సోలాపూర్‌లో త్వరలో నిర్వహించే సభ కోసం ఎంపిక చేసిన స్థలాన్ని పరిశీలిస్తారని తెలిపాయి.

పోస్టులు భర్తీ చేయమంటే కొడతారా?: షర్మిల



సాక్షి, హైదరాబాద్: అసెంబ్లీలో ఇచ్చిన హామీ ప్రకారం 13,086 ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేస్తే లాఠీలతో కొడతారా? అని వైఎస్సార్ టీపీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ట్విట్టర్ వేదికగా ప్రశ్నించారు. ఉపాధ్యాయ అభ్యర్థులపై లాఠీచార్జి చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. కొలువుల కోసం తెలంగాణ తెచ్చుకున్న నిరుద్యోగులను కొట్టే హక్కు మీకెక్కడిదని మండిపడ్డారు. సిగ్గుందా కేసీఆర్.. నిండు అసెంబ్లీలో ఇచ్చిన మాట కూడా నిలబెట్టుకోవా? అని నిలదీశారు. ఎన్నికల ముందు కూడా మాట మీద నిలబడవా?.. 13096 ఉపాధ్యాయ పోస్టులకు ముష్టి 5 వేల పోస్టులు భిక్షం వేస్తావా? అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఇక్కడా మహిళలకు ఆర్టీసీలో ఉచితం

- తమిళనాడులో ఈ పథకం ఇప్పటికే సూపర్ సక్సెస్
- ఆ స్ఫూర్తితోనే కర్ణాటకలో కాంగ్రెస్ హామీ.. ఎన్నికల్లో సానుకూల ఫలితం
- ఇక్కడా కాంగ్రెస్ మేనిఫెస్టోలో పెట్టే అవకాశం
- ముందే అమలు చేయాలంటూ బీఆర్ఎస్ నేతల ఒత్తిడి



సాక్షి, హైదరాబాద్: 'ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం'...ఇప్పుడు ఈ అంశంపై రాజకీయ పార్టీలు దృష్టి సారించాయి. తమిళనాడులో సూపర్ సక్సెస్ అయిన ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం పథకాన్ని తాము అధికారంలోకి వస్తే అమలు చేస్తామంటూ కర్ణాటకలో కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు హామీ ఇచ్చిన విషయం తెలిసిందే. అక్కడ కాంగ్రెస్ అధికారంలోకి రావడానికి ఈ హామీ కూడా కీలకభూమిక పోషించిందనేది రాజకీయ విశ్లేషకుల అంచనా. ఇప్పుడు కర్ణాటక తరహాలో తెలంగాణలో కూడా ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం హామీని మేనిఫెస్టోలో పెట్టే అంశం కాంగ్రెస్ పరిశీలనలో ఉంది. కర్ణాటకలో ఈ హామీ ఆ పార్టీకి సానుకూల ఫలితాన్ని అందించిన నేపథ్యంలో, ఇక్కడా ప్రజలపై తీవ్ర ప్రభావాన్ని చూపే అవకాశం ఉన్నందున మనం కూడా దీనిపై ఆలోచన చేయాలంటూ తాజాగా బీఆర్ఎస్ నేతలు కూడా మంత్రుల దృష్టికి తెస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చే లోపు రాష్ట్రంలో దీనిని అమలు చేయాలన్న అభిప్రాయం వారి ముందుంచుతున్నారు.

చెన్నైకి వెళ్లిన ఆర్టీసీ అధికారులు

ఎన్నికలతో ప్రమేయం లేకుండా, ఇటీవలే కొందరు అధికారులు దీనిపై ఉన్నతాధికారులకు ఓ నివేదిక అందజేశారు. కొద్ది రోజుల క్రితం అధికారులతో కూడిన ఓ బృందం తమిళనాడు ఆర్టీసీపై అధ్యయనానికి చెన్నై వెళ్లింది. అక్కడ ఆర్డినరీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం పథకం బాగా సక్సెస్ అయ్యిందని, దాని రూపంలో ఆక్యుపెన్సీ రేషియో బాగా పెరిగిందని, ఈ పథకం కోసం ప్రభుత్వం రీయింబర్స్ చేసే మొత్తం ఆర్టీసీకి లాభదాయకంగా మారిందంటూ అక్కడి అధికారులు స్పష్టం చేశారు. కర్ణాటక మోడల్‌తో పోలిస్తే, తమిళనాడు మోడల్ బాగుందని, దీనిని తెలంగాణలో కూడా అమలు చేస్తే బాగుంటుందని అధికారులు ఆర్టీసీ మేనేజ్‌మెంట్‌కు ఓ నివేదిక అందజేశారు. రెండు రాష్ట్రాల్లో ఈ పథకం అమలులోకి వచ్చాక మహిళా సాధికారత గణనీయంగా పెరిగిందని నివేదికలు పేర్కొంటున్నాయి. అటు అధికారుల సానుకూల నివేదిక, ఇటు రాజకీయపార్టీల ఎన్నికల ప్రణాళికలు.. వెరసి తెలంగాణ బస్సుల్లో మహిళల ఉచిత ప్రయాణం అంశం పెద్ద చర్చకు దారితీస్తోంది.

తమిళనాడులో ఇలా..

స్టాలిన్ ముఖ్యమంత్రి అయ్యాక ఆ రాష్ట్ర ఆర్టీసీ ఆర్డినరీ బస్సుల్లో మహిళలు వయసుతో సంబంధం లేకుండా ఉచితంగా ప్రయాణించే వెసులుబాటు 2021లో ప్రారంభించారు.

- ఆ రాష్ట్రంలోని మొత్తం 22500 ఆర్టీసీ బస్సులు ఉండగా, 7500 ఆర్డినరీ బస్సుల్లో ఈ వసతి కల్పించారు.
- మహిళలకు బస్సుల్లో కండక్టర్లు జీరో టికెట్ జారీ చేస్తారు. దీనివల్ల ఎంతమంది మహిళలు బస్సుల్లో ప్రయాణించిందీ లెక్క తేలుతుంది.
- ఇలా జారీ అయ్యే జీరో టికెట్లకుగాను ప్రభుత్వం ప్రతి టికెట్‌కు రూ.16 చొప్పున ఆర్టీసీకి రీయింబర్స్ చేస్తుంది.
- ఈ పథకం రాకముందు అక్కడి ఆర్టీసీ బస్సుల్లో నిత్యం 30 లక్షల మంది మహిళలు ప్రయాణించేవారు. తర్వాత వారి సంఖ్య 45 లక్షలకు పెరిగింది. అంటే 50 శాతం ఆక్యుపెన్సీ పెరిగిందన్నమాట.
- ఈ రూపంలో ప్రభుత్వం నుంచి నెలకు సగటున రూ.200 కోట్ల మొత్తం ఆర్టీసీకి అందుతోంది.

తమిళనాడు కంటే ఓ అడుగు ముందుకేసి కర్ణాటకలో శక్తి పథకం పేరుతో గత జూన్‌లో ఆర్డినరీ బస్సులతోపాటు ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో కూడా మహిళలకు ఉచిత ప్రయాణ వెసులుబాటు కల్పించారు.

- మొత్తం 18609 బస్సుల్లో ఈ అవకాశం కల్పించారు. ఇందులో 6343 ఎక్స్‌ప్రెస్, 6308 సిటీ సర్వీసులు, 5958 ఆర్డినరీ బస్సులున్నాయి.
- తొలి నెల రోజుల వ్యవధిలో రాష్ట్ర వ్యాప్తంగా 17.40 కోట్ల మంది మహిళలు ఈ పథకాన్ని వినియోగించుకున్నారు. ఒక్క బెంగళూరు సిటీలోనే ఏకంగా 5.60 కోట్ల ట్రిప్పులు నమోదయ్యాయి.

కర్ణాటకలో ఇలా..

- ఈ పథకం అమలులోకి రాకముందు, కర్ణాటక రాష్ట్రంలో రోజుకు సగటున 85 లక్షల మంది ప్రయాణికులు ఆర్టీసీ బస్సుల్లో తిరిగేవారు. పథకం ప్రారంభమయ్యాక ఆ సగటు సంఖ్య 1.09 కోట్లకు పెరిగిందని తేలింది. అంటే నిత్యం అదనంగా 25 లక్షల మంది ప్రయాణికుల సంఖ్య పెరిగింది. వారంతా మహిళా ప్రయాణికులే అన్నది దాని సారాంశం.
- అంటే ఇది ప్రత్యక్షంగా ప్రైవేటు వాహన ప్రయాణాన్ని అరికడుతోంది.
- ఈ పథకం తాలూకు ఖర్చు భరించేందుకు అక్కడి రాష్ట్ర ప్రభుత్వం తాజా బడ్జెట్‌లో ఏకంగా రూ.4 వేల కోట్లు కేటాయించింది.
- ప్రభుత్వం నుంచి రీయింబర్స్‌మెంట్ అందుతున్నందున, మహిళా ప్రయాణికుల రూపంలో ఆర్టీసీ బస్సుల్లో పెరిగే ఆక్యుపెన్సీ రేషియో మేరకు ఆర్టీసీకి ఆదాయం పెరిగినట్టయ్యింది.
- ఎక్స్‌ప్రెస్ బస్సుల్లోనూ ఈ పథకాన్ని అమలు చేస్తుండటం.. క్రమంగా ప్రభుత్వానికి భారంగా మారుతుందన్న విమర్శలు ఉన్నాయి. అందుకే తమిళనాడు తరహా ఆర్డినరీ బస్సుల వరకే దాన్ని పరిమితం చేయాలన్న వాదన ఉంది.

తెలంగాణలో ఒంటరిగానే పోటీ: కిషన్‌రెడ్డి



సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణల ఎన్నికల్లో బీజేపీ ఒంటరిగానే పోటీ చేస్తుందని, ఏ పార్టీతో పొత్తు ఉండదని కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు. ఇప్పటికే ఎన్నికల సన్నద్ధత మొదలైందని, త్వరలోనే ఎన్నికల కమిటీ సమావేశాన్ని ఏర్పాటు చేసి అభ్యర్థులను నిర్ణయిస్తామన్నారు. మంగళవారం ఆయన ఇక్కడ విలేకరులతో మాట్లాడారు. బీజేపీ కేడర్ బేస్ పార్టీ అని చెప్పు కొచ్చిన ఆయన.. కేడర్‌తో మాట్లాడిన తర్వాతే అభ్యర్థులపై నిర్ణయం ఉంటుందని తెలిపారు. బీఆర్ఎస్ పార్టీలో మాదిరి డైనింగ్ టేబుల్‌పై అభ్యర్థుల భవితవ్యాన్ని నిర్ణయించలేమని ఎద్దేవాచేశా రు. సెప్టెంబర్ 17న రాష్ట్ర విమోచన దినం తర్వాత రాష్ట్ర వ్యాప్తంగా యాత్రలు చేపడతామని, ఈ యాత్రలో అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా ప్రజలను కలుస్తామని కిషన్‌రెడ్డి చెప్పారు. ఎమ్మెల్యే రాజాసింగ్ సస్పెన్షన్ ఎత్తివేతపై అధిష్టానం నిర్ణయం తీసుకుంటుందని, నిర్ణయం సానుకూలంగానే ఉంటుందన్నారు. ప్రధాని పిలుపు మేరకు అన్ని రాష్ట్ర ప్రభుత్వాలు పెట్రోల్‌పై పన్నులను తగ్గిస్తే, తెలంగాణ ప్రభుత్వం మాత్రం ప్రజలపై ఎనలేని భారం మోపిందని ఆయన విమర్శించారు.

రాష్ట్రంలో ఎమర్జెన్సీ రోజులు

సాక్షి, హైదరాబాద్: టీచర్ పోస్టులకు నోటిఫికేషన్ జారీ చేయాలని డిమాండ్ చేస్తూ స్కూల్ ఎడ్యుకేషన్ డైరెక్టరేట్ ముట్టడికి ప్రయత్నించిన డీఎడ్, బీఎడ్ అభ్యర్థులపై పోలీసుల దౌర్జన్యాన్ని ఖండిస్తున్నామని కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. రాష్ట్రంలో ఎమర్జెన్సీ లాంటి చీకటి రోజులు ఉన్నాయనడానికి, కేసీఆర్‌ది నియంత పాలన అనడానికి జరుగుతున్న ఘటనలే సాక్ష్యాలన్నారు. ఇటీవల గ్రూప్–2 పరీక్షల నిర్వహణ వాయిదా వేయాలని కోరుతూ నిరుద్యోగులు ధర్నా చేస్తే మహిళలని కూడా చూడకుండా పోలీసులు లాఠీచార్జ్ చేయడం కేసీఆర్ నిరంకుశ పాలనకు నిదర్శనమని విమర్శించారు. రాష్ట్రంలో 13,500 టీచర్ పోస్టులు ఖాళీగా ఉంటే.. తూతూమంత్రంగా కేవలం 5వేల పోస్టుల భర్తీకే నోటిఫికేషన్ రిలీజ్ చేయడం దురదృష్టకరమన్నారు. ఖాళీగా ఉన్న పోస్టులన్నీ భర్తీ చేయాలని కిషన్‌రెడ్డి డిమాండ్ చేశారు. రాఖీ పౌర్ణమి సందర్భంగా ప్రధాని మోదీ గ్యాస్‌ధరలను తగ్గించి సోదరీమణులకు పండుగ కానుకను అందించారని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు.

పెట్రో ఉత్పత్తులపై అత్యధిక పన్ను ఇక్కడే..

గ్యాస్ సిలిండర్‌పై కేంద్రం రూ.200 తగ్గించడాన్ని కూడా ఎగతాళి చేస్తున్న కల్వకుంట్ల కుటుంబ సభ్యులు.. పెట్రో ఉత్పత్తులకు దేశంలోనే అత్యధికంగా తెలంగాణలో పన్ను వసూలు చేస్తున్న విషయాన్ని మరిచిపోయారా? అని జి.కిషన్‌రెడ్డి ప్రశ్నించారు. అత్యధిక పెట్రోల్, డీజిల్ ధరలున్న రాష్ట్రంగా తెలంగాణ మొదటి స్థానంలో నిలిచిన విషయాన్ని ఓ సారి గుర్తుచేసుకోవాలని సూచించారు.

పది రోజుల్లో ఏదో ఒకటి చెప్పాలి

బీఆర్ఎస్ అధిష్టానానికి ఉప్పల్ ఎమ్మెల్యే అల్టిమేటం

రామంతాపూర్/ఉప్పల్: అవినీతి ఆరోపణల్లేవు..ఆవిర్భావం నుంచి పార్టీ కోసం శ్రమించా.. తనలాంటి ఉద్యమకారుడికి టికెట్ ఇవ్వకుండా అధిష్టానం నిలువునా గొంతు కోసిందంటూ ఉప్పల్ శాసనసభ్యుడు బేతి సుభాష్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. మేకను బలి తీసేముందు నీరు తాగిస్తారని, ఉరి తీసే ముందు ఖైదీని చివరి కోరిక అడుగుతారని, తన విషయంలో హైకమాండ్ కనీసం మాట మాత్రం చెప్పకపోవడం కలచివేసిందన్నారు. మంగళవారం హబ్సిగూడలోని తన నివాసంలో ఎమ్మెల్యే బేతి మీడియాతో మాట్లాడారు. అధిష్టానానికి పది రోజులు సమయం ఇస్తున్నా.. ఆ లోపు నిర్ణయం మార్చుకుంటారా సరేసరి..లేనిపక్షంలో భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తానన్నారు. హైదరాబాద్, ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలోని 29 మంది ఎమ్మెల్యేల్లో తానొక్కడినే ఉద్యమకారుడననే విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. కాగా, నిన్న మొన్నటిదాకా ఎడమొఖం పెడమొఖంగా ఉన్న సుభాష్‌రెడ్డి, బొంతు రామ్మోహన్‌లకు టీఆర్ఎస్ టికెట్ రాక పోవడంతో ఆ ఇద్దరూ ఏకమయ్యారు. సుభాష్‌రెడ్డి సమావేశానికి బొంతు రామ్మోహన్ భార్య శ్రీదేవి హాజరవడం చర్చకు దారితీసింది.

టీచర్ పోస్టుల లెక్కలు వేరయా!

- విద్యాశాఖ లెక్క తేల్చింది 22 వేలు
- ప్రభుత్వం ప్రకటించింది 13 వేలు
- నియామకం జరిగేవి 5 వేలు
- హేతుబద్ధీకరణ నివేదికే కారణమా?



సాక్షి, హైదరాబాద్: ఉపాధ్యాయ ఖాళీలపై అన్ని వైపుల నుంచి ఒత్తిడి పెరుగుతోంది. నిరుద్యోగుల ఆందోళనలు, ప్రభుత్వ ఉపాధ్యాయ సంఘాల నుంచి అసంతృప్తి ఎక్కువవుతోంది. దీంతో విద్యాశాఖ మల్లగుల్లాలు పడుతోంది. టీచర్ల నియామక ప్రకటన రాజకీయంగా కలిసి వస్తుందని ప్రభుత్వం భావిస్తుంటే, అసంతృప్తి, విమర్శలకు దారి తీస్తుందని ప్రభుత్వ వర్గాలు కంగారు పడుతున్నాయి. ఈ క్రమంలో మంత్రి సబితా ఇంద్రారెడ్డి విద్యాశాఖ ఉన్నతాధికారుల నుంచి తాజాగా నివేదిక కోరారు. నియామక పోస్టులు పెంచడం సాధ్యమా? వాస్తవ ఖాళీలను వెల్లడించడం వీలవు తుందా? టీచర్లకు పదోన్నతులు కల్పించడం ద్వారా ఏర్పడే ఖాళీలను తర్వాత భర్తీ చేస్తామనే భరోసా ఇవ్వగలమా? అని ఆమె అధికారులను అడిగినట్టు తెలిసింది. అయితే దీనిపై విద్యాశాఖ అధికారులు నిస్సహాయత వ్యక్తం చేసినట్టు సమాచారం.

పొంతన లేని లెక్క

పాఠశాల విద్యలో 22 వేల ఖాళీలు ఉండే వీలుందని ఏడాది క్రితం విద్యాశాఖ ప్రభుత్వానికి నివేదించింది. గెజిటెడ్ హెచ్ఎం పోస్టులు 1,974, ప్రైమరీ హెచ్ఎం పోస్టులు 2,043, స్కూల్ అసిస్టెంట్లు 7,200, పీడీలు 25, ఎస్‌జీటీలు 6,775, లాంగ్వేజ్ పండిట్లు 688, పీఈటీలు 172, డ్రాయింగ్, మ్యూజిక్ టీచర్ పోస్టులు 1,733 ఖాళీలున్నాయని తేల్చింది. దీంతోపాటు ఎంఈవోలు 467, బాలికల పాఠశాలల హెచ్ఎంలు 15, డైట్ లెక్చరర్లు 271, డిప్యూటీ విద్యాశాఖ అధికారులు 58, డీఈవోలు 12 మందిని నియమించాలని సర్కార్‌కు నివేదించారు. ఇందులో 13 వేల పైచిలుకు పోస్టులు భర్తీ చేస్తామని ప్రభుత్వం గత ఏడాది ఏప్రిల్‌లో ప్రకటించింది. కానీ ఇప్పుడు 5,089 పోస్టులు భర్తీ చేస్తున్నట్టు వెల్లడించింది. దీంతో నిరుద్యోగులు ప్రతీ రోజూ పాఠశాల విద్య డైరెక్టరేట్ వద్ద ఆందోళనలు చేస్తున్నారు. ఉపాధ్యాయ సంఘాలు కూడా 22 వేల ఖాళీలుంటే, 5 వేల పోస్టుల భర్తీ ఏంటని నిలదీస్తున్నాయి. ప్రభుత్వం మాత్రం టీచర్లకు పదోన్నతులు ఇస్తే కొన్ని ఖాళీలు ఏర్పడతాయని చెబుతోంది. ఈ ప్రక్రియ ముందుకెళ్లే పరిస్థితి కన్పించడం లేదు.

నిరుద్యోగులను మోసం చేయడమే

టీచర్ పోస్టులు 22 వేల వరకూ ఖాళీగా ఉంటే, 5,089 పోస్టులే భర్తీ చేస్తామని చెప్పడం నిరుద్యోగులను మోసం చేయడమే. దీనిపై ఆందోళనకు దిగితే మమ్మల్ని అరెస్టులు చేస్తున్నారు. ముఖ్యమంత్రే 13,500 పోస్టులు భర్తీ చేస్తామని చెప్పారు. ఇప్పుడా పోస్టులు ఎక్కడికి పోయాయి? 22 వేల పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ ఇవ్వకపోతే ఆందోళన తీవ్రతరం చేస్తాం.

– కోటా రమేష్ (డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు)

ఇదేం రేషనలైజేషన్

విద్యార్థుల సంఖ్యను బట్టి టీచర్లను కేటాయించే హేతుబద్ధీకరణ అశాస్త్రీయమైంది. ఒక్కో పాఠశాలలో ఎంత మంది విద్యార్థులున్నా, అన్ని తరగతుల బోధన జరగాలి. అన్ని సబ్జెక్టులకు టీచర్లు ఉండాలి. ఈ వాస్తవాన్ని కప్పిపుచ్చడం, అతి తక్కువ పోస్టుల భర్తీకి పూనుకోవడం ఎంతమాత్రం సరికాదు.

– చావా రవి (టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి)

హేతుబద్ధీకరణే ముంచిందా?

- టీచర్ నియామక ప్రకటన వెలువడేందుకు ముందు విద్యాశాఖ ఉన్నతాధికారులు జిల్లా విద్యాశాఖాధికారులతో సమావేశం నిర్వహించారు. రేషనలైజేషన్ ప్రకారం చూస్తే ఎన్ని ఖాళీలుంటాయని ఆరా తీశారు. టీచర్ పోస్టులు భారీగా కుదించుకుపోవడానికి డీఈవోల హేతుబద్ధీకరణ నివేదికే కారణమని విద్యాశాఖ వర్గాలు చెబుతున్నాయి. ప్రతీ 30 మందికి ఒక టీచర్ చొప్పున అధికారులు లెక్క గట్టారు. దీన్ని కొలమానంగా తీసుకోవడం అశాస్త్రీయమని ఉపాధ్యాయ సంఘాలు అంటున్నాయి. రాష్ట్రంలో మూడో వంతు బడుల్లో విద్యార్థుల సంఖ్య 30లోపే ఉంది. తెలంగాణలో ప్రభుత్వ పాఠశాలలు 26,337 ఉన్నాయి. ఇందులో 8,782 (33.35 శాతం) చోట్ల 1–30 మంది విద్యార్థులున్నారు. ఈ తరహా హేతుబద్ధీకరణను ఉపాధ్యాయ సంఘాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. 30 మంది కన్నా తక్కువ ఉన్నా, అన్ని తరగతులకు టీచర్లు కావాలని, కానీ హేతుబద్ధీకరణ పేరుతో ఒకే టీచర్‌ను ఇవ్వడం వల్ల అన్ని తరగతులు ఎలా బోధిస్తారని ప్రశ్నిస్తున్నాయి. దీనివల్లే అసలైన ఖాళీలు బయటకు రాకుండా పోయాయని వాపోతున్నాయి.

ఎన్ని స్కూళ్లలో ఎంతమంది విద్యార్థులు?

విద్యార్థులు	ప్రాథమిక పాఠశాలలు	మాధ్యమిక పాఠశాలలు	మొత్తం
1-30	8,665	117	8,782
31-100	9,225	1,397	10,622
101-250	3,261	2,030	5,291
251-1000	313	1,305	1,618
1,000కిపైగా	1	23	24

నేడు బీజేపీలోకి చెన్నమనేని వికాస్‌రావు

మాజీ మంత్రి కృష్ణయాదవ్ కూడా..



సాక్షి, హైదరాబాద్: మాజీ గవర్నర్ సీహెచ్ విద్యాసాగర్‌రావు తనయుడు చెన్నమనేని వికాస్‌రావు, మాజీ మంత్రి కృష్ణయాదవ్ బీజేపీలో చేరనున్నారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో బుధవారం కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి, ముఖ్యనేతలు బండి సంజయ్, డా.కె.లక్ష్మణ్, ఈటల రాజేందర్‌ల సమక్షంలో వీరిద్దరూ పార్టీ కండువా కప్పుకోను న్నారు. పలువురు ప్రముఖులు, స్వచ్ఛంద సేవకు లు, ప్రొఫెషనల్స్, రాజకీయవేత్తలు కూడా తమ పార్టీలో చేరుతున్నారని బీజేపీ ప్రకటించింది. బీజేపీ తరఫున వేములవాడ నుంచి వికాస్‌రావు పోటీచేసే అవకాశాలున్నాయని పార్టీ వర్గాల్లో చర్చ సాగుతోంది. అంబర్‌పేట అసెంబ్లీ సెగ్మెంట్ నుంచి బీజేపీ అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి లేదా ఆయన సతీ మణి కావ్యారెడ్డి పోటీచేయని పక్షంలో తనకు అవకాశమివ్వాలని కృష్ణయాదవ్ కోరినట్టు తెలిసింది. గతంలో హిమాయత్‌నగర్ (ప్రస్తుతం అంబర్‌పేట) నియోజకవర్గం నుంచి గెలుపొందిన కృష్ణయాదవ్, టీడీపీ హయాంలో ప్రభుత్వవిప్‌గా, మంత్రిగా పనిచేసిన విషయం తెలిసిందే.

ప్రగతిభవన్ నుంచి మధుకు పిలుపు

- ముదిరాజ్‌లకు టికెట్ ఇవ్వాలని వినతి
- సిట్టింగ్ ఎమ్మెల్యే, మధుతో మంత్రి హరీశ్ చర్చలు
- పార్టీ నిర్ణయానికి కట్టుబడాలని హరీశ్ సూచన



సాక్షి, హైదరాబాద్: పటాన్‌చెరు అసెంబ్లీ నియోజకవర్గం నుంచి భారత్ రాష్ట్ర సమితి టికెట్‌ను ఆశిస్తున్న నీలం మధు ముదిరాజ్‌కు మంగళవారం ప్రగతిభవన్ నుంచి పిలుపు వచ్చింది. దీంతో ఆయన శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్ ముదిరాజ్‌తో కలిసి ప్రగతి భవన్‌కు చేరుకున్నారు. అప్పటికే అక్కడికి వచ్చిన ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డితో మంత్రి హరీశ్‌రావు చర్చించారు. పటాన్‌చెరు నియోజకవర్గంలో నెలకొన్న పరిస్థితిని దృష్టిలో పెట్టుకొని పార్టీ నిర్ణయానికి అందరూ కట్టుబడి ఉండాలని, నీలం మధు సేవలు పార్టీకి అవసరమని హరీష్ స్పష్టం చేశారు. అనంతరం మంత్రి నీలం మధుతోను టికెట్ కేటాయింపుపై చర్చించారు. రాష్ట్రవ్యాప్తంగా ముదిరాజ్ సామాజిక వర్గానికి రాజకీయంగా ప్రాధాన్యం ఇవ్వాలని నీలం మధు కోరారు. అటు సిట్టింగ్ ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి, నీలం మధు అభిప్రాయాలను విన్న మంత్రి.. ఒకటి రెండు రోజుల్లో ముఖ్యమంత్రితో భేటీ జరిగేలా చూస్తానని మధుకు హామీ ఇచ్చారు. అమెరికా పర్యటనలో ఉన్న పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ మంత్రి కేటీ రామారావు వచ్చిన తర్వాత స్పష్టత ఇస్తామని హామీ ఇచ్చినట్టు తెలిసింది. కాగా నీలం మధుకు టికెట్ కేటాయించాలంటూ ఆయన అనుచరులతో పాటు జిల్లా వ్యాప్తంగా పలు కుల సంఘాలు ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయి. సీఎం కేసీఆర్‌తో భేటీలో మధుకు టికెట్ కేటాయింపు అంశంపై స్పష్టత వచ్చేంతవరకు తమ ఒత్తిడి కొనసాగుతుందని మధు సన్నిహిత వర్గాలు సాక్షికి వెల్లడించాయి.

బీసీలకు అండ బీజేపీనే..

బీజేపీ రాష్ట్ర ఓబీసీ మోర్చా కార్యవర్గ సమావేశంలో ఎంపీ డాక్టర్ లక్ష్మణ్



కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడుతున్న లక్ష్మణ్..

కుత్బుల్లాపూర్: తెలంగాణలో బీసీలకు అండగా ఉండే పార్టీ ఒక్క బీజేపీ మాత్రమేనని ఆ పార్టీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు, ఎంపీ డా.లక్ష్మణ్ స్పష్టం చేశారు. మంగళవారం కొంపల్లిలో బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు ఆలే భాస్కర్ ఆధ్వర్యంలో రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరిగింది. లక్ష్మణ్ మాట్లాడుతూ.. తెలంగాణలో 52 శాతం బీసీ వర్గాలుండగా.. కేవలం ముగ్గురికి మంత్రి పదవులు ఇచ్చి సామాజిక న్యాయం అంటే బీఆర్ఎస్‌కు బీసీలు ఎలా ఓట్లు వేస్తారని ప్రశ్నించారు. ఇక నెహ్రూ నుంచి రాహుల్ గాంధీ వరకు బీసీలను వ్యతిరేకించిన కాంగ్రెస్ పార్టీకి తెలంగాణలో బీసీలు ఓట్లు వేయాలా అని ప్రశ్నించారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు బీసీ వ్యతిరేక పార్టీలని లక్ష్మణ్ విమర్శించారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో కేంద్రంలో 27 మంది ఓబీసీలకు మంత్రి పదవిలో స్థానం కల్పించారని గుర్తు చేశారు. దేశ వ్యాప్తంగా బీసీల పక్షాన నిలిచే ఏకైక పార్టీ బీజేపీయేనని అన్నారు. ఎమ్మెల్యే ఈటల రాజేందర్ మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ బీసీ బిడ్డ అని, ఆకలి తెలిసినోడు కాబట్టే, పేదలకు కావాల్సిన పథకాలు ప్రవేశపెడుతున్నారని వ్యాఖ్యానించారు. సీఎం కేసీఆర్ అన్నింటిలో తెలంగాణను నంబర్ వన్ అని చెబుతుంటారని, వాస్తవానికి ఆయన అబద్ధాల్లో మాత్రమే నంబర్ వన్ అని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ బూర నర్సయ్య గౌడ్, మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్, జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యులు తల్లోజు ఆచారి, ఓబీసీ మోర్చా ప్రధాన కార్యదర్శి దివాకర్, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు మహేష్, ప్రధాన

మర్రి జనార్దన్‌రెడ్డి ఎమ్మెల్యేనా.. రౌడీనా?

ఎన్నికల్లో పోటీకి అనర్హుడిని చేయాలి: టీపీసీసీ

సాక్షి, హైదరాబాద్: బీఆర్ఎస్ నేత మర్రి జనార్దన్ రెడ్డి ఎమ్మెల్యేనా, రౌడీనా అని కాంగ్రెస్ సీనియర్ నేతలు మల్లు రవి, గోపిశెట్టి నిరంజన్ ప్రశ్నించారు. మంగళవారం వారు విలేకరులతో మాట్లాడుతూ కాంగ్రెస్ నేతలు కనిపిస్తే కాల్చివేస్తానని జనార్దన్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను సుమోటోగా తీసుకుని ఆయన్ను వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో పోటీకి అనర్హుడిని చేసేలా ఎన్నికల కమిషన్ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇలాంటి బెదిరింపు వ్యాఖ్యలు చేసేవారిని ఎమ్మెల్యేలుగా బీఆర్ఎస్ ఎలా నిలబెడుతుందని ప్రశ్నించారు. జనార్దన్‌రెడ్డి వ్యాఖ్యలను ఎన్నికల కమిషన్ సీరియస్‌గా తీసుకోవాలని, మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అమలు చేసి ఆయన్ను ఎమ్మెల్యే పదవికి అనర్హుడిగా ప్రకటించాలని కోరారు. ఈ మేరకు ఎన్నికల ప్రధానాధికారి వికాస్‌రాజ్‌కు రాసిన లేఖను సీఈవో ఆఫీస్‌లో అందజేశారు.

'వారిని పిచ్చాసుపత్రిలో చేర్చాలి'

సాక్షి, హైదరాబాద్: బీఆర్ఎస్ నేతలు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, బాల్క సుమన్, మర్రి జనార్దన్‌రెడ్డిలను ఎర్రగడ్డ పిచ్చాసుపత్రిలో చేర్పించాలని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి కోటూరి మానవతారాయ్ అన్నారు. కాంగ్రెస్ పార్టీ వచ్చే ఎన్నికల్లో అధికారంలోకి వస్తుందనే భయంతోనే వీరు పిచ్చిపిచ్చిగా మాట్లాడుతున్నారని చెప్పారు. మంగళవారం గాంధీభవన్‌లో ఓయూ జేఏసీ నేతలు దుర్గం భాస్కర్, లింగం యాదవ్, సంధ్యారెడ్డి, ఆచారిలతో కలిసి విలేకరులతో మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీలో చేరాలనుకునే వారిని అవమానించేందుకే సుమన్ ఇష్టానుసారం మాట్లాడున్నారని విమర్శించారు. ఆయనకు తెలంగాణ ప్రజలే బుద్ధి చెబుతారన్నారు. బీఆర్ఎస్ ఎన్ని కేసులు పెట్టినా మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కాంగ్రెస్‌లోకి వచ్చారని, రేపో మాపో తుమ్మల నాగేశ్వరరావు కూడా వస్తారని చెప్పారు.



ఆందోళనలో పాల్గొన్న టీఆర్‌టీ అభ్యర్థులను కట్టడి చేస్తున్న పోలీసులు

మెగా డీఎస్సీని ప్రకటించాలి: ఆర్.కృష్ణయ్య

విద్యాశాఖ కార్యాలయాన్ని ముట్టడించిన టీఆర్‌టీ అభ్యర్థులు

గన్‌ఫౌండ్రీ (హైదరాబాద్): రాష్ట్రవ్యాప్తంగా ఖాళీగా ఉపాధ్యాయ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని ఇందుకు మెగా డీఎస్సీ నోటిఫికేషన్ ఇవ్వాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. 25 వేలకు పైగా ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉంటే కేవలం 5 వేలకే నోటిఫికేషన్‌ను విడుదల చేయడం సరికాదన్నారు. తెలంగాణ నిరుద్యోగ జేఏసీ ఆధ్వర్యంలో మంగళవారం బషీర్‌బాగ్‌లోని విద్యాశాఖ కార్యాలయం ఎదుట బీఈడీ, టీఆర్‌టీ అభ్యర్థులు భారీగా ఆందోళనకు దిగారు. కొన్నేళ్లుగా ఎయిడెడ్ పాఠశాలలో ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయడం లేదని ఆర్.కృష్ణయ్య అన్నారు. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి కోసం రూ.వేల కోట్లు కేటాయిస్తున్న ప్రభుత్వం ఉపాధ్యాయులను భర్తీ చేయడానికి మాత్రం ఎందుకు ఆలోచిస్తుందని ప్రశ్నించారు.

భారీగా తరలివచ్చిన అభ్యర్థులు...

మెగా డీఎస్సీని ప్రకటించాలని కోరుతూ.. బీఈడీ, డీఈడీ అభ్యర్థులు పెద్ద ఎత్తున విద్యాశాఖ కార్యాలయం ముట్టడికి యత్నించారు. అసెంబ్లీ నుంచి కొంతమంది, అబిడ్స్ నుంచి కొంతమంది అభ్యర్థులు ఏకకాలంలో దూసుకురావడంతో పోలీసులు వారిని అడ్డుకున్నారు. దీంతో అక్కడ కొద్దిసేపు ఉద్రిక్త పరిస్థితి ఏర్పడింది. పోలీసులతో వాగ్వాదం, తోపులాట జరగడంతో పలువురు స్వల్పంగా గాయపడ్డారు. ఆందోళనకారులను పోలీసులు అరెస్టు చేసి వివిధ పోలీస్‌స్టేషన్లకు తరలించారు. ఆందోళనలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జకృష్ణ, నిరుద్యోగ జేఏసీ చైర్మన్ నీల వెంకటేశ్ పాల్గొన్నారు.



గతంలో జీవించకు, భవిష్యత్ గురించి కలలు కనకు,
వర్తమాన క్షణం మీదే నీ మనసును నిలుపు.
– బౌద్ధ ధర్మం

సాక్షి

బుధవారం, 30 ఆగస్టు 2023

చేజేతులా తలవంపులు!

విశ్వవేదికపై భారతదేశానికి కీర్తి, పతకాలు తెచ్చిపెట్టిన ఒక క్రీడ... ఇప్పుడు అంతర్జాతీయంగా నలుగురిలో నగుబాటుకు కారణంగా మారిందంటే తప్పెవరిది? గడచిన నాలుగు ఒలిపింక్స్‌లోనూ వరుసగా మన దేశానికి పతకాలు సాధించి పెట్టిన రెజ్లింగ్‌లో ఆటగాళ్ళు ఇప్పుడు కనీసం భారత జాతీయ పతాకం నీడన అధికారికంగా అంతర్జాతీయ పోటీల్లో పాల్గొనే వీలు లేకుండా పోయిందంటే ఆ పాపం ఎవరిది? మన అగ్రశ్రేణి రెజ్లర్లు ఈ ఏడాది మొదట్లో వీధికెక్కి, భారత రెజ్లింగ్ సమాఖ్య (డబ్ల్యుఎఫ్ఐ) అప్పటి అధ్యక్షుడు బ్రిజ్‌భూషణ్ శరణ్ సింగ్‌పై ఆరోపణలు చేసినప్పటి నుంచి గత ఎనిమిది నెలల్లో రోజుకో వివాదం మన రెజ్లింగ్‌ను చుట్టుముడుతూనే ఉంది. ఇప్పటికే లైంగిక వేధింపుల ఆరోపణలతో సతమతమవుతున్న భారత సమాఖ్యను అంతర్జాతీయ రెజ్లింగ్ పర్యవేక్షక సంఘం 'యునైటెడ్ వరల్డ్ రెజ్లింగ్' (యుడబ్ల్యుడబ్ల్యు) తాజాగా సస్పెండ్ చేసింది. నిర్ణీత గడువులోగా ఎన్నికలు జరపనందుకు పడ్డ ఈ సస్పెన్షన్ వేటు మన రెజ్లింగ్ భవితపై నీలినీడలు పరిచింది.

ఈ సస్పెన్షన్ మరీ ఊహించనిదేమీ కాదు. కొన్ని నెలలుగా అంతర్జాతీయ రెజ్లింగ్ సంఘం పదే పదే హెచ్చరిస్తూనే ఉంది. వివాదాల్లో కూరుకుపోయిన భారత రెజ్లింగ్ సమాఖ్యను చక్కదిద్దుకోవాల్సిందిగా మన క్రీడాయంత్రాంగ పెద్దలను అభ్యర్థిస్తూనే ఉంది. దోవకు రాకుంటే సస్పెన్షన్ వేటు వేయక తప్పదని జూన్‌లో హెచ్చరించింది. జూలైలోనూ మరోసారి హెచ్చరికలు జారీ చేసింది. అయినా పరిస్థితిలో మార్పు రాలేదు. భారత రెజ్లింగ్ సమాఖ్యలో అంతర్గత వర్గ పోరాటాలు సాగుతూనే ఉన్నాయి. మరోపక్క సమాఖ్య ఎన్నికల్ని వివిధ కోర్టులు నిలిపివేశాయి. చివరకు సహనం నశించిన అంతర్జాతీయ సంఘం అన్నంత పనీ చేసింది. భారత రెజ్లింగ్ సమాఖ్యపై వేటు వేసింది. సమస్యను ఆదిలోనే పరిష్కరించని మన క్రీడా అధికారుల అసమర్థత ఇక్కడి దాకా తెచ్చింది.

ఈ సస్పెన్షన్ వల్ల ఆటగాళ్ళపై వ్యక్తిగతంగా ప్రభావమేమీ ఉండకపోవచ్చు. కానీ, దేశానికి మాత్రం తీరని తలవంపులు. ఎలాగంటే, ఈ సెప్టెంబర్ 16 నుంచి బెల్‌గ్రేడ్‌లో జరగనున్న ప్రపంచ ఛాంపియన్‌షిప్స్‌లో మన రెజ్లర్లు తటస్థ అథ్లెట్లుగానే పోటీలో పాల్గొనాల్సిన పరిస్థితి. ఇలా మన కుస్తీయోధులు అన్ని రకాల పోటీల్లో పాల్గొనవచ్చు. పతకాలు సాధించవచ్చు. కానీ, జాతీయ పతాకం ధరించడానికి లేదు. సాక్షాత్తూ బంగారు పతకం సాధించి, పోడియమ్‌పై నిలబడినప్పటికీ ప్రాంగణంలో మన జాతీయ గీతాన్ని వినిపించరు. వారి ప్రతిభా ప్రదర్శన, గెలిచే పతకాలు... ఇలా ఏవీ భారతదేశపు లెక్కలోకి రావు. అదీ ఈ సస్పెన్షన్‌తో దాపురించే దుఃస్థితి. ఒకవేళ ఇంత జరుగుతున్నా సరే ఇప్పుడిప్పుడే ఎన్నికలు నిర్వహించకుంటే, దరిమిలా సస్పెన్షన్‌ను ఎత్తివేయకుంటే... అప్పుడిక మన భారత రెజ్లర్లు రానున్న ఒలింపిక్స్ సహా ఏ అంతర్జాతీయ పోటీలోనూ దేశం తరఫున పోటీ చేసే వీలుండదు. ఇది దేశ ప్రతిష్ఠకే మాయని మచ్చ.

ఇందుకు నిందించాల్సింది మన భారత రెజ్లింగ్ సమాఖ్యను, మన పాలకులనే! లైంగికంగా వేధించినట్టు సాక్ష్యాధారాలు లభించినప్పటికీ, దేశానికి పతకాల పంట పండించిన రెజ్లర్లు న్యాయం కోసం రోడ్డున పడి ధర్నాలు చేసినప్పటికీ ఇవాళ్టికీ మన ఏలికలకు చీమ కుట్టినట్టయినా లేదు. సమాఖ్య మాజీ అధ్యక్షుడు, పాలక బీజేపీ పార్లమెంట్ సభ్యుడైన బ్రిజ్‌భూషణ్‌పై చర్యలు తీసుకోవడానికి ఇప్పటికీ మన పాలకులకు చేతులు రావడం లేదు. పేరుకు పదవిలో నుంచి పక్కకు తప్పుకున్నప్పటికీ, తన వారినే మళ్ళీ పీఠంపై కూర్చోబెట్టి కథ నడిపించాలని చూస్తున్న నిందితుడిని అడ్డుకొనేందుకు మన ప్రభుత్వాలకు మనస్కరించడం లేదు. బాధిత రెజ్లర్లకూ, చక్రం తిప్పాలని చూస్తున్న బడాచోర్లకూ మధ్య చిక్కుకున్నది కేవలం రెజ్లింగ్ కాదు... దేశ పరువు ప్రతిష్ఠలు! లైంగిక ఆరోపణల వ్యవహారంతో ఇప్పటికే దేశం పరువు పోగా, తాజా సస్పెన్షన్‌తో తలకొట్టేసినట్టయింది.

రాజకీయాలకు అతీతంగా సాగాల్సిన క్రీడా సంఘాలు గనక రాజకీయ నేతల కబంధ హస్తాల్లో చిక్కుకుంటే ఇలాగే ఉంటుంది. ఆటలు, ఆటగాళ్ళ ప్రయోజాల పరిరక్షణ వెనక్కి పోయి, క్రీడలతో సంబంధం లేని అంశాలు ముందుకు వస్తాయి. దేశంలోని అనేక ఇతర క్రీడా సంఘాల్లోనూ ఇదే జరిగింది. సమయానికి ఎన్నికలు జరపలేదంటూ నిరుడు ప్రపంచ ఫుట్‌బాల్ పర్యవేక్షక సంఘం 'ఫిఫా' మనదేశ ఫుట్‌బాల్ సమాఖ్యను సస్పెండ్ చేసింది. అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ, హాకీ ఫెడరేషన్‌లు సైతం ఈ కారణాలతోనే మన సంఘాల్ని నిషేధిస్తామని హెచ్చరించాయి. క్రీడా నియమావళిని పాటించట్లేదంటూ సాక్షాత్తూ భారత సర్కారే 2020 జూన్‌లో 54 జాతీయ క్రీడా సమాఖ్యల గుర్తింపును ఉపసంహరించింది. నియమాల ఉల్లంఘనకు పాల్పడుతున్నారంటూ ఢిల్లీ హైకోర్ట్ గత ఏడాది దాదాపు పాతిక క్రీడాసంఘాలకు అక్షింతలు వేసింది. అయినా పరిస్థితి మారలేదు. రాజకీయాలకు బలవుతున్న సంఘాల్లో ఒకటిగా మన రెజ్లింగ్ సైతం నిలిచింది.

విచిత్రంగా కొందరు ప్రస్తుత పరిస్థితికి ఆటగాళ్ళను తప్పుబడుతున్నారు. లైంగిక వేధింపుల అంశాన్ని బయటకు చెప్పడమే వారి నేరమన్నట్టుగా, వారిని 'ధర్నా జీవులు' అంటూ బ్రిజ్‌భూషణ్ నిస్సిగ్గుగా బురద జల్లుతున్నారు. ఇకనైనా పాలకులు, క్రీడా అధికారులు కళ్ళు తెరవాలి. దీర్ఘ కాలం సస్పెన్షన్ కొనసాగితే అంతర్జాతీయ పోటీలకు ఆహ్వానాలు తగ్గుతాయి. ప్రపంచ సంఘం నుంచి ఆర్థిక సహకారమూ తగ్గుతుంది. ఆటగాళ్ళ కెరీర్ దెబ్బ తింటుంది. ఇవన్నీ దృష్టిలో ఉంచుకొని, సంక్షోభ పరిష్కారానికి తగిన చర్యలు చేపట్టాలి. అలాకాక ప్రభుత్వం ఇప్పటికీ మౌనం వీడకపోతే కష్టమే! దేశప్రతిష్ఠ కన్నా దేశంలో వచ్చే ఎన్నికల్లో గెలుపే ముఖ్యమని భావిస్తే అది మహా పాపమే!

వ్యవసాయానికి ఎన్నాళ్లీ సంకెళ్లు?

విశ్లేషణ



డాక్టర్ అజీత్ రానాడే

ఉల్లి ఎగుమతులను సమర్థంగా అడ్డుకోవడం ద్వారా కేంద్ర ప్రభుత్వం స్థానిక సరఫరాను పెంచింది. ఈ చర్య రైతులకు నష్టం కలిగించేదే. ఇది మార్కెట్ యంత్రాంగంలో ప్రభుత్వం జోక్యం చేసుకోవడం కాదా? అంతర్జాతీయంగా బియ్యం ధరలు దశాబ్ద కాలపు గరిష్ఠ స్థాయికి చేరుకున్నాయి. కానీ బాస్మతీయేతర తెల్ల బియ్యం, నూకల బియ్యం ఎగుమతిని కేంద్రం నిషేధించింది. మొత్తం బియ్యం ఎగుమతుల్లో ఈ రెండూ 45 శాతం వరకు ఉంటున్నాయి (తాజాగా బాస్మతి ఎగుమతులనూ నిషేధించింది). బియ్యం ఎగుమతులను నిషేధించడానికి కారణం ఇథనాల్ తయారీదారుల ప్రయోజనాలను కాపాడటం కోసమేనని తెలుస్తోంది. ఇది వరి రైతు లాభాలను పణంగా పెడుతోంది.

ఈ సంవత్సరం మరో రెండు లక్షల టన్నుల ఉల్లిని అదనంగా సేకరిస్తామని కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. ఇది ఈ ఏడాది ఉల్లి నిల్వల లక్ష్యాన్ని (బఫర్ స్టాక్) మూడు లక్షల టన్నుల నుండి ఐదు లక్షల టన్నులకు తీసుకెళుతుంది. ఉల్లిపై 40 శాతం ఎగుమతి సుంకం విధించిన ఒక రోజు తర్వాత కేంద్రం నుంచి ఈ ప్రకటన వచ్చిందని గుర్తించాలి. అంటే, ఎగుమతులను సమర్థంగా అడ్డుకోవడం ద్వారా ప్రభుత్వం స్థానిక సరఫరాను పెంచింది. ఇది ఉల్లి ధరల పతనానికి కారణమవుతుంది. ఇది మార్కెట్ యంత్రాంగంలో జోక్యం చేసుకోవడం కాదా? ఉల్లి రైతులు ప్రభుత్వానికి తక్కువ ధరకు తమ పంటను అమ్మేలా చేసేందుకు ప్రభుత్వం నేరుగా జోక్యం చేసుకున్నట్లు కనిపించడం లేదా? ఇది మార్కెట్‌పై ప్రభుత్వ ఆధిపత్యాన్ని దుర్వినియోగం చేయడం కాదా? ఈ చర్య కచ్చితంగా రైతులకు నష్టం కలిగిస్తున్నందున, కేంద్ర మాజీ వ్యవసాయ మంత్రి కూడా ఉల్లిపై ఎగుమతి పన్ను పెంపును విమర్శించారు. ఆ మాజీ మంత్రి దేశంలోని ఉల్లిపాయల్లో మూడింట ఒక వంతు సరఫరా చేసే రాష్ట్రానికి చెందినవారు. ఎగుమతి పన్నుకు వ్యతిరేకంగా రైతులు ఇప్పటికే ఆందోళనలు చేస్తున్నప్పటికీ ఫలితం లేకుండా పోయింది.

వ్యవసాయోత్పత్తుల కోసం మార్కెట్ యంత్రాంగంలో ఇటువంటి ఏకపక్ష జోక్యాలకు రైతులు అలవాటు పడ్డారు. ఈ వారం ఉల్లి ద్రవ్యోల్బణం 19 శాతానికి చేరుకోవడం కేంద్ర ప్రభుత్వానికి ఆందోళన కలిగిస్తోంది. ఇంటి బడ్జెట్‌లో ఉల్లిపాయల వాటా కొంత భాగం మాత్రమే అనుకోవద్దు. ఉల్లి ధరలు రాజకీయ నాయకులకు కన్నీళ్లు తెప్పిస్తాయి. మితిమీరిన ఉల్లిపాయల ధరల పెరుగుదల కారణంగా ప్రభుత్వాలే పడిపోయిన విషయాన్ని దృష్టిలో పెట్టుకోవాలి. 2020 సెప్టెంబర్‌లో పార్లమెంటులో ప్రతిపాదించిన వ్యవసాయ చట్టాలను గుర్తుంచుకోండి. ఈ మూడు చట్టాలలో ఒకటి వ్యవసాయ ఉత్పత్తుల ధరలపై నియంత్రణను పూర్తిగా ఎత్తివేయాలనీ, నిల్వ పరిమితులను తొలగించాలనీ ప్రతిపాదించింది. ఎగుమతులు లేదా దిగుమతులపై ఏకపక్ష నిషేధాలను సడలించాలని కూడా అది ప్రతిపాదించింది. కానీ నూతన వ్యవసాయ చట్టాలను పార్లమెంటులో ప్రవేశపెట్టిన ఆ వారంలోనే, బంగ్లాదేశ్‌కు వెళ్లే అనేక ట్రక్కులను సరిహద్దు వద్ద నిలిపివేశారు. ఎందుకంటే, అవి ఉల్లిపాయల ఎగుమతి సరుకులను తీసుకుపోతున్నాయి. ఒకవైపు ఎగుమతులను నిలిపివేయడం, మరోవైపు వ్యవసాయ మార్కెట్లపై నియంత్రణ ఎత్తివేయడం వంటి ఈ చర్యలు మిశ్రమమైన, నిజాయితీ లేని సంకేతాలను ఇస్తున్నాయి.

బహుశా, ఉల్లిపాయలపై ప్రస్తుతం విధించిన ఎగుమతి పన్నును నివారణ చర్యగా చెప్పవచ్చు. టమోటా ధరల అనూహ్య పెరుగుదల కారణంగా ఇప్పటికే దెబ్బతిని ఉన్నాం. భారత జాతీయ సహకార సంస్థల వినియోగదారు సమాఖ్య, భారత జాతీయ సహకార మార్కెటింగ్ సమాఖ్య ఇప్పటికే తమ బఫర్ స్టాక్ కోసం 15 లక్షల టన్నుల కంటే ఎక్కువ టమోటాలను సేకరించాయి. కిలో టమోటా ధర రూ.200 వరకు పెరగడంతో సబ్సిడీ ధరలకు విక్రయిస్తున్నారు. ఈ రాయితీలను ఎక్కడినుంచి చెల్లిస్తున్నారు? ద్రవ్యోల్బణం మంటలను ఆర్పడానికి నేపాల్, తదితర దేశాల నుండి కూడా బహిరంగంగా ప్రకటించని మొత్తంలో టమోటాలను భారత్ దిగుమతి చేసుకుంది. ప్రస్తుతం దేశీయ రిటైల్ ద్రవ్యోల్బణం 7.5 శాతం వద్ద నడుస్తోంది. ఇది భారతీయ రిజర్వ్ బ్యాంక్ నిర్దేశించిన 6 శాతం పరిమితి కంటే ఎక్కువ. కాబట్టి, ద్రవ్యోల్బణానికి కారణమయ్యే ప్రధాన విలన్‌లలో టమోటాలు కూడా ఉన్నాయి. ఇది ప్రభుత్వాల అపఖ్యాతికి కారణమవుతోంది. పైగా అది మీడియా దృష్టిని విపరీతంగా ఆకర్షిస్తోంది కూడా.



మరొక వ్యవసాయ సరుకును తీసుకోండి. జూలై నెలలో భారతదేశం బాస్మతీయేతర తెల్ల బియ్యం, నూకల బియ్యం ఎగుమతిని నిషేధించింది. మొత్తం బియ్యం ఎగుమతుల్లో ఈ రెండూ 45 శాతం వరకు ఉంటున్నాయి. ఈ నిషేధం మన వ్యాపార భాగస్వాములలో చాలామందిని కలవరపెట్టింది. పైగా భారతదేశాన్ని నమ్మదగని సరఫరాదారుగా కనిపించేలా చేసింది. ఈ నేపథ్యంలో ఆఫ్రికా, ఆసియాలోని కొన్ని దేశాలు భారత్ నుండి బియ్యం దిగుమతిపై ఆధారపడటం వారి ఆహార భద్రతకు హాని కలిగించవచ్చు. దీనివల్ల ఆహార భద్రతపై భారత ప్రభుత్వం నిజంగా శ్రద్ధ చూపడం లేదని అర్థమవుతోంది. అయితే ప్రాథమికంగా బియ్యం ఎగుమతులను నిషేధించడానికి కారణం ఇథనాల్ తయారీదారుల ప్రయోజనాలను కాపాడటం కోసమేనని తెలుస్తోంది. 50 నుండి 60 లక్షల టన్నుల నూకల బియ్యంలో 30 లక్షల టన్నుల దాకా ఇథనాల్ తయారు చేయడానికి వెళ్తాయి. బియ్యం ఎగుమతిపై నిషేధం కార్ ఇంజిన్‌ల లభ్యతను పెంచుతుంది. కానీ ఇది వరి రైతు లాభాలను పణంగా పెడుతోందని గమనించాలి. అంతర్జాతీయంగా బియ్యం ధరలు దశాబ్ద కాలపు గరిష్ఠ స్థాయికి చేరుకున్నాయి. మంచి లాభాలు ఆర్జించేందుకు ఇదొక అవకాశం. వ్యవసాయోత్పత్తులపై ఎగుమతి నిషేధం వంటి చర్యల ఫలితంగా అంతిమంగా రైతులు నష్టపోతున్నారు.

టమోటాలు, ఉల్లిపాయలు లేదా బియ్యంపై విధానపరమైన చర్యలకు సంబంధించిన ఇటీవలి కథనాలు... వ్యవసాయంలో సంస్కరణలు ఎందుకు ఇంత కఠినంగా, అసంపూర్తిగా ఉన్నాయనే విషయాన్ని వివరిస్తున్నాయి. దీని వెనుక స్వాభావికమైన పట్టణ పక్షపాతం ఉంది. ప్రభుత్వ విధానాలు రైతుల ప్రయోజనం కంటే పట్టణ వినియోగదారుల సంక్షేమానికి (తక్కువ ఆహార ద్రవ్యోల్బణం) అధిక ప్రాధాన్యత ఇస్తాయి. కాబట్టి, మార్కెట్లను సంస్కరించే, రైతుకు అనుకూలంగా క్రమబద్ధీకరించే వ్యవసాయ విధానాలను ఎల్లప్పుడూ ఏకపక్షంగా తిప్పికొడుతున్నారు. ధరల నియంత్రణల వల్ల రైతులకు కలుగుతున్న నష్టాన్ని భర్తీ చేయడానికి, ఉచిత నీరు, విద్యుత్, చౌకగా ఎరువులు వంటి ఇన్‌పుట్ సబ్సిడీలు కొనసాగుతాయి. ఇది ఆర్థిక ఒత్తిడిని కలిగిస్తుంటుంది. ప్రభుత్వంపై పడుతున్న భారానికి ప్రత్యామ్నాయంగా 'ఫార్వర్డ్ మార్కెట్ల' అన్వేషణ జరగటం లేదు. అందువల్లే ప్రభుత్వం మార్కెట్‌లో జోక్యం చేసుకుంటోంది. దానికోసం పోటీ లేని గుత్తాధిపత్య ప్రవర్తనకు కూడా వెనుకాడటం లేదు. ఈ ఆధిపత్య దుర్వినియోగానికి గానూ ప్రభుత్వాన్ని ఎవరు కోర్టుకు లాగుతారు?

ధరల నియంత్రణ, నిల్వ పరిమితులు, ఏకపక్ష దిగుమతి, ఎగుమతి నిషేధాలతోపాటు తరచూ మారుతున్న ప్రభుత్వ విధానాల వల్ల వ్యవసాయం ఇప్పటికీ సంకెళ్లతో బంధించబడి ఉంది. సాంకేతికంగా చూస్తే వ్యవసాయం రాష్ట్ర ప్రభుత్వాల పరిధికి సంబంధించిన అంశం అయినప్పటికీ కేంద్రంతోపాటు, రాష్ట్ర ప్రభుత్వాలు కూడా వ్యవసాయంపై తీవ్రంగా జోక్యం చేసుకుంటున్నాయి. ఈ పరిణామాలతో రైతు భారీస్థాయి, విధ్వంసకరమైన రాయితీలతో అల్లాడిపోతాడు. భారీ సబ్సిడీలతో కూడిన రసాయన ఎరువులను అధికంగా వాడటం వల్ల పంజాబ్‌లో సంభవించిన నేల క్షీణత, లవణీయత దీనికి సాక్షీభూతంగా ఉంది. వీటన్నింటికీ మించి, దేశంలో సగం మంది రైతులకు రాయితీలు లభించవు. ఎందుకంటే వారు భూమి లేనివారు లేదా కౌలుదారులు కాబట్టి తాము సాగుచేసే భూమితో వారికి సంబంధం ఉండదు. వ్యవసాయ విధాన పరంగా మనం నేస్తున్న వలలు మనల్ని చిక్కుల్లో పడేశాయి. అందుకనే వాటి సంకెళ్లు తొలగించడం చాలా కష్టంగా మారింది. మార్కెట్లు మెరుగ్గా పనిచేయాలన్నా, ప్రభుత్వ జోక్యాన్ని పరిమితంగా ఉంచాలన్నా, మార్కెట్ ప్రక్రియలో పాల్గొని, దాని నుండి లాభం పొందేందుకు రైతుకు మరింత స్వేచ్ఛను అందించాల్సి ఉంది. దీనికోసమే మనకు భారీ సంస్కరణలు అవసరం.

వ్యాసకర్త ఆర్థికవేత్త
('ద ఫ్రీ ప్రెస్ జర్నల్' సౌజన్యంతో)

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

అద్వైతే ఈజీ



అక్సాయి చిన్, అరుణాచల్ ప్రదేశ్ ప్రాంతాలను మళ్లీ చైనా భౌగోళిక పటాలు తమవిగా చూపుతున్నాయి. దీనికి మన స్పందనేమిటి? ఓ ఓ! అయితే మళ్లీ కొన్ని చైనీస్ యాప్స్‌ను నిషేధించడానికి టైమొచ్చిందా?

– సుమంత్ రామన్, జర్నలిస్ట్

గట్టి జవాబుందా?



భారతదేశంలోని ఒక పూర్తి రాష్ట్రాన్ని (అరుణాచల్ ప్రదేశ్) మళ్లీ తమదిగా చైనీస్ మ్యాపులు పేర్కొంటున్నాయి. 'ఇది తప్పు, అంగీకారం కాదు' లాంటి బలహీనమైన జవాబులకు బదులుగా ఇండియా స్పందన ఏమిటి? భారత మ్యాపుల్లో టిబెట్‌ను స్వతంత్ర దేశంగా గుర్తిస్తే? జవాబులు ఇలా ఉండొచ్చు: చైనా అంటే భయం. ఆశ్రితుల ప్రయోజనాలు పోతాయి. చైనా దిగుమతుల మీద భారీగా ఆధారపడ్డాం. షీ జిన్‌పింగ్‌ను ముఖాముఖి ఎదుర్కొనే సంకల్పం లేదు. జోక్ ఏమిటంటే, ఇప్పటికే చైనా మెడలు వంచేశామని తమ భక్తులను వాట్సప్ యూనివర్సిటీ నమ్మించడం!

– సందీప్ మనుధానె, విద్యావేత్త

కావాలా? వద్దా?



షరియా చట్టాలను ఇష్టపడే పాకిస్తానీయులు పాశ్చాత్య దేశాలకు వెళ్లడానికి వాటి దౌత్యకార్యాలయాల ముందు వీసాల కోసం భారీ క్యూలు కడుతున్నారు: కానీ ఎవరూ కూడా (ఆ చట్టం అమల్లో ఉన్న) అఫ్గానిస్తాన్ దౌత్యకార్యాలయం ముందు వేచి ఉండటం లేదు.

– ఇంతియాజ్ మహమూద్, థింకర్

ఖాళీగా ఉన్నారా?



నారాయణమూర్తి బృందం 1981లో ఇన్ఫోసిస్‌ను ప్రారంభించింది. రాజీవ్ గాంధీ 1984లో ప్రధానమంత్రి అయ్యారు. ఒకవేళ దేశానికి రాజీవే కంప్యూటర్లు తెచ్చివుంటే, ఆ మూడున్నరేళ్ల కాలంలో ఇన్ఫోసిస్ ఇంజినీర్లు ఏం వాడివుంటారు? టైప్ రైటర్లా?

– కిరణ్ కుమార్ ఎస్., వ్యాఖ్యాత

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి. ఈ-మెయిల్: editpage@sakshi.com

సారాంశం

సరికొండ చలపతి

ప్రాణం మీదకొస్తున్న 'ప్యాకేజీ' చదువులు

చదువు.. తెలివి

ముందుగా 'ప్యాకేజీ ' చదువుల ఇంజనీర్ కథ .. ఓ వ్యక్తి బాగా చదువుకున్నాడు. ఇంజనీర్ అయ్యాడు. బాగా సంపాదిస్తున్నాడు. కారు కొనుక్కున్నాడు. డ్రైవర్‌ను కూడా పెట్టుకున్నాడు. ఫంక్షన్ ఉండడంతో ఓ రోజు ఊరెళ్లాల్సి వచ్చింది. కానీ, డ్రైవర్ సెలవు పెట్టాడు. దానితో తనే స్వయంగా డ్రైవ్ చేసుకుంటూ ఊరికి బయలు దేరాడు. దాదాపుగా ఊరిదాకా వెళ్లాడు. కానీ అంతలోనే కారు టైరు పంక్చరయ్యింది. మార్చడానికి ఎప్పటిలా డ్రైవర్ లేడు. చేసేదేంలేక తానే టైర్ మార్చే ప్రయత్నం చేయసాగాడు. కష్టపడి టైర్ విప్పాడు. దురదృష్టం మనవాడిని వెన్నాడుతూనే ఉంది. స్టెప్నీ టైర్ తీసిపెట్టి బిగించే టైమ్‌లో కాలు తాకి విప్పిపెట్టిన నట్లు పక్కనే ఉన్న మురికి కాల్వలో పడ్డాయి. ఉసూరుమన్నాడు. దిగి తీద్దామంటే బురద... అంటితే ఫంక్షన్‌కు అటెండ్ కావడం ఎలా? కర్రలు గట్రాలతో రకరకాల ప్రయత్నాలు చేశాడు. ఏదీ వర్కవుట్ కాలేదు.... తల పట్టుకుని అలాగే కూర్చున్నాడు. అరగంట గడిచింది. ఆ దారిలో పశువులను తోలుకుంటూ ఓ ఆసామి వస్తున్నాడు అతన్ని పిలిచి తన బాధంతా చెప్పి ఎలాగైనా ఆ నట్లు తీసివ్వాలని రిక్వెస్ట్ చేశాడు. దానికి ఎంత డబ్బయినా ఇస్తానని చెప్పాడు. కొంచెంసేపు ఆ ఇంజనీర్‌వైపు కారువైపు అలాగే చూసి నవ్వుతూ ఇలా అన్నాడు. ''బాబూ!, డబ్బుల విషయం అలా ఉంచు. నేను దిగి తీసివ్వడానికి అభ్యంతరం ఏమీ లేదు. కానీ, అందులో దిగాకా నేను మళ్లీ ఇంటికి వెళ్లి బురద కడుక్కుని రావాలి. నువ్వు కూడా దానిలో దిగలేవు. అందుకని నేనో ఉపాయం చెబుతా.. మిగతా చక్రాలవి ఒక్కో నట్టు తీసి ఈ టైరుకు బిగిద్దాం. కారు నడవడానికి ఢోకా ఉండదు. నువ్వు హాయిగా వెళ్లొచ్చు. ఓ పది కిలోమీటర్ల దూరంలో మెకానిక్ షాపు ఉంది. అక్కడికి వెళ్లి నట్లు వేయించుకుని వెళ్లు. నీకు డబ్బు ఖర్చు, నాకు బురదా తప్పుతాయి. ఆ ఐడియాకు ఆ మెకానికల్ ఇంజనీర్ అవాక్కయ్యాడు. ఈ మాత్రం ఆలోచన రాక అరగంట నుంచి ఇబ్బంది పడ్డానే అనుకున్నాడు..


చదువు మెకానికల్ అయిపోయి, ఉద్యోగానికి మాత్రమే, అందునా ప్యాకేజీలకు మాత్రమే పనికి వచ్చే చదువుతో తయారైన బుర్ర నుంచి ఇలాంటి పదునైన ఆలోచన రావడం కష్టమే..

చావుల చదువు..

ఓ సీలింగ్ ఫ్యాన్.. మేధో బుర్రలకు తట్టిన గొప్ప ఐడియా. సీలింగ్ ఫ్యాన్‌కు దానికి ఆధారంగా ఉండే రాడ్‌కు మధ్య ఓ స్ప్రింగ్‌ను బిగిస్తారు. ఈ ఫ్యాన్లకు 20 కిలోల కన్నా ఎక్కువ బరువు వేలాడితే వెంటనే స్ప్రింగ్ సాగుతుంది. దానితో ఫ్యాను సీలింగ్ నుంచి కిందకు దిగుతుంది. స్ప్రింగ్ సాగగానే సైరన్ కూడా మోగుతుంది.

అత్యంత విచారకరమైన విషయం ఏమిటంటే ఇవి ఇప్పుడు రాజస్థాన్‌లోని కోటా పట్టణంలోని హాస్టళ్లలో ఏర్పాటు చేస్తున్నారు. కోటాలోని ఐఐటీ కోచింగ్ సెంటర్లలో చదివే విద్యార్థులు ఫ్యాన్లకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంటున్నారని.. వాటిని ఆపాలని ప్రయత్నం. వీటితో పాటు భవనంపై నుంచి దూకి ఆత్మహత్యలు చేసుకోకుండా భవనాల వెలుపలా, బాల్కనీల్లో సూసైడ్ ప్రూఫ్ వలలు ఏర్పాటు చేస్తున్నారు. ఇవి 150 కిలోల బరువు మోయగలవు. ఎవరైనా విద్యార్థులు భవనంపై నుంచి దూకినా గాయాలు కావు.

పరిష్కారం ఇదేనా.. అన్న చర్చ పక్కన పెడితే.. **విద్యావ్యవస్థ సిగ్గు పడాల్సిన సందర్భం ఇది.**



చదువు ఏమి ఇస్తది..
జ్ఞానం ఇస్తది..
బతుకుకు భరోసా ఇస్తది
చావు నిస్తదా..

....

చదువు ఎంత గొప్పదయితే
అంత చావునిస్తదా.

....

చదువు ఎందుకంత గొప్పదయ్యింది. మంచి జ్ఞానాన్ని, జీవితంపై భరోసాను కాదు మంచి జీతాన్ని ఇస్తదని, మంచి ప్యాకేజీలను ఇస్తదని ఆశ.. దానివల్ల విద్యార్థులపై ఒత్తిడి. పదిహేను లక్షలమందితో పోటీపడి 12 వేల మంది గెలుచుకునే క్రీడ. ఇందులో బలయ్యేది.. ఎక్కువగా తక్కువ స్థోమత ఉన్న కుటుంబంలోంచి వచ్చిన పిల్లలేనట. ఉన్న ఎకరమో, అరెకరమో అమ్మి, లేదా ఆర్థిక స్థోమత లేక అప్పోసప్పో చేసి తల్లిదండ్రులు పిల్లల బాగుకోసం చదువులకు పంపితే..అది ఇంకా పిల్లలపై ఒత్తిడి పెంచుతోంది. అసలే తీవ్రమైన పోటీ.. ఎడతెరిపిలేకుండా శిక్షణ, ఆ చదువులు అబ్బుతాయా లేదా అన్న విచక్షణ లేకుండా.. మంచి ప్యాకేజీలో స్థిరపడాలన్న తల్లిదండ్రుల ఆకాంక్ష, వెరసి చదువులు స్ప్రింగ్ ఫ్యాన్లు, సూసైడ్ ప్రూఫ్ నెట్ దాకా వచ్చాయి.

....

ఇంతా కష్టపడి చదివిన ఐఐటీ డిగ్రీలు అవి నేర్పిన వృత్తిలోనే స్థిర పడుతున్నారా... ఏది దొరికితే ఆ ఉద్యోగం చేస్తున్నారు.. మనం పైన సరదాగా చెప్పుకున్న మెకానికల్, ప్యాకేజీ చదువులయిపోయాయి. మనసుకు పట్టినా పట్టకపోయినా.. మెకానికల్‌గా చదువుకుని బయట పడ్డవాళ్లు బతికిపోతున్నారు.. లేని వాళ్లు చితికిపోతున్నారు.

చదవేస్తే...

తెల్లారితే చాలు.. ఎక్కడో ఓ చోట.. ఎవరో ఓ విద్యార్థి ఆత్మహత్య వార్త వింటున్నాం. చదువుల ఒత్తిడి.. పరీక్షల్లో పాస్ కాకపోతే ఎలాగనే ఆవేదన.. తల్లిదండ్రులు, స్నేహితుల ముందు పరువుపోతుందనే ఆందోళన.. విద్యా సంస్థల్లో అధ్యాపకులు, సిబ్బంది వేధింపులు.. ఇలాంటివన్నీ కలసి విద్యార్థుల ఆత్మ'హత్య'లకు కారణమవుతున్నాయి. కుటుంబ, వ్యక్తిగత కారణాలూ వీటికి తోడవుతున్నాయి. కొన్నేళ్లుగా ఈ సమస్య మరింతగా పెరుగుతూ వస్తోంది. జూనియర్ కాలేజీల నుంచి మొదలుకుని మెడికల్ కాలేజీలు, ప్రఖ్యాత ఐఐటీల వరకు అన్నిచోట్లా విద్యార్థుల బలవన్మరణాలు జరుగుతున్నాయి.

- దేశంలో 2017– 2021 మధ్య ఆత్మహత్యలు 26 శాతం పెరిగాయి. అదే ఒక్క విద్యార్థులనే పరిగణనలోకి తీసుకుంటే 32 శాతం పెరిగాయి.
- 2017లో 9,905 మంది విద్యార్థులు బలవన్మరణాలకు పాల్పడితే.. 2021లో ఈ సంఖ్య 13 వేలకుపైనే.
- దేశంలో సగటున రోజుకు 35 మంది.. అంటే ప్రతి రెండు గంటల్లో ముగ్గురు విద్యార్థులు ఆత్మహత్య చేసుకుంటున్నారు. ఇందులోనూ పురుష విద్యార్థుల బలవన్మరణాలు ఎక్కువగా ఉంటున్నాయి.
- కరోనా మహమ్మారి కారణంగా 2020లో విద్యార్థుల ఆత్మహత్యల్లో ఒక్కసారిగా 21 శాతం పెరుగుదల నమోదైనట్టు గుర్తించారు.
- దేశంలోనే టాప్ విద్యాసంస్థలు అయిన ఐఐటీలు, ఐఐఎంలు, నిట్‌లు, సెంట్రల్ యూనివర్సిటీల్లోనూ ఇదే పరిస్థితి. 2018 నుంచి 2023 ఏప్రిల్ మధ్య వీటిలో 103 మంది విద్యార్థులు ఆత్మహత్య చేసుకున్నారు.
- ప్రధానంగా మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల్లో ఎక్కువగా విద్యార్థుల ఆత్మహత్యలు జరుగుతుంటే.. ఛత్తీస్‌గఢ్, గుజరాత్, కేరళ, తెలుగు రాష్ట్రాల్లో పెరుగుతూ వస్తున్నాయి.
- వయసుపరంగా చూస్తే.. 18 ఏళ్ల నుంచి 30 ఏళ్ల మధ్య వారి ఆత్మహత్యలు బాగా పెరిగాయి. ఈ ఏజ్‌వారు 2017 కల్లా 45,217 మంది బలవన్మరణానికి పాల్పడగా.. 2021 నాటికి ఈ సంఖ్య 56,543కు చేరుకుంది.
- అయితే విద్యార్థులు స్కూల్ చదువు పూర్తి చేసి కాలేజీల్లో చేరినప్పుడు.. ఒక్కసారిగా మారిపోతున్న విద్యా వాతావరణం, కాలేజీ చదువుకు అయ్యే ఖర్చు, విద్యార్థుల సామాజిక-సాంస్కృతిక-ఆర్థిక స్థాయిల్లో భేదాలతో ఒత్తిడి వంటివి ఆత్మహత్యలకు దారితీస్తున్నాయని నిపుణులు చెప్తున్నారు. ఇవి వారి కుటుంబాల్లో సమస్యలకు కారణమై.. 'కుటుంబ సమస్యల'తో బలవన్మరణాలు జరుగుతున్నాయని అంటున్నారు.
- జాతీయ నేర గణాంకాల సంస్థ (ఎన్సీఆర్‌బీ) విడుదల చేసిన 'భారత్‌లో ప్రమాద మరణాలు, ఆత్మహత్యల నివేదిక (ఏడీఎస్ఐ)' లోని అధికారిక లెక్కలే ఇవి. ఇంకా నమోదు కాని ఆత్మహత్యలు మరెన్నో.

....

బంజారా బతుకమ్మ

బంజారా (లంబాడీ)లు అత్యంత ఉత్సాహపూరితంగా జరుపుకొనే పండుగ 'తీజ్'. దీనిని 'బంజారాల బతుకమ్మ పండుగ' అనడం అతిశయోక్తి కాదు. తొమ్మిది రోజుల పాటు జరుపు కొనే ఈ పండుగలో పెళ్లి కాని లంబాడీ యువతుల పాత్ర అతి ముఖ్యమైనది.

గోదుమ మొలకలను 'తీజ్'గా పిలుస్తారు. బతుకమ్మను పూలతో అలంకరించినట్లే తీజ్‌లో గోదుమ మొలకలను ఎనిమిది రోజుల పాటు భక్తి భావంతో పెంచి తొమ్మిదవ రోజు తండా ప్రజలందరూ కలిసి ఊరేగింపుతో నిమజ్జనం చేస్తారు. శ్రావణ మాసంలో తండా పెద్దమనిషి 'నాయక్' అనుమతి తీసుకొని తీజ్ పనులను మొదలుపెడతారు. ఆడపిల్లలు అంగడికి వెళ్లి గోదుమలు, వాటిని మొలకెత్తించడానికి దూసేరు తీగలతో అల్లిన బుట్ట (ఓల్డి)లు, సెనగలు, ఇతరత్రా సామాన్లు తెచ్చుకుంటారు. పుట్ట మట్టిని తెచ్చి అందులో మేక ఎరువును కలుపుతారు. లంబాడీల దేవతలు 'దండి యాడి', 'తుల్జా భవాని', 'సేవా భాయి', 'సేవాలాల్ మహారాజ్', 'సీత్లా భవాని' పేర్లతో తయారు చేసిన బుట్టలలో మొదటగా తండా పెద్దమనిషి నాయక్ చేత ఎరువు కలిపిన మట్టిని పోయిస్తారు. ఆ తరువాత నానబెట్టిన గోదుమలు బుట్టలో చల్లిస్తారు. ఈ అన్ని కార్యక్రమాలూ బంజారా ఆడపిల్లల ఆటపాటలతో జరుగుతాయి.రోజూ ఆడపిల్లలు స్నానం చేసి బావి నుంచి నీటిని తెచ్చి ప్రతిరోజు ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం తొమ్మిది రోజుల పాటు బుట్టల్లో పోస్తారు.

ఈ నీరు అత్యంత పవిత్రమైందనీ, దీని వల్ల శుభం జరుగుతుందనీ నమ్మకం. గోధుమలు, సెనగలు గునుగుపూలలా పొడుగ్గా పెరిగితేనే నచ్చిన జీవిత భాగస్వామి దొరుకుతాడనీ, తమ బతుకులు పచ్చగా ఉంటాయనీ గిరిజనుల నమ్మకం. ఏడో రోజు జరిపే కార్యక్రమమే 'ఢమోళి' (రొట్టెలో బెల్లం కలిపిన ముద్దను) చుర్మో అంటారు. ఆ రోజు మేరామా భవానీకి జంతువులను బలి ఇవ్వడం ఆచారం. దీన్నే 'అకాడో' అని కూడా అంటారు. మేక మాంసాన్ని ఇంటింటికీ పంపిస్తారు.

ఎనిమిదో రోజు తమ లంబాడి ఆరాధ్య దేవతల ప్రతిరూపాలను మట్టితో చేసి పూజిస్తారు. వారికి పెళ్లిళ్లు చేస్తారు. ఆడపిల్లలు తమను డోక్రిలుగా ఊహించుకుంటారు. పెళ్లి అయితే తమ పుట్టింటిని వదిలి వెళ్లాల్సి వస్తుందని ఏడుస్తారు. వారిని సోదరులు ఓదార్చు తారు. తీజ్ నిమజ్జనానికి బంధుమిత్రులను ఆహ్వానిస్తారు. డప్పు చప్పుళ్లతో సంప్రదాయ బద్ధంగా పాటలు పాడుతూ నృత్యం చేస్తూ నిమజ్జనం చేయడంతో ఉత్సవాలు ముగుస్తాయి.

– లకావత్ చిరంజీవి నాయక్
(శ్రావణ మాసంలో తీజ్ పండుగ జరుపుకొంటున్న సందర్భంగా)

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయణం, వర్ష ఋతువు, నిజ శ్రావణ మాసం, **తిథి:** శు.చతుర్దశి ఉ.10.33 వరకు, తదుపరి పౌర్ణమి, **నక్షత్రం:** ధనిష్ఠ రా.10.03 వరకు, తదుపరి శతభిషం, **వర్జ్యం:** తె.4.44 నుండి 6.14 వరకు (తెల్లవారితే గురువారం), **దుర్ముహూర్తం:** ప.11.37 నుండి 12.26 వరకు, **అమృతఘడియలు:** ప.12.21 నుండి 1.50 వరకు; **రాహుకాలం:** ప.12.00 నుండి 1.30 వరకు, **యమగండం:** ఉ.7.30 నుండి 9.00 వరకు, **సూర్యోదయం:** 5.48, **సూర్యాస్తమయం:** 6.14.

క్లుప్తంగా...

సెప్టెంబర్ 11 నుంచి అంగన్‌వాడీల సమ్మె

ఏఐటీయూసీ జాతీయ నాయకురాలు విజయలక్ష్మి


సమావేశంలో మాట్లాడుతున్న విజయలక్ష్మి

హిమాయత్‌నగర్(హైదరాబాద్): అంగన్‌వాడీలపట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మొండివైఖరి ప్రదర్శిస్తున్నాయని ఏఐటీయూసీ జాతీయ నాయకురాలు విజయలక్ష్మి అన్నారు. మంగళవారం హిమాయత్‌నగర్‌లోని సత్యనారాయణరెడ్డి భవన్‌లో నిర్వహించిన అంగన్‌వాడీల సమావేశంలో ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీల వేతనాల పెంపు, ఇతర సమస్యల పరిష్కారానికి సెప్టెంబర్ 11వ తేదీ నుంచి సమ్మె చేపట్టనున్నట్లు తెలిపారు. అంగన్‌వాడీల జీతాలు పెంచాలని అనేక పోరాటాలు చేస్తున్న ప్పటికీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోవడంలేదన్నారు. సమావేశంలో అంగన్‌వాడీల అసోసియేషన్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి నందూరి కరుణకుమారి, ఏఐటీయూసీ ఉపాధ్యక్షురాలు ప్రేంపావని, అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు టి.సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

సింగరేణిలో సమ్మెలపై నిషేధం పొడిగింపు

సాక్షి, హైదరాబాద్: సింగరేణి బొగ్గు గనుల సంస్థలో అన్ని రకాల సమ్మెలపై నిషేధాన్ని మరో ఆరు నెలల పాటు పొడిగిస్తూ రాష్ట్ర ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సునీల్ శర్మ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం అమల్లో ఉన్న నిషేధం సెప్టెంబర్ 11తో ముగియనుండగా, తెలంగాణ అత్యవసరసేవల నిర్వహణ చట్టం(టెస్మా) కింద మరో ఆరు నెలల పాటు పొడిగించినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

గ్యాస్ ధర తగ్గింపు నామమాత్రం: కవిత



సాక్షి, హైదరాబాద్: ప్రజల నడ్డి విరిచేలా వంట గ్యాస్ ధరలను విపరీతంగా పెంచిన కేంద్ర ప్రభుత్వం ప్రస్తుతం నామమాత్రంగా తగ్గించి ఎంతో లబ్ధి చేశామని గొప్పలు చెప్పుకుంటోందని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత విమర్శించారు. వంట గ్యాస్ సిలిండర్ ధరల తగ్గింపు నిర్ణయంపై ఆమె ట్విట్టర్లో స్పందించారు. పదేళ్లలో బీజేపీ ప్రభుత్వం ఒక్కొక్క ఎల్పీజీ సిలిండర్‌పై రూ.800 పెంచి తాజాగా రూ.200 మాత్రమే తగ్గించిందని పేర్కొన్నారు. 'ఇది కానుక కాదు. సామాన్య ప్రజల జేబులను గుల్ల చేసి దగా చేయడమే. ప్రజల భావోద్వేగాలతో ఆడుకోవడమే'.. అని స్పందించారు.

సెకండ్ ఏఎన్ఎంలకు షోకాజ్ నోటీసులు

సమ్మె నేపథ్యంలో చర్యలు

సాక్షి, హైదరాబాద్: వైద్య, ఆరోగ్య శాఖలో సమ్మె చేస్తున్న సెకండ్ ఏఎన్ఎంలపై ప్రభుత్వం చర్యలకు దిగింది. కొందరు ఏఎన్ఎంలకు ఏకంగా షోకాజ్ నోటీసులు జారీచేయడం రాష్ట్రవ్యాప్తంగా చర్చకు దారితీసింది. అన్ని రకాల ఏఎన్ఎంలను యథావిధిగా రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 15 నుంచి తెలంగాణ యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో జరుగుతున్న సమ్మె మంగళవారానికి 15వ రోజుకు చేరుకుంది. రాష్ట్రవ్యాప్తంగా కాంట్రాక్టు ఏఎన్ఎంలు సమ్మెను ఐక్యంగా కొనసాగిస్తున్నారు. ఈ మధ్యకాలంలో ప్రభుత్వంతో మూడుసార్లు చర్చలు జరిగినా కీలకమైన రెగ్యులరైజేషన్ మీద ప్రభుత్వ వైఖరి సరిగా లేదని ఏఎన్ఎంలు చెబుతున్నారు. చట్టబద్ధంగా 15 రోజుల ముందు ప్రభుత్వానికి సమ్మె నోటీసు ఇచ్చామని, ప్రభుత్వం స్పందించకపోవడంతో సమ్మెకు వెళ్లామని.. అందువల్ల ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించాలని అంటున్నారు. తమను రెగ్యులర్ చేసే వరకు సమ్మె ఆపేది లేదని, నోటీసుల పేరుతో బెదిరించి సమ్మెను విరమింప చేయాలనుకోవడం సమంజసం కాదని చెబుతున్నారు. షోకాజ్ నోటీసులను వెంటనే వెనక్కి తీసుకోవాలని యూనియన్ ప్రధాన కార్యదర్శి యాదనాయక్ డిమాండ్ చేశారు.

నేడు, రేపు ఆర్టీసీ మహిళా ప్రయాణికులకు లక్కీ డ్రా

రాఖీ పౌర్ణమి ఆఫర్.. విజేతలకు నగదు బహుమతులు

సాక్షి, హైదరాబాద్: రాఖీ పండుగ నేపథ్యంలో ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే మహిళలకు లక్కీ డ్రా రూపంలో నగదు బహుమతులు ఇవ్వాలని ఆర్టీసీ నిర్ణయించింది. 11 రీజియన్లలో రీజియన్ల వారీగా విజేతలను గుర్తించి బహుమతి ప్రదానం చేస్తారు. అన్నీ కలిపి రూ.5.50 లక్షల మొత్తాన్ని అందించనుండటం విశేషం. ఈ నెల 30, 31 తేదీల్లో ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే మహిళలు గమ్యం చేరిన తర్వాత తమ టికెట్ వెనక పేరు, ఫోన్ నంబర్, ఇతర వివరాలు రాసి బస్టాండ్లలో ఉంచిన ప్రత్యేక బాక్సుల్లో వేయాల్సి ఉంటుంది. జమయ్యే టికెట్ల నుంచి రీజియన్ల వారీగా కొన్ని ఎంపిక చేసి ఆయా ప్రయాణికులకు బహుమతులు ప్రదానం చేయాలని నిర్ణయించారు.

ఏబీపీఎస్‌కు మారితేనే ఉపాధి కూలి జమ

1వ తేదీ నుంచి జాబ్‌కార్డు, ఆధార్–బ్యాంకు ఖాతా లింక్ కావాల్సిందే



సాక్షి, హైదరాబాద్: జాతీయ ఉపాధిహామీ చట్టం కింద ఉపాధి పొందాలంటే తప్పనిసరిగా ఆధార్ ఆధారిత చెల్లింపు బ్రిడ్జి సిస్టమ్ (ఏబీపీఎస్)కు మారాల్సిందే. గతంలో మూడునాలుగు పర్యాయాలు ఈ డెడ్‌లైన్ మారినా, ఇకపై ఎలాంటి పొడిగింపులు ఉండవని కేంద్ర ప్రభుత్వవర్గాలు స్పష్టం చేస్తున్నట్టు తెలుస్తోంది. ఆగస్టు 31వ తేదీ వరకే బ్యాంక్ ఖాతా ఆధారిత, ఆధార్ ఆధారిత పద్ధతుల్లో పేమెంట్స్ చేస్తారు. ఇకపై ఆధార్–ఎనెబుల్డ్ పేమెంట్ సిస్టమ్ (ఏఈపీఎస్) కాకుండా, సెప్టెంబర్ 1వ తేదీ నుంచి ఏబీపీఎస్ అనుసరిస్తున్నారనే విషయాన్ని గమనించాల్సి ఉందని అధికారులు చెబుతున్నారు.

- ఈ కొత్త విధానంలో భాగంగా ఉపాధి హామీ జాబ్‌కార్డ్ హోల్డర్, తన జాబ్ కార్డ్‌ను బ్యాంక్ ఖాతా, ఆధార్‌తో అనుసంధానం చేయడంతో పాటు దీనిని నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ) మ్యాపర్‌తో తప్పనిసరిగా కనెక్ట్ చేయాలి.
- ఆధార్‌తో బ్యాంక్ అకౌంట్ సీడింగ్, ఎన్‌పీసీఐ మ్యాపర్‌లో మ్యాపింగ్ చేయడానికి ఖాతాదారు కేవైసీ వివరాలు, బయోమెట్రిక్, స్థానికత, ఆధార్ డేటాబేస్–బ్యాంక్ ఖాతాల్లోని వివరాల్లో తేడాలు లేకుండా చూసుకోవడం వంటివి చేయాల్సి ఉంటుంది.
- ఉపాధిహామీ జాబ్‌కార్డు సమాచారంలో తేడాలున్నా వేజ్ పేమెంట్ అనేది స్తంభిస్తుంది.
- ఉపాధి కూలీలు బ్యాంక్ ఖాతాలను తరచుగా మార్చడం, దానిని ప్రోగ్రామ్ ఆఫీసర్లు అప్‌డేట్ చేయకపోవడం, తదితర కారణాల నేపథ్యంలో లబ్ధిదారులకు నష్టం జరగకుండా ఏబీపీఎస్ అత్యుత్తమ ప్రత్యామ్నాయమని కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ స్పష్టం చేసింది.
- క్షేత్రస్థాయిలో వివిధ జిల్లాల్లో జాబ్‌కార్డును బ్యాంక్ ఖాతా, ఆధార్‌తో అనుసంధానం చేయడంలో సిబ్బందికి అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి అధికారులు చెబుతున్నారు. ఈ డెడ్‌లైన్ మరికొంతకాలం పొడిగిస్తే అందరికీ ఉపయోగకరంగా ఉంటుందని సూచిస్తున్నారు.

లిబ్‌టెక్ నివేదికలో ఏముందంటే...

- కేంద్ర ప్రభుత్వం సాంకేతిక అంశాలకు ప్రాధాన్యం ఇచ్చి ఉపాధిహామీ చట్టం ఆశయాలు, లక్ష్యాలను నీరుగారుస్తుందని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.
- రాష్ట్రంలోని మొత్తం కోటీ ఐదు లక్షల మంది (ఇన్ యాక్టివ్ వర్కర్లతో సహా) ఉపాధి కూలీల్లో 42 లక్షల మంది ఏబీపీఎస్‌కి అనర్హులుగా ఉండిపోయారు.
- పనిచేస్తున్న 61 లక్షల కూలీల్లో (యాక్టివ్ వర్కర్స్) 5.33 లక్షల మంది ఏబీపీఎస్‌కి అర్హత సాధించలేకపోయారు.
- నరేగా పోర్టల్ నుంచి సమాచారాన్ని విశ్లేషించిన లిబ్‌టెక్ ఇండియా సంస్థ తన నివేదికలో ఈ విషయాలను వెల్లడించింది.

పేమెంట్ మిస్ కాకుండా ప్రభుత్వాలే బాధ్యత వహించాలి

యాక్టివ్ వర్కర్స్ కేటగిరీలో ఏబీపీఎస్ అర్హత విషయంలో మొత్తం కార్మికుల సంఖ్యను పరిగణనలోకి తీసుకున్నపుడు గణనీయమైన సంఖ్యలో కార్మికులు దీనికి అర్హత సాధించలేదని అర్థమవుతుంది. దీంతో వారు ఉపాధి హామీ కింద పని పొందడానికి అనర్హులుగా చేస్తుంది. ఇది ఉపాధి చట్టం సూత్రాలకు స్పష్టమైన ఉల్లంఘనే. అంతేకాకుండా, గత 18 నెలల్లో రాష్ట్రవ్యాప్తంగా నికరంగా తొలగించిన దాదాపు 4 లక్షల మంది కార్మికులను ఏబీపీఎస్ అర్హత గణాంకాలు పరిగణనలోకి తీసుకోలేదు. తెలంగాణలో ఏ ఒక్క కార్మికుడు కూడా ఏబీపీఎస్ కారణంగా ఉపాధి హామీ చట్టం కింద పని, పేమెంట్ మిస్ కాకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వాలదే. – చక్రధర్ బుద్ధా, డైరెక్టర్, లిబ్‌టెక్ ఇండియా సంస్థ

వైద్యుల నిర్లక్ష్యం... బాలింతకు కష్టం

కాటన్ ప్యాడ్‌ను తొలగించకుండానే డిశ్చార్జి • ఇంటికి చేరాక అస్వస్థత


చికిత్స పొందుతున్న బాలింత కీర్తిలయ

మంచిర్యాల టౌన్: మంచిర్యాల ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో ఈ నెల 24న ఓ మహిళకు ప్రసవ సమయంలో వైద్యులు, సిబ్బంది కాటన్ ప్యాడ్‌ను అమర్చి డిశ్చార్జి సమయంలో తొలగించడం మర్చిపోయారు. దీంతో ఆమె తీవ్ర అస్వస్థతకు గురైంది. బాధితురాలు కీర్తిలయ, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మంచిర్యాల జిల్లా వేమనపల్లి మండలం నీల్వాయి గ్రామానికి చెందిన కీర్తిలయకు ఈ నెల 24న పురిటి నొప్పులు రావడంతో మంచిర్యాల ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించారు. అదేరోజు మధ్యాహ్న సమయంలో సాధారణ ప్రసవానికి ప్రయత్నించగా.. కొంత క్రిటికల్ కావడంతో ఫోర్సెప్ డెలివరీ (బలవంతపు సాధారణ ప్రసవం) చేయగా మగశిశువుకు జన్మనిచ్చింది. కీర్తిలయకు రక్తస్రావం కాకుండా ఉండేందుకు కాటన్ ప్యాడ్ అమర్చారు. అనంతరం తల్లీబిడ్డలను వార్డులోకి మార్చారు. మూడు రోజుల తర్వాత 27న సాయంత్రం కాటన్‌ప్యాడ్‌ను తొలగించకుండానే డిశ్చార్జి చేశారు. ఇంటికి వెళ్లిన బాలింత 28న సాయంత్రం అస్వస్థతకు గురికాగా 108లో చెన్నూర్‌లోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడి వైద్య సిబ్బంది విషయాన్ని గమనించి కాటన్‌ప్యాడ్‌ను తొలగించారు. మెరుగైన వైద్యం కోసం మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. కాటన్‌ప్యాడ్ తొలగించకుండానే డిశ్చార్జి చేయడంపై బాలింత, ఆమె కుటుంబ సభ్యులు వైద్యులు, వైద్య సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రస్తుతం బాలింత పరిస్థితి మెరుగ్గానే ఉండగా, పూర్తిస్థాయి చికిత్సకు వైద్యులు ఏర్పాట్లు చేశారు. ఈ విషయమై ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ హరిశ్చందర్‌రెడ్డిని సంప్రదించగా.. కాటన్‌ప్యాడ్‌ను తొలగించడంలో సిబ్బంది తప్పిదం ఉందని, బాధ్యులైన వైద్యులు, సిబ్బంది వివరణ తీసుకుని ఉన్నతాధికారులకు తెలిపి, వారి ఆదేశాల ప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు.

వచ్చే నెల 9-12 తేదీల మధ్య 'పీఆర్ కార్యాలయాలు' ప్రారంభం

సాక్షి, హైదరాబాద్: వచ్చే నెల 9 నుంచి 12 తేదీల మధ్య పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ శాఖకు సంబంధించిన చీఫ్ ఇంజనీర్, సూపరింటెండెంట్ ఇంజనీర్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ల కార్యాలయాలను ప్రారంభించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. కొత్త చీఫ్ ఇంజనీర్, సూపరింటెండెంట్ ఇంజనీర్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కార్యాలయాల ప్రారంభోత్సవాలను సంబంధిత జిల్లా మంత్రుల ద్వారా, డీఈఈ, ఇతర ఆఫీసులను జిల్లా మంత్రులను సంప్రదించి స్థానిక ప్రజాప్రతినిధుల ద్వారా చేయాలని పంచాయతీరాజ్ ఈఎన్‌సీకి పీఆర్ ముఖ్య కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా సూచించారు. పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ శాఖ పునర్‌వ్యవస్థీకరణతో పాటు కొత్తగా చీఫ్ ఇంజనీర్ ఆఫీసులు, సర్కిళ్లు, డివిజన్లు, సబ్‌డివిజన్లను ఏర్పాటు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే ఉత్తర్వులు జారీచేసింది. తదనుగుణంగా కొత్త పంచాయతీరాజ్ యూనిట్లలో నూతన కార్యాలయాలు / యూనిట్ల ఏర్పాట్లు, ఇన్‌చార్జీల నియామకానికి సంబంధించి పీఆర్ ఈఎన్‌సీకి అనుమతినిస్తూ మంగళవారం నాటి ఉత్తర్వుల్లో సుల్తానియా స్పష్టంచేశారు.

దడ పుట్టిస్తున్న డిక్లరేషన్

సాక్షి, హైదరాబాద్: దళిత, గిరిజన వర్గాల కోసం కాంగ్రెస్ పార్టీ చేసిన డిక్లరేషన్‌ను చూసి బీఆర్ఎస్ ప్రభుత్వ మంత్రులు భయపడుతున్నారని టీపీసీసీ ఆదివాసీ కాంగ్రెస్ అధ్యక్షుడు బెల్లయ్య నాయక్ వ్యాఖ్యానించారు. తమ డిక్లరేషన్ పనికిరాదంటూ వారు చేస్తున్న వ్యాఖ్యల వెనుక భయం స్పష్టంగా కనిపిస్తోందని చెప్పారు. ఆయన మంగళవారం గాంధీభవన్‌లో విలేకరులతో మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్ అమలైతే ఐదేళ్లలోనే దళిత, గిరిజన జీవితాల్లో మార్పులు వస్తాయని స్పష్టం చేశారు. సెప్టెంబర్ 2వ తేదీ నుంచి ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్‌ను ప్రజల్లోకి తీసుకెళ్తామని చెప్పారు.

615 'ఎలక్ట్రిక్' చార్జింగ్ కేంద్రాలు!

- ఏర్పాటుకు ప్రైవేటు వ్యక్తుల నుంచి దరఖాస్తుల ఆహ్వానం
- పీపీపీ విధానంలో ఏర్పాటుకు తెలంగాణ రెడ్కో నిర్ణయం

సాక్షి, హైదరాబాద్: గ్రేటర్ హైదరాబాద్ మినహా రాష్ట్రంలో మిగిలిన అన్ని జిల్లా, మండల కేంద్రాలు, హైవేలపై 615 ప్రాంతాల్లో పబ్లిక్ ప్రైవేటు భాగస్వామ్య(పీపీపీ) పద్ధతిలో ఎలక్ట్రిక్ వాహనాల చార్జింగ్ కేంద్రాల ఏర్పాటుకు ప్రైవేటు వ్యక్తుల నుంచి తెలంగాణ పునరుద్ధరణీయ ఇంధన సంస్థ(రెడ్కో) దరఖాస్తులను ఆహ్వానించింది. రెడ్కో చూపించిన స్థలాల్లోనే ఫాస్ట్, స్లో చార్జింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. పూర్తి వివరాలు, విధివిధానాల కోసం హైదరాబాద్‌లోని తమ కేంద్ర కార్యాలయం/స్థానిక జిల్లా కార్యాలయాలను సందర్శించాలని రెడ్కో చైర్మన్ వై.సతీష్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. సంస్థ వెబ్‌సైట్ https://tsredco.telangana.gov.in/ లో పూర్తి వివరాలను అందుబాటులో ఉంచినట్లు వెల్లడించారు.

దేశంలోనే తొలిసారిగా..

దేశంలోనే తొలిసారిగా తెలంగాణలో పీపీపీ విధానంలో చార్జింగ్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని, ఇప్పటికే యాదాద్రిలో ఏర్పాటు చేసిన తొలి చార్జింగ్ కేంద్రం విజయవంతంగా నడుస్తోందని సతీష్‌రెడ్డి తెలిపారు. ఎలక్ట్రిక్ వాహన వినియోగదారులకు ఇబ్బందులు రాకుండా రాష్ట్రమంతటా చార్జింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయాలని లక్ష్యంతో పనిచేస్తున్నామని పేర్కొన్నారు. రాష్ట్రంలో 2025 కల్లా 3000 ఎలక్ట్రిక్ చార్జింగ్ కేంద్రాల ఏర్పాటు లక్ష్యంగా పనిచేస్తున్నట్టు వెల్లడించారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో రెడ్కో స్వయంగా 150 ఫాస్ట్ చార్జింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసిందని.. ఇందులో 90 కేంద్రాలు వినియోగంలోకి వచ్చాయని వివరించారు.

ధర్మారెడ్డిని మార్చకపోతే తడాఖా చూపిస్తాం

పరకాల నియోజకవర్గ తెలంగాణ ఉద్యమకారులు

పరకాల: పరకాల అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అభ్యర్థిత్వాన్ని మార్చాలని తెలంగాణ ఉద్యమకారులు, వివిధ కుల సంఘాల నాయకులు బీఆర్ఎస్ అధిష్టానాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం హనుమకొండ జిల్లా పరకాలలో రుణవిమోచన కమిషన్ చైర్మన్ నాగుర్ల వెంకటేశ్వర్లు వర్గంతోపాటు తెలంగాణ ఉద్యమకారుల సంఘం బాధ్యులు, ఆరె కులస్తులు, వ్యాపారులు సమావేశమై పలు అంశాలపై చర్చించారు. ధర్మారెడ్డికి ఎమ్మెల్యే టికెట్ రద్దు చేయని పక్షంలో వచ్చే ఎన్నికల్లో తడాఖా చూపుతామని హెచ్చరించారు. తన ఆస్తులను రూ.200 కోట్లు, 2 వేల ఎకరాలకు పెంచుకున్న చల్లాకు మళ్లీ టికెట్ ఇస్తే ఓటుతో ప్రజలు బుద్ధి చెప్పటానికి సిద్ధంగా ఉన్నారన్నారు. బహుజనుల బిడ్డ నాగుర్లకు టికెట్ ఇస్తేనే పరకాలలో గులాబీ జెండా ఎగురవేయడం ఖాయమని స్పష్టం చేశారు.

సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ అనుమానాస్పద మృతి

చెల్లెలిపై అనుమానాలు?


మృతి చెందిన దీప్తి

కోరుట్ల: సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్న ఒక యువతి జగిత్యాల జిల్లా కోరుట్ల పట్టణంలోని భీముని దుబ్బలో అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. మంగళవారం మధ్యాహ్నం జరిగిన ఈ సంఘటనపై మెట్‌పల్లి డీఎస్పీ రవీందర్‌రెడ్డి కథనం ప్రకారం.. సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ బంక దీప్తి తల్లిదండ్రులు బంక శ్రీనివాస్‌రెడ్డి, మాధవి సోమవారం ఉదయం బంధువుల గృహప్రవేశం కార్యక్రమానికి హైదరాబాద్ వెళ్లారు. ఇంట్లో దీప్తి, ఆమె చెల్లెలు చందన (21) మాత్రమే ఉన్నారు. మంగళవారం మధ్యాహ్నం దీప్తి ఇంట్లోని సోఫాలో చనిపోయి ఉంది. చెల్లెలు చందన ఇంట్లో లేకపోవడం గమనార్హం. చందన తన బాయ్‌ఫ్రెండ్‌తో కలిసి వెళ్లిపోయినట్లు కోరుట్ల బస్టాండ్ వద్ద ఉన్న సీసీ కెమెరాల్లో నమోదైంది. దీప్తి చనిపోవడంలో చెల్లెలి పాత్రపై విచారణ సాగిస్తున్నట్లు డీఎస్పీ రవీందర్‌రెడ్డి తెలిపారు. కాగా పుణేలో ఓ సాఫ్ట్‌వేర్ సంస్థలో ఇంజనీర్ అయిన దీప్తి ప్రస్తుతం వర్క్‌ఫ్రం హోం విధానంలో పనిచేస్తోంది. తండ్రి శ్రీనివాస్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు డీఎస్పీ వివరించారు.

అయోవా–తెలంగాణ మధ్య పరస్పర సహకారం

- అమెరికా పర్యటనలో మంత్రి నిరంజన్‌రెడ్డి ఆకాంక్ష
- అయోవా రాష్ట్ర లెఫ్టినెంట్ గవర్నర్ ఆడమ్ గ్రెగ్‌తో భేటీ



సాక్షి, హైదరాబాద్: అమెరికాలోని అయోవా రాష్ట్రం – తెలంగాణ మధ్య పరస్పర సహకారం ఉండాలని వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి ఆకాంక్షించారు. అమెరికా పర్యటనలో ఉన్న ఆయన మంగళవారం అయోవా రాష్ట్ర రాజధాని డెమోయిన్ లో లెఫ్టినెంట్ గవర్నర్ ఆడమ్ గ్రెగ్‌తో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా నిరంజన్‌రెడ్డి మాట్లాడుతూ, వ్యవసాయక రాష్ట్రంగా పేరుగాంచిన అయోవాకు, తెలంగాణకు అనేక సారూప్యతలున్నాయన్నారు. రెండు రాష్ట్రాలూ ఆహారధాన్యాల ఉత్పత్తులు, పౌల్ట్రీ, మాంసోత్పత్తిలో నంబర్ వన్‌గా నిలిచాయని, భవిష్యత్తులో రెండు రాష్ట్రాల మధ్య అనేక అంశాల్లో పరస్పర సహకారానికి అవకాశాలున్నాయని చెప్పారు. పలు విధాన నిర్ణయాల ఫలితంగా రాష్ట్రంలో ఆహార ధాన్యాల ఉత్పత్తి ఇబ్బడిముబ్బడిగా పెరిగిందన్నారు. తెలంగాణ సాధించిన విజయాలు గర్వించదగ్గవని ఆడమ్ కితాబిచ్చారు.

తెలంగాణలో ఐదు విప్లవాలు

అనంతరం నిరంజన్‌రెడ్డి అయోవా సెక్రటరీ ఆఫ్ అగ్రికల్చర్ మైక్ నెయిగ్‌ను కలిశారు. రాష్ట్రంలో రెండో హరిత విప్లవం ద్వారా ధాన్యం ఉత్పత్తి ఆరు రెట్లు పెరిగిందని, పాడి పరిశ్రమ అభివృద్ధి ద్వారా శ్వేత విప్లవం, చేపల పెంపకంలో వృద్ధి సాధించి నీలి విప్లవం సాధించామని చెప్పారు. అలాగే, మాంసోత్పత్తిలో రికార్డు సృష్టించి పింక్ రెవల్యూషన్ సాధించిన తెలంగాణ, ఇప్పుడు నూనె గింజల ఉత్పత్తిలో పసుపు విప్లవాన్ని సాధించే దిశగా పురోగమిస్తోందని వివరించారు. తెలంగాణ సాధించిన అయిదు విప్లవాల గురించి విన్న మైక్ నెయిగ్ త్వరలోనే రాష్ట్రాన్ని సందర్శించి ఈ విజయాలను స్వయంగా చూస్తానని హామీ ఇచ్చారన్నారు. అలాగే ప్రపంచంలోనే పేరెన్నికగన్న వ్యవసాయ వర్సిటీ అయిన అయోవా స్టేట్ యూనివర్సిటీ క్యాంపస్‌ను మంత్రి సందర్శించారు. వర్సిటీ ప్రెసిడెంట్ వెండీ వింటర్‌స్టీన్‌ను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. అయోవా వర్సిటీ, ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయాల మధ్య స్టూడెంట్, ఫ్యాకల్టీ ఎక్స్ఛేంజ్ ప్రోగ్రాం ఉండాలనే చర్చ జరిగింది. ఈ సమావేశాల్లో తెలంగాణ వ్యవసాయ శాఖ కార్యదర్శి రఘునందన్ రావు, విత్తనాభివృద్ధి సంస్థ ఎండీ కేశవులు పాల్గొన్నారు.

అదృశ్యమైన మహిళ దారుణ హత్య

ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లో ఘటన


కాశమ్మ (ఫైల్)

గచ్చిబౌలి (హైదరాబాద్): అదృశ్యమైన ఓ మహిళ దారుణ హత్యకు గురైంది. ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లో నిర్మాణంలో ఉన్న భవనం సెల్లార్‌లో దుండగులు బండరాయితో మోది చంపేశారు. గచ్చిబౌలి సీఐ జేమ్స్ బాబు చెప్పిన వివరాల ప్రకారం.. గౌలిదొడ్డి కేశవనగర్‌లో ఎం.కాశమ్మ (38) నివసిస్తోంది. కూలీ డబ్బులు మద్యం కోసం ఖర్చు చేయడంతో కాశమ్మకు, ఆమె కూతురు లక్ష్మికి మధ్య గొడవ జరిగింది. దీంతో ఈ నెల 25న ఉదయం 11 గంటలకు కాశమ్మ ఇంట్లోంచి బయటకు వెళ్లిపోయింది. రెండు రోజులు గడిచినా తిరిగి రాకపోవడంతో కూతురు లక్ష్మి ఆదివారం గచ్చిబౌలి పీఎస్‌లో ఫిర్యాదు చేయగా.. పోలీసులు మిస్సింగ్ కేసు నమోదుచేశారు. ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లోని విప్రో జంక్షన్ సమీపంలోని ఓ కన్‌స్ట్రక్షన్స్ సంస్థకు చెందిన నిర్మాణంలో ఉన్న భవనం సెల్లార్‌లో దుర్వాసన రావడంతో మృతదేహాన్ని గుర్తించి మంగళవారం పోలీసులకు సమాచారం అందించారు. మృతిచెందిన మహిళ కాశమ్మ అని కుటుంబ సభ్యులు గుర్తించారు. మద్యం అలవాటు ఉన్న కాశమ్మ స్క్రాప్ కోసం నిర్మాణంలో ఉన్న భవనాల వద్దకు వెళ్తుండేది. అదే క్రమంలో వెళ్లిన కాశమ్మను గుర్తుతెలియని వ్యక్తులు బండరాయితో మోది చంపారని పోలీసులు తెలిపారు. నిర్మాణ సంస్థలో పనిచేసే కూలీలే హత్య చేసి ఉంటారని పోలీసులు అనుమానిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. మృతురాలికి భర్త, కూతురు, ఇద్దరు కొడుకులు ఉన్నారు. గచ్చిబౌలి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మహిళపై అత్యాచారం ఘటనపై గవర్నర్ సీరియస్

సాక్షి, హైదరాబాద్: గచ్చిబౌలి పోలీసు స్టేషన్ పరిధిలోని నానక్‌రామ్ గూడలో ఓ మహిళ హత్యాచారానికి గురైనట్టు వచ్చిన వార్తలపై గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ తీవ్రంగా స్పందించారు. ఘటనపై 48 గంటల్లోగా నివేదిక సమర్పించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, డీజీపీ, సైబరాబాద్ పోలీసు కమిషనర్‌ను మంగళవారం ఆమె ఆదేశించారు.

డాక్యుమెంట్ల నుంచి వేలిముద్రలు సేకరించి..

- సిలికాన్ ఫింగర్‌ప్రింట్స్ తయారు చేసి మోసాలు
- కస్టమర్ సర్వీస్ పాయింట్‌ల నుంచి ఆన్‌లైన్‌లో డబ్బు కొల్లగొడుతున్న కేటుగాళ్లు
- ఇద్దరు అంతర్రాష్ట్ర ముఠా సభ్యులను అరెస్టు చేసిన సీఐడీ పోలీసులు

సాక్షి, హైదరాబాద్: సిలికాన్ ఫింగర్‌ప్రింట్స్ (నకిలీ వేలిముద్రల)ను తయారు చేసి ఆన్‌లైన్‌లో డబ్బులు కొల్లగొడుతున్న ఇద్దరు అంతర్రాష్ట్ర ముఠా సభ్యులను తెలంగాణ సీఐడీ పోలీస్ బృందం అరెస్టు చేసింది. ఈ ముఠాలో పనిచేస్తున్న బిహార్‌కు చెందిన రంజిత్‌షాను ఆ రాష్ట్రంలోని కిషన్‌గంజ్ జిల్లాలో ఈనెల 24న, మరో నిందితుడు సఫాత్ ఆలంను ఈనెల 14న బెంగళూరులో అరెస్టు చేసినట్టు సీఐడీ అడిషనల్ డీజీ మహేశ్‌భగవత్ మంగళవారంనాడిక్కడ తెలిపారు. ఈ ముఠాలో కీలక నిందితుడు అక్మల్ ఆలంను సీఐడీ పోలీసులు గతేడాది డిసెంబర్‌లో బిహార్‌లోని కిషన్‌గంజ్‌లో అరెస్టు చేసిన విషయం తెలిసిందే.

రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లలోని వేలిముద్రలతో...

ఈ సైబర్ మోసంలో నిందితులు రిజిస్ట్రేషన్, రెవెన్యూశాఖల వెబ్‌సైట్‌లను లక్ష్యంగా చేసుకోవడం గమనార్హం. ఈ ముఠా ముందుగా రిజిస్ట్రేషన్, రెవెన్యూ శాఖల వెబ్‌సైట్‌లోకి వెళ్లి సేల్‌డీడ్, ఇతర డాక్యుమెంట్లలో వేలిముద్రలను, ఆధార్ నంబర్లను, బ్యాంక్ ఖాతాల్లో పేర్లను సేకరిస్తుంది. ఈ వేలిముద్రలను ఆధారంగా సిలికాన్ ఫింగర్ ప్రింట్స్ తయారు చేస్తున్నారు. కస్టమర్ సర్వీస్ పాయింట్స్ (సీఎస్‌పీ)ల సిబ్బందితో కుమ్మక్కై, ఆ సెంటర్లలో ఆధార్ ఎనేబుల్డ్ పేమెంట్ సిస్టం (ఏఈపీఎస్) విధానంలో వేలిముద్రలను పెట్టి, ఆధార్ నంబర్‌ను నమోదు చేసి సదరు వ్యక్తులకు తెలియకుండానే వారి బ్యాంకు ఖాతాల్లోని నగదును డ్రా చేస్తున్నారు. ఆధార్ నంబర్, బ్యాంక్ ఖాతాలో పేరు, వేలిముద్ర ఉంటే ఏఈపీఎస్‌ల నుంచి డబ్బులు డ్రా చేసే అవకాశం ఉండటం సైబర్ నేరగాళ్లకు కలిసొచ్చే అంశంగా మారింది.

ఇలా వెలుగులోకి వచ్చింది...

హైదరాబాద్‌లోని సెయింట్ మేరీస్ రోడ్డులోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచీలో ఖాతా ఉన్న ఓ రిటైర్డ్ ఉద్యోగి గతేడాది డిసెంబర్‌లో సీఐడీ పోలీసులకు ఓ ఫిర్యాదు ఇచ్చారు. గతేడాది డిసెంబర్ 4, 5 తేదీల్లో తన బ్యాంకు ఖాతా నుంచి నాలుగు విడతల్లో మొత్తం రూ.24 వేలు తనకు తెలియకుండానే ఎవరో డ్రా చేసినట్టు ఫిర్యాదు చేశారు. దీనిపై దృష్టి పెట్టిన సీఐడీ అధికారులు నగదు విత్‌డ్రా చేసిన ప్రాంతంలో బ్యాంకు ఖాతాలు, అక్కడ నిందితులు వాడిన ఫోన్ నంబర్ల ఆధారంగా కీలక సమాచారం సేకరించారు. కేసు దర్యాప్తులో భాగంగా గతేడాది డిసెంబర్ 22న కీలక నిందితుడు అక్మల్ ఆలంను అరెస్టు చేశారు. అతడి నుంచి సేకరించిన సమాచారంతో మరో ఇద్దరు నిందితులను అరెస్టు చేశారు. కేసు దర్యాప్తులో కీలకంగా పనిచేసిన సీఐడీ సైబర్‌క్రైం ఎస్పీ లావణ్య ఎన్‌జేపీ, మరో ఎస్పీ బి. రామ్‌రెడ్డిని మహేశ్‌భగవత్ అభినందించారు.

క్లుప్తంగా...

లోక్‌సభ ఎన్నికలు ముందే జరగొచ్చు



నలందా: ప్రతిపక్ష పార్టీల ఐక్యత కార ణంగా ఆలస్యమయ్యే కొద్దీ తమకు నష్టం జరుగుతుందని భయపడుతున్న కేంద్రంలోని బీజేపీ లోక్‌సభ ఎన్నికలను ముందుగానే జరిపే అవకాశం ఉందని బిహార్ సీఎం నితీశ్ కుమార్ అన్నారు. లోక్‌సభ ఎన్నికలు డిసెంబర్‌లోనే జరగొచ్చంటూ పశ్చిమబెంగాల్ సీఎం మమతా బెనర్జీ సోమవారం చేసిన వ్యాఖ్యలను ఆయన సమర్థించారు. లోక్‌సభ ఎన్నికలు ముందుగానే జరిగే అవకాశాలున్నాయన్న విషయాన్ని ఏడెనిమిది నెలల క్రితం నుంచే తాను చెబుతున్నానన్నారు. ఆ ఎన్నికల్లో బీజేపీని ఓడించేందుకు ప్రతిపక్షాలన్నీ ఏకం కావాలన్నారు. 'ఈ విషయంలో నాకెలాంటి కోరికలు లేవు. వ్యక్తిగత ఆకాంక్షలు లేవు. బీజేపీకి వ్యతిరేకంగా పార్టీలన్నీ ఏకం చేయాలన్నదే నా ఏకైక ఆశయం' అని నితీశ్ తెలిపారు.

తోషఖానా కేసులో ఇమ్రాన్‌కు ఊరట

ఇస్లామాబాద్: పాకిస్తాన్ మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్‌కు ఊరట లభించింది. తోషఖానా అవినీతి కేసులో జిల్లా కోర్టు ఇమ్రాన్‌కు విధించిన మూడేళ్ల జైలు శిక్షను ఇస్లామాబాద్ హైకోర్టు కొట్టివేసింది. ఆయన్ను వెంటనే విడుదల చేయాలని అధికారులను ఆదేశించింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఆమిర్ ఫరూక్ సారథ్యంలోని డివిజన్ బెంచ్ ఎదుట సోమవారం ఈ కేసులో వాదోపవాదాలు పూర్తయ్యాయి. రూ.లక్ష పూచీకత్తుపై ఇమ్రాన్‌ను విడుదల చేయాలని పేర్కొంది. ఇమ్రాన్ కోరిన విధంగా వెంటనే తీర్పు ప్రతిని అందుబాటులో ఉంచుతామని ప్రకటించింది. తీర్పు వివరాలను తెహ్రీక్-ఇ-ఇన్సాఫ్(పీటీఐ) వాట్సాప్ సందేశం ద్వారా విడుదల చేసింది. అయితే, ఇమ్రాన్ అటోక్ జైలు నుంచి విడుదల కాలేదు. అధికార రహస్యాల చట్టం ఉల్లంఘన కేసులో ఆయనపై విచారణ కొనసాగుతున్నందున ఇమ్రాన్‌ను జైలు నుంచి విడుదల చేయరాదని ప్రత్యేక న్యాయ స్థానం ఆదేశాలిచ్చింది. ఈనెల 30వ తేదీన తమ ముందు హాజరుపరచాలని కోరింది.

1901 తర్వాత అత్యంత పొడి ఆగస్ట్

న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా తీవ్ర వర్షాభావ పరిస్థితులు కొనసాగుతున్నాయి. ఆగస్ట్ నెలలో వర్షాలు ఇంత తక్కువగా నమోదు కావడం 1901 తర్వాత ఇదే మొదటిసారని భారత వాతావరణ శాఖ(ఐఎండీ) తెలిపింది. వర్షాకాలం సీజన్‌లో ఇంత తక్కువగా వర్షాలు పడటం కూడా 2015 తర్వాత ఇదే మొదటిసారని పేర్కొంది.

తైవాన్ అధ్యక్ష రేసులో.. టెర్రీ గౌ



ఫాక్స్‌కాన్ ఫౌండర్ రాకతో అధికార పార్టీకి ముక్కోణపు పోటీ

చివరికి దానికే లాభిస్తుందని అంచనాలు

ఐ ఫోన్ తయారీ సంస్థ ఫౌండర్, అపర కుబేరుడు టెర్రీ గౌ కూడా తైవాన్ అధ్యక్ష రేసులో నిలిచారు. కుచేలుడి నుంచి కుబేరుని స్థాయికి ఎదిగిన ఆసక్తికర నేపథ్యం టెర్రీది. కనుక ఆయనకున్న ప్రజాదరణ నేపథ్యంలో ఒక్కడే గనక బరిలో ఉంటే పాలక డెమొక్రటిక్ ప్రోగ్రెసివ్ పార్టీకి గట్టి పోటీ ఇవ్వడం కూడా ఖాయమేనని అంటున్నారు. కానీ విపక్షాల తరఫున ఇప్పటికే ఇద్దరు రంగంలోకి దిగారు. ఈ నేపథ్యంలో టెర్రీ పోటీ విపక్ష ఓటును మూడుగా చీల్చి చివరికి 2024 జనవరిలో జరగబోయే అధ్యక్ష ఎన్నికల్లో అధికార పక్షం నెత్తిన పాలు పోసేలా కనిపిస్తోందన్నది పరిశీలకుల విశ్లేషణ...

తైవాన్‌కు చెందిన 72 ఏళ్ల టెర్రీ అపర కుబేరుడు. ఐ ఫోన్ తయారీ సంస్థ ఫాక్స్ కాన్ వ్యవస్థాపకుడు. వ్యాపారవేత్తగా దేశ ప్రజల్లో ఆయనకున్న చరిష్మా అంతా ఇంతా కాదు. అధికార పక్షంతో ఇప్పటికే రెండు విపక్షాలు తలపడుతుండగా మూడో శక్తిగా ఆయన కూడా రంగంలోకి దిగి అధ్యక్ష ఎన్నికల రేసును ఆసక్తికర మలుపు తిప్పారు.

బరిలో ఆ ముగ్గురు...

అధ్యక్షుడు సై ఇంగ్ వెన్‌కు ఇది రెండో టర్మ్. అంతకు మించి పదవిలో కొనసాగేందుకు తైవాన్ నిబంధనలు అనుమతించవు. దాంతో ఈసారి అధికార డెమొక్రటిక్ ప్రోగ్రెసివ్ పార్టీ (డీపీపీ) తరఫున విలియం లై చింగ్ తే బరిలో దిగుతున్నారు.

ప్రధాన విపక్షమైన జాతీయవాద కోయిమిన్ టాంగ్ పార్టీ నుంచి అధ్యక్ష అభ్యర్థిగా చాన్స్ దక్కించుకునేందుకు టెర్రీ ఎంతగానో ప్రయత్నించి విఫలమయ్యారు. ఆయనకు బదులుగా హౌ యూ ఇయ్‌కు పార్టీ అవకాశం ఇచ్చింది.

మరో విపక్షం టీపీపీ తరఫున దేశ ప్రజల్లో అత్యంత ఆదరణ ఉన్న కో వెన్ జే పోటీ పడుతున్నారు. రాజధాని తాయ్ పీ సిటీ మేయర్‌గా చేసిన అనుభవం ఆయన సొంతం. పైగా యువ ఓటర్లు ఆయనను వేలం వెర్రిగా అభిమానిస్తారు. ప్రస్తుతం రేసులో రెండో స్థానంతో వెన్ దూసుకు పోతున్నారు.

ఎంత ప్రయత్నించినా ప్రధాన విపక్షం డీపీపీ నుంచి అవకాశం దక్కక పోవడంతో టెర్రీ స్వతంత్ర హోదాలో పోటీకి దిగారు. అంతులేని సంపద, వ్యాపార విజయాలతో పాటు చైనాతో దీర్ఘకాలం పాటు విజయవంతంగా కలిసి పని చేసిన విశేషాను భవం టెర్రీకి మరింతగా కలిసొచ్చే అంశం.

- తైవాన్ ఇంజనీరింగ్ ప్రతిభకు మానవ వనరులను కలగలిపి ఫాక్స్ కాన్ (హాన్ హై ఇండస్ట్రీస్)ను ప్రపంచంలోనే అతి పెద్ద ఎలక్ట్రానిక్స్ తయారీదారుగా తీర్చిదిద్దారు టెర్రీ. 1980, 90ల్లో దక్షిణ చైనాలో అతి పెద్ద తయారీ సంస్థలను నెలకొల్పి చైనీయులకు వేలాదిగా ఉపాధి కల్పించారు.
- ఈ మోడల్ సూపర్ సక్సెస్ అయింది. ఎంతగా అంటే, యాపిల్ తన మాక్ బుక్స్, ఐ ఫోన్ల తయారీని ఫాక్స్ కాన్‌కే అప్పగించేలా ఒప్పించగలిగారు టెర్రీ.
- దాంతో ఫాక్స్ కాన్ అతి పెద్ద కంపెనీగా, టెర్రీ దేశంలోనే అతి సంపన్నుల్లో ఒకరిగా ఎదగడం సాధ్యపడింది.
- తైవాన్ సార్వభౌమత్వాన్ని కాపాడేందుకు చైనాతో తనకున్న సంబంధాలన్నింటినీ ఉపయోగిస్తానని, దేశాభివృద్ధి కోసం తన అనుభవం మొత్తాన్నీ రంగరిస్తానని చెబుతున్నారు టెర్రీ. తైవాన్‌ను ఎలాగైనా పూర్తిగా తనలో కలిపేసుకోవాలని చైనా ప్రయత్నిస్తుండటం, ఇటీవల ఆ దిశగా దూకుడు పెంచడం, అది తైవాన్ కు కొమ్ము కాస్తున్న అమెరికాతో ఘర్షణ దాకా వెళ్లడం తెలిసిందే
- పాలక డీపీపీ అసమర్థ, అసంబద్ధ, దుందుడుకు విధానాలే ఈ దుస్థితికి కారణమని టెర్రీ ఆరోపిస్తున్నారు. కానీ తైవాన్ ప్రజల్లో అత్యధికులు ఈ వాదనను విశ్వసించడం లేదు. త్రిముఖ ఓటుతో ఇప్పటికే అవకాశాలు సన్నగిల్లేలా కనిపిస్తున్న టెర్రీకి ఇది మరింత ప్రతికూలంగా మారేలా ఉంది. 40 శాతానికి పైగా ఓటర్లు పాలక పక్షానికి గట్టిగా మద్దతిస్తున్నట్టు ఇటీవలి సర్వేలు కూడా తేల్చాయి.
- ఈ పరిస్థితుల్లో విపక్షాలన్నీ ఒక్కటై ఉమ్మడిగా ఒకే అభ్యర్థిని నిలిపితేనే అధికార పార్టీకి కాస్తో కూస్తో పోటీ ఇవ్వడం సాధ్యపడేలా కనిపిస్తోంది.
- కానీ అందుకు రెండు విపక్షాల్లో ఏదీ సిద్ధంగా లేదు. దాంతో సర్వేలు చెబుతున్నట్టు అధికార డీపీపీకి కేవలం 40 శాతం ఓట్లు మాత్రమే వచ్చినా అది అధికారం నిలుపుకునే అవకాశాలు పుష్కలంగా కనిపిస్తున్నాయి.

- నేషనల్ డెస్క్, సాక్షి

మిగిలింది వారం రోజులే..

చివరి దశకు చేరిన చంద్రయాన్-3 మిషన్

- జాబిల్లి ఉపరితలంపై మరిన్ని శాస్త్రీయ పరిశోధనలు
- కీలక సమాచారం అందించనున్న ల్యాండర్, రోవర్
- ఆసక్తిగా ఎదురు చూస్తున్న ప్రపంచ దేశాలు



న్యూఢిల్లీ: భారత అంతరిక్ష పరిశోధన సంస్థ(ఇస్రో) ప్రతిష్టాత్మకంగా చేపట్టిన చంద్రయాన్-3 మిషన్ ఈ ఏడాది జూలై 14న శ్రీహరికోట నుంచి నింగిలోకి దూసుకెళ్లింది. 41 రోజుల ప్రయాణం అనంతరం ఆగస్టు 23న సాయంత్రం 6.04 గంటలకు ల్యాండర్ విక్రమ్ చందమామ దక్షిణ ధ్రువం ఉపరితలంపై నిర్దేశిత ప్రాంతంలో సురక్షితంగా అడుగుపెట్టింది. జాబిల్లి దక్షిణ ధ్రువంపై దిగిన మొట్టమొదటి మిషన్‌గా చరిత్ర సృష్టించింది. దాదాపు 4 గంటల తర్వాత ల్యాండర్ నుంచి ఆరు చక్రాలతో రోవర్ ప్రజ్ఞాన్ విజయవంతంగా బయటకు వచ్చింది. నెమ్మదిగా అడుగులు వేస్తూ జాబిల్లి ఉపరితలానికి చేరుకుంది. అటూ ఇటూ తిరుగుతూ చంద్రుడిపై పరిశోధనలు ప్రారంభించింది. విలువైన సమాచారాన్ని భూమిపైకి చేరవేస్తోంది. సాఫ్ట్ ల్యాండింగ్ జరిగి వారం రోజులు పూర్తయ్యింది. ఆగస్టు 23 నుంచి ఆగస్టు 29 వరకు మొత్తం ఏడు రోజుల వ్యవధిలో చంద్రయాన్-3 మిషన్ ఏమేం చేసింది? అనే వివరాలను ఇస్రో బహిర్గతం చేసింది.

రోవర్ చాకచక్యం

చంద్రుడిపై ల్యాండర్ సాఫ్ట్ ల్యాండింగ్, ల్యాండర్ నుంచి రోవర్ విజయవంతంగా బయటికి వచ్చి తన కార్యాచరణ ప్రారంభించడం, చంద్రుడి ఉపరితలంపై పరిశోధనలు అనేవి మూడు ప్రధాన లక్ష్యాలు కాగా, ఆగస్టు 26 నాటికే తొలి రెండు లక్ష్యాలు నెరవేరాయి. ఆగస్టు 27న చంద్రుడి ఉపరితలంపై ఉష్ణోగ్రతల మార్పుల వివరాలను రోవర్ ప్రజ్ఞాన్ భూమిపైకి చేరవేసింది. అందరూ అనుకుంటున్నట్లు చంద్రుడు చల్లగా ఉండడని, ఉపరితలంపై 70 డిగ్రీల దాకా వేడి ఉంటుందని తేల్చింది. ఆగస్టు 28న తన ప్రయాణానికి 4 మీటర్ల లోతున్న గొయ్యి అడ్డు రావడంతో ఇస్రో కమాండ్స్‌ను పాటిస్తూ రోవర్ చాకచక్యంగా తప్పించుకుంది. ఈ మిషన్‌కు ఇంకా వారం రోజుల కాల వ్యవధి మిగిలి ఉంది. ఈ ఏడు రోజుల్లో ల్యాండర్, రోవర్ ఏం చేయనున్నాయన్నది ఆసక్తికరం. సాంకేతికంగా వాటికి ఇదే చివరి దశ.

- మిగిలిన ఏడు రోజుల్లో చందమామపై ల్యాండర్, రోవర్ మరిన్ని శాస్త్రీయ పరిశోధనలు చేస్తాయి.
- రోవర్ ప్రజ్ఞాన్ చంద్రుడి ఉపరితలంపై మట్టి స్వభావాన్ని విశ్లేషిస్తుంది.
- చంద్రుడిపై ఉన్న దుమ్ము ధూళీ, రాళ్లలోని రసాయనిక సమ్మేళనాలను రోవర్ గుర్తిస్తుంది. చందమామ ఉపరితల వాతావరణం, ఉపరితలం లోపలి పరిస్థితుల గురించి సమాచారం అందిస్తుంది.
- ల్యాండర్ విక్రమ్‌లో నాలుగు పేలోడ్‌లు ఉన్నాయి. ఇవి చంద్రుడిపై ప్రకంపనలు, ఉపరితలంపై ఉష్ణోగ్రతల స్థితిగతులు, ప్లాస్మాలో మార్పులను అధ్యయనం చేస్తాయి.
- చంద్రుడికి-భూమికి మధ్యనున్న దూరాన్ని కచ్చితంగా లెక్కించడంలో ల్యాండర్‌లోని పేలోడ్‌లు సహకారం అందిస్తాయి.
- చంద్రుడిపై మట్టి స్వభావాన్ని విశ్లేషించడం, ఉష్ణోగ్రతలను గుర్తించడం అనేవి అత్యంత కీలకమైనవి.
- చందమామ దక్షిణ ధ్రువంలో చీకటి పడగానే 14 రోజులపాటు ఉష్ణోగ్రత మైనస్ 230 డిగ్రీలకు పడిపోనుంది. ఈ అత్యల్ప ఉష్ణోగ్రతను తట్టుకొని పనిచేసేలా ల్యాండర్‌ను, రోవర్‌ను డిజైన్ చేయలేదు. ఉపరితలంపై సూర్యాస్తమయం కాగానే ఇవి పనిచేయడం ఆగిపోతుంది.
- కొన్ని సవాళ్లు ఎదురైనప్పటికీ చంద్రయాన్-3 మిషన్ ఇప్పటిదాకా సాధించింది తక్కువేమీ కాదు. ఎవరూ చూడని జాబిల్లి దక్షిణ ధ్రువం గురించి కీలక సమాచారం అందించింది.
- చంద్రయాన్-3 చివరి దశలోకి ప్రవేశించడంతో ఇక ల్యాండర్, రోవర్ అందించే సమాచారం కోసం ప్రపంచ దేశాలు ఉత్సుకతతో ఎదురు చూస్తున్నాయి.

చందమామపై సల్ఫర్‌ను గుర్తించిన రోవర్

చంద్రుడి ఉపరితలంపై వివిధ లోహాలతో పాటు సల్ఫర్ ఉన్నట్లు రోవర్ నిర్ధారించింది. ఈ విషయాన్ని ఇస్రో మంగళవారం వెల్లడించింది. అంతేకాకుండా అల్యూమినియం, కాల్షియం, ఐరన్, క్రోమియం, టైటానియం, మాంగనీస్, సిలికాన్ ఉన్నట్లు రోవర్ గుర్తించిందని తెలియజేసింది. హైడ్రోజన్ కోసం అన్వేషణ సాగిస్తోందని తెలిపింది.

చంద్రయాన్-3 విజయంపై కేబినెట్ ప్రశంస

చందమామపై చంద్రయాన్-3 ల్యాండర్ విక్రమ్ క్షేమంగా దిగడాన్ని ప్రశంసిస్తూ కేంద్ర కేబినెట్ మంగళవారం తీర్మానం ఆమోదించింది. ఇది కేవలం 'ఇస్రో' విజయం మాత్రమే కాదని, దేశ ప్రగతికి, అంతర్జాతీయ వేదికపై పెరుగుతున్న దేశ గౌరవ ప్రతిష్టలకు నిదర్శనమని కొనియాడింది. ఆగస్టు 23వ తేదీని 'నేషనల్ స్పేస్ డే'గా కేంద్ర ప్రభుత్వం ప్రకటించడాన్ని స్వాగతించింది. చంద్రయాన్-3 ప్రయోగాన్ని విజయవంతం చేసిన ఇస్రోను మంత్రివర్గం అభినందించిందని, సైంటిస్టులకు కృతజ్ఞతలు తెలిపిందని మంత్రి అనురాగ్ ఠాకూర్ చెప్పారు.

జమ్మూకశ్మీర్‌కు యూటీ హోదా శాశ్వతం కాదు

- సుప్రీంకోర్టుకు తెలియజేసిన కేంద్ర ప్రభుత్వం
- అక్కడ పరిస్థితులను చక్కదిద్దాలన్న అత్యున్నత న్యాయస్థానం

న్యూఢిల్లీ: జమ్మూకశ్మీర్‌కు కల్పించిన కేంద్ర పాలిత ప్రాంతం(యూటీ) హోదా శాశ్వతం కాదని కేంద్ర ప్రభుత్వం సుప్రీంకోర్టుకు తెలియజేసింది. ఈ అంశంపై ఈ నెల 31న పూర్తిస్థాయిలో నివేదిక సమర్పిస్తామని వెల్లడించింది. ఆర్టికల్ 370ని కేంద్రం రద్దు చేయడాన్ని సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లపై సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని అయిదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం మంగళవారం విచారణ కొనసాగించింది. ఒక రాష్ట్రాన్ని కేంద్ర పాలిత ప్రాంతంగా మార్చవచ్చా? ఓ రాష్ట్రం నుంచి యూటీని రూపొందించవచ్చా? అని ప్రశ్నించింది. జమ్మూకశ్మీర్‌కు రాష్ట్ర హోదాను పునరుద్ధరించడానికి ఏదైనా కాల వ్యవధి ఉందా? దీనికి సంబంధించి ప్రభుత్వం వద్ద ఏదైనా ప్రణాళిక ఉందా? అని అడిగింది. అక్కడ ఎన్నికల ప్రజాస్వామ్యం ఏర్పడటం చాలా ముఖ్యమని స్పష్టం చేసింది. జమ్మూకశ్మీర్‌లో పరిస్థితులను త్వరగా చక్కదిద్దాలని కేంద్రాన్ని ధర్మాసనం ఆదేశించింది. కేంద్ర ప్రభుత్వం తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా బదులిచ్చారు. జమ్మూకశ్మీర్‌కు కేంద్ర పాలిత ప్రాంతం హోదా శాశ్వతం కాదని ఆయన అన్నారు. లద్దాఖ్‌కు మాత్రం యూటీ హోదా మరికొంత కాలం కొనసాగే అవకాశం ఉందని తెలిపారు. ఇదిలా ఉండగా, జమ్మూకశ్మీర్ పరిస్థితిపై గురువారం ఒక సానుకూల ప్రకటన చేయనున్నట్లు కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది.

గ్యాస్ బండ రూ. 200 తగ్గింది

ఎన్నికల ముందు కేంద్ర మంత్రివర్గం కీలక నిర్ణయం

- నేటి నుంచి దేశవ్యాప్తంగా అమల్లోకి రానున్న తగ్గింపు ధర



న్యూఢిల్లీ: ఐదు రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలతోపాటు లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తుండడంతో కేంద్ర ప్రభుత్వం మంగళవారం కీలక నిర్ణయం తీసుకుంది. వంట గ్యాస్ సిలిండర్ ధరను ఏకంగా రూ.200 చొప్పున తగ్గించింది. ఈ నిర్ణయం బుధవారం నుంచి దేశవ్యాప్తంగా అమల్లోకి రానుంది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన కేంద్ర మంత్రివర్గం మంగళవారం సమావేశమైంది. మధ్యప్రదేశ్‌తోపాటు తెలంగాణలో తాము అధికారంలోకి వస్తే చౌక ధరకే గ్యాస్ సిలిండర్ సరఫరా చేస్తామంటూ ప్రతిపక్ష కాంగ్రెస్ హామీ ఇస్తోంది. ఈ నేపథ్యంలో గ్యాస్ బండ ధరను రూ.200 చొప్పున తగ్గిస్తూ మోదీ సర్కారు నిర్ణయం తీసుకోవడం గమనార్హం. దేశంలో గత రెండేళ్లుగా గ్యాస్ సిలిండర్ ధర పెరగడమే తప్ప తగ్గిన దాఖలాలు లేవు. దేశ రాజధాని ఢిల్లీలో 14.2 కిలోల సిలిండర్ ధర ప్రస్తుతం రూ.1,103 ఉండగా, బుధవారం నుంచి రూ.903కు లభించనుంది. 'ప్రధానమంత్రి ఉజ్వల యోజన' లబ్ధిదారులు వంట గ్యాస్ సిలిండర్‌పై ఇప్పటికే రూ.200 చొప్పున రాయితీ పొందుతున్నారు. తాజా తగ్గింపు ధర వారికి కూడా వర్తిస్తుంది. అంటే ఒక్కో సిలిండర్ రూ.703కే పొందవచ్చు. అంతేకాకుండా ఉజ్వల యోజన కింద అదనంగా 75 లక్షల వంట గ్యాస్ కనెక్షన్లు ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దీంతో ఈ పథకం కింద లబ్ధి పొందేవారి సంఖ్య 10.34 కోట్లకు చేరుకోనుంది.

ఎన్నికలతో సంబంధం లేదు: మంత్రి

ప్రజలకు ఉపశమనం కల్పించడానికే వంట గ్యాస్ సిలిండర్ ధర తగ్గించాలని నిర్ణయించినట్లు కేంద్ర సమాచార, ప్రసార శాఖ మంత్రి అనురాగ్ ఠాకూర్ చెప్పారు. ఈ నిర్ణయానికి ఎన్నికలతో ఎలాంటి సంబంధం లేదని అన్నారు. ఇది ఓనం, రక్షాబంధన్ పండుగల సందర్భంగా మహిళలకు మోదీ ప్రభుత్వం ఇస్తున్న కానుక అని వివరించారు. ప్రజలపై ఆర్థిక భారం తగ్గించడమే లక్ష్యంగా చేపట్టిన చర్యల్లో భాగంగానే గ్యాస్ ధరను తగ్గించినట్లు కేంద్ర ప్రభుత్వం ఒక ప్రకటనలో వెల్లడించింది. ప్రజల సంక్షేమం పట్ల ప్రభుత్వ చిత్తశుద్ధి, అంకితభావానికి ఇదొక నిదర్శనమని స్పష్టం చేసింది. నిత్యావసరాలు సరసమైన ధరలకే ప్రజలకు అందాలన్నదే తమ ఉద్దేశమని పేర్కొంది.

సోదరీమణులకు ఉపశమనం: మోదీ

గ్యాస్ సిలిండర్ ధరను రూ.200 చొప్పున కేంద్ర ప్రభుత్వం తగ్గించడం పట్ల ప్రధాని మోదీ హర్షం వ్యక్తం చేశారు. రక్షాబంధన్ పండుగ సందర్భంగా వెలువడిన ఈ నిర్ణయం కుటుంబాల్లో సంతోషాన్ని పెంచుతుందని చెప్పారు. అక్కాచెల్లెమ్మలకు మరింత ఉపశమనం లభిస్తుందని వెల్లడించారు. తన సోదరీమణులంతా సంతోషంగా, ఆరోగ్యంగా ఉండాలంటూ భగవంతుడిని ప్రార్థిస్తున్నానని పేర్కొన్నారు.

ఎన్నికల వ్యూహమే!?

రాబోయే ఎన్నికల్లో లబ్ధి పొందడానికే వంట గ్యాస్ సిలిండర్ ధరను ప్రభుత్వం తగ్గించినట్లు ప్రచారం సాగుతోంది. వంట గ్యాస్‌తోపాటు నిత్యావసరాల ధరల పెరుగుదలను కాంగ్రెస్ ప్రచారాస్త్రంగా మార్చుకుంది. కాంగ్రెస్ పాలిత రాజస్తాన్‌లో రూ.500కే గ్యాస్ సిలిండర్ సరఫరా చేస్తున్నారు. త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్న మధ్యప్రదేశ్, తెలంగాణలో అధికారంలోకి వస్తే రూ.500కు సిలిండర్ ఇస్తామని కాంగ్రెస్ హామీ ఇస్తోంది. కొన్ని నెలల క్రితం జరిగిన కర్ణాటక ఎన్నికల్లో ఇలాంటి హామీతో కాంగ్రెస్ విజయం సాధించింది. అందుకే కాంగ్రెస్ ప్రచార ఎత్తుగడలను తిప్పికొట్టి జనాన్ని తమవైపు తిప్పుకోవాలన్న వ్యూహంలో భాగంగానే సిలిండర్ ధరను మోదీ సర్కారు భారీగా తగ్గించినట్లు సమాచారం. ఈ తగ్గింపు వల్ల చమురు సంస్థలపై పడే భారాన్ని కేంద్ర ప్రభుత్వమే భరించనుంది.

ఆయుర్దాయానికి కాలుష్య కాటు

- అత్యధికంగా ఢిల్లీ వాసులకు 11.9 ఏళ్లు
- ఏపీలో 2.6 ఏళ్లు, తెలంగాణలో 3.2 ఏళ్లు సగటున తగ్గుతున్న జీవితకాలం
- ది ఎయిర్ క్వాలిటీ లైఫ్ ఇండెక్స్ నివేదిక వెల్లడి

సాక్షి, న్యూఢిల్లీ: ప్రపంచంలోనే అత్యంత కలుషిత నగరం ఢిల్లీ అని ఓ అధ్యయనం చెబుతోంది. తీవ్ర కాలుష్యం బారిన పడుతున్న ఢిల్లీ వాసులు తమ ఆయుర్దాయంలో అత్యధికంగా 11.9 ఏళ్లు కోల్పోతున్నారని పేర్కొంది. జాతీయ వాయు నాణ్యత ప్రమాణం ప్రకారం చూసినా దేశ రాజధాని వాసులు సగటు కన్నా 8.5 ఏళ్లు నష్ట పోతున్నారని తెలిపింది. భారత్‌లో ప్రజల ఆరోగ్యానికి కాలుష్యం పెనుముప్పుగా తయారైందని యూనివర్సిటీ ఆఫ్ షికాగో ఎనర్జీ పాలసీ ఇన్‌స్టిట్యూట్ విడుదల చేసిన ది ఎయిర్ క్వాలిటీ లైఫ్ ఇండెక్స్ (ఏక్యూఎల్‌ఐ) ఆందోళన వ్యక్తం చేసింది. ప్రపంచ ఆరోగ్య సంస్థ(డబ్ల్యూహెచ్‌వో) నిర్దేశించిన కాలుష్య స్థాయిల కంటే భారత్‌లో చాలా ఎక్కువ కాలుష్యం ఉందని పేర్కొంది. డబ్ల్యూహెచ్‌వో మార్గదర్శకాల ప్రకారం పర్టిక్యులేట్ మాటర్ (పీఎం) 2.5 ఐదు మైక్రోగ్రాములు/క్యూబిక్ మీటర్‌గా కాలుష్యం ఉండాల్సి ఉంది. కాలుష్య తీవ్రతలు ఇలానే కొనసాగితే భారతీయుల సగటు ఆయుర్దాయం కన్నా 5.3 ఏళ్లు తగ్గుతుందని తెలిపింది. దేశంలోని మొత్తం 130 కోట్ల మందికి పైగా ప్రజలు వార్షిక సగటు కాలుష్య స్థాయి ప్రపంచ ఆరోగ్య సంస్థ మార్గదర్శకాల కంటే ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లోనే నివసిస్తున్నారు. జాతీయ వాయు నాణ్యత ప్రమాణం 40 మైక్రోగ్రాములు/క్యూబిక్ మీటర్లకు మించి కాలుష్యం ఉండే ప్రాంతాల్లో 67.4 శాతం మంది నివసిస్తున్నారని నివేదిక తెలిపింది. సగటు భారతీయుడి ఆయుర్దాయం కాలుష్యం కారణంగా 5.3 ఏళ్లు తక్కువగా ఉంటోందని వివరించింది. 2021లో భారత్‌లో రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో పర్టిక్యులేట్ మాటర్ (పీఎం) 2.5 నమోదు చూస్తే ఆంధ్రప్రదేశ్ ప్రజలు సగటు కన్నా 2.6 ఏళ్లు, తెలంగాణ ప్రజలు సగటు కన్నా 3.2 ఏళ్లు కోల్పోతున్నారని తెలిపింది. జాతీయ వాయు నాణ్యత ప్రమాణం 40 మైక్రోగ్రాములు/క్యూబిక్ మీటర్ల ప్రకారం చూస్తే ఆంధ్రప్రదేశ్, తెలంగాణల్లో ఆయుష్షు ముప్పు లేదని తెలిపింది. దేశంలో హృదయ సంబంధ వ్యాధులతో 4.5 ఏళ్లు, తల్లీ పిల్లల పోషకాహార లోపంతో 1.8 ఏళ్ల ఆయుర్దాయం కోల్పోతున్నట్లు నివేదిక పేర్కొంది. 2013- 2021 మధ్య ప్రపంచవ్యాప్తంగా పెరిగిన కాలుష్యంలో భారత్ వాటా 59.1 శాతమని తెలిపింది. సగటు కంటే ఎక్కువగా ఆయుర్దాయం కోల్పోతున్న అత్యధిక జనాభా కలిగిన 10 రాష్ట్రాలు వరసగా.. యూపీ, బిహార్, బెంగాల్, రాజస్తాన్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, గుజరాత్, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు ఉన్నాయని తెలిపింది.

ఐటీసీ మౌర్య షెరటాన్‌లో బైడెన్ బస

- అమెరికా అధ్యక్షుడి కోసం ప్రెసిడెన్షియల్ సూట్, ప్రత్యేకంగా లిఫ్ట్
- హోటల్‌లోని మొత్తం 400 రూంలు బుక్
- త్వరలో సీక్రెట్ సర్వీస్ బృందం రాక
- జీ20కి హాజరయ్యే నేతలకు ఢిల్లీ హోటళ్లలో ఆతిథ్యం
- విస్తృతంగా భద్రతా ఏర్పాట్లు చేపట్టిన హోం శాఖ



న్యూఢిల్లీ: వచ్చే నెలలో జరిగే జీ20 శిఖరాగ్రానికి హాజరయ్యే నేతలకు ఢిల్లీలోని ప్రముఖ హోటళ్లలో బస ఏర్పాట్లు చేస్తున్నారు. అగ్రరాజ్యం అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ ఐటీసీ మౌర్య షెరటాన్, చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌కు తాజ్ ప్యాలెస్‌లో బస చేయనున్నారు. ఢిల్లీతోపాటు దేశ రాజధాని ప్రాంతం(ఎన్‌సీఆర్)లోని మొత్తం 31 హోటళ్లలో వివిధ దేశాల నేతల కోసం ఏర్పాట్లు చేస్తున్నారు. సెప్టెంబర్ 9, 10వ తేదీల్లో జరిగే శిఖరాగ్రంలో పాల్గొనే నేతలు త్వరలోనే ఇక్కడికి చేరుకుంటారని అధికార వర్గాలు తెలిపాయి. కేంద్ర ప్రభుత్వం ఈ సమావేశాలను ప్రతిష్టాత్మకంగా తీసుకుని ఏర్పాట్లు చేపట్టింది.

వివిధ దేశాల నేతలు ఢిల్లీలో బసచేసే హోటళ్లివే...

ఐటీసీ మౌర్యషెరటాన్, తాజ్ మాన్‌సింగ్, తాజ్ ప్యాలెస్, హోటల్ ఒబెరాయ్, హోటల్ లలిత్, ది లోధి, లి మెరిడియన్, హయత్ రీజెన్సీ, షంగ్రి-లా, లీలీ ప్యాలెస్, హోటల్ అశోక, ఈరోస్ హోటల్, ది సూర్య, ర్యాడిసన్ బ్లూ ప్లాజా, జేడబ్ల్యూ మారియెట్, షెరటాన్, ది లీలా అంబియెన్స్ కన్వెన్షన్, హోటల్ పుల్‌మాన్, రోజెట్ హోటల్, ది ఇంపీరియల్.

ఎన్‌సీఆర్‌లోని హోటళ్లు: వివాంటా (సూరజ్‌కుండ్), ఐటీసీ గ్రాండ్ (గురుగ్రామ్), తాజ్ సిటీ సెంటర్ (గురుగ్రామ్), హయత్ రిజెన్సీ(గురుగ్రామ్), ది ఒబెరాయ్ (గురుగ్రామ్), వెస్ట్ ఇన్ (గురుగ్రామ్), క్రౌన్ ప్లాజా(గ్రేటర్ నోయిడా).

ఎవరెవరు ఎక్కడెక్కడంటే?

అమెరికా అధ్యక్షుడు బైడెన్ బస చేసే ఐటీసీ మౌర్య హోటల్‌లోని ప్రతి ఫ్లోర్‌లోనూ అమెరికా సీక్రెట్ సర్వీస్ కమాండోలు పహారా కాస్తారు. బైడెన్ బస ఉండే 14వ ఫ్లోర్‌కు చేరుకునేందుకు ప్రత్యేకంగా లిఫ్ట్ ఏర్పాటు చేశారు. ఈ హోటల్‌లోని మొత్తం 400 రూములు బుక్కయ్యాయి. ఇంకా.. షంగ్రి-లా హోటల్‌లో యూకే ప్రధాని రిషి సునాక్ బస చేస్తారు. ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మాక్రాన్ క్లారిడ్జెస్ హోటల్‌లో ఉంటారు. ఆస్ట్రేలియా ప్రధాని ఆంథోని అల్బనీస్ ఇంపీరియల్ హోటల్‌లో, చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ తాజ్ ప్యాలెస్ హోటల్‌లో బస చేస్తారు. ఆయా దేశాలకు చెందిన అనుసంధాన బృందాలు ఇప్పటికే ఢిల్లీకి చేరుకున్నాయి. ఢిల్లీలోని ఒబెరాయ్ హోటల్‌లో టర్కీ ప్రతినిధులు, మారిషస్, నెదర్లాండ్స్, నైజీరియా, స్పెయిన్ దేశాల నేతలు లి మెరిడియన్ హోటల్‌లో దిగుతారని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. బ్రెజిల్ ప్రతినిధి బృందం తాజ్ ప్యాలెస్‌లో, ఇండోనేసియా నేతలు ఇంపీరియల్ హోటల్‌లో ఉంటారు. షంగ్రి-లాలో యూకే, జర్మనీ బృందాలుంటాయి. హయత్ రీజెన్సీలో ఇటలీ, సింగపూర్ దేశాల ప్రతినిధులు బస చేస్తారు. కెనడా, జపాన్ బృందాలకు లలిత్ హోటల్‌లో ఆతిథ్యం కల్పిస్తారు.

భారీ భద్రతా ఏర్పాట్లు

ఢిల్లీ పోలీసు బృందాలతోపాటు సెంట్రల్ పారా మిలటరీ బలగాలు, ఎన్ఎస్‌జీ కమాండోలు విదేశాల నుంచి వచ్చే అతిథులకు రక్షణ కల్పిస్తారు. బైడెన్‌కు భద్రత కల్పించే అమెరికా సీక్రెట్ సర్వీస్ స్క్వాడ్ బృందం జీ20 శిఖరాగ్రానికి మూడు రోజులు ముందుగా బాధ్యతలు చేపడుతుంది. ప్రతినిధుల భద్రత కోసం సీఆర్‌పీఎఫ్‌కు చెందిన 50 బృందాలను నియోగిస్తారు.

బెంగళూరులో సూపర్‌స్టార్ రజనీ సందడి



సాక్షి బెంగళూరు: బహుభాషా నటుడు, సూపర్ స్టార్ రజనీకాంత్(72) మంగళవారం బెంగళూరు జయనగరలోని బెంగళూరు మెట్రోపాలిటన్ ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ (బీఎంటీసీ) బస్ డిపో-4కు వెళ్లారు. ఉదయం 11.30 గంటల సమయంలో అధికారులు, డ్రైవర్లు, కండక్టర్లు, ఇతర సిబ్బంది తమ పనుల్లో బిజీబిజీగా ఉండగా ఆయన తన కారులో అక్కడికి వెళ్లారు. లోపలికి రావొచ్చా అని సిబ్బందిని అనుమతి అడిగారు.. ఆయన్ను చూసివారు ఆశ్చర్యంలో మునిగిపోయారు. సాదరంగా లోపలికి ఆహ్వానించి, ఆయనతో సెల్ఫీలు తీసుకున్నారు. వారితో ఆయన కొద్దిసేపుగడిపారు. అనంతరం రజనీ బెంగళూరులోని రాఘవేంద్ర మఠానికి వెళ్లారు, అక్కడి ఆలయానికి వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. గాంధీబజార్‌లోని చిన్నతనంలో చదువుకున్న స్కూలుకు వెళ్లి బాల్య స్మృతులను నెమరువేసుకున్నారు. కాగా, రజనీ సినీ రంగానికి రాకముందు బెంగళూరు ట్రాన్స్‌పోర్టు సర్వీసెస్-బీటీఎస్ (ఇప్పుడు బీఎంటీసీ)లో కండక్టర్‌గా పని చేశారు. అసలు పేరు శివాజీ రావ్ గైక్వాడ్. 22 ఏళ్ల వరకు బెంగళూరులోనే ఉన్నారు. అనంతరం సినిమాల్లో అవకాశాలు వెతుక్కుంటూ చెన్నై వెళ్లారు.

చైనా స్టాండర్డ్ మ్యాప్‌పై భారత్ అభ్యంతరం

న్యూఢిల్లీ: అక్సాయ్‌చిన్, అరుణాచల్ ప్రదేశ్‌లను చైనాలో అంతర్భాగాలుగా గుర్తిస్తూ డ్రాగన్ దేశం తాజాగా రూపొందించిన 'స్టాండర్డ్ మ్యాప్'పై భారత్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. ఇలాంటి దుందుడుకు చర్యలు సరిహద్దు సమస్యలను మరింత సంక్లిష్టం చేస్తాయే తప్ప ఒరిగేదేమీ ఉండదని తేల్చిచెప్పింది. అక్సాయ్‌చిన్, అరుణాచల్ ప్రదేశ్‌లు చైనాలో అంతర్భాగాలని చెప్పడానికి ఎలాంటి ఆధారాలు లేవని భారత విదేశాంగ శాఖ మంగళవారం స్పష్టం చేసింది. చైనా వైఖరిని భారత విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ తప్పుపట్టారు. ఇతర దేశాల భూభాగాలు తమవేనంటూ చాటుకోవడం హాస్యాస్పదమని అన్నారు. స్టాండర్డ్ మ్యాప్‌పై భారతదేశ నిరసనను దౌత్య మార్గాల్లో చైనాకు తెలియజేశామని విదేశాంగ శాఖ వెల్లడించారు.

వచ్చే నెలలో రాహుల్ యూరప్ పర్యటన

న్యూఢిల్లీ: కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ సెప్టెంబర్‌లో యూరప్ దేశాల్లో పర్యటించనున్నారు. సెప్టెంబర్ మొదటి వారంలో రాహుల్ ఫ్రాన్సులో అయిదు రోజులపాటు పర్యటించే అవకాశాలున్నాయని కాంగ్రెస్ వర్గాలు తెలిపాయి. సెప్టెంబర్ 7న బెల్జియం రాజధాని బ్రస్సెల్స్‌లో యూరోపియన్ కమిషన్ ప్రతినిధుల సమావేశానికి హాజరవుతారు. 8న ప్యారిస్‌లో యూనివర్సిటీ ఆఫ్ ప్యారిస్‌లో విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. 9న ప్యారిస్‌లో లేబర్ యూనియన్ ఆఫ్ ఫ్రాన్సు సమావేశంలో పాల్గొంటారు. 10న నార్వే రాజధాని ఓస్లోకు వెళతారు. అక్కడి ప్రవాస భారతీయులతో రాహుల్ గాంధీ ముఖాముఖి ఉంటుందని కాంగ్రెస్ వర్గాలు వివరించాయి. సెప్టెంబర్ 9, 10వ తేదీల్లో జీ20 సమావేశాలను ప్రతిష్టాత్మకంగా జరిపేందుకు కేంద్రం ఏర్పాట్లు చేస్తున్న వేళ రాహుల్ విదేశాల్లో పర్యటనలకు వెళ్తుండటం గమనార్హం.

కుల వివక్ష వ్యతిరేక బిల్లుకు కాలిఫోర్నియా అసెంబ్లీ ఆమోదం

వాషింగ్టన్: అమెరికాలో చర్చనీయాంశంగా మారిన కుల వివక్ష వ్యతిరేక బిల్లును కాలిఫోర్నియా రాష్ట్ర అసెంబ్లీ సోమవారం ఆమోదించింది. సభలో 50-3 మెజారిటీతో బిల్లు ఆమోదం పొందింది. రాష్ట్రంలో కుల వివక్షను అరికట్టడంతోపాటు అట్టడుగు వర్గాల ప్రజలను వివక్ష నుంచి కాపాడడమే లక్ష్యంగా ఈ బిల్లును తీసుకొచ్చారు. బిల్లు అసెంబ్లీలో ఆమోదం పొందడంతో ఇక గవర్నర్ గవీన్ న్యూసమ్ వద్దకు చేరనుంది. గవర్నర్ సంతకం చేస్తే చట్టంగా మారనుంది. దీంతో అమెరికాలో కుల వివక్షకు వ్యతిరేకంగా చట్టం చేసిన మొట్టమొదటి రాష్ట్రంగా కాలిఫోర్నియా రికార్డు సృష్టించనుంది. ఈ బిల్లును కాలిఫోర్నియా అసెంబ్లీలో తొలిసారిగా సేట్ సెనేటర్ అయిషా వాహబ్ ప్రవేశపెట్టారు. పౌర హక్కుల కార్యకర్తలు, పౌర హక్కుల సంఘానికి దీనికి మద్దతు ప్రకటించాయి.

సాక్షి
కరీంనగర్
బుధవారం ‌। 30 ‌। ఆగస్టు ‌। 2023

కమనీయం.. కల్యాణం



తిమ్మాపూర్: మండలంలోని మహాత్మనగర్ తాపాల లక్ష్మీ నరసింహస్వామి కల్యాణోత్సవం మంగళవారం వైభవంగా జరిగింది. అధ్యయన బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆలయ కమిటీ చైర్మన్ ఇనుకొండ నాగేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. ప్రధాన అర్చకులు తిరునగరి వెంకటాద్రిస్వామి కల్యాణం జరిపించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని వేడుకను తిలకించారు.

న్యూస్‌రీల్

బకాయిలు విడుదల చేయాలి



ఆందోళన చేస్తున్న ఏబీవీపీ నాయకులు

కరీంనగర్: పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజురీయింబర్స్‌మెంట్ వెంటనే విడుదల చేయాలని, విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్‌చేస్తూ ఏబీవీపీ రాష్ట్రశాఖ పిలుపు మేరకు జిల్లాశాఖ ఆధ్వర్యంలో మంత్రి గంగుల కమలాకర్ క్యాంపు ఆఫీసు ముట్టడించారు. స్టేట్ వర్కింగ్ కమిటీ మెంబర్లు అజయ్, రాకేశ్, సాయి, రంజిత్ మాట్లాడుతూ.. విద్యారంగంలోని సమస్యలు పరిష్కరించాలని కొన్ని రోజులుగా ఏబీవీపీ ఉద్యమం చేస్తూంటే ప్రభుత్వం పట్టించుకోవడం లేదని అన్నారు. పెండింగ్ ఫీజు రీయింబర్స్‌మెంట్ రూ.5300 కోట్లు ఉంటే ప్రభుత్వం గత నాలుగుగేళ్లుగా రూపాయి కూడా విడుదల చేయడం లేదని మండిపడ్డారు. రాష్ట్రంలోని యూనివర్సిటీల్లో అధ్యాపక పోస్టులు భర్తీ చేయాలని అన్నారు. పూర్తిస్థాయిలో పాఠ్యపుస్తకాలు అందించాలని డిమాండ్‌చేశారు. ఖాళీగా ఉన్న 15000 పోస్టులను భర్తీ చేయకుండా 6000 టీచర్ పోస్టులకు నోటిఫికేషన్ ఇవ్వడం సరికాదన్నారు. జిల్లా కన్వీనర్లు రాజశేఖర్, నగర కార్యదర్శి పూసాల విష్ణు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రేషవేణి వేణు, మాధవేణి సునీల్, బామండ్ల నందు తదితరులు పాల్గొన్నారు.

భాష రాకపోతే సైన్స్ అర్థం కాదు



సప్తగిరికాలనీ(కరీంనగర్): భాష రాక పోతే సైన్స్ అర్థంకాదని జిల్లా విద్యాశాఖ అధికారి సీహెచ్.జనార్దన్‌రావు అన్నారు. ఉన్నతి కార్యక్రమంలో భాగంగా మంగళవారం సుభాశ్‌నగర్, ధన్గర్‌వాడీ పాఠశాలలో జరిగిన కార్యక్రమాల్లో పాల్గొన్నారు. పునాది సరిగా ఉన్నప్పుడే అభ్యసన ఫలితాలు వస్తాయని, ధారళంగా చదవడం, రాయడం ద్వారా విషయ పరిజ్ఞానం కలుగుతుందన్నారు. పిల్లలలో రాయడం, చదవడం ఎంతవరకు వచ్చిందో తెలుసుకోవడానికి ప్రతినెల మాస పరీక్ష నిర్వహించాలని సూచించారు. సెక్టోరియల్ అధికారి అశోక్‌రెడ్డి, సైన్స్ అధికారి జైపాల్‌రెడ్డి, ఎంఈవో మధుసూదనాచారి, సైన్స్ టీచర్లు పాల్గొన్నారు.

రాఖీ సందర్భంగా మహిళలకు ఆర్టీసీ బహుమతులు



విద్యానగర్(కరీంనగర్): రాఖీ పౌర్ణమి సందర్భంగా ఈ నెల 30,31తేదీల్లో ఆర్టీసీ బస్సులలో ప్రయాణించే మహిళలకు రాష్ట్ర వ్యాప్తంగా లక్కీ డ్రా నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేయనున్నట్లు ఆర్టీసీ కరీంనగర్ రీజనల్ మేనేజర్ ఎస్.సుచరిత తెలిపారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని అన్ని డిపోల పరిధిలోని ప్రధాన బస్‌స్టేషన్లలో లక్కీడ్రా బాక్స్‌లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆర్టీసీ బస్సులలో ప్రయాణించే మహిళలందరూ ప్రయాణం పూర్తయ్యాక టికెట్ వెనకాల పేరు, ఫోన్ నెంబర్ రాసి వాటిని బస్టాండ్లలో ఏర్పాటు చేసిన డ్రా బాక్స్‌లో వేయాలన్నారు. ఆ బాక్స్‌లను ఒకచోటికి చేర్చి లక్కీ డ్రా నిర్వహించి ప్రతి రీజియన్ పరిధిలో ముగ్గురు విజేతలకు, మొత్తం రాష్ట్ర వ్యాప్తంగా 33 మందికి రూ.5.50 లక్షల విలువ గల బహుమతులను అందజేయనున్నట్లు తెలిపారు. మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

సైనిక కళాశాలలో ఉపాధ్యాయ ఖాళీలు

చొప్పదండి: మండలంలోని రుక్మాపూర్ శివారు సైనిక శిక్షణ విద్యాలయంలో ఆంగ్ల మాధ్యమంలో గణితం, ఫిజిక్స్, కెమిస్ట్రీ బోధించేందుకు గౌరవ వేతనం పద్ధతిలో నియామకం చేసేందుకు వచ్చే నెల 6న విద్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు సాంఘీక సంక్షేమ గురుకుల సైనిక కళాశాల ప్రిన్సిపాల్ లచ్చయ్య తెలిపారు. ఎన్‌డీఏ, సీబీఎస్‌ఈ 11, 12 తరగతులకు సంబంధిత సబ్జెక్టుల్లో పీజీ ప్రథమ శ్రేణితో పాటు, బీఈడీ రెగ్యులర్ విద్యార్థిగా గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి ఉత్తీర్ణులైన వారు హాజరు కావాలని సూచించారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఉదయం పది గంటలకు జరిగే డెమో, ఇంటర్వ్యూలో పాల్గొనాలని పేర్కొన్నారు.

ఆశావహుల్లో డాక్టర్లే ఎక్కువ!

- ఏడుగురు వైద్యులు, ముగురు డాక్టరేట్ పట్టభద్రులు
- బీటెక్ బాబులు, వకీల్‌సాబ్‌లకు కొదవేం లేదు
- అన్ని పార్టీల నుంచి గ్రాడ్యుయేట్లు
- ఆశావహుల్లో విద్యాధికులే అధికం



సాక్షిప్రతినిధి, కరీంనగర్:

అసెంబ్లీ ఎన్నికలకు అన్ని పార్టీలు సిద్ధమవుతున్నాయి. ఉమ్మడి జిల్లాలోని 13 నియోజకవర్గాల్లోనూ ప్రధాన పార్టీలు అభ్యర్థులను రంగంలోకి దింపే పనిలోపడ్డాయి. ఇందులో బీఆర్‌ఎస్ ఇప్పటికే అభ్యర్థులను ప్రకటించి ఒకడుగు ముందే వేయగా.. కాంగ్రెస్ ఆశావహుల నుంచి దరఖాస్తులు తీసుకుని కసరత్తు ప్రారంభించిది. ఇక బీజేపీ కూడా అభ్యర్థుల ఎంపికలో సీరియస్‌గానే పనిచేస్తోంది. మొత్తానికి అన్ని పార్టీల అభ్యర్థులకు అంగబలం, అర్థబలం, సామాజిక వర్గాలతోపాటు విద్యావంతులను ఎంపికచేసే పనిలోపడ్డాయి. ప్రస్తుతం పోటీకి సిద్ధంగా ఉన్న అధికార పార్టీ అభ్యర్థులు, ప్రతిపక్ష పార్టీలకు చెందిన ఆశావహులు దాదాపుగా ఉన్నత విద్యావంతులు కావడం విశేషం. అన్ని పార్టీలపరంగా ఆశావహుల విద్యార్హతలను పరిశీలిస్తే.. అందరిలో అధికంగా డాక్టర్లే ఎక్కువగా ఉండటం గమనార్హం. ఆ తర్వాతి స్థానాల్లో వకీల్‌సాబ్‌లు, పోస్ట్ గ్రాడ్యుయేట్లు, బీటెక్‌బాబులు, గ్రాడ్యుయేట్లు ఉన్నారు. మొత్తానికి ఉమ్మడి జిల్లాలో ఈసారి అసెంబ్లీ బరిలో ఉన్నత విద్యావంతుల చాలామంది నిలవనున్నారు.

పదిమంది పేర్ల ముందు డాక్టర్

1. డాక్టర్ సంజయ్, ఎంఎస్, ఎమ్మెల్యే (బీఆర్‌ఎస్-జగిత్యాల)
2. డాక్టర్ సంజయ్, ఎంఎస్, (బీఆర్‌ఎస్-కోరుట్ల)
3. డాక్టర్ భోగ శ్రావణి, బీడీఎస్ (బీజేపీ-జగిత్యాల)
4. డాక్టర్ వికాస్‌బాబు, ఎంబీబీఎస్ (బీజేపీ- వేములవాడ)
5. డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ, ఎంఎస్ (కాంగ్రెస్-మానకొండూరు)
6. డాక్టర్ బల్మూరి వెంకట్, ఎంబీబీఎస్ (కాంగ్రెస్-హుజూరాబాద్)
7. డాక్టర్ జేఎన్ వెంకట్, ఎంబీబీఎస్ (బీజేపీ-కోరుట్ల)

పీహెచ్‌డీ డాక్టర్లు

8. డాక్టర్ రసమయి బాలకిషన్, ఎమ్మెల్యే (బీఆర్‌ఎస్-మానకొండూరు)
9. డాక్టర్ కొనగాల మహేశ్ (కాంగ్రెస్-కరీంనగర్)
10. డాక్టర్ మేడిపల్లి సత్యం (కాంగ్రెస్-చొప్పదండి)

వకీల్‌సాబ్‌లు వీరే..

1. దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ఎల్‌ఎల్‌బీ, ఎమ్మెల్యే (కాంగ్రెస్-మంథని)
2. టి.జీవన్‌రెడ్డి, ఎల్‌ఎల్‌బీ, ఎమ్మెల్సీ (కాంగ్రెస్-జగిత్యాల)
3. ఎ.మోహన్, ఎల్‌ఎల్‌బీ (మాజీ ఎమ్మెల్యే -మానకొండూరు)
4. కేకే మహేందర్‌రెడ్డి, ఎల్‌ఎల్‌బీ (కాంగ్రెస్-సిరిసిల్ల)

ఇంజినీర్లు

1. గంగుల కమలాకర్, బీటెక్(సివిల్) మంత్రి (బీఆర్‌ఎస్-కరీంనగర్)
2. దాసరి ఉష, ఐఐటీ ఖరగ్‌పూర్ (బీఎస్పీ- పెద్దపల్లి)
3. చలిమెడ లక్ష్మీనరసింహారావు, బీటెక్ (బీఆర్‌ఎస్- వేములవాడ)
4. వొడితెల సతీశ్‌బాబు, ఎంటెక్, ఎమ్మెల్యే (బీఆర్‌ఎస్-హుస్నాబాద్)
5. నక్కా విజయ్‌బాబు, బీటెక్ (బీజేపీ- ధర్మపురి)

పోస్ట్ గ్రాడ్యుయేట్లు

1. కేటీఆర్, ఎంబీఏ(యూఎస్‌ఏ), మంత్రి (బీఆర్‌ఎస్-సిరిసిల్ల)
2. కోరుకంటి చందర్, ఎంఏ, ఎమ్మెల్యే (బీఆర్‌ఎస్- రామగుండం)
3. దాసరి మనోహర్‌రెడ్డి, ఎంఏ, ఎమ్మెల్యే (బీఆర్‌ఎస్- పెద్దపల్లి)
4. పొన్నం ప్రభాకర్, ఎంఏ, మాజీ ఎంపీ (కాంగ్రెస్- హుస్నాబాద్)
5. సోమారపు సత్యనారాయణ, పీజీ (బీజేపీ-రామగుండం)
6. జువ్వాడి నర్సింగరావు, పీజీ (కాంగ్రెస్-కోరుట్ల)

గ్రాడ్యుయేట్లు

1. ఈటల రాజేందర్, బీఎస్సీ, ఎమ్మెల్యే (బీజేపీ-హుజూరాబాద్)
2. బండి సంజయ్, డిగ్రీ, ఎంపీ (బీజేపీ-కరీంనగర్)
3. రోహిత్‌రావు, గ్రాడ్యుయేషన్ (ఆస్ట్రేలియా) (కరీంనగర్-కాంగ్రెస్)
4. కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, గ్రాడ్యుయేట్ (కరీంనగర్-కాంగ్రెస్)

కాంగి'రేస్'లో 85 మంది!



- అత్యధికంగా కరీంనగర్‌కు, అత్యల్పంగా జగిత్యాలకు
- 13 అసెంబ్లీ నియోజకవర్గాల్లోనూ హోరాహోరీ

సాక్షిప్రతినిధి,కరీంనగర్:

ఉమ్మడి జిల్లా కాంగ్రెస్ ఆశావహుల జాబితా సిద్ధమైంది. రాష్ట్రంలో ఎన్నికలకు అధికార బీఆర్‌ఎస్ సమరశంఖం పూరించిన నేపథ్యంలో కాంగ్రెస్ కూడా పోటీకి నేతల నుంచి దరఖాస్తులు ఆహ్వానించింది. దీనికి లీడర్ల నుంచి అనూహ్య స్పందన వచ్చింది. ఉమ్మడి జిల్లాలోని 13 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 85 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో అత్యధికంగా కరీంనగర్‌కు 15 దరఖాస్తులు రాగా, అత్యల్పంగా జగిత్యాలకు ఒకే ఒక్క దరఖాస్తు రావడం గమనార్హం. గతంలోలా కాకుండా ఈసారి ఇప్పటికే తమ పార్టీ స్థితిగతులపై పలుదఫాలుగా సర్వేలు చేసిన కాంగ్రెస్ పార్టీ.. ఇపుడు ఆ సర్వే ఫలితాల ఆధారంగా టికెట్ కేటాయించనుందని సమాచారం. సామాజిక వర్గాలవారీగా ఓసీ, బీసీలు, ఎస్సీ, ఎస్టీలకు ధరావత్తు సొమ్ము చెల్లించి మరీ తమ ఆకాంక్షను పార్టీకి తెలియజేశారు. ఈనెల 25తో దరఖాస్తులకు గడువు ముగియడంతో వాటి పరిశీలన మొదలైంది. ఈ వడపోత కార్యక్రమం ముగిసిన తర్వాత దరఖాస్తు చేసుకున్న వారి వివరాలు ప్రకటిస్తారా? లేక కొత్తగా పార్టీలో చేరేవారికి దరఖాస్తుకు మరోసారి గడువు పెంచుతారా? అన్న విషయంలో ఇంకా స్పష్టత రావాల్సి ఉంది. ఇప్పటికే గాంధీభవన్ నుంచి ఢిల్లీ వరకు ఎవరి పైరవీలు వారు ప్రారంభించారు. తమకే టికెట్ కేటాయించాలని, ఒక్కచాన్స్, చివరి చాన్స్ అంటూ యత్నాలు చేస్తున్నారు.

13 నియోజకవర్గాల్లో దరఖాస్తులు ఇలా..

కరీంనగర్-15: రేగులపాటి రమ్యారావు, మేనేని రోహిత్‌రావు, డాక్టర్ కొనగాల మహేశ్, వైద్యుల అంజన్‌కుమార్, మొహమ్మద్ అబ్దుల్ షమీద్ (నవాబ్), కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, కోమటిరెడ్డి పద్మాకర్‌రెడ్డి, పురమల్ల శ్రీనివాస్, జువ్వాడి నిఖిల్ చక్రవర్తి, రేగులపాటి రితీశ్‌రావు, సత్తు మల్లయ్య, కర్ర సత్యప్రసన్న, పడాల రాహుల్, ఎండీ రహమత్ హుస్సేన్, కొత్త జైపాల్‌రెడ్డి.

చొప్పదండి-7: మేడిపల్లి సత్యం, జిల్లాల భానుప్రియ, వెన్న రాజమల్లయ్య, కాశిపాక రాజేశ్, చిగురు శకుంతల, నాగి శేఖర్, మైక లక్ష్మణ్.

మానకొండూర్-2: డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ, తిప్పార సంపత్.

హుజూరాబాద్-13: పాతి రామకృష్ణారెడ్డి, జాలి కమలాకర్‌రెడ్డి, వొంటెల లింగారెడ్డి, ప్యాట రమేశ్, కె.బుచ్చిరెడ్డి, గూడెపు సారంగాపాణి, బల్మూరి వెంకట నర్సింగ్‌రావు, టి.రవీందర్, కశ్యప్ రెడ్డి ముద్దసాని, సాయిని, రవికుమార్, పూదరి రేణుక, దాసరి భూమయ్య, తిప్పార సంపత్.

హుస్నాబాద్-06: పొన్నం ప్రభాకర్, అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి, వొంటెల లింగారెడ్డి, బాలికొట్టి శివయ్య, వొంటెల రత్నాకర్, డాక్టర్ గజ్జెల మల్లేశ్.

పెద్దపల్లి-05: కిరణ్‌కుమార్ వెల్పుల, చింతకుంట విజయరమణారావు, గంట రాములు, చేతి ధర్మయ్య, ఈర్ల కొమురయ్య.

రామగుండం-06: ఎంఎస్ రాజ్‌ఠాకూర్, హర్కర వేణుగోపాల్‌రావు, బాజ్‌పాల్ జనక్‌ప్రసాద్, అంచర్ల మహేశ్ యాదవ్, రియాజొద్దీన్ అహ్మద్, గంట సత్యనారాయణరెడ్డి.

మంథని-02: దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, శివనాద్రి ప్రమోద్‌కుమార్.

వేములవాడ-04: ఆది శ్రీనివాస్, ఎం.చంద్రశేఖర్ యాదవ్, టి.అంజయ్యయాదవ్, సింగిరెడ్డి నరేశ్‌రెడ్డి.

సిరిసిల్ల-04: సంగీతం శ్రీనివాస్, చీటి ఉమేశ్‌రావు, నాగుల సత్యనారాయణ, కేకే మహేందర్‌రెడ్డి.

జగిత్యాల-01: తాటిపర్తి జీవన్‌రెడ్డి.

కోరుట్ల-13: కల్వకుంట్ల సుజిత్‌రావు, కోమొరెడ్డి జ్యోతిదేవి, జువ్వాడి నర్సింగరావు, రుద్ర శ్రీనివాస్, రుద్ర శంకర్, మొహమ్మద్ షకీర్ సిద్ధిఖీ, కోమొరెడ్డి కరమ్ చంద్, కోట దుర్గారాజ్, కాటిపల్లి శ్రీనివాస్‌రెడ్డి, సింగిరెడ్డి నరేశ్‌రెడ్డి, ఆసిఫ్ హబీబ్, అలే పాండురంగా, మొహమ్మద్ హబీబ్ ఖాన్.

ధర్మపురి-07: అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, గజ్జెల స్వామి, వడ్లూరి కృష్ణ, గుమ్మడి కుమారస్వామి, బండారి కనుకయ్య, రవీందర్ మద్దెల, బొల్లి స్వామి.

పిల్లలు క్రీడల్లో రాణించేలా చూడాలి



విద్యార్థులకు బహుమతులు ఇస్తున్న కలెక్టర్ గోపి, సీపీ సుబ్బారాయుడు, మేయర్ సునీల్‌రావు

- క్రీడా దినోత్సవంలో కలెక్టర్ గోపి

కరీంనగర్‌స్పోర్ట్స్: రాష్ట్రంలో క్రీడలకు మంచి సౌకర్యాలు ఉన్నాయని, పిల్లలు చిన్నతనం నుంచే క్రీడల్లో రాణించేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలని కలెక్టర్ బి.గోపి అన్నారు. మంగళవారం కరీంనగర్ అంబేడ్కర్ స్టేడియంలో భారత హాకీ దిగ్గజం మేజర్ ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకొని జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా చలో మైదాన్ కార్యక్రమం నిర్వహించారు. ముందుగా మేజర్ ధ్యాన్‌చంద్ చిత్రపటానికి కలెక్టర్, మేయర్, సీపీ నివాళి అర్పించారు. కలెక్టర్ గోపి మాట్లాడుతూ.. తెలంగాణ హాకీక్రీడలో ఉన్నతస్థానంలో ఉందని అన్నారు. జిల్లాలో అత్యుత్తమ క్రీడాకారులను తీర్చిదిద్దడానికి ప్రాంతీయ క్రీడా పాఠశాల, అంబేడ్కర్ స్టేడియం అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. మేయర్ వై.సునీల్‌రావు మాట్లాడుతూ.. క్రీడలకు పెద్దఎత్తున ఆదరణ లభిస్తోందననారు. సీపీ సుబ్బారాయుడు మాట్లాడుతూ ప్రతిఒక్కరు ధ్యాన్‌చంద్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. అనంతరం జిల్లాలోని వెటరన్ క్రీడాకారులు, సైక్లిస్టులు, కోచ్‌లను శాలువాలతో సత్కరించారు. పలువురు విద్యార్థులకు ట్రోఫీలు ప్రదానం చేశారు. సుడా చైర్మన్ జీవీ రామకృష్ణారావు, జిల్లా మార్కెటింగ్ అధికారిని పద్మావతి, అడిషనల్ డీసీపీ లక్ష్మీనారాయణ, జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి, డీవైఎస్‌ఓ రాజవీరు, నెహ్రూ యువ కేంద్రం కోఆర్డినేటర్ ఎం.వెంకటరాంబాబు, జిల్లా ఒలింపిక్ సంఘం ప్రధాన కార్యదర్శి గసిరెడ్డి జనార్దన్‌రెడ్డి, ఉపాధ్యక్షులు తుమ్మల రమేశ్‌రెడ్డి పాల్గొన్నారు.

ఓటరుగా నమోదు చేసుకోండి

కరీంనగర్ అర్బన్: జూనియర్ కళాశాలలు, వృత్తి నైపుణ్య కళాశాలల్లోని అర్హులైన ప్రతి విద్యార్థి ఓటరుగా నమోదు కావాల్సిందేనని, తదనుగుణంగా చర్యలుండాలని కలెక్టర్ డా.బి.గోపి ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో నోడల్ అధికారులు, జిల్లా అధికారులు, స్వీప్ నోడల్ అధికారులు, ఏఈఆర్‌ఓలు, బీఎల్‌ఓలతో ఓటర్ల జాబితా సవరణపై సమీక్షించారు. జిల్లాలోని నాలుగు నియోజక వర్గాలలోని జూనియర్ కళాశాల, వృత్తి నైపుణ్య కళాశాలలో అక్టోబర్ 1, 2023 నాటికి 18 సంవత్సరాలు పూర్తిచేసుకున్న వారందరూ ఓటు హక్కును కలిగి ఉండేలా చూడాలని ఆదేశించారు. జాబితాలో పేర్లు, చిరునామాలో మార్పులు, డబుల్ ఎంట్రీ, ఓటరు ఫొటో సరిగాఉండేలా చూడాలన్నారు. నూతన ఓటర్లను ఆధార్, బర్త్ సర్టిఫికెట్ల ఆధారంగా నమోదు చేయాలని సూచించారు. ప్రతీ బుధవారం ఓటరు అవగాహన కార్యక్రమాల్లో భాగంగా ఓటరు జాబితాలోని వివరాల నిర్ధారణ, వ్యాసరచన, పెయింటింగ్, సాంస్కృతిక కార్యక్రమాలు, సెమినార్లు, సైకిల్ ర్యాలీ చేపట్టాలని తెలిపారు. ఓటు అవగాహన కార్యక్రమంపై లఘు చిత్రం రూపొందించిన యూట్యూబర్ సదానందను సన్మానించారు. అదనపు కలెక్టర్లు లక్ష్మీ కిరణ్, ప్రఫుల్ దేశాయ్, ఆర్డీవోలు కుందారపు మహేశ్వర్, సోలిపేట రాజు, మెప్మా పీడీ రవీందర్, తహసీల్దార్లు, డిప్యూటీ మున్సిపల్ కమిషనర్ స్వరూపరాణి పాల్గొన్నారు.

ఆధార్ అప్‌డేట్ వందశాతం పూర్తవ్వాలి

జిల్లాలో ఆధార్ ఎన్‌రోల్‌మెంట్, డాక్యుమెంటేషన్ వందశాతం అప్‌డేట్ జరిగేలా చూడాలని కలెక్టర్ డా.బి.గోపి ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లాస్థాయి ఆధార్ మానిటరింగ్ కమిటీ మూడో త్రైమాసిక సమావేశంలో కలెక్టర్ పాల్గొన్నారు. ఆధార్ ఎన్‌రోల్‌మెంట్, డాక్యుమెంట్ అప్డేట్‌పై మండలాల వారీగా సమీక్షించారు. ఆధార్‌కి సంబంధించిన పొరపాట్లు జరిగినా ముందు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పాఠశాలల్లో ఆధార్ ఎన్‌రోల్‌మెంట్ తప్పనిసరిగా డాక్యుమెంటేషన్ అప్డేట్ జరిగేలా చూడాలని జిల్లా విద్యాశాఖ అధికారిని సూచించారు. ఇ- డిస్ట్రిక్ట్ మేనేజర్ శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా విద్యాశాఖ అధికారి జనార్దన్‌రావు, జిల్లా లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ ఆంజనేయులు, ఉదయ్, అసిస్టెంట్ మేనేజర్ సత్యకళ పాల్గొన్నారు.

చర్చకు వచ్చేదేమిటో?

- ఎజెండాలో 17 అంశాలు
- నేడు బల్దియా సర్వసభ్య సమావేశం



కరీంనగర్ కార్పొరేషన్: రెండు నెలల అనంతరం బల్దియా సర్వసభ్య సమావేశం బుధవారం జరగనుంది. నగరపాలకసంస్థ కార్యాలయంలో నూతనంగా నిర్మించిన మీటింగ్‌హాల్‌లో ఈ సమావేశం నిర్వహిస్తున్నారు. మేయర్ యాదగిరి సునీల్‌రావు అధ్యక్షతన జరిగే సమావేశానికి సంబంధించిన ఎజెండా కాపీలను కార్పొరేటర్లకు అందజేశారు.

ఎజెండాలో 17అంశాలు

నగరపాలకసంస్థ సర్వసభ్య సమావేశం ఎజెండాలో 17 అంశాలు పొందుపరిచారు. ఎక్కువగా అభివృద్ధి పనులకు సంబంధించినవే ఉన్నాయి. కార్పొరేటర్ల ప్రతిపాదనలు 200 వరకు ఉండగా, కేవలం 17 మాత్రమే ఎజెండాలో పెట్టారని, తమ ప్రతిపాదనలు బుట్టదాఖలయినట్లేనని కార్పొరేటర్లు పేర్కొంటున్నారు. ఎజెండాలో పొందుపరచలేని అంశాలు, టేబుల్ ఎజెండాల్లో ఉంచే అవకాశం ఉందని సీనియర్ కార్పొరేటర్లు అభిప్రాయపడుతున్నారు.

అవినీతి ఆరోపణలు...అధికారుల వివాదాలు

నగరంలో వేల కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు జరుగుతుంటే, అక్కడక్కడా అవినీతి, అక్రమాల ఆరోపణలు ఇబ్బందిగా మారాయి. ప్రధానంగా ఇంజినీరింగ్ అధికారులపై తీవ్రస్థాయిలో ఆరోపణలు వచ్చాయి. కాంట్రాక్టర్లతో కుమ్మక్కై ఓ డీఈ అక్రమాలకు పాల్పడ్డాడని ఏకంగా అధికార బీఆర్‌ఎస్ కార్పొరేటర్ ఫిర్యాదు చేయడం ఈ ఆరోపణలకు బలం చేకూర్చాయి. జంక్షన్‌లు, సమీకృత మార్కెట్‌ల నిర్మాణాల్లో ఒకరిద్దరు అధికారులు చేతివాటం ప్రదర్శించారనే ఫిర్యాదులు వచ్చాయి. తమ దురుసు ప్రవర్తనతో తరచూ వార్తల్లో నిలుస్తూ నగరపాలకసంస్థ పరిపాలనను మసకబార్చే అధికారుల ఉదంతాలు వెలుగు చూస్తున్నాయి.

ఎక్స్‌టెన్షనా...టెండరా?

నగరంలో డివైడర్‌ల నిర్వహణ కాంట్రాక్ట్ అంశం ఏజెండాలో ఉంటుందని భావించినప్పటికి, లేకపోవడం ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. డివైడర్ల మధ్యలో ఉన్న చెట్లకు నీళ్లు పోయడం, కట్ చేయడం తదితర పనుల కోసం కాంట్రాక్ట్ అప్పగించారు. సంవత్సరానికి రూ.50 లక్షల కాంట్రాక్ట్ కావడంతో దీనిపై పలువురు ఆసక్తి కనపరిచారు. గతంలో కొంతమంది కార్పొరేటర్లు ఈ కాంట్రాక్ట్ తీసుకొని పనులు చేయగా, మూడు నెలల క్రితం ఈ కాంట్రాక్ట్ గడువు ముగిసింది. అప్పటి నుంచి ఆ కాంట్రాక్ట్‌కు పొడిగింపు (ఎక్స్‌టెన్షన్) ఇస్తారా, కొత్తగా టెండర్ పిలుస్తారా అనే చర్చ బల్దియాలో మొదలైంది. బుధవారం సర్వసభ్య సమావేశంలో దీనిపై ఏదో ఒక నిర్ణయం ఉంటుందనే ప్రచారం ఉంది.

కొత్త సమావేశ మందిరంలో...

సర్వసభ్య సమావేశం నూతన సమావేశ మందిరంలో జరగనుంది. మొదటి అంతస్తులో ఉన్న సమావేశ మందిరాన్ని సర్వసభ్య సమావేశానికి గతంలో వినియోగించేవాళ్లు. కాని నగరపాలకసంస్థగా ఏర్పడిన తర్వాత, గ్రామాల విలీనంతో 60 డివిజన్‌లకు విస్తరించడంతో ఆ సమావేశ మందిరం సరిపోలేదు. దీంతో కలెక్టరేట్ ఆడిటోరియానికి మార్చారు. ఈ క్రమంలోనే నగరపాలకసంస్థ మూడవ అంతస్తులో అత్యాధునిక, విశాలమైన సమావేశ మందిరాన్ని నిర్మించారు. గత జూన్ 21వ తేదీన మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ సమావేశ మందిరాన్ని ప్రారంభించారు. పూర్తిస్థాయిలో తొలి సర్వసభ్య సమావేశం బుధవారం ఇక్కడ జరగనుంది.

'లంచం ఇస్తేనే పనులు'



కరీంనగర్ కార్పొరేషన్: నగరపాలకసంస్థలో లంచం ఇస్తేనే పనులు చేస్తున్నారని బీఆర్‌ఎస్ కార్పొరేటర్ కమల్‌జిత్‌కౌర్ సోహన్ సింగ్ ఆరోపించారు. మంగళవారం నగరంలోని తారక హోటల్‌లో మాట్లాడుతూ రెవెన్యూ విభాగంలో అధికారులు బ్రోకర్లను పెట్టుకొని డబ్బులు వసూలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. తమ డివిజన్ పరిధిలో మూడు గుంటల ఖాళీస్థలానికి 30 ఏళ్లకు సంబంధించిన పన్నులు బకాయి ఉంటే, కేవలం రెండేళ్ల పన్నులు మాత్రమే వసూలు చేశారని ఆరోపించారు. అదే ఇంటికి సంబంధించి రెండు వేర్వేరు లీగలైర్ పత్రాలు సృష్టించారని, ఇది అధికారులు ప్రోత్సహిస్తున్న బ్రోకర్లు తయారుచేసినవిగా అనుమానం ఉందన్నారు. డబ్బులు ఇస్తేనే బర్త్, డెత్ సర్టిఫికెట్‌లు ఇస్తున్నారన్నారు. ఇలాంటి వ్యవహారంలపై విచారణ జరిపించాలన్నారు.

నేడు అర్చక ఆగమ ఉత్తీర్ణత సర్టిఫికెట్లు జారీ

కరీంనగర్‌కల్చరల్: దేవాదాయ, ధర్మదాయ శాఖ నిర్వహించిన అర్చక ఆగమ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులకు బుధవారం హైదరాబాద్‌లోని కమిషనర్ కార్యాలయంలో సర్టిఫికెట్లు అందించనున్నట్లు ఉమ్మడి కరీంనగర్ సహ కమిషనర్ ఆకునూరి చంద్రశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి జిల్లా కరీంనగర్‌లోని అర్చక ఆగమ పరీక్షలలో ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులు హైదరాబాద్ వెళ్లి ధ్రువీకరణ పత్రాలు తీసుకోవాలని సూచించారు.

స్వావలంబనే అంతిమ లక్ష్యం కావాలి



సదస్సులో వక్తలు, విద్యార్థులు

కరీంనగర్‌సిటీ: దేశంలో ఉన్న అనువైన వాతావరణాన్ని ఉపయోగించుకొని, స్వావలంబనే అంతిమ లక్ష్యంగా ముందుకుసాగాలని తెలంగాణ కాటన్ జిన్నింగ్ అసోసియేషన్ సెక్రటరీ కక్కిరాల రమేశ్ అన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిన స్వావలంబి భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా కరీంనగర్‌లోని ఎస్సారార్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం నిర్వహించిన సదస్సుకు హాజరై, మాట్లాడారు. కావేరీ పరిశ్రమల ద్వారా తాను 2 వేల మందికి ఉపాధి కల్పిస్తున్నానని తెలిపారు. రాష్ట్ర కోఆర్డినేటర్, సీఏ హరీశ్‌బాబు మాట్లాడుతూ.. ట్రిలియన్ ఎకానమీ వ్యవస్థలో ఉన్న అవకాశాలను అందిపుచ్చుకోవాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ కె.రామకృష్ణ మాట్లాడుతూ.. విద్యార్థులు ఉద్యోగాలు సృష్టించే బాధ్యత తీసుకోవాలన్నారు. కళాశాల కోఆర్డినేటర్ ఎ.సతీష్‌కుమార్ విద్యార్థుల కు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు కిశోర్‌కుమార్, పురుషోత్తం, ఓదెలుకుమార్, దామోదర్‌రెడ్డి, చంద్రమౌళి, అరవింద్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

'అరసం' కార్యవర్గం ఎన్నిక


మల్లారెడ్డి


వెంకటేశ్‌

కరీంనగర్‌కల్చరల్‌: అభ్యుదయ రచయితల సంఘం ఉమ్మడి కరీంనగర్‌ జిల్లా నూతన కార్యవర్గాన్ని మంగళవారం అరసం జాతీయ కార్యదర్శి వేల్పుల నారాయణ, రాష్ట్ర ఉపాధ్యక్షుడు నిధి, రాష్ట్ర కార్యదర్శి పల్లేరు వీరస్వామిల ఆధ్వర్యంలో కరీంనగర్‌లో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గులాబీల మల్లారెడ్డి, ప్రధాన కార్యదర్శి గా ఏలేశ్వరం వెంకటేశ్‌, ఉపాధ్యక్షులుగా గడిపె మల్లేష్‌, నాగేంద్ర శర్మ, కార్యదర్శులుగా సంది నేని నరేంద్ర, టి.లక్ష్మణ్‌ రావు, కార్యవర్గ సభ్యులుగా వై.లెనిన్‌, అంబరగొండ రాజేశ్వరరావు, పెట్టుగడి అనిల్‌కుమార్‌, ఎంఏ బేగ్‌, తాళ్లపెల్లి శంకర్‌ ఎన్నికయ్యారు. జాతీయ కార్యదర్శి వేల్పుల నారాయణ మాట్లాడుతూ ప్రస్తుత సంక్షోభభరిత సమాజంలో రచయితల భావస్వేచ్ఛపై అప్రకటిత నిషేధం అమలవుతోందని అన్నారు. ప్రజాస్వామ్యంపై దాడి పెరిగిపోయి ందని, రచయితలు ప్రజలను చైతన్యం చేసేందుకు తమ రచనలను ఎక్కుపెట్టాలని కోరారు. పలువురు సాహితీవేత్తలు, అభిమానులు పాల్గొన్నారు

నన్ను, నా కుటుంబాన్ని రక్షించండి

- విద్యుదాఘాతానికి గురైన రైతు



జమ్మికుంట: 'నన్ను, నా కుటుంబాన్ని రక్షించండి' అంటూ విద్యుదాఘాతానికి గురైన రైతు వేల్పుల తిరుపతి వేడుకున్నాడు. జమ్మికుంట మండలంలోని విలాసాగర్‌కు చెందిన తిరుపతిని ఇదే గ్రామానికి చెందిన ముగ్గురు వ్యక్తులు హత్య చేసేందుకు ప్రయత్నించారని అతని భార్య సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేసిన విషయం విధితమే. జమ్మికుంట పట్టణంలోని ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న తిరుపతి మంగళవారం విలేకరులతో మాట్లాడాడు. వ్యవసాయం చేసుకొని, జీవించే తనకు, తన కుటుంబానికి ప్రాణభయం ఉందని తెలిపాడు. హత్యాయత్నం జరగడానికి ముందు తనను చంపుతామని బెదిరింపులకు పాల్పడ్డారని అన్నాడు. వారిని చట్టపరంగా కఠినంగా శిక్షించాలని కోరాడు.

మోసగించిన కేసులో ఒకరికి జైలు

హుజూరాబాద్‌: సిద్దిపేట జిల్లా కోహెడ మండలంలోని మైసంపల్లికి చెందిన అల్లెపు కృష్ణకు మోసం చేసిన కేసులో హుజూరాబాద్‌ ఫస్ట్‌ అడిషనల్‌ జ్యుడీషియల్‌ ఫస్ట్‌ క్లాస్‌ మెజిస్ట్రేట్‌ 18 నెలల జైలుశిక్షతోపాటు జరిమానా విధించినట్లు ఏసీపీ జీవన్‌ రెడ్డి తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. కృష్ణ కరబూజ ఐలమ్మకు ఆసరా పెన్షన్‌, రేషన్‌కార్డు ఇప్పిస్తానని మభ్యపెట్టి, ఆమె వద్ద నుంచి సుమారు తులంనర బంగారం తీసుకున్నాడు. తర్వాత ఇప్పించకపోవడంతో మోసపోయానని గ్రహించిన బాధితురాలు హుజూరాబాద్‌ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కేసు దర్యాప్తు చేసిన పోలీసులు పూర్తి ఆధారాలను కోర్టుకు సమర్పించారు. న్యాయమూర్తి వాటిని పరిశీలించి, కృష్ణకు మంగళవారం శిక్ష విధిస్తూ తీర్పు వెల్లడించారు.

వ్యక్తి ఆత్మహత్య

కరీంనగర్‌ క్రైం: కరీంనగర్‌లోని న్యూసిక్‌వాడీకి చెందిన చనుమల్ల కిరణ్‌(54) ఆత్మహత్య చేసుకున్నాడని వన్‌టౌన్‌ పోలీసులు తెలిపారు. వారి వివరాల ప్రకారం.. కిరణ్‌ మద్యానికి బానిసయ్యాడు. సోమవారం రాత్రి కూడా మద్యం సేవించి, ఇంటికి వచ్చాడు. 10 గంటల సమయంలో అతని భార్య ఆస్పత్రిలో ఉన్న కూతురును చూసేందుకు వెళ్లింది. మంగళవారం ఉదయం 7 గంటలకు ఇంటికి వచ్చేసరికి కిరణ్‌ ఉరేసుకున్నాడు. మద్యం మానేయాలని చెప్పడంతో మనస్తాపం చెంది, ఆత్మహత్య చేసుకున్నట్లు మృతుడి భార్య శివలీల పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు వారు పేర్కొన్నారు.

సమగ్ర శిక్షా అభియాన్‌ కాంట్రాక్ట్‌ ఉద్యోగుల పోరుబాట

- తక్కువ వేతనాలతో ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన
- సీఎం ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్‌
- జిల్లాలో 555 మంది
- కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలు



కలెక్టరేట్‌ ఎదుట దీక్ష చేస్తున్న సమగ్ర శిక్షా అభియాన్‌ కాంట్రాక్టు ఉద్యోగులు

కరీంనగర్‌: జిల్లా విద్యాశాఖ పరిధిలో ఉన్న సమగ్ర శిక్షా అభియాన్‌ పథకంలో 15 ఏళ్లుగా పని చేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగుల పరిస్థితి దయనీయంగా మారింది. ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా విద్యాభివృద్ధికి కృషి చేస్తున్నప్పటికీ ప్రభుత్వం తమను చిన్నచూపు చూస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సీఎం కేసీఆర్‌ ఎన్నికలకు ముందు కాంట్రాక్టు ఉద్యోగులందరినీ రెగ్యులరైజ్‌ చేస్తామని, మహిళా ఉద్యోగులకు 6 నెలల వేతనంతో కూడిన ప్రసూతి సెలవులు ఇస్తామని హామీ ఇచ్చి, అమలు చేయడం లేదన్నారు. సమస్యల పరిష్కారానికి మూడు రోజులుగా కలెక్టరేట్‌ ఎదుట ధర్నాలు, రిలే నిరాహార దీక్షలు చేపడుతున్నారు.

జిల్లాలో 555 మంది ఉద్యోగులు

జిల్లాలో సమగ్ర శిక్షా అభియాన్‌లో కాంట్రాక్టు పద్ధతిలో 555 మంది పని చేస్తున్నారు. కేజీబీవీల్లో టీచింగ్‌, నాన్‌టీచింగ్‌ సిబ్బంది 317, యూఆర్‌ఎస్‌లో టీచింగ్‌, నాన్‌టీచింగ్‌ సిబ్బంది 09 మంది, డీపీవో కాంట్రాక్టు స్టాఫ్‌ 09, ఎంఐఎస్‌ కో–ఆర్డినేటర్‌ 09, ఎమ్మార్సీ కంప్యూటర్‌ ఆపరేటర్స్‌ 10, భవిత సెంటర్లలో ఐఈఆర్పీలు 28, స్కూల్‌ కాంప్లెక్స్‌ స్థాయిలో క్లస్టర్‌ రిసోర్స్‌ పర్సన్లు 80, పార్ట్‌ టైం ఇన్‌స్ట్రక్టర్లు 80, ఎంఆర్‌సీ మెసెంజర్లు 12 మంది ఉన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి

ఆంధ్రప్రదేశ్‌ ప్రభుత్వం కాంట్రాక్టు ఉద్యోగులకు సాధారణ మరణమైతే రూ.2 లక్షలు, ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.5 లక్షలు చెల్లిస్తోందని, మహిళా కాంట్రాక్టు ఉద్యోగులకు 180 రోజుల వేతనంతో కూడిన ప్రసూతి సెలవులు ఇస్తున్నారని తెలిపారు. ఇక్కడ కూడా వాటిని అమలు చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతున్నారు.

క్రమబద్ధీకరణలో మొండిచేయి

ఆంధ్రప్రదేశ్‌తో పోలిస్తే కాంట్రాక్టు ఉద్యోగులకు మన రాష్ట్రంలో కంటే ఎక్కువ వేతనాలు చెల్లిస్తున్నారని తెలిపారు. గతంలో ఉన్నత విద్యాశాఖలో కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్న లెక్చరర్లను క్రమబద్ధీకరించిన ప్రభుత్వం సమగ్ర శిక్షా అభియాన్‌ ప్రాజెక్టులో పనిచేస్తున్న వారికి మాత్రం మొండిచేయి చూపుతోందని ఆవేదన చెందుతున్నారు. తమకు స్కూల్‌ అసిస్టెంట్‌, ఎస్‌జీటీ నియామకాలకు సరిపోయే విద్యార్హతలు ఉన్నా వెయిటేజీ ఇవ్వకపోవడంతో అన్యాయం జరుగుతోందన్నారు.

పలు సంఘాల సంఘీభావం

సమగ్ర శిక్షా అభియాన్‌ కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులరైజ్‌, మినిమం టైం స్కేల్‌ అమలు చేయాలని తెలంగాణ సమగ్ర శిక్షా అభియాన్‌ కాంట్రాక్టు ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు బెజ్జంకి ఆంజనేయులు, జిల్లా ప్రధాన కార్యదర్శి దుర్గం శ్రీనివాస్‌ డిమాండ్‌ చేశారు. మంగళవారం కలెక్టరేట్‌ ఎదుట రిలే నిరాహార దీక్ష చేపట్టారు. పీఆర్‌టీయూటీఎస్‌ జిల్లా అధ్యక్షుడు ముస్కు తిరుపతిరెడ్డి, ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌ నాయక్‌, తెలంగాణ ప్రాంత టీచర్స్‌ అసోసియేషన్‌ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంబటి వేణుకుమార్‌, టీఆర్టీఎఫ్‌ జిల్లా జనరల్‌ సెక్రటరీ అశోక్‌ రావు, టీపీయూఎస్‌ జిల్లా జనరల్‌ సెక్రటరీ రంగారావు, ఎస్టీయూ టీఎస్‌ జిల్లా జనరల్‌ సెక్రటరీ పిన్నింటి తిరుపతిరావు, సంఘీభావం తెలిపారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు గీట్ల ముకుంద రెడ్డి, కాంగ్రెస్‌ నగరశాఖ అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్‌ రెడ్డి, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు మోసం అంజయ్య మద్దతు ప్రకటించారు.

పేస్కేల్‌ అమలు చేయాలి



సమగ్ర శిక్షా కాంట్రాక్టు ఉద్యోగులకు బేసిక్‌ పేస్కేల్‌ అమలు చేసి, ఉద్యోగ భద్రత కల్పించాలి. గ్రూప్‌ ఇన్సూరెన్స్‌, నగదు రహిత వైద్యం అందించాలి. చనిపోయిన వారి కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి.
– బెజ్జంకి ఆంజనేయులు, తెలంగాణ సమగ్ర శిక్షా కాంట్రాక్టు ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు

అరకొర వేతనాలతో ఇబ్బంది



కాంట్రాక్టు ఉద్యోగులందరినీ ప్రభుత్వం రెగ్యులరైజ్‌ చేయాలి. విద్యావ్యాప్తికి కృషి చేస్తున్నాం. అరకొర వేతనాలతో పనిచేస్తూ ఇబ్బంది పడుతున్నాం. ఎప్పటికైనా ఉద్యోగాన్ని క్రమబద్ధీకరిస్తారన్న ఆశతో ఉన్నాం.
– వైద్య దీప్తి, ఎంఐఎస్‌ కో–ఆర్డినేటర్‌

టైం స్కేల్‌ ఇవ్వాలి



పార్ట్‌ టైం ఇన్‌స్ట్రక్టర్లకు టైం స్కేల్‌ ఇవ్వాలి. ఉద్యోగ భద్రతతోపాటు పూర్తిస్థాయి సౌకర్యాలు కల్పించాలి. బోధన, బోధనేతర పనులు చేయించుకుంటూ రీఎంగేజ్‌ పేరిట కాలయాపన చేయడం సరికాదు.
– వి.గీతారాణి, పార్ట్‌ టైం ఇన్‌స్ట్రక్టర్‌

అసలేం జరిగింది..!?

- సాఫ్ట్‌వేర్‌ ఇంజినీర్‌ అనుమానాస్పద మృతి
- ఇంట్లో ఉన్నది అక్కాచెల్లెళ్లు మాత్రమే
- యువకుడితో చెల్లి వెళ్లిపోయిందా..?
- బస్టాండ్‌ సీసీ ఫుటేజీల్లో దృశ్యాలు


దీప్తి మృతదేహం


దీప్తి (ఫైల్‌)


కోరుట్ల బస్టాండ్‌లో యువకుడితో చందన (సీసీ ఫుటేజీ)


విచారణ జరుపుతున్న డీఎస్పీ రవీందర్‌ రెడ్డి

కోరుట్ల: 'సోమవారం రాత్రి ఆ ఇంట్లో అక్కాచెల్లెళ్లు మాత్రమే ఉన్నారు. తెల్లారేసరికి అక్క చనిపోయి సోఫాలో పడి ఉంది. ఇంటి బయట తలుపునకు గొళ్లెం పెట్టి చెల్లి ప్రియుడితో కలిసి పరారైంది'. ఇంట్లోని కిచెన్‌లో ఓడ్కా, బ్రీజర్‌ బాటిళ్లు ఉన్నాయి. అసలు ఆ రాత్రి ఇంట్లో ఏం జరిగి ఉంటుంది..? అక్క చనిపోవడానికి చెల్లెలే కారణమా..? ప్రియుడితో కలిసి చెల్లె వెళ్లిపోతుంటే అక్క అడ్డుకున్న క్రమంలో గొడవ జరిగిందా.. ఈ గొడవలోనే అక్క ప్రాణాలు పోయాయా..? లేదా ఓడ్కాలో అక్కకు మత్తు ఇచ్చి చెల్లెలు గుర్తుతెలియని యువకుడితో కలిసి పరారైందా..? వోడ్కాలో కలిపిన మత్తు మందు డోసు ఎక్కువై అక్క చనిపోయిందా..?!

అనేక అనుమానాలు

కోరుట్లకు చెందిన సాఫ్ట్‌వేర్‌ ఇంజినీర్‌ బంక దీప్తి మృతి వెనక లెక్కలేని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఆంధ్రకు చెందిన బంక శ్రీనివాస్‌రెడ్డి–మాధవి దంపతులు సుమారు పాతికేళ్లుగా కోరుట్లలోని భీమునిదుబ్బలో స్థిరపడ్డారు. ఇటుకబట్టీ వ్యాపారం చేసుకునే శ్రీనివాస్‌రెడ్డికి కుమారుడు, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. కుమారుడు బెంగళూర్‌లో సాఫ్ట్‌వేర్‌ ఇంజినీర్‌. పెద్ద కూతురు దీప్తి (24) పుణేలోని ఓ కంపెనీలో సాఫ్ట్‌వేర్‌ ఇంజినీర్‌గా వర్క్‌ఫ్రం హోం పద్ధతిన ఇంట్లో నుంచి పనిచేస్తోంది. చిన్నకూతురు చందన ఇటీవల బీటెక్‌ పూర్తి చేసింది. సోమవారం ఉదయం శ్రీనివాస్‌రెడ్డి– మాధవి హైదరాబాద్‌లోని బంధువుల గృహప్రవేశం కార్యక్రమానికి వెళ్లగా దీప్తి, చందన మాత్రమే ఇంట్లో ఉన్నారు. రాత్రి 10 గంటల వరకు తండ్రితో అక్కాచెల్లెళ్లు ఫోన్‌లో మాట్లాడినట్లు సమాచారం.

తెల్లారేసరికి..

మంగళవారం ఉదయం శ్రీనివాస్‌రెడ్డి తన కూతుళ్లతో మాట్లాడటానికి ప్రయత్నించగా పెద్ద కూతురు దీప్తి ఫోన్‌ లిఫ్ట్‌ కాలేదు. చిన్నకూతురు చందన ఫోన్‌ స్విచ్‌ ఆఫ్‌ వచ్చింది. రెండుమూడు సార్లు ఫోన్‌లో కూతుళ్లతో మాట్లాడేందుకు ప్రయత్నించిన శ్రీనివాస్‌రెడ్డి చివరికి పక్క ఇంట్లో ఉన్నవారికి ఫోన్‌ చేశాడు. తమ కూతుళ్లు ఫోన్‌ ఎత్తడం లేదని చెప్పి, ఓ సారి ఇంటిదాకా వెళ్లి చూడమని కోరాడు. పక్క ఇంట్లో ఉండే ఓ మహిళ మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో శ్రీనివాస్‌రెడ్డి ఇంట్లోకి వెళ్లి చూడగా తలుపు బయట నుంచి గొళ్లెం పెట్టి ఉంది. పిలిస్తే ఎవరూ పలకలేదు. దీంతో తలుపు గొళ్లెం తీసి లోపలికి వెళ్లి చూడగా పెద్ద కూతురు దీప్తి సోఫాలో పడిపోయి ఉంది. చుట్టుపక్కల వారికి విషయం చెప్పగా వారు దీప్తిని పరిశీలించి అప్పటికే చనిపోయినట్లు గుర్తించారు. బంధువులు, పోలీసులకు సమాచారం ఇవ్వగా మెట్‌పల్లి డీఎస్పీ వంగ రవీందర్‌రెడ్డి, సీఐ లక్ష్మీనారాయణ, ఎస్సైలు కిరణ్‌, చిరంజీవి ఘటన స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు.


ఆ రాత్రి ఏం జరిగినట్లు..?

సోమవారం ఉదయం తల్లిదండ్రులు హైదరాబాద్‌లోని బంధువు ఇంట్లో ఫంక్షన్‌కు వెళ్లగా రాత్రి అక్కాచెల్లెల్లు ఇద్దరే ఇంట్లో ఉన్నారు. కిచెన్‌లో వోడ్కా, బ్రీజర్‌ బాటిళ్లు, వెనిగర్‌, నిమ్మకాయలు ఉండటంతో రాత్రి వేళ దీప్తి, చందన కలిసి మద్యం సేవించారా..? అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. వీరికి మద్యం బాటిళ్లు ఎవరు తెచ్చి ఇచ్చారు, ప్రియుడితో కలిసి పరారయ్యేందుకు ముందుగానే పథకం వేసుకున్న చందన అతడితోనే మద్యం తెప్పించి ముగ్గురు కలిసి మద్యం తీసుకున్నారా..? అన్న విషయంలో స్పష్టత లేదు. దీప్తికి మద్యంలో మత్తు కలిపి తాము పరారయ్యేందుకు పథకం వేశారా..? మత్తు డోసు ఎక్కువ కావడంతో దీప్తి మృతి చెంది ఉంటుందా..? అన్న అనుమానాలున్నాయి. చందన ప్రియుడితో కలిసి వెళ్లిపోయే ప్రయత్నాన్ని దీప్తి అడ్డుకునే క్రమంలో గొడవ జరిగి ఆ గొడవలో తగలరాని చోట దెబ్బతగిలి దీప్తి చనిపోయిందా..? అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. దీప్తి శరీరంపై పెద్దగా గాయాలు కనిపించకపోవడం ప్రశ్నార్థకంగా మారింది.

బస్టాండ్‌ సీసీ కెమెరాలో చందన..

కోరుట్ల బస్టాండ్‌లోని సీసీ కెమెరాల్లో మంగళవారం వేకువజామున 5 గంటలకు చందన ఓ యువకుడితో కలిసి ఉన్న వీడియోలను పోలీసులు గుర్తించారు. చందన, మరో యువకుడు లగేజీ తీసుకుని నిజామాబాద్‌ వైపు వెళ్లే బస్సు ఎక్కినట్లు సీసీ ఫుటేజీల్లో రికార్డు అయింది. చందన ఫోన్‌కాల్‌ డేటా ఆధారంగా ఆమె ఓ యువకుడితో గంటల తరబడి ఫోన్‌ మాట్లాడినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. మంగళవారం రాత్రి చందన ఫోన్‌ లొకేషన్‌ హైదరాబాద్‌లో వస్తున్నట్లుగా పోలీసులు గుర్తించారని సమాచారం. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు దర్యాప్తు చేస్తున్నట్లు కోరుట్ల సీఐ ప్రవీణ్‌కుమార్‌ తెలిపారు.

ఘనంగా జాతీయ క్రీడా దినోత్సవం



కొత్తపల్లి: స్థానిక అల్ఫోర్స్‌ ఇ–టెక్నో స్కూల్‌లో మంగళవారం జాతీయ క్రీడా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మేజర్‌ ధ్యాన్‌చంద్‌ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి విద్యాసంస్థల చైర్మన్‌ వి.నరేందర్‌ రెడ్డి నివాళి అర్పించారు. ధ్యాన్‌చంద్‌ను స్ఫూర్తిగా తీసుకొని, ప్రతిఒక్కరూ క్రీడల్లో రాణించాలని సూచించారు.

పారమిత హెరిటేజ్‌ స్కూల్లో..

పద్మనగర్‌లోని పారమిత హెరిటేజ్‌ స్కూల్లో జాతీయ క్రీడా దినోత్సవం నిర్వహించారు. రాష్ట్ర, జాతీయ క్రీడాకారులచే క్రీడా పరుగు చేపట్టారు. విద్యాసంస్థల అధినేత ఇ.ప్రసాదరావు మాట్లాడుతూ.. ధ్యాన్‌చంద్‌ మార్గంలో నడుస్తూ అంతర్జాతీయ క్రీడాకారులుగా ఎదగాలని ఆకాంక్షించారు. డైరెక్టర్లు ప్రసూన, అనూకర్‌రావు, వినోద్‌రావు తదితరులున్నారు.

అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి

కరీంనగర్‌ క్రైం: కరీంనగర్‌లోని భాగ్యనగర్‌కు చెందిన ఓ మహిళ అనుమానాస్పద స్థితిలో మృతిచెందింది. కరీంనగర్‌ టూటౌన్‌ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సిద్దిపేట జిల్లా కోహెడ మండలంలోని చెంచల్‌ చెరువుపల్లికి చెందిన కాసర్ల నర్సయ్య కుటుంబం 17 ఏళ్లుగా హైదరాబాద్‌లోని మియాపూర్‌లో ఉంటోంది. నర్సయ్య కూతురు స్వరూప(36)కు కరీంనగర్‌కు చెందిన తోట వెంకటేశ్‌తో 16 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. ఈ దంపతులకు ఒక కుమారుడు, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. వెంకటేశ్‌ ఆర్‌ఎంపీగా పని చేస్తున్నాడు. సోమవారం ఉదయం పనిమీద కమాన్‌పూర్‌ వెళ్లాడు. సాయంత్రం కుమారుడు స్కూల్‌ నుంచి ఇంటికి వచ్చి చూడగా స్వరూప చెవులకు ఇయర్‌ ఫోన్స్‌ పెట్టుకొని, మంచంపై అచేతనంగా పడి ఉంది. ఆమె చెవి, ముక్కులో నుంచి రక్తం వచ్చింది. చుట్టుపక్కల వారు వచ్చి, వెంకటేశ్‌కు ఫోన్లో సమాచారం అందించారు. స్వరూపను ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా వైద్యులు పరీక్షించి, మృతిచెందినట్లు నిర్ధారించారు. ఆమె మృతిపై అనుమానం ఉందని, మృతురాలి తల్లి కనకవ్వ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు వారు పేర్కొన్నారు.

ఎస్‌జీటీలకు ప్రాధాన్యం ఇవ్వాలి


వినోద్‌కుమార్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

కరీంనగర్‌: ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల స్థాయిలోనే చేయాలని, ఉత్తమ ఉపాధ్యాయుల ఎంపిక విధానంలో ఎస్‌జీటీలకు ప్రాధాన్యం ఇవ్వాలని ఎస్‌జీటీయూ నాయకులు కోరారు. ఈ మేరకు మంగళవారం రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్‌ను కలిసి, వినతిపత్రం అందజేశారు. సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కరివేద మహిపాల్‌రెడ్డి, అరికెల వెంకటేశం మాట్లాడుతూ.. ప్రతీ గ్రామ పంచాయతీ పరిధిలో ఒక ఆదర్శ పాఠశాల ఏర్పాటు చేసి, ప్రతీ తరగతికి ఒక గది, ఒక ఉపాధ్యాయుడు, ఒక ప్రధానోపాధ్యాయుడిని, పాఠశాలల పరిశుభ్రత కోసం సర్వీస్‌ పర్సన్లను నియమించాలన్నారు. టీచర్ల సర్దుబాటు, విద్యార్థుల సంఖ్య ఎక్కువగా ఉన్న పాఠశాలల్లో చేయాలని, సబ్జెక్టు కొరత ఉన్న స్కూళ్లలో తాత్కాలికంగా విద్యావలంటీర్లను నియమించాలని కోరారు. 10 వేల పీఎస్‌ హెచ్‌ఎం పోస్టుల మంజూరుకు ఉత్తర్వులు ఇచ్చి, పదోన్నతులు, బదిలీలు చేపట్టి, ఖాళీల్లో కొత్త నియామకాలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

రెండో ఏఎన్‌ఎంలను రెగ్యులరైజ్‌ చేయండి


మాట్లాడుతున్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

కరీంనగర్‌టౌన్‌: రెండో ఏఎన్‌ఎంలను రెగ్యులరైజ్‌ చేయకుండా వేధించడం సరికాదని పట్టభద్రుల ఎమ్మెల్సీ టి.జీవన్‌ రెడ్డి అన్నారు. కలెక్టరేట్‌ ఎదుట ఏఎన్‌ఎంల దీక్షా శిబిరాన్ని మంగళవారం సందర్శించి, వారికి సంఘీభావం తెలిపారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవం చేయించుకుంటే రూ.13 వేలు ఇస్తామని చెప్పి, ఇవ్వకుండా రూ.1,500 విలువ చేసే కేసీఆర్‌ కిట్టు ఇచ్చి, చేతులు దులుపుకుంటున్నారని విమర్శించారు. ఏఎన్‌ఎంలను రెగ్యులరైజ్‌ చేయకపోతే డిసెంబర్‌లో కాంగ్రెస్‌ ప్రభుత్వం రాబోతుందని మార్చిలోగా రెగ్యులరైజ్‌ చేస్తుందని పేర్కొన్నారు. కాంగ్రెస్‌ నగర శాఖ అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్‌ రెడ్డి, చొప్పదండి ఇన్‌చార్జి మేడిపల్లి సత్యం, నాయకులు పాల్గొన్నారు.

యూహెచ్‌సీ కాంట్రాక్ట్‌ ఏఎన్‌ఎంల నిరసన

కరీంనగర్‌: అర్బన్‌ హెల్త్‌ సెంటర్‌ కాంట్రాక్ట్‌ ఏఎన్‌ఎంలను రెగ్యులరైజ్‌ చేయాలని డిమాండ్‌ చేస్తూ తెలంగాణ యునైటెడ్‌ మెడికల్‌ ఎంప్లాయీస్‌–వర్కర్స్‌ యూనియన్‌(సీఐటీయూ) ఆధ్వర్యంలో ఏఎన్‌ఎంలు మంగళవారం కలెక్టరేట్‌ ఎదుట చెవిలో పూలు పెట్టుకొని, నిరసన తెలిపారు. సంఘం అధ్యక్షురాలు ముద్దం రమాదేవి, నాయకులు సంపూర్ణ, స్వరూప, సంతోష, స్రవంతి తదితరులున్నారు.

అక్క జీవితం నాశనం చేశారనే హత్య

- ఆర్టీసీ రిటైర్డ్‌ ఉద్యోగి మర్డర్‌ కేసులో ఇద్దరి అరెస్టు


వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ బారీ

ఖిలావరంగల్‌: రెండో పెళ్లి చేసుకొని, తన అక్క జీవితం నాశనం చేసిన బావ, అతని తండ్రిని హత్య చేయాలని నిర్ణయించుకున్నాడు.. సమయానికి బావ లేకపోవడం.. అతని తండ్రి ఉండటంతో హత్య చేసి, తన కక్ష తీర్చుకున్నాడు. ఈ నెల 23న వరంగల్‌ నగరంలోని కరీమాబాద్‌ ఎస్‌ఆర్‌ఆర్‌ తోటలో జరిగిన ఆర్టీసీ రిటైర్డ్‌ ఉద్యోగి నాముతాబాజీ రాంచందర్‌ (65) హత్య కేసు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. కేసు వివరాలను పోలీస్‌ కమిషనరేట్‌లో సెంట్రల్‌ జోన్‌ డీసీపీ బారీ మంగళవారం వెల్లడించారు. కొమురంభీం ఆసిఫాబాద్‌ జిల్లా సిర్పూర్‌ కాగజ్‌నగర్‌కు చెందిన సాటేపూర్‌ అనిల్‌ సోదరి అరుణకు 20 ఏళ్ల క్రితం వరంగల్‌ కరీమాబాద్‌లోని ఎస్‌ఆర్‌ఆర్‌ తోటకు చెందిన నాముతాబాజీ రాంచందర్‌ కుమారుడు త్రిలోక్‌ చందర్‌తో వివాహమైంది. కొంతకాలం తర్వాత అనారోగ్య కారణాలు చూపి, ఆమెను త్రిలోక్‌చందర్‌ వదిలేసి పోయాడు. ఈ విషయమై అతని తండ్రిని పిలిపించి, పంచాయితీ పెట్టి, త్రిలోక్‌ చందర్‌కు చెడు అలవాట్లు ఉన్నాయని విడాకుల పత్రం రాయించారు. ఆ సమయంలో ఒప్పుకున్న డబ్బుల్లో కొన్ని మాత్రమే ఇచ్చి మిగతావి ఇవ్వకుండా మోసం చేశారు. అప్పటినుంచి అరుణ తన తమ్ముడు అనిల్‌ వద్దే ఉంటోంది. ఆమె శుభకార్యాలకు వెళ్లకపోవడం.. ఇరుగుపొరుగు వారు సూటిపోటి మాటలతో చులకనగా చూస్తున్నారు. త్రిలోక్‌ చందర్‌ మాత్రం మొదట తిరిగిన అమ్మాయినే రెండో వివాహం చేసుకొని, సంతోషంగా ఉంటున్నాడు.

ఇద్దరినీ చంపాలని నిర్ణయించుకున్నాడు..

సోదరి అరుణ జీవితం నాశనం కావడానికి కారణమైన త్రిలోక్‌ చందర్‌, అతని తండ్రి రాంచందర్‌లను చంపాలని అనిల్‌ నిర్ణయించుకున్నాడు. ఈ క్రమంలో ఈ నెల 21న హనుమకొండలోని తన మేనమామ ఇంటికి చేరుకొని, స్నేహితుడైన కరీంనగర్‌ జిల్లా వీణవంక మండలం చల్లూరు గ్రామానికి చెందిన నారాయణదాస్‌ అరుణ్‌కుమార్‌ను కలిశాడు. ఇద్దరూ 22న త్రిలోక్‌ చందర్‌ ఇంటి వద్ద రెక్కీ నిర్వహించారు. 23న ఉదయం 8 గంటలకు బైక్‌పై కరీమాబాద్‌ ఏరియాకు చేరుకున్నారు. అక్కడ ఓ దుకాణంలో కత్తి కొనుగోలు చేసి, మెడికల్‌ షాపులో చేతి గ్లౌజ్‌లు తీసుకున్నారు. ఆ తర్వాత రాంచందర్‌ ఇంటి వద్దకు చేరుకొని, బైక్‌ స్టార్ట్‌ చేసి రెడీగా ఉండాలని అరుణ్‌కు చెప్పి, అనిల్‌ ఇంట్లోకి వెళ్లాడు. ఆ సమయంలో త్రిలోక్‌ ఇంట్లో లేకపోవడం, రాంచందర్‌ ఒక్కడే ఉండటంతో అతని గొంతు కోశాడు. అనంతరం బైక్‌పై సిర్పూర్‌ కాగజ్‌నగర్‌కు వెళ్లిపోయారు. పోలీసులు సీసీ ఫుటేజీల ఆధారంగా నిందితులను గుర్తించి, గాలింపు చర్యలు మొదలుపెట్టారు. విషయం తెలుసుకున్న అనిల్‌, అరుణ్‌కుమార్‌లు డబ్బులు తీసుకొని, హైదరాబాద్‌ వెళ్లిపోదామని మంగళవారం కాగజ్‌నగర్‌ నుంచి హనుమకొండలోని మేనమామ ఇంటికి చేరుకున్నారు. అక్కడే మాటువేసిన పోలీసులు వారిని పట్టుకున్నారు. కత్తి, రెండు గ్లౌజ్‌లు, బైక్‌, రెండు ఫోన్లు స్వాధీనం చేసుకొని, ఇద్దరినీ రిమాండ్‌కు తరలించామని డీసీపీ తెలిపారు. మిల్స్‌ కాలనీ ఇన్‌స్పెక్టర్‌ నరేష్‌కుమార్‌, టాస్క్‌ఫోర్స్‌ ఇన్‌స్పెక్టర్లు పి.దేవేందర్‌, రాంబాబు, ఏఏవో సల్మాన్‌పాషా, సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్యోగాలు ఇప్పిస్తామని మోసం..

- ముఠా అరెస్ట్‌
- వివరాలు వెల్లడించిన ఏసీపీ డేవిడ్‌రాజ్‌


వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ డేవిడ్‌ రాజ్‌

ధర్మసాగర్‌(హన్మకొండ): ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పి కోట్లాది రూపాయల వసూళ్లకు పాల్పడుతూ మోసం చేస్తున్న ఓ ముఠాను పోలీసులు అరెస్ట్‌ చేశారు. మంగళవారం ధర్మసాగర్‌ పీఎస్‌లో కాజీపేట ఏసీపీ డేవిడ్‌ రాజ్‌ వివరాలు వెల్లడించారు. కాజీపేట మండలం రాంపూర్‌కు చెందిన బాకడి సుష్మాకు కోర్టులో కాంట్రాక్ట్‌ పద్ధతిలో ఉద్యోగాలు ఇప్పిస్తామని ఓ గుర్తుతెలియని వ్యక్తి జూన్‌లో వాట్సాప్‌ మెసేజ్‌ చేశాడు. అది నమ్మిన సుష్మా.. అతడికి రెండు, మూడు దఫాలుగా సుమారు రూ.99వేల ఫోన్‌పే చేసింది. ఆ తర్వాత సదరు వ్యక్తి నుంచి ఎలాంటి స్పందన లేకపోవడంతో తాను మోసపోయానని గ్రహించి జూలై 14న ధర్మసాగర్‌ పోలీసులకు ఫిర్యాదు చేసింది. విచారణ చేపట్టిన పోలీసులు కరీంనగర్‌ జిల్లా సైదాపూర్‌ మండలం ఎలబోతారం గ్రామానికి చెందిన నూనె సంతోష్‌ను అదుపులోకి తీసుకుని విచారించారు. తనతోపాటు తన భార్య మమత, స్నేహితులు జమ్మికుంటకు చెందిన వడ్లూరి కిశోర్‌, హుజూరాబాద్‌కు చెందిన సమ్మెట సాయి, జూపాకు చెందిన సమ్మెట రాజేష్‌ ఉద్యోగాలు ఇప్పిస్తామని నిరుద్యోగుల నుంచి డబ్బులు వసూలు చేస్తామని సంతోష్‌ఒప్పుకున్నాడు. దీంతో వీరిని అరెస్ట్‌ చేసి కోర్టులో హాజరుపరిచినట్లు ఏసీపీ వెల్లడించారు. కాగా, ఇప్పటి వరకు ఈ ముఠా సుమారు రూ.1.87 కోట్లు వసూలు చేయగా వారి వద్ద నుంచి రూ.లక్ష రికవరీ చేసినట్లు ఏసీపీ వివరించారు. సమావేశంలో ధర్మసాగర్‌ సీఐ కె శ్రీధర్‌ రావు, ఎస్‌ఐలు బి.రాజు, పి.ఫిలిప్‌ రాజ్‌, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పట్టపగలే మహిళ దారుణ హత్య

- ముఖంపై పిడిగుద్దులు.. పుస్తెలతాడు చోరీ
- ఘటన స్థలాన్ని పరిశీలించిన డీఎస్పీ


మృతదేహాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ


జల (ఫైల్‌)

రాయికల్‌:(జగిత్యాల): రాయికల్‌ పట్టణంలోని నాగారంవాడలో మంగళవారం పట్టపగలే కోల జల (48) దారుణహత్యకు గురైంది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. జల భర్త సత్తయ్య, కొడుకు శేఖర్‌ ఉపాధి నిమిత్తం గల్ఫ్‌ దేశాలకు వెళ్లారు. కూతురు రమ్యను ఇదే గ్రామానికి చెందిన వ్యక్తికి ఇచ్చి వివాహం చేశారు. జల తన ఇంట్లో ఒక్కతే నివసిస్తోంది. శ్రావణమాసం సందర్భంగా మంగళవారం ఉదయం పట్టణంలోని చెన్నకేశవనాథ ఆలయానికి వెళ్లి పూజలు చేసింది. మధ్యాహ్నం సుమారు 2 గంటల సమయంలో భోజనం చేసి నిద్రిస్తుంది. ఇదే అదునుగా భావించిన గుర్తుతెలియని వ్యక్తులు ఇంట్లోకి ప్రవేశించి జల పుస్తెలతాడును దోచుకెళ్లే క్రమంలో ఆమె ముఖంపై పిడిగుద్దులు గుద్దడంతో అక్కడికక్కడే మృతిచెందింది. రోజూ సాయంత్రం పూట ఆరుబయటకు వచ్చే జల రాకపోవడంతో గమనించిన స్థానికులు ఇంట్లోకి వెళ్లి చూడగా మంచంపై రక్తం మరకలతో బోర్లాపడి ఉంది. స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. డీఎస్పీ వెంకటస్వామి, రూరల్‌ సీఐ ఆరీఫ్‌ఖాన్‌ ఘటన స్థలానికి చేరుకున్నారు. డాగ్‌స్క్వాడ్‌, క్లూస్‌టీంలతో ఆధారాలు సేకరించారు. అనంతరం డీఎస్పీ విలేకరులతో మాట్లాడుతూ.. కోల జలను దుండగులు హత్య చేసి పుస్తెలతాడును దోచుకెళ్లినట్లు తెలిపారు. మృతురాలి కూతురు రమ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై దేవేందర్‌ నాయక్‌ తెలిపారు. ఏదేమైనా రాయికల్‌ పట్టణంలో పట్టపగలే మహిళ హత్యకు గురికావడంతో ప్రజలు ఒక్కసారిగా భయాందోళనకు గురయ్యారు.


కోర్టు చౌరస్తా ప్రాంతంలో..


ఎన్జీవోస్ కాలనీలో..

నగరంలో కుక్కల బెడద

నగరంలో కుక్కల బెడద ఎక్కువవుతోంది. కోర్టు చౌరస్తా ప్రాంతం, ఎన్జీవోస్ కాలనీలో రహదారిపై స్వైర విహారం చేస్తున్నాయి. పాదచారులు, వాహనదారులు కుక్కల గుంపును చూసి బెంబేలెత్తిపోతున్నారు. ముఖ్యంగా విద్యార్థులు, వృద్ధులు ఇక్కట్లు పడుతున్నారు. అధికారులు మాత్రం ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. చేతిలో కర్ర లేనిదే బయటకు వెళ్లే పరిస్థితి లేదని, వెంటపడుతున్నాయని వాపోతున్నారు. – కరీంనగర్ అర్బన్/సాక్షి ఫొటోగ్రాఫర్, కరీంనగర్




ప్రమాదకరంగా రహదారి

కరీంనగర్ మండలం తాహెర్‌కొండాపూర్ రహదారి గుంతలతో ప్రమాదకరంగా మారింది. చెర్లభూత్కూర్ నుంచి తాహెర్‌కొండాపూర్ గ్రామానికి చెరువుకట్ట మీదుగా బీటీ రోడ్డు నిర్మించారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు రోడ్డుపై పలు చోట్ల గుంతలేర్పడ్డాయి. కొన్ని ప్రాంతాల్లో రోడ్డు కుంగిపోయింది. మూలమలుపుల వద్ద గుంతలతో కంకర తేలి ప్రమాదకరంగా మారింది. కట్టమీద నుంచి వెళ్లేప్పుడు గుంతల్లో పడి చెరువులో పడిపోయే ప్రమాదముందని ద్విచక్రవాహనదారులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డు మరమ్మతు చేయించాలని వాహనదారులు కోరుతున్నారు. – కరీంనగర్‌రూరల్

క్లుప్తంగా

పోషకాహార కిట్లు పంపిణీ



కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలం బొమ్మకల్‌లోని చల్మెడ ఆనందరావు కేన్సర్ ఆస్పత్రిలో మంగళవారం రోగులకు పోషకాహార కిట్లను పంపిణీ చేశారు. కేన్సర్ చికిత్సకు అయ్యే ఖర్చుతో పాటు పోషకాహారం లేని పేద రోగులకు ఎంతో ఉపయోగపడుతుందని ఆస్పత్రి హెచ్‌వోడీ డాక్టర్ ఎళిలరాసి తెలిపారు. కార్యక్రమంలో చల్మెడ ఆస్పత్రి డైరెక్టర్ సూర్యనారాయణరెడ్డి, ప్రిన్సిపాల్ ఆసీమ్ అలీ, ఇండియన్ క్యాన్సర్ సొసైటీ ప్రతినిధులు డాక్టర్ గురుసుహాస్, సంపత్‌కుమార్, సతీశ్ పాల్గొన్నారు.

నేడు ఉచిత వైద్యశిబిరం

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలం చెర్లభూత్కూర్‌లో మహాదేవ సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి మామిడాల సుమంత్ తెలిపారు. కిడ్నీ, గుండె, లివర్, షుగర్, బీపీ తదితర వ్యాధులన్నింటికీ వైద్య పరీక్షలు చేస్తారని వివరించారు. గ్రామపంచాయతీలో నిర్వహించే ఉచిత వైద్యశిబిరాన్ని గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నియామకం

కరీంనగర్‌టౌన్: రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపించడమే లక్ష్యంగా పార్టీ యువజన కాంగ్రెస్ జాతీయ నాయకత్వం మంగళవారం యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పడాల రాహుల్‌ను నియోజకవర్గ వ్యవహారాల ఇన్‌చార్జిగా, కోఇన్‌చార్జిగా రాష్ట్ర కార్యదర్శి పులి కృష్ణను నియమించింది. కాగా తమ నియామకానికి కృషి చేసిన రాష్ట్ర, జిల్లా కాంగ్రెస్ నాయకులకు రాహుల్, కృష్ణలు కృతజ్ఞతలు తెలిపారు.

అన్నదానం



విద్యానగర్(కరీంనగర్): నగరంలోని వీరబ్రహ్మేంద్ర అనాథ వృద్ధుల ఆశ్రమంలోని వృద్ధులకు మంగళవారం సప్తగిరి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో అన్నదానం చేసి పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు గడప కోటేష్‌కుమార్, సభ్యులు శ్రీరామోజు సత్యనారాయణ, నాగార్జున, కనపర్తి రమేశ్, కడారి అయిలన్న, కట్ట రామబ్రహ్మచారి, అరుణ, అపూర్వసాయి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ చౌర్యం కేసులో ఒకరికి జరిమానా

కొత్తపల్లి: పెద్దపల్లి జిల్లా కాల్వశ్రీరాంపూర్ మండలంలోని మల్యాల గ్రామానికి చెందిన బొల్లి రాజయ్యకు విద్యుత్ చౌర్యం కేసులో జడ్జి డి.హేమంత్‌కుమార్ జరిమానా విధించినట్లు ఉమ్మడి కరీంనగర్ జిల్లా విద్యుత్ విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ కె.స్వామి తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. రాజయ్య తన ఇంటికి విద్యుత్‌ను అక్రమంగా వినియోగిస్తూ అధికారులకు పట్టుబడ్డాడు. మొదటి తప్పుగా పరిగణించి, రూ.1,000 జరిమానా విధించి, వదిలేశారు. అతను రెండోసారి కూడా విద్యుత్‌ను అక్రమంగా వినియోగిస్తుండగా పట్టుకొని, కేసు నమోదు చేశారు. మంగళవారం పెద్దపల్లి జిల్లా కోర్టులో ప్రవేశపెట్టగా కేసు పూర్వాపరాలను జిల్లా జడ్జి హేమంత్‌కుమార్ పరిశీలించారు. రాజయ్య తాను విద్యుత్ చౌర్యానికి పాల్పడినట్లు ఒప్పుకోవడంతో రూ.7,931 జరిమానా చెల్లించాలని లేదంటే మూడు నెలల సాధారణ జైలుశిక్ష అనుభవించాలని తీర్పు వెల్లడించారు. ఎస్సై టి.నరేశ్, విజిలెన్స్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎంపీ అసదుద్దీన్ ఓవైసీని దూషించిన వ్యక్తిపై కేసు

కరీంనగర్ క్రైం: ఎంఐఎం ఎంపీ అసదుద్దీన్ ఓవైసీపై అనుచిత వ్యాఖ్యలు చేస్తూ సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేసిన కాంగ్రెస్ నాయకుడు నేరెళ్ల ఆంజనేయులుగౌడ్‌పై ఎంఐఎం కరీంనగర్ టౌన్ ప్రెసిడెంట్ సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్ ఒకటో టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈమేరకు ఆంజనేయులుగౌడ్‌పై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.


మానేరులో కబడ్డీ ఆడుతున్న విద్యాసంస్థల అధినేత అనంతరెడ్డి


మహిళా కళాశాలలో కబడ్డీ క్రీడాకారిణిని సత్కరిస్తున్న ప్రిన్సిపాల్

ఘనంగా జాతీయ క్రీడా దినోత్సవం

- క్రీడల్లో ఉత్సాహంగా పాల్గొన్న విద్యార్థులు

కరీంనగర్‌స్పోర్ట్స్: హాకీ మాంత్రికుడు మేజర్ ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకొని జాతీయ క్రీడా దినోత్సవాన్ని మంగళవారం నగరంలోని పలు విద్యాసంస్థల్లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. దేశంలోని క్రీడాకారులందరికీ ధ్యాన్‌చంద్ ఒక స్ఫూర్తి అని కొనియాడారు. ప్రతిఒక్కరు ఆయనను ఆదర్శంగా తీసుకొని దేశానికి పతకాలు తెచ్చే క్రీడాకారులుగా తయారు కావాలని అన్నారు. జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా ప్రతిఒక్కరూ ఏదైన ఒక క్రీడలో పాల్గొనాలని సూచించారు. పలు విద్యాసంస్థల్లో విద్యార్థులకు క్రీడా పోటీలను నిర్వహించారు. పీఈటీలను, విద్యార్థులను సత్కరించారు.

కోరా జాన్సన్ పాఠశాలలో..

కరీంనగర్: నగరంలోని కోరా జాన్సన్ పాఠశాలలో పాఠశాల చైర్మన్ మహిపాల్‌రెడ్డి, డైరెక్టర్లు వరప్రసాద్, రాంరెడ్డి, సింహాచలం, హరికృష్ణ, వంగళ సంతోష్‌రెడ్డిలు ఒలింపిక్ ల్యాంప్ను వెలిగించారు.


సిద్ధార్థలో విద్యార్థుల ప్రదర్శన

పీఈటీ దుర్గరాజు ఆధ్వర్యంలో పరేడ్ నిర్వహించి హ్యాండ్‌బాల్, కబడ్డీ, ఖోఖో పోటీలు నిర్వహించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సాంఘిక సంక్షేమ మహిళా గురుకుల డిగ్రీ కళాశాలలో..

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలం నగునూరు సాంఘిక సంక్షేమ మహిళా గురుకుల డిగ్రీ కళాశాలలో ధ్యాన్‌చంద్ చిత్రపటానికి ప్రిన్సిపాల్ శ్రీహరితో పాటు పలువురు అధ్యాపకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థులకు పరుగుపందెం, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బాస్కెట్‌బాల్, లాంగ్‌జంప్, షాట్‌పుట్, టేబుల్ టెన్నిస్ తదితర ఆటలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ సమత, ఏసీవో సుష్మ, స్టాఫ్ సెక్రటరీ రోజా రమణి, పీడీ రమాదేవి, ఎన్ఎస్ఎస్ పీవో లావణ్య, లైబ్రేరియన్ మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.


కోరా జాన్సన్ పాఠశాలలో..


సాంఘిక సంక్షేమ మహిళా గురుకుల డిగ్రీ కళాశాలలో ధ్యాన్‌చంద్ చిత్రపటానికి నివాళి

కిమ్స్‌లో 'ఓనమ్'



కిమ్స్ హోటల్ మేనేజ్‌మెంట్ కళాశాలలో మంగళవారం ఓనమ్ పండుగ ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. కిమ్స్ విద్యాసంస్థల వైస్ చైర్మన్ సాకేత్ రామారావు జ్యోతిప్రజ్వలన చేసి ఉత్సవాలను ప్రారంభించి మాట్లాడుతూ ఓనమ్ పండుగ అనేది కేరళలో అతిపెద్ద అత్యంత ప్రజాదరణ పొందిన పండుగ అన్నారు. ప్రత్యేక వంటకాలను హోటల్ మేనేజ్‌మెంట్ విద్యార్థులు చేసి అందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ అనూష్‌రెడ్డి, అధ్యాపకులు హరీశ్, యశ్వంత్, మనోజ్, సృజన, స్రవంతి, విద్యార్థులు పాల్గొన్నారు. – కరీంనగర్‌సిటీ

'వసంత్‌వ్యాలీ'లో రక్షాబంధన్



నగరంలోని హనుమాన్‌నగర్‌లో గల వసంత్‌వ్యాలీ పాఠశాలలో మంగళవారం రక్షాబంధన్ వేడుకలు నిర్వహించారు. పాఠశాల కరస్పాండెంట్ స్వరూప బుచ్చిరెడ్డి మాట్లాడుతూ ప్రతిఒక్కరూ ఐక్యతతో సంతోషంగా ఉండాలని 'నీవు నాకు రక్ష నేను నీకు రక్ష మనందరం దేశానికి రక్షా' అని అన్నారు. ఆర్ఎస్ఎస్ సభ్యులు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. – కరీంనగర్

మెరుగ్గా వీధి దీపాల నిర్వహణ

- మేయర్ సునీల్‌రావు


హైమాస్ట్ లైట్లు ప్రారంభిస్తున్న మేయర్

కరీంనగర్‌కార్పొరేషన్: నగరపాలక సంస్థ పరిధిలోని వీధిదీపాలు నిర్వహణ మెరుగ్గా ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని మేయర్ సునీల్‌రావు తెలిపారు. నగరంలోని 19వ డివిజన్ విజయ్‌పురి, షేకాబీ కాలనీల్లో ఏర్పాటు చేసిన హైమాస్ట్‌లైట్లను మంగళవారం ప్రారంభించారు. గతంతో పోల్చితే వీధిదీపాల నిర్వహణను మెరుగు పరిచామన్నారు. విలీన గ్రామాల డివిజన్‌లలోనూ హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. నగరవాసులు రాత్రివేళల్లో ఇబ్బంది పడకుండా ఉండేందుకు అన్ని వీధుల్లో ఏర్పాటు చేస్తున్న వీధిదీపాల వెలుగులు నగరానికి వన్నె తీసుకువచ్చాయని అన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు ఏదుల్ల రాజశేఖర, సుధగోని మాధవి కృష్ణగౌడ్, ఆయా కాలనీవాసులు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు మంజూరు చేయాలి


నాగరాజుకు వినతిపత్రం సమర్పిస్తున్న పీఆర్‌టీయూ నాయకులు

కరీంనగర్: పెండింగ్‌లో ఉన్న మెడికల్ బిల్లులు, ఈఎల్ సరెండర్, సప్లిమెంటరీ బిల్లులు సత్వరమే మంజూరు చేయాలని కోరుతూ పీఆర్‌టీయూ తెలంగాణ జిల్లా శాఖ ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా ట్రెజరీ అధికారి నాగరాజుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గోనె శ్రీనివాస్, పల్లెపాటి వేణుగోపాల్‌రావులు మాట్లాడుతూ దీర్ఘకాలంగా అన్ని రకాల బిల్లులు పెండింగ్‌లో ఉండటం వల్ల ఉద్యోగ, ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని, సత్వరమే బిల్లులన్నింటినీ మంజూరు అయ్యే విధంగా తగు చర్యలు తీసుకోవాలని కోరినట్లు తెలిపారు.

టీచర్ల సమస్యలు పరిష్కరించాలి


పాఠశాల విద్యాశాఖ సంచాలకులు దేవసేనకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

కరీంనగర్: ప్రాథమిక పాఠశాలల్లో ఎస్‌జీటీ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని ఎస్‌జీటీయూ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కరివేద మహిపాల్ రెడ్డి, అరికల వెంకటేశం కోరారు. ఈ మేరకు మంగళవారం పాఠశాల విద్యాశాఖ సంచాలకురాలు దేవసేనకు వినతిపత్రం అందజేశారు. ప్రాథమిక పాఠశాలల్లో సర్వీస్ పర్సన్స్ గురించి అడగగా నెల రోజుల్లోపు నియమిస్తామని చెప్పారన్నారు. పదోన్నతులు, బదిలీల షెడ్యూల్ విడుదల చేయాలని, ఈ ఏడాదిలోనే పీఎస్‌హెచ్‌ఎం పోస్టులను మంజూరు చేయాలని కోరారు. జిల్లా స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయుల ఎంపిక విషయంలో ఎస్‌జీటీలకు ప్రాధాన్యం ఇవ్వాలని విన్నవించారు.

ఆమె నేత్రాలు సజీవం


విజయ (ఫైల్)

కరీంనగర్‌టౌన్: కరీంనగర్‌లోని కాపువాడకు చెందిన కరబత్తుల విజయ(72) మంగళవారం గుండెపోటుతో మృతిచెందింది. ఆమె నేత్రాల దానం చేయాలని కుమారుడు సంపత్, కుమార్తె రొప్పుల షీలా నిర్ణయించుకున్నారు. రేకుర్తి కంటి ఆస్పత్రి నిర్వహణ కమిటీ సభ్యుడు, ఇంజినీర్ కోల అన్నారెడ్డికి సమాచారం ఇచ్చారు. ఆయన హైదరాబాద్ ఎల్వీ ప్రసాద్ కంటి ఆస్పత్రి సిబ్బందిచే విజయ నేత్రాలను సేకరించి, అదే ఆస్పత్రికి పంపించారు. రాష్ట్ర హైకోర్టు జడ్జి ఈవీ వేణుగోపాల్, బొమ్మ రాధాకృష్ణ, వొంటెల రత్నాకర్, అనురాసు కుమార్, బొమ్మరాతి రాజేశం, ముప్పిడి శ్రీనివాస్ బాబు, గాజుల సతీశ్‌కుమార్ తదితరులున్నారు.

పోస్టర్ ఆవిష్కరణ


టీఎంజేఎఫ్ ప్లీనరీ పోస్టర్ ఆవిష్కరిస్తున్న మంత్రి

కొత్తపల్లి: సికింద్రాబాద్‌లో సెప్టెంబర్ 6న నిర్వహించనున్న తెలంగాణ మున్నూరుకాపు జర్నలిస్టు ఫోరం ద్వితీయ ప్లీనరీ పోస్టర్‌ను మంగళవారం కరీంనగర్‌లోని మీసేవ కార్యాలయంలో రాష్ట్ర బీసీ సంక్షేమ, పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో మేయర్ సునీల్‌రావు, టీఎంకేజేఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్రీనివాస్, సూదుల వెంకటరమణ, ఉపాధ్యక్షులు దులూరి జగన్‌మోహన్, సుమ, బండి రఘు, కోశాధికారి తోటరమణ, కార్యవర్గ సభ్యులు సుగుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

'హామీలు అమలు చేయాలి'


ర్యాలీ నిర్వహిస్తున్న టీడీపీ నాయకులు

విద్యానగర్: గత ఎన్నికల్లో బీఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం కరీంనగర్‌లో టీడీపీ నాయకులు ర్యాలీ నిర్వహించి కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షుడు వంచ శ్రీనివాసరెడ్డి, అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి గంగాధర కనకయ్య, పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి కల్యాణపు ఆగయ్య, నాయకులు ఎర్రబెల్లి రవీందర్, తోట మనోహర్, సాయిల రాజమల్లయ్య, ఎర్రవెల్లి వినీత్, మిట్టపల్లి శ్రీనివాస్, ఎలిమిళ్ల కిషన్, బసాలత్ ఖాన్, తాటికొండ శేఖర్, సందబోయిన రాజేశం, రొడ్డ శ్రీనివాస్, రొడ్డ శ్రీధర్, హయగ్రీవ చారి, గంగాధర శోభ, అనవేని రజిత పాల్గొన్నారు.

తెలుగు పుస్తక ప్రదర్శన



కరీంనగర్ మండలం నగునూరు జిల్లా పరిషత్ పాఠశాలలో మంగళవారం గిడుగు రామ్మూర్తి జయంతిని పురస్కరించుకుని తెలుగు భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. తెలుగు ఉపాధ్యాయులు అనసూయ, గోపాలచారీలు పుస్తక ప్రదర్శన ఏర్పాటు చేశారు. అనంతరం విద్యార్థులకు భాషా క్రీడలు, అచ్చ తెలుగు, తెలుగుక్విజ్, ఉపన్యాస, వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయురాలు అనసూయతో పాటు పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు. – కరీంనగర్‌రూరల్

ఆశవర్కర్ల డిమాండ్లు నెరవేర్చాలి


మంత్రి గంగులకు వినతిపత్రం ఇస్తున్న సత్యం, ఆశవర్కర్లు

కరీంనగర్: ఆశవర్కర్లకు నెలవారీగా ఫిక్స్‌డ్ వేతనం రూ.18 వేలు ఇవ్వాలని, వారి న్యాయమైన డిమాండ్లు నెరవేర్చాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గుడికందుల సత్యం డిమాండ్ చేశారు. సంఘం ఆధ్వర్యంలో ఆశ వర్కర్లు మంగళవారం రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి గంగుల కమలాకర్‌ను కలిసి, వినతిపత్రం అందజేశారు. సత్యం మాట్లాడుతూ.. కరోనా కష్టకాలంలో పనిచేసిన ఆశవర్కర్లకు పారితోషికం బకాయిలు 16 నెలలుగా పెండింగ్‌లో ఉన్నాయని, వెంటనే విడుదల చేయాలని కోరారు. వారికి శ్రమకు తగ్గ వేతనం ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారని తెలిపారు. గ్రామ పంచాయతీల్లో, పీహెచ్‌సీలలో, జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు పనిభారం మోపుతూ వేధిస్తున్నారని ఆరోపించారు. వారి డిమాండ్లను సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లి, పరిష్కరిస్తానని మంత్రి హామీ ఇచ్చారు. గృహలక్ష్మి పథకానికి ఆశవర్కర్లు అర్హులేనని, వెంటనే దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు రంగనవేని శారద, రూరల్ పీహెచ్‌సీ కార్యదర్శి భీమారపు శోభ, ఆశవర్కర్లు అనిత, శ్రీలత, తులసి, పి.సరోజ, మల్లిక, సత్యలక్ష్మి, రాజేశ్వరి, రాజమణి, పద్మ, రమ తదితరులు పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించండి


మాట్లాడుతున్న జోజిరెడ్డి

కరీంనగర్: విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడొద్దని, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు వెంటనే చెల్లించాలని ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అంబటి జోజిరెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం కరీంనగర్‌లోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఇంజినీరింగ్ ఫైనల్ ఇయర్ విద్యార్థులకు ప్రభుత్వం ట్యూషన్ ఫీజు చెల్లించని కారణంగా కళాశాలల నిర్వాహకులు వారికి సర్టిఫికెట్లు ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం భూములమ్మి, మద్యం టెండర్లు నిర్వహించి, డబ్బులను పోగు చేస్తుందే తప్ప అవసరాలకు ఖర్చు చేయడం లేదని విమర్శించారు. నాయకులు ముత్యాల విజయ్‌కుమార్, కురవెల్లి శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

నాణేనికి అటు.. ఢిల్లీలో డ్రామా!

ఎంపిక చేసుకున్న విలేకరుల సమావేశంలో బీజేపీపై చంద్రబాబు ప్రేమ బాణాలు

- తాను మొదటి నుంచీ కేంద్రంలో పొత్తులోనే ఉన్నాడట..
- హోదా కోసమే ఎన్డీఏ నుంచి బయటకు వచ్చానంటూ మరోసారి నాలుక మడత
- హోదా ఏమైనా సంజీవనా?.. ప్యాకేజీ అంతకంటే మెరుగైనదంటూ అర్ధరాత్రి ప్రెస్‌మీట్ పెట్టి మరీ చెప్పిన విషయం ప్రజలకు గుర్తుండదనే ధీమా
- పోలవరం కాంట్రాక్టుల కోసం హోదాను తాకట్టు పెట్టిన ఘనత బాబుదే
- రామోజీ వియ్యంకుడు, యనమల వియ్యంకుడిని కాంట్రాక్టర్లుగా ప్రవేశపెట్టి డబ్బు దండుకున్న విషయం ఎవరూ మరువలేరు
- రాజధాని పేరుతో బాబు భారీ స్కామ్‌కు తెరతీయడంతో తీవ్ర ప్రజా వ్యతిరేకత
- దాన్ని కేంద్రంపైకి మళ్లించడం కోసం చివరి ఏడాది ఎన్డీఏ నుంచి బయటకు టీడీపీ
- 2019 ఎన్నికల్లో బెడిసికొట్టిన అంచనాలు.. బీజేపీలోకి కోవర్టులను ప్రవేశపెట్టిన బాబు
- తన పార్ట్‌నర్ పవన్‌ను కాషాయం ఫ్రంట్‌లో చేర్చి ఢిల్లీ కరుణ కోసం వేడుకోలు
- ఆ ప్రయత్నాలకు తోడు కొత్తగా పురందేశ్వరి కుటుంబంతో కుదిరిన రాజీని బీజేపీతో పొత్తు కోసం వాడుకుంటున్న చంద్రబాబు

సాక్షి, అమరావతి: పార్టీ భవిష్యత్‌పై ఆశలు ఆవిరవడంతో తీవ్ర నిరాశ, నిస్పృహలో కూరుకుపోయిన టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు తాజాగా బీజేపీతో పొత్తు కోసం ఢిల్లీలో పెద్ద డ్రామానే నడిపారు! ఎన్టీఆర్ స్మారక నాణెం విడుదల కార్యక్రమాన్ని ఇందుకు వినియోగించుకున్నారు. ఆ కార్యక్రమం ముగిసిన తరువాత రెండో రోజు ఢిల్లీలో ఎంపిక చేసుకున్న విలేకరుల సమక్షంలో బీజేపీపై చంద్రబాబు ప్రేమ బాణాలు విసరడం చర్చనీయాంశమైంది. తాను మొదటి నుంచి కేంద్రంలో పొత్తులోనే ఉన్నానంటూ బీజేపీ పెద్దలను ప్రసన్నం చేసుకునేందుకు ఆయన ప్రయత్నించారు. ప్రత్యేక హోదా కోసమే గతంలో తాను ఎన్డీయే నుంచి బయటకు వచ్చానంటూ తాజాగా చంద్రబాబు మరోసారి నాలుక మడతేశారు. 'హోదా ఏమైనా సంజీవనా..? ప్యాకేజీ అంతకంటే మెరుగైనదంటూ అధికారంలో ఉండగా అర్ధరాత్రి తాను ప్రెస్‌మీట్ పెట్టి మరీ చెప్పిన విషయం ప్రజలకు గుర్తుండదనే భ్రమతో తనకు అలవాటైన రీతిలో చంద్రబాబు అలవోకగా అబద్ధాలు చెప్పేశారు. పోలవరం ప్రాజెక్టు కాంట్రాక్టుల కోసం ప్రత్యేక హోదాను చంద్రబాబు తాకట్టు పెట్టిన విషయం జనం మది నుంచి చెదిరిపోలేదు. రామోజీరావు, యనమల రామకృష్ణుడు వియ్యంకులను కాంట్రాక్టర్లుగా ప్రవేశపెట్టి ప్రాజెక్టు సొమ్ముని ఏటీఎంలా వాడుకుని డబ్బులు దండుకున్న విషయాన్ని ప్రజలెవరూ ఎప్పటికీ మరువలేరు! ఇవన్నీ ఎవరికీ గుర్తుండవనే ఉద్దేశంతో బీజేపీతో పొత్తు కోసం పాకులాడుతూ చంద్రబాబు నిస్సిగ్గుగా అబద్ధాలాడారు!

ప్రజా వ్యతిరేకత నుంచి బయటపడేందుకు ఎన్డీఏ నుంచి బయటకు

చంద్రబాబు అధికారంలో ఉండగా రాజధాని అమరావతి పేరుతో భారీ అంతర్జాతీయ స్కామ్‌కు తెరతీయడంతో ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. రాజధాని ముసుగులో ఆయన చేసిన అక్రమాలు బయటపడడంతో ప్రజల్లో తీవ్ర ఆగ్రహం వెల్లి విరిసింది. దీన్ని కేంద్ర ప్రభుత్వంపై మళ్లించడం కోసం తన పాలన చివరి సంవత్సరంలో చంద్రబాబు ఎన్డీఏ నుంచి బయటకు వచ్చారు.



కానీ తానొకటి తలిస్తే దైవమొకటి తలచినట్లుగా ఎన్నికల్లో ఆయన అంచనాలు బెడిసికొట్టి చిత్తుచిత్తుగా ఓడిపోయారు. వైఎస్సార్ సీపీ ఘన విజయం సాధించి అధికారంలోకి వచ్చింది. దీంతో చంద్రబాబు వెంటనే బీజేపీలోకి తన కోవర్టులను ప్రవేశపెట్టారు. తన మిత్రుడైన పవన్ కల్యాణ్‌ను సైతం కాషాయ ఫ్రంట్‌లో చేర్చారు. ఘోర ఓటమి తర్వాత మళ్లీ ఎలాగైనా బీజేపీ పంచన చేరడానికి చంద్రబాబు చేయని ప్రయత్నం లేదు. ఆ ప్రయత్నాలకు తోడు తాజాగా పురందేశ్వరితో రాజీ చేసుకుని బీజేపీతో పొత్తు అవసరాలకు వాడుకున్నారు. ఇటీవలే బీజేపీ అధ్యక్షురాలైన పురందేశ్వరి కుటుంబంతో చంద్రబాబుకు రాజీ కుదిరింది. బీజేపీలో ఉంటూ చంద్రబాబుకు సహకరించేందుకు పురందేశ్వరి అంగీకరించారు. అందులో భాగంగానే ఎన్టీఆర్ స్మారక నాణెం విడుదల కార్యక్రమం సందర్భంగా బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డాకు బాబును దగ్గర చేసేందుకు ఆమె తాపత్రయపడ్డారు.

నాణెం విడుదల కార్యక్రమానికి సతీమణిని పిలవరా?

పురందేశ్వరి చంద్రబాబు ఏజెంటులా పనిచేస్తున్నారని ఎన్టీఆర్ సతీమణి లక్ష్మీపార్వతి ఆరోపించిన విషయం తెలిసిందే. ఎన్టీఆర్ నాణెం విడుదల కార్యక్రమాన్ని ఆయన సతీమణిని పిలవకుండా నిర్వహించడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఎన్టీఆర్‌ను చివరి దశలో వంచించి వేధించిన కుటుంబ సభ్యులంతా ఇప్పుడు మరోసారి ఆయన భార్యను అవమానించారు.

ఆ వంకతో నడ్డాతో చంద్రబాబు భేటీ

ఇక ఎన్టీఆర్ నాణెం విడుదల కార్యక్రమం వంకతో బీజేపీ జాతీయ అధ్యక్షుడు నడ్డాతో చంద్రబాబు వంగి వంగి మంతనాలాడారు. ఈ భేటీలో టీడీపీ కోవర్టులు తప్ప మిగిలిన పాత బీజేపీ నేతలు ఎవరూ లేకపోవడం కొసమెరుపు. అక్కడ చంద్రబాబు తన పొత్తు ప్రతిపాదనలను నడ్డా ఎదుట పెట్టి ఎలాగైనా పొత్తు కుదిరేలా చూడాలని కోరారు. నడ్డా నుంచి ఆశించిన స్పందన వచ్చిందో లేదో తెలియదు గానీ రెండో రోజు చంద్రబాబు ఎంపిక చేసిన విలేకరుల కోసం లంచ్ మీటింగ్ ఏర్పాటు చేశారు. అక్కడ మోదీ సర్కార్‌పై తన ప్రేమను చాటుకున్నారు. కేంద్రంలో ఏ ప్రభుత్వం ఉన్నా మంచి సంబంధాలు అవసరమని తాజాగా చంద్రబాబు ప్రవచించారు. చంద్రబాబు తాను సీఎంగా ఉండగా ప్రధాని మోదీ రాష్ట్రానికి వచ్చినప్పుడు నల్లజెండాలు ఎగరేయడం, నిరసన తెలియచేస్తూ హోర్డింగ్‌లు పెట్టడం, బీజేపీ అగ్రనేత అమిత్‌షా కారు మీద తిరుపతిలో రాళ్లతో దాడి చేయించిన విషయాలను కప్పిపుచ్చేందుకు ప్రయత్నించటాన్ని నెటిజన్స్ సోషల్ మీడియాలో తెగ వైరల్ చేస్తున్నారు. బీజేపీతో పొత్తు కోసం శతవిధాలుగా ప్రయత్నాలు చేస్తున్న చంద్రబాబు మరోసారి ఎన్టీఆర్ పేరును ఉపయోగించుకున్నారు. ఎన్టీఆర్ స్మారక నాణెం కార్యక్రమాన్ని తన పొత్తు చర్చల కోసం వినియోగించుకుని మరోసారి ఆయనకు వెన్నుపోటు పొడిచారు.

వేలమంది సమక్షంలో లక్ష్మీ పార్వతిని తన భార్యగా ఎన్టీఆర్ బహిరంగంగానే ప్రకటించిన విషయం రాష్ట్ర ప్రజలందరికీ తెలిసిందే. ఆమెను కార్యక్రమానికి రానివ్వకుండా గూడుపుఠాణి చేసి కేవలం చంద్రబాబుకు సన్నిహితులైన కుటుంబ సభ్యులు మాత్రమే ఆ కార్యక్రమానికి హాజరయ్యేలా చేశారు. ఇందులోయ ఎలాంటి గూడుపుఠాణి లేకపోతే లక్ష్మీపార్వతిని పిలవవచ్చు కదా? అనే ప్రశ్నకు సమాధానం లేదు.



తిరుమల పవిత్రోత్సవాలు పరిపూర్ణం

తిరుమల: తిరుమల శ్రీవారి ఆలయంలో మూడు రోజులపాటు నిర్వహించిన పవిత్రోత్సవాలు మంగళవారం పూర్ణాహుతితో ముగిశాయి. ఉదయం యాగశాలలో రుత్వికులు హోమాలు నిర్వహించారు. శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ మలయప్పస్వామివారి ఉత్సవమూర్తులకు స్నపన తిరుమంజనం జరిపారు. పాలు, పెరుగు, తేనె, కొబ్బరి నీరు, పసుపుతో అభిషేకించి చివరగా చందనం పూత పూశారు. ధూపదీప హారతులు నివేదించారు. సాయంత్రం శ్రీదేవి, భూదేవి సమేత మలయప్పస్వామివారు ఆలయ నాలుగు మాడ వీధుల్లో విహరిస్తూ భక్తులను కటాక్షించారు. యాగశాలలో పూర్ణాహుతి నిర్వహించారు. ఆ తర్వాత శ్రీ మలయప్పస్వామి వారు శ్రీదేవి, భూదేవితో కలిసి విమాన ప్రదక్షిణంగా వెళ్లి ఆలయ ప్రవేశం చేయడంతో పవిత్రోత్సవాలు ముగిశాయి. ఈ కార్యక్రమంలో పెద్దజీయర్ స్వామి, చిన్నజీయర్ స్వామి, ఈవో ఏవీ ధర్మారెడ్డి దంపతులు, ఆలయ డిప్యూటీ ఈవో లోకనాథం పాల్గొన్నారు.

నవ ప్రపంచాన్ని నిర్మించే శక్తి యువత సొంతం

ఏఎన్‌యూ స్నాతకోత్సవంలో ఏపీ గవర్నర్ జస్టిస్ ఎస్.అబ్దుల్ నజీర్

ఏఎన్‌యూ: సాంకేతికతను సద్వినియోగం చేసుకుని నవ ప్రపంచాన్ని నిర్మించే శక్తి యువతకు ఉందని ఏపీ గవర్నర్ జస్టిస్ ఎస్.అబ్దుల్ నజీర్ అన్నారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీ 39, 40వ స్నాతకోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. యూనివర్సిటీ చాన్సలర్ హోదాలో పాల్గొన్న గవర్నర్ సందేశం ఇస్తూ మానవాళి ప్రయోజనాలు పరిరక్షించే నూతన ఆవిష్కరణలకు యువత కృషిచేయాలని సూచించారు. చదువు, సాంకేతిక పరిజ్ఞానంతోపాటు నైతికత, సామాజిక బాధ్యత కూడా ముఖ్యమని చెప్పారు. యువత నేర్చుకునే సాంకేతిక, నైపుణ్యం కేవలం తమ సొంతానికి మాత్రమే కాకుండా సమాజ హితం కోసం వాడాలని సూచించారు. ప్రపంచం ఎదుర్కొంటున్న అనేక సవాళ్లు, సంక్షోభాలకు పరిష్కారం చూపే వైవిధ్యభరితమైన ఆవిష్కరణలు చేయడంతోపాటు వాటి ద్వారా అపారమైన అవకాశాలు సృష్టించాలని సూచించారు. యూనివర్సిటీ వీసీ ఆచార్య పి.రాజశేఖర్ ఏఎన్‌యూ అభివృద్ధి నివేదికను సమర్పించారు. అనంతరం ప్రముఖ సంపాదకుడు పాలగుమ్మి సాయినాథ్‌కు గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేశారు. పలువురు విద్యార్థులకు పీహెచ్‌డీలు, బంగారు పతకాలు, డిగ్రీ పట్టాలు అందించారు.



పాలగుమ్మి సాయినాథ్‌కు గౌరవ డాక్టరేట్ ప్రదానం చేస్తున్న గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్, వీసీ ఆచార్య రాజశేఖర్

వ్యవసాయ రంగ సమస్యలపై అధ్యయనం చేసిన తొలి రాష్ట్రం ఏపీ: సాయినాథ్

వ్యవసాయ రంగంలో సంక్షోభం, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై అధ్యయనం చేసిన తొలి రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ అని ప్రముఖ సంపాదకుడు పాలగుమ్మి సాయినాథ్ చెప్పారు. ఏఎన్‌యూ స్నాతకోత్సవంలో ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో వ్యవసాయ రంగం ఎదుర్కొంటున్న సంక్షోభం, రైతుల సమస్యలపై తాను 2001-2002 కాలంలో అధ్యయనం చేశానని చెప్పారు. 2006లో అప్పటి ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి రాష్ట్రంలో వ్యవసాయ రంగ సంక్షోభంపై అధ్యయనానికి ప్రత్యేకంగా కమిటీని నియమించారని తెలిపారు. ఈ కమిటీ సుదీర్ఘకాలంగా రాష్ట్రంలో వ్యవసాయ రంగం ఎదుర్కొంటున్న సంక్షోభం గురించి నిశితంగా అధ్యయనం చేసిందని పేర్కొన్నారు. తన సొంత రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్‌తోపాటు పలు ప్రాంతాల్లో వ్యవసాయరంగ సమస్యలు, వాస్తవ పరిస్థితులను క్షుణ్ణంగా అధ్యయనం చేశానని తెలిపారు. ఆ సేవలకు దక్కిన గౌరవంగా ఈ డాక్టరేట్‌ను భావిస్తానని సాయినాథ్ తెలిపారు.

సత్తా చాటుతున్న సహకార బ్యాంకులు

టెస్కాబ్ టర్నోవర్ రూ.19 వేల కోట్లు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో సహకార బ్యాంకులు లాభాల బాటపట్టాయి. గతంలో కంటే టర్నోవర్ లోనూ, లాభాల్లోనూ మేటిగా నిలబడ్డాయి. రైతులకు అధిక రుణాలిస్తూ ముందు వరుసలో ఉన్నాయి. ముఖ్యంగా డీసీసీబీలు, ప్యాక్స్‌లు క్షేత్రస్థాయిలో విభిన్న రంగాల్లో వ్యాపారాలు చేస్తూ లాభాలను గడిస్తున్నాయి. ఈ క్రమంలోనే తెలంగాణ స్టేట్ కోఆపరేటివ్ అపెక్స్ బ్యాంక్ వార్షిక టర్నోవర్ భారీగా పెరిగింది. ఈ మేరకు మంగళవారం నివేదిక విడుదల చేసింది. 2015లో ఈ బ్యాంకు వార్షిక టర్నోవర్ కేవలం రూ. 6,307 కోట్లు మాత్రమే ఉండగా ప్రస్తుతం ఇది రూ. 19,021 కోట్లకు పెరిగింది. అంటే ఎనిమిదేళ్లలో టెస్కాబ్ టర్నోవర్ మూడు రెట్లు పెరగడం గమనార్హం. దీంతో పాటు లాభాలు కూడా అదే స్థాయిలో పెరిగాయి. 2015లో ఆ బ్యాంకు లాభాలు కేవలం రూ. 27.81 కోట్లు మాత్రమే కాగా, ప్రస్తుతం ఇది రూ. 133 కోట్లకు పెరిగింది. గతేడాది తొలిసారిగా రూ. 100 కోట్ల లాభాల మార్జిన్‌ను బ్యాంకు చేరుకుంది. టెస్కాబ్ ద్వారా రుణాల మంజూరు కూడా భారీగా పెరిగింది. 2015లో కేవలం రూ. 2,909 కోట్లు మాత్రమే రుణాలను అందించగా ప్రస్తుతం ఇది రూ. 8,508 కోట్లకు పెరిగింది. టెస్కాబ్, డీసీసీబీలు, ప్యాక్స్‌లు దేశంలో అనేక అవార్డులు సాధిస్తూ ప్రతిభ కనబరుస్తున్నాయి. దేశంలోని సహకార బ్యాంకుల్లో సాంకేతికత వినియోగాన్ని అందుబాటులోకి తీసుకొచ్చిన తొలి రాష్ట్రంగా తెలంగాణ ఘనత సాధించింది. దీంతో పాటు సైబర్ సెక్యూరిటీ ఆపరేషన్ సెంటర్‌ను నెలకొల్పిన తొలి సహకార బ్యాంకులు కూడా తెలంగాణ సహకార బ్యాంకులే కావడం గమనార్హం. అదే విధంగా అన్ని ప్రాథమిక సహకార సంఘాల (ప్యాక్స్)ను కంప్యూటరైజేషన్ చేసిన తొలి రాష్ట్రంగా తెలంగాణ నిలిచింది. 2018-19లో 798 ప్యాక్స్‌లు ఉండగా ప్రస్తుతం వీటి సంఖ్య 825కి పెరిగింది.

ఉత్తమ సేవలు అందిస్తున్నాం..

రైతులకు, వినియోగదారులకు ఉత్తమ సేవలు అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నాం. రైతులకు సరళ పద్ధతిలో రుణాలు మంజూరు చేస్తున్నాం. ప్యాక్స్‌ల ద్వారా ఇతర వ్యాపారాలు చేస్తూ వాటి లాభాలను మరింత పెంచాం. టెస్కాబ్, డీసీసీబీ, ప్యాక్స్ టర్నోవర్‌తో పాటు లాభాలు పెరిగాయి. ఇంకా బలోపేతం చేసే దిశగా చర్యలు తీసుకుంటున్నాం. వాణిజ్య బ్యాంకులకు దీటుగా పనిచేస్తున్నాం.

– నేతి మురళీధర్‌రావు, ఎండీ, టెస్కాబ్

గమ్యం.. ప్రయాణం సులభతరం

- ప్రత్యేక యాప్‌ను అందుబాటులోకి తెచ్చిన ఆర్టీసీ

మంచిర్యాలఅర్బన్: బస్‌స్టేషన్‌లో విచారణ కేంద్రం వద్ద.. 'సార్, 12 గంటల బస్సు వచ్చిందా.. ఏమైనా లేట్ ఉందా..? బస్సు ఎక్కడుంది..?' నిత్యం ప్రయాణికులకు నుంచి వచ్చే ప్రశ్నలు ఇవి. ఇకపై ఈ సమస్యలు తీరనున్నాయి. చేతిలో స్మార్ట్‌ఫోన్ ఉంటే చాలు .. ఇలాంటి సందేహాలకు సమాధానం దొరుకుతుంది. ప్రయాణమూ సులభతరం అవుతుంది. ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించేందుకు ఆర్టీసీ గమ్యం యాప్ అందుబాటులోకి తెచ్చింది. ఆగస్టు 12న ఆర్టీసీ యాజమాన్యం రాష్ట్ర వ్యాప్తంగా ఈ బస్సు ట్రాకింగ్ యాప్‌ను లాంఛనంగా ప్రారంభించింది. ఈ యాప్ సహాయంతో తాము ప్రయాణించాల్సిన బస్సు ఎక్కడుందో ఇట్టే తెలుసుకోవచ్చు. ఇదివరకు జీపీఎస్, టీఎస్ఆర్టీసీ పేరుతో యాప్ ఉన్నప్పటికీ ప్రస్తుతం సరికొత్త ఫీచర్లతో మహిళా ప్రయాణికులకు పెద్దపీట వేస్తూ కొత్త యాప్ అందుబాటులోకి తెచ్చారు.

నిరీక్షణకు తెర..

యాప్ రాక ముందు ప్రయాణికులు గంటల తరబడి బస్‌స్టేషన్‌లో వేచి చూడాల్సి వచ్చేది. విచారణ కేంద్రంలో అడిగినా సరైన సమాధానం దొరక్కపోయేది. బస్సు వస్తుందా.. క్యాన్సిల్ అయిందా.. ఎక్కడైనా మరమ్మతులకు వచ్చిందా తెలియక ఇబ్బంది పడేవారు. గమ్యం యాప్ ద్వారా ఈ సమస్యలన్నింటికీ చెక్ పెట్టవచ్చు. బస్సు కచ్చితమైన సమాచారం ఇట్టే తెలిసిపోతుంది. ఈయాప్‌లో ఎక్కాల్సిన బస్సు సమాచారం మొత్తం ఉంటుంది.. చేరాల్సిన గమ్యానికి ఎన్ని గంటలు పడుతుంది..? ఏ ప్రాంతంలో బస్సు ఉంది.. బస్సు నంబర్, డ్రైవర్ ఫోన్ నంబర్ సమాచారం ఉంటుంది. పల్లె వెలుగు మినహాయించి ఎక్స్‌ప్రెస్, డీలక్స్, రాజధాని సర్వీసులకు యాప్‌ను అనుసంధానం చేశారు.



టీఎస్ఆర్టీసీ గమ్యం ట్రాకింగ్ యాప్

మహిళలకు భద్రత...

గమ్యం యాప్‌లో ప్రత్యేకంగా మహిళ భద్రతకు సంబంధించి ఫీచర్ ఏర్పాటు చేశారు. మహిళల ఇబ్బందులు తొలగించేలా ఫ్లాగ్ ఏ బస్సు ఫీచర్‌ను ప్రవేశపెట్టారు. రాత్రి ఏడు గంటల నుంచి ఉదయం 6 గంటల వరకు అందుబాటులో ఉంటుంది. మహిళ ప్రయాణికులు తమ వివరాలను యాప్‌లో నమోదు చేస్తే స్క్రీన్‌పై ఆకుపచ్చని లైట్ వస్తుంది. దీన్ని ఆ రూట్లో వచ్చే ఏ ఆర్టీసీ బస్సు డ్రైవర్‌కు చూపినా వెంటనే నిలుపుతారు. సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవచ్చు.

పోలీసులకు సమాచారం..

ప్రయాణికులకు 'గమ్యం' ఎంతో తోడ్పడుతుందో... అత్యవసర వేళల్లో కూడా అంతే దోహదం చేస్తుంది. ఆర్టీసీ కాల్ సెంటర్‌ను సంప్రదించడానికి డయల్ 100, 108 ఈ యాప్‌ను అనుసంధానం చేశారు. యాప్‌లో ఉన్న ఎఫ్‌ఓఎస్ బటన్ నొక్కితే పోలీసులకు సమాచారం చేరుతుంది. రోడ్డు ప్రమాదం, వైద్యసేవలు, బస్సు బ్రేక్‌డౌన్ తదితర విషయాలను ప్రయాణికులు యాప్ ద్వారా అధికారులకు సమాచారం అందించవచ్చు. యాప్‌ను గూగుల్ ప్లేస్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకునే వెసులుబాటు ఉంది. ఈ యాప్‌లో వ్యక్తిగత వివరాలు నమోదు చేయాల్సిన అవసరం లేకుండానే ఇన్‌స్టాల్ చేసుకోవచ్చు.

కూరగాయల వెంకటేశ్

- యువరైతు వినూత్న సాగు
- ఓ వైపు కాలీఫ్లవర్, మరోవైపు నల్లకాకర, బీరకాయ
- రెండు నెలల్లోనే పంట చేతికి రావడంతో ఆదాయం



జగిత్యాలఅగ్రికల్చర్: సాధారణంగా రైతులు ఒకే కూరగాయ పంటను ఒకే సమయంలో పండిస్తుంటారు. దీంతో ఆ పంటకు మార్కెట్లో సరైన ధర లేక నష్టాలపాలవుతుంటారు. దీనికి తోడు మూస ధోరణిలో ఒకే కంపెనీ విత్తనాన్ని వాడుతుంటారు. పంట సరిగ్గా రానప్పుడు ఇబ్బందులు పడుతుంటారు. ఈ నేపథ్యంలో జిల్లాలోని సారంగాపూర్ మండలం పెంబట్ల గ్రామానికి చెందిన యువ రైతు బండారి వెంకటేశ్ (62818 13273) వినూత్న పద్ధతిలో కాలీఫ్లవర్, నల్లకాకర, బీరకాయలను దాదాపు 3 ఎకరాల్లో సాగు చేస్తూ మంచి ఆదాయం గడిస్తున్నాడు.

వ్యవసాయాన్ని ఇష్టంగా చేస్తూ..

వెంకటేశ్ కొన్నేళ్ల పాటు ఉపాధి కోసం సింగపూర్ వెళ్లాడు. అక్కడ పనులు నచ్చక స్వగ్రామానికి వచ్చి భార్య విజయతో కలిసి వ్యవసాయం చేయడం మొదలుపెట్టాడు. తనకున్న ఏడున్నర ఎకరాల్లో రకరకాల ప్రయోగాలు చేస్తూ విభిన్న పంటలు పండిస్తున్నారు. అలాగే మహారాష్ట్ర, బెంగళూర్ వంటి ప్రాంతాలకు వెళ్లి, అక్కడి కూరగాయల రైతులతో మాట్లాడి నాణ్యమైన విత్తనాలు తెచ్చుకుంటాడు. ఇప్పటి వరకు వరి సాగు చేసిన 3 ఎకరాల్లో అంతరపంటలుగా ఖర్బూజ, క్యాబేజీ, ట్రెల్లిస్ పద్ధతిలో టమాట, క్యారెట్ సాగు చేశాడు. సేంద్రియ ఎరువులు 75 శాతం, రసాయన ఎరువులను 25 శాతం, పురుగుమందులను వాడకుండా సోలార్ ట్రాప్‌లు, లింగాకర్షక బుట్టలతో పురుగులను అదుపుచేస్తూ అద్భుత దిగుబడులు సాధిస్తున్నాడు.

వినూత్నంగా కాలీఫ్లవర్ సాగు

జగిత్యాలకు రోజూ రెండు ఐషర్ వ్యాన్లలో కాలీఫ్లవర్ వస్తుంటుంది. దీనిపై కన్నేసిన వెంకటేశ్ మహారాష్ట్రకు వెళ్లి కూరగాయల రైతులను కలిసి వర్షాకాలంలో చేతికి వచ్చే కాలీఫ్లవర్ విత్తనాలు తెచ్చుకున్నాడు. మొక్కలు నాటడానికి ముందు పంట వేసే భూమిని రెండుమూడు సార్లు బాగా దున్ని పశువుల ఎరువు వేశాడు. తర్వాత భూమిని బెడ్‌లుగా తయారు చేసి డ్రిప్ పైపులు వేశాడు. కలుపు మొక్కలు రాకుండా మల్చింగ్ షీట్ వేసి మే చివరి వారంలో కాలిఫ్లవర్ మొక్కలు నాటాడు. బెంగళూర్ నుంచి నల్లకాకర విత్తనాలు తెప్పించి నాటుకున్నాడు. నాణ్యమైన కంపెనీకి చెందిన బీర విత్తనాలను సైతం నాటాడు.

ఆవు మూత్రంతో జీవామృతం

మొక్కలు నాటిన తర్వాత 15 రోజులకోసారి, 30 రోజులకు మరోసారి స్వల్పంగా డీఏపీ వేశాడు. తర్వాత 40,50,60 రోజులకు క్రిమిసంహారక మందులు వాడకుండా ఆవు మూత్రంతో తయారు చేసిన జీవామృతాన్ని పంటపై పిచికారీ చేశాడు. ఎండకు కాలీఫ్లవర్ దెబ్బతినకుండా ఉండేందుకు పెరుగును మజ్జిగగా తయారు చేసి దానిని వారంరోజులు పులియబెట్టి పంటపై పిచికారీ చేశాడు. పంటకు తెగుళ్లు ఆశించకుండా సోలార్ ట్రాప్స్, లింగాకర్షక బుట్టలుపెట్టాడు. ఇలా యాజమాన్య పద్ధతులు పాటించడంతో మంచి దిగుబడులు సొంతం చేసుకుంటున్నాడు.

హోల్‌సేల్‌గా మార్కెట్లో అమ్మకం

ప్రస్తుతం కూరగాయల పంటలు చేతికి రావడంతో భార్యాభర్తలిద్దరూ సాయంత్రం 3 గంటలకు వెళ్లి కాలీఫ్లవర్, కాకర, బీరకాయలు తెంపి ఇంటికి తీసుకు వస్తారు. మరుసటి రోజు ఉదయం 2 గంటల ప్రాంతంలో జగిత్యాల మార్కెట్‌కు తీసుకెళ్తారు. ప్రస్తుతం కాలీఫ్లవర్ పంట రోజుకు 2 క్వింటాళ్ల వరకు వస్తుండగా, హోల్‌సేల్ రేటు కిలో రూ.70 వరకు పలుకుతుంది. అలాగే నల్ల కాకర కాయ రోజుకు 1.50 క్వింటాల్ వస్తుండటంతో దీనికి కిలో రూ.50 వరకు ఉంది. ఇక బీరకాయ 50 కిలోల వరకు వస్తుండగా కిలో రూ.80 వరకు పలుకుతుంది. ప్రతి పంట తొలి రెండురోజులు అమ్మకం ద్వారా వచ్చిన డబ్బును సేవా కార్యక్రమాలకు ఖర్చుపెడుతుండటం ఆ దంపతుల సేవాగుణానికి నిదర్శనం.

సాగులోనే సంతృప్తి

భార్యాభర్తలిద్దరం కష్టపడి పంట పండిస్తాం. అందులోనే సంతృప్తి చెందుతాం. ఓ రోజు రేటు రావచ్చు మరో రోజు రాక పోవచ్చు. అయినా ఏనాడు బాధపడం. కానీ మార్కెట్‌ను నిశితంగా పరిశీలిస్తూ జరిగిన పొరపాటు మళ్లీ జరగకుండా ప్రణాళికతో ముందుకెళ్తాం. నాణ్యమైన విత్తనాలకు పెద్ద పీట వేస్తాం.

– బండారి వెంకటేశ్, యువ రైతు, పెంబట్ల

రాష్ట్రస్థాయి ప్రదర్శనకు పల్లె చిత్రాలు

- ఆదిలాబాద్ జిల్లా నుంచి 35 ఎంపిక
- సెప్టెంబర్‌లో రవీంద్రభారతిలో ప్రదర్శన



లఘు చిత్రాలు చిత్రీకరించిన స్వామి

తాంసి: హైదరా బాద్‌లోని రవీంద్రభారతిలో లఘు చిత్రాల ప్ర దర్శనకు ఆదిలాబాద్ జిల్లా నుంచి 35 చిత్రాలు ఎంపికయ్యా యి. జిల్లాలోని 15 యూట్యూబ్ చానళ్ల నుంచి వీటిని ఎంపిక చేసినట్లు తెలంగాణ భాషా సాంస్కృతికశాఖ సంచాలకులు మామిడి హరికృష్ణ తెలిపారు. ఇందులో తాంసి మండలం హస్నాపూర్ గ్రామానికి చెందిన కర్నేవార్ స్వామి చిత్రీకరించిన మూడు షార్ట్ ఫిలిమ్స్ ఉన్నాయి. స్వామి చిత్రీకరించిన 'సర్పంచ్ మొగుడు తోపు, ఆన్‌లైన్ క్లాసుల గోల, కొంప ముంచిన కరోనా' చిత్రాలను సెప్టెంబర్‌లోని నాలుగు శనివా రాల్లో సాయంత్రం 6 నుంచి 9 గంటల వరకు ప్రదర్శించనున్నారు. ఈ సందర్భంగా స్వామి ని పలువురు అభినందించారు.

అర్చకులకు తీపికబురు

- గౌరవ వేతనం రూ.10 వేలకు పెంపు
- సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపిన మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి

నిర్మల్‌టౌన్: అర్చకులకు ధూపదీప నైవేద్య పథకం కింద గౌరవ వేతనాన్ని రూ.6వేల నుంచి రూ.10 వేలకు పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు దేవాదాయశాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి ఓ ప్రకటనలో సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. సమైక్య పాలనలో అర్చకులకు ధూప దీప నైవేద్య పథకం కింద రూ.2,500 మాత్రమే వచ్చేదని, అర్చకుల ఇబ్బందులను గుర్తించిన సీఎం కేసీఆర్ రూ.2,500 గౌరవ వేతనాన్ని రూ.6వేలకు పెంచారని గుర్తు చేశారు. ప్రస్తుతం రూ.6వేల నుంచి రూ.10వేలకు పెంచుతూ కేసీఆర్ ప్రకటించడం ఆయన గొప్ప మనస్సుకు నిదర్శనమని తెలిపారు. గతంలో 1,805 ఆలయాలకు మాత్రమే ఈ పథకం అమలు కాగా, ప్రస్తుతం 6,541 ఆలయాలకు అమలు చేస్తున్నట్లు వెల్లడించారు. ఈ పథకం కింద సంవత్సరానికి రూ.78.49 కోట్లు వ్యయమవుతోందని వివరించారు.

చెక్ చేయాలంటే.. వాక్ చేయాల్సిందే!



నెలవారీ ఆరోగ్య పరీక్షలకు మారుమూల గ్రామాల్లోని గర్భిణులకు దారి కష్టాలు తప్పడం లేదు. తిర్యాణి మండలం కేరిగూడకు చెందిన ముగ్గురు గర్భిణులు నెలవారీ చెకప్‌ల కోసం మంగళవారం ఆశ కార్యకర్తలతో కలిసి గిన్నెధరి పీహెచ్‌సీకి బయలుదేరారు. పంగిడి మాదర వరకు సరైన రోడ్డు సౌకర్యం లేకపోవడంతో వారు పది కిలోమీటర్ల దూరం నడవాల్సి వచ్చింది. అక్కడి నుంచి అంబులెన్స్‌లో పీహెచ్‌సీకి వెళ్లి వైద్యపరీక్షలు చేయించుకున్నారు. పరీక్షల అనంతరం గర్భిణులను అంబులెన్స్ సిబ్బంది పంగిడిమాదర వద్ద దించి వెళ్లిపోయారు. మళ్లీ కాలినడకనే వారు ఇళ్లకు చేరుకున్నారు. – తిర్యాణి

నార్త్ కరోలినాలో 'గ్లోబల్ తెలంగాణ' ఏర్పాటు

సప్తగిరికాలనీ(కరీంనగర్): అమెరికా దేశంలోని నార్త్ కరోలినా స్టేట్ చార్లోట్ సిటీలో తెలంగాణకు చెందిన పలువురు ఎన్ఆర్ఐలు కలిసి గ్లోబల్ తెలంగాణ సంఘం ఏర్పాటు చేశారు. దీన్ని ఎమ్మెల్సీ గోరేటి వెంకన్న ప్రారంభించినట్లు సంఘం ప్రతినిధులు కడారి కృష్ణారెడ్డి, చందురెడ్డి తెలిపారు. తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలు ఇక్కడి ప్రజలకు తెలిసేలా భవిష్యత్ కార్యాచరణ రూపొందించనున్నట్లు పేర్కొన్నారు. ఈమేరకు మంగళవారం బతుకమ్మ, సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను అలరించాయి. కార్యక్రమంలో కాసర్ల గోపాల్, మన్మోహన్, సత్రు నాయక్, వంశీ, వేణు, ప్రదీప్, రవి, సాయి, భిక్షు, నర్సింగ్, పద్మ, కల్వల విశ్వేశ్వర్, కసిరెడ్డి ప్రవీణ్, కిరమ్, రవీందర్, బాపురెడ్డి, రాజేందర్ పాల్గొన్నారు.



సంఘం ప్రతినిధులతో ఎమ్మెల్సీ గోరటి వెంకన్న


స్వాతి

చిన్నారులకు ఆత్మీయ నేస్తం

చంటి పిల్లల నుంచి పదేళ్ల లోపు చిన్నారుల మానసిక వికాసానికి దోహదపడే బొమ్మలను, స్టోరీ బుక్స్‌ను రూపొందిస్తూ వాటి ద్వారా ఉపాధి పొందుతున్నారు హైదరాబాద్ నార్సింగ్‌లో ఉంటున్న స్వాతి.



పిల్లల కోసం పర్యావరణ అనుకూలమైన ఉత్పత్తుల తయారీలో గ్రామీణ మహిళలకు అవగాహన కల్పిస్తున్నారు. న్యూ ఏజ్ పేరెంట్స్‌ను ఆకట్టుకునేలా చేస్తున్న ఈ ప్రయత్నానికి మంచి స్పందన వస్తోందని, పిల్లలకు ఈ బొమ్మలు ఆత్మీయ నేస్తాలు అవుతున్నాయని ఆనందంగా వివరిస్తోంది స్వాతి.

''పిల్లల మనసులు తెల్లని కాగితాల్లాంటివి. వాటిపై మనం ఏది రాస్తే అదే వారి భవిష్యత్తు. పదేళ్లుగా వందలాది మంది చంటి పిల్లలతో ఆడి పాడి, వారికి నచ్చినట్టు చెప్పే పద్ధతులను నేనూ నేర్చుకుంటూ వచ్చాను. డిగ్రీ చేసిన నాకు స్వతహాగా పిల్లలతో గడపడంలో ఉండే ఇష్టం నన్ను టీచింగ్ వైపు ప్రయాణించేలా చేస్తోంది. ప్లే స్కూల్ పిల్లలతో ఆడుకోవడం, వారితో రకరకాల యాక్టివిటీస్ చేయించడం ఎప్పుడూ సరదాయే నాకు. నాకు ఒక బాబు. వాడి వల్లనే ఈ ఇష్టం మరింత ఎక్కువైందనుకుంటాను. బాబుతో పాటు నేనూ ఓ స్కూల్లో జాయిన్ అయి, నా ఆసక్తులను పెంచుకున్నాను.



ఆలోచనకు మార్గం

పదేళ్లుగా చంటి పిల్లల నుంచి పదేళ్ల వయసు చిన్నారుల వరకు వారి ఆటపాటల్లో నేనూ నిమగ్నమై ఉన్నాను కనుక వారి ముందుకు ఎలాంటి వస్తువులు వచ్చి చేరుతున్నాయనే విషయాన్ని గమనిస్తూ వచ్చాను. కానీ, నేను అనుకున్న విధంగా అన్నింటినీ ఒక దగ్గరకు చేర్చడం ఎలాగో తెలియలేదు. కరోనా సమయంలో వచ్చిన ఆలోచన నాకు నేనుగా నిలబడేలా చేసింది. ఒక ప్రాజెక్ట్ వర్క్‌లాగా పిల్లల మానసిక వికాసానికి ఏమేం వస్తువులు అవసరం అవుతాయో అన్నీ రాసుకున్నాను. నేను ఏయే పద్ధతుల్లో పిల్లలకు నేర్పిస్తున్నానో, దాన్నే నాకు నేనే ప్రాజెక్ట్ వర్క్‌గా చేసుకున్నాను. ఏ వస్తువులు ఏ ప్రాంతానికి ప్రత్యేకమైనవి, నాకు నచ్చినట్టుగా ఏయే వస్తువులను తయారు చేయించాలి అనేది డిజైన్ చేసుకున్నాను కాబట్టి అనుకున్న విధంగా పనులు మొదలుపెట్టాను. కిండోరా టాయ్స్ పేరుతో రెండేళ్ల క్రితం ఈ ప్రాజెక్ట్‌ను ప్రారంభించాను.

అన్నింటా ఎకో స్టైల్

పిల్లలకు దంతాలు వచ్చే దశలో గట్టి వస్తువులను నోటిలో పెట్టేసుకుంటారు. వాటిలో ప్లాస్టిక్‌వీ వచ్చి చేరుతుంటాయి. అందుకని సాఫ్ట్ ఉడ్‌తో బొమ్మలను తయారు చేయించాను. వీటికోసం మన తెలుగు రాష్ట్రాల్లోని కొండపల్లి, నిర్మల్ నుంచే కాకుండా, ఇతర రాష్ట్రాల్లోని టాయ్ మేకింగ్ వారిని కలిసి నాకు కావల్సిన విధంగా తయారు చేయించాను. ఇంద్రధనుస్సు రంగులను పరిచయం చేయడానికి సాఫ్ట్ ఉడ్ మెటీరియల్, కలర్, బిల్డింగ్ బాక్స్‌లే కాదు... ఐదేళ్ల నుంచి చిన్న చిన్న అల్లికలు, కుట్టు పని నేర్చుకోవడానికి కావల్సిన మెటీరియల్, క్రోచెట్ అల్లికలు వంటివి కూడా ఉండేలా శ్రద్ధ తీసుకున్నాను.

సాఫ్ట్ టాయ్స్‌తో పాఠం

మన దేశ సంస్కృతిని పిల్లలకు తెలియజేయాలంటే మన కట్టూ బొట్టునూ పరిచయం చేయాలి. అందుకు ప్రతి రాష్ట్రం ప్రత్యేకత ఏమిటో డెకొరేటివ్ బొమ్మల ద్వారా చూపవచ్చు. ఇవి కూడా ఆర్గానిక్ మెటీరియల్స్‌తో తయారు చేసినవే. డెకరేటివ్ సాఫ్ట్ టాయ్స్ స్వయంగా నేను చేసినవే. ఆర్గానిక్ కాటన్ మెటీరియల్‌తో చేయించిన సాఫ్ట్ టాయ్స్‌లో జంతువులు, పండ్లు, పువ్వుల బొమ్మలు కూడా ఉంటాయి. వీటివల్ల చిన్న పిల్లలకు ఎలాంటి హానీ కలగదు. రంగు రంగులుగా కనిపించే ఈ బొమ్మల ద్వారా చెప్పే పాఠాలను పిల్లలు ఆసక్తిగా వింటారు. వీటితో పాటు పిల్లలను అలరించే పుస్తకాలు కూడా అందుబాటులో ఉండేలా చూసుకున్నాను. ఒక విధంగా చెప్పాలంటే ఈ కాలపు తల్లిదండ్రులు తమ పిల్లలకు ఎలాంటి మానసిక వికాసపు బొమ్మలు కావాలనుకుంటారో అవన్నీ నా దగ్గర ఉండేలా ప్లాన్ చేసుకున్నాను.

నా ఆసక్తే పెట్టుబడి..

ఉద్యోగం చేయగా వచ్చిన డబ్బుల నుంచి చేసుకున్న పొదుపు మొత్తాలను ఇందుకోసం ఉపయోగించాను. ముందు చిన్నగా స్టార్ట్ చేశాను. ఇప్పుడు ఆన్‌లైన్ వేదికగా మంచి ఆర్డర్స్ వస్తున్నాయి. నాతో పాటు ఈ పనిలో గ్రామీణ మహిళలు భాగస్వామ్యం కావడం మరింత ఆనందాన్ని ఇస్తోంది. ప్లే స్కూళ్లు, ఆన్‌లైన్, ఆఫ్ లైన్ ద్వారా వచ్చే ఆర్డర్లను బట్టి సాఫ్ట్ టాయ్స్ తయారీలో కనీసం పాతికమంది మహిళలు పాల్గొంటున్నారు. ముందుగా వర్క్‌షాప్ నిర్వహించి, టాయ్స్ మేకింగ్ నేర్పించి వర్క్ చేయిస్తుంటాను. పూర్తి ఎకో థీమ్ బేస్డ్ కావడంతో ఈ కాలం అమ్మలు ప్రత్యేక ఆసక్తి చూపిస్తున్నారు. నేననుకున్న థీమ్ ఎంతో కొంతమందికి రీచ్ అవడం నాకు చాలా ఆనందంగా ఉంది'' అని వివరించింది స్వాతి.

– నిర్మలారెడ్డి
ఫొటోలు: మోహనాచారి

యూత్ పల్స్

నవయువ చిత్రశాల

పర్యావరణ గొంతుక

'కళ కళ కోసమే కాదు... పర్యావరణ సంరక్షణ కోసం కూడా' అంటోంది యువతరం. సంక్లిష్టమైన పర్యావరణ అంశాలను సులభంగా అర్థం చేయించడానికి, పర్యావరణ స్పృహను రేకెత్తించడానికి గ్రాఫిటీ వర్క్, ఇల్లస్ట్రేషన్, ఇమోజీ, కార్టూన్‌లను బలమైన మాధ్యమంగా ఉపయోగించుకుంటుంది.


పూర్వ గోయెల్

ఆర్ట్, హ్యూమర్‌లను కలిపి తన ఇలస్ట్రేషన్‌లతో పర్యావరణ సంరక్షణకు సంబంధించిన అంశాలను ప్రచారం చేస్తున్నాడు రోహన్ చక్రవర్తి. కామిక్స్, కార్టూన్‌లు, ఇలస్ట్రేషన్ సిరీస్‌లతో 'గ్రీన్ హ్యూమర్' సృష్టించాడు. రెండు జాతీయ పత్రికల్లో వచ్చిన ఈ సిరీస్‌ను పుస్తకంగా ప్రచురించాడు. తన కృషికి ఎన్నో అవార్డులు వచ్చాయి.

ఎన్నో స్వచ్ఛంద సంస్థలు రోహన్ చక్రవర్తి కార్టూన్‌లను పర్యావరణ పరిరక్షణ ప్రచారానికి వినియోగించుకుంటున్నాయి.

మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌కు చెందిన రోహన్ పదహారు సంవత్సరాల వయసు నుంచే కార్టూన్‌లు వేయడం మొదలుపెట్టాడు.

'పర్యావరణ సంక్షోభ తీవ్రతను కామిక్స్‌తో బలంగా చెప్పవచ్చు. శాస్త్రీయ విషయాలపై ఆసక్తి ఉన్న వారినే కాదు, వాటిపై అవగాహన లేని వారిని కూడా ఆకట్టుకొని మనం చెప్పదలుచుకున్న విషయాన్ని సూటిగా సులభంగా చెప్పవచ్చు' అంటున్నాడు రోహన్ చక్రవర్తి.

కార్టూనిస్ట్, గ్రాఫిక్ స్టోరీ టెల్లర్ పూర్వ గోయెల్ తన కళను పర్యావరణ సంబంధిత అంశాల ప్రచారానికి ఉద్యమస్థాయిలో ఉపయోగిస్తోంది. పర్యావరణ నిపుణులు, పరిశోధకులు, పర్యావరణ ఉద్యమ సంస్థలతో కలిసి పనిచేస్తోంది. 'అన్ని వయసుల వారిని ఆకట్టుకొని, అర్థం చేయించే శక్తి కార్టూన్‌లకు ఉంది' అంటోంది 26 సంవత్సరాల పూర్వ గోయెల్.

పశ్చిమ కనుమల జీవవైవిధ్యానికి వాటిల్లుతున్న ముప్పు నుంచి అరుణాచల్‌ప్రదేశ్‌లోని దిబంగ్ లోయలోని మిష్మి ప్రజలు ఎదుర్కొంటున్న కష్టాల వరకు పూర్వ గోయెల్ తన కళ ద్వారా ఆవిష్కరించింది. అభివృద్ధిగా కనిపించే దానిలోని అసమానతను ఎత్తి చూపింది.

డెహ్రాడూన్‌కు చెందిన పూర్వ గోయెల్ నదులు, అడవులు ఎదుర్కొంటున్న జీవన్మరణ సమస్యను దగ్గరి నుంచి చూసింది. బెల్జియంలో గ్రాఫిక్ స్టోరీ టెల్లింగ్‌లో మాస్టర్స్ చేసింది. ఐక్యరాజ్య సమితి జీవవైవిధ్యం అంశంపై కెనడాలో నిర్వహించిన సదస్సుకు హాజరైంది.

'ఆ సదస్సులో వక్తలు పర్యావరణ విధానాల గురించి సంక్లిష్టంగా మాట్లాడారు. సామాన్యులు ఆ ప్రసంగ సారాన్ని అర్థం చేసుకోవడం కష్టం. దీన్ని దృష్టిలో పెట్టుకొని అందరికీ అర్థమయ్యేలా పర్యావరణ విషయాలను చెప్పాలనుకున్నాను. దీనికి నా కుంచె ఎంతో ఉపయోగపడింది. నన్ను నేను కమ్యూనికేటర్‌గా భావించుకుంటాను' అంటుంది పూర్వ గోయెల్.



అశ్విని మేనన్


అక్షయ

ఒక స్వచ్ఛంద సంస్థ ఇచ్చిన నివేదిక ఆధారంగా కామిక్ బుక్ తయారుచేసింది గోయెల్. ఈ కామిక్ బుక్‌కు అనూహ్యమైన స్పందన వచ్చింది.

'మేము ఎన్నో రిపోర్ట్‌లు విడుదల చేశాం. కాని ఒక్క రిపోర్ట్ చదవడానికి కూడా మా ఎకౌంటెంట్ ఆసక్తి చూపించలేదు. కామిక్స్ రూపంలో ఉన్న రిపోర్ట్ ఆమెకు బాగా నచ్చింది. కామిక్స్ ద్వారా తెలుసుకున్న విషయాలను ఇతరులకు చెప్పడం మొదలు పెట్టింది' అని ఆ సంస్థ ప్రతినిధులు చెప్పినప్పుడు ఉత్సాహం రూపంలో గోయెల్‌కు ఎంతో శక్తి వచ్చి చేరింది.

'గ్రాఫిక్ డిజైన్‌లో భాగంగా బ్రాండ్ డిజైన్ నుంచి పబ్లికేషన్ డిజైన్ వరకు ఎన్నో చేయవచ్చు. కాని నాకు కామిక్ స్ట్రిప్స్ అంటేనే ఇష్టం. ఎందుకంటే పెద్ద సబ్జెక్ట్‌ను సంక్షిప్తంగానే కాదు అర్థమయ్యేలా చెప్పవచ్చు. ఒకటి లేదా రెండు వాక్యాలు, ఇమేజీలతో పెద్ద స్టోరీని కూడా చెప్పవచ్చు' అంటున్న అశ్విని మేనన్ గ్రాఫిక్ డిజైన్‌ను పర్యావరణ అంశాల ప్రచారానికి బలమైన మాధ్యమంగా చేసుకుంది.

బెంగళూరులోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డిజైన్ (ఎన్‌ఐడీ)లో చదువుకున్న అశ్విని కళకు సామాజిక ప్రభావం కలిగించే శక్తి ఉందని గ్రహించింది. తన కళను సమాజ హితానికి ఉపయోగించాలనుకుంది.

రిచీ లైనల్ ప్రారంభించిన డాటా స్టోరీ టెల్లింగ్ సంస్థ 'బెజలెల్ డాటా' అసాధారణ ఉష్ణోగ్రతలకు సంబంధించిన సంక్లిష్టమైన సమాచారం అందరికీ సులభంగా, వేగంగా అర్థమయ్యేలా యానిమేటెట్ ఇమోజీలను క్రియేట్ చేస్తోంది.

'సంప్రదాయ రిపోర్ట్ స్ట్రక్చర్స్ ప్రకారం వెళితే అందరికీ చేరువ కాకపోవచ్చు. రిపోర్ట్ సారాంశాన్ని సులభంగా అర్థం చేసుకునేలా డాటా కామిక్స్ ఉపయోగపడతాయి. పెద్ద వ్యాసం చదువుతున్నట్లుగా కాకుండా ఇతరులతో సంభాషించినట్లు ఉంటుంది' అంటున్న రిచీ లైనల్ ఎన్నో స్టోరీ టెల్లింగ్ వర్క్‌షాప్‌లు నిర్వహించాడు క్లైమెట్ డాటాపై అజీమ్ ప్రేమ్‌జీ యూనివర్శిటీతో కలిసి పని చేశాడు.

సంక్లిష్టమైన విషయాలను సంక్షిప్తంగా, సులభంగా అర్థమయ్యేలా చేయడానికి రిచీ లైనల్ అనుసరిస్తున్న మార్గంపై యువతరం ఆసక్తి ప్రదర్శిస్తోంది.

మెరైన్ బ్లాగిస్ట్, నేచర్ ఫొటోగ్రాఫర్ గౌరవ్ పాటిల్ రాతలతోనే కాదు ఇలస్ట్రేషన్స్, ఫొటోలతో పర్యావరణ సంబంధిత అంశాలను ప్రచారం చేస్తున్నాడు. సముద్ర కాలుష్యం నుంచి కాంక్రీట్ జంగిల్స్ వరకు ఎన్నో అంశాల గురించి తన ఇల్లస్ట్రేషన్‌ల ద్వారా చెబుతున్నాడు.

బెంగళూరుకు చెందిన అక్షయ జకారియ వైల్డ్‌లైఫ్ డాక్యుమెంటరీలు చూస్తూ పెరిగింది. పర్యావరణంపై ఆసక్తి పెంచుకోవడానికి అది కారణం అయింది. పర్యావరణ సంరక్షణపై అవగాహనకు ఇలస్ట్రేషన్, డిజైన్‌లను ఉపయోగిస్తోంది.

రోహన్ చక్రవర్తి నుంచి అక్షయ వరకు పర్యావరణ అంశాలపై ఆసక్తి పెంచుకోవడానికి రకరకాల కారణాలు ఉండొచ్చు. అయితే అందరినీ ప్రకృతి ప్రపంచంలోకి తీసుకువచ్చింది అనురక్తి మాత్రమే కాదు అంతకంటే ఎక్కువైన అంకితభావం కూడా.



పార్కూ... పుస్తకమూ... మనమూ...

ట్రెండ్

**పెద్దగా మాటలుండవు.
ఒక పదీ పదిహేనుమందివచ్చి
పార్కులో కలుస్తారు.
అందరి చేతుల్లో వారికి నచ్చిన పుస్తకాలు ఉంటాయి.
తలా ఒకచోట కూచుని
పుస్తకాన్ని నిశ్శబ్దంగా చదువుకుంటారు.
వీడ్కోలుకు ముందు కాసిన్ని కబుర్లు... ఒక చాయ్...
ఒకరి పుస్తకం మరొకరికి అరువు...
ఒక ఆరోగ్యకరమైన వ్యాపకం
ఆరోగ్యకరమైన బృందం...
సెల్‌ఫోన్‌ల కాలుష్యంలో
ముంబైలో తాజా ట్రెండ్ 'సైలెంట్ రీడింగ్'.**

శనివారం సాయంత్రం 5 గంటలు. ముంబైలోని జుహూలో కైఫీ ఆజ్మీ పార్క్. మెల్లమెల్లగా కొంత మంది నడుచుకుంటూ వచ్చి ఒకచోట జమయ్యారు. వారి చేతుల్లో పుస్తకాలు, చాపలు, దుప్పట్లు, చిరుతిండ్లు ఉన్నాయి. ఒక్కొక్కరు వారికి నచ్చినచోట దుప్పటి పరిచి పుస్తకం తెరిచి కూచున్నారు. దూరం నుంచి చూస్తే ఒక పదిహేను ఇరవై మంది శిలల్లా కూచుని చేతుల్లో పుస్తకాలు చదువుతూ కనిపిస్తారు. మంచి ప్రకృతిలో, మంచి సమయంలో, నచ్చిన పుస్తకాన్ని, తమలా పుస్తకాలను ఇష్టపడేవారి సమక్షంలో చదువుకోవడం ఎంత బాగుంటుంది? పుస్తకాన్ని మించిన స్నేహితుడు లేడు. పుస్తకాలను చదివే వారితో స్నేహానికి మించింది లేదు. అందుకే ఇప్పుడు ముంబైలో 'సైలెంట్ రీడింగ్' అనేది ఒక ట్రెండ్‌గా మారింది. కొత్త స్నేహితులను పరిచయం చేస్తోంది.



సైలెంట్ రీడింగ్ ఎందుకు?

పుస్తకాభిమానులు బుక్ రిలీజ్ ఫంక్షన్లకు వెళ్లినా, ఆథర్ టాక్‌కు వెళ్లినా ఏదో రణగొణధ్వని. పుస్తకం గురించి తక్కువ... మెరమెచ్చులు ఎక్కువ. అంతేకాదు, కొంతమంది పుస్తకాన్ని తప్ప దానిని రాసినవారిని కలవాలనుకోరు. మరికొంతమంది ఇంట్రావర్ట్‌లు తాము నిశ్శబ్ద స్నేహితులుగా ఉండాలనుకుంటారు. ఇలాంటి వారంతా ఏ గోలా లేని 'సైలెంట్ రీడింగ్'ని ఇష్టపడుతున్నారు. ఈ సైలెంట్ రీడింగ్ గ్రూపుల్లో వాగుడుకాయలకు ప్రవేశం లేదు. హాయిగా నిశ్శబ్దంగా చదువుకోవడమే. మంచి పుస్తకాన్ని ఒకరితో మరొకరు పంచుకోవడమే.

బెంగళూరులో మొదలు

బెంగళూరులోని కబ్బన్ పార్క్‌లో శ్రుతి షా, హర్ష్ స్నేహాన్షు ఇద్దరు పుస్తక ప్రేమికులు 'కబ్బన్ రీడ్స్' పేరుతో 'సైలెంట్ రీడింగ్'ని 2022 డిసెంబర్‌లో మొదలెట్టారు. కబ్బన్ పార్క్‌లో పుస్తక ప్రేమికులు విశేషంగా వచ్చి వారానికి ఒకసారి పుస్తకాలు చదువుకుని వెళ్లడం అందరినీ ఆకర్షించింది. దాని ప్రభావంతో ముంబైలోని జుహూలో దియా సేన్ గుప్తా, రచనా మల్హోత్రా అనే ఇద్దరు స్నేహితురాళ్లు 'జుహూ రీడ్స్' పేరుతో ఈ సంవత్సరం మేలో 'సైలెంట్ రీడింగ్'ను మొదలెట్టారు. వెంటనే జుహూలోని పుస్తక ప్రేమికులను ఇది ఆకర్షించింది. అన్ని వయసుల వాళ్లు ఇక్కడికి వచ్చి కూచుని ప్రశాంతంగా పుస్తకాలు చదవసాగారు. అంతేనా? వీల్‌చైర్‌లో ఉండేవారు కూడా వచ్చి పుస్తకంలో, పుస్తకాన్ని ఇష్టపడే వారి సమక్షంలో ఓదార్పు పొందసాగారు. 'సెల్‌ఫోన్లు వచ్చాక పుస్తకం చదివే అలవాటు తగ్గింది. మనుషులు సెల్ చూసుకుంటూ కనిపించడమే అందరికీ తెలుసు. కాని ఒకప్పుడు పుస్తకం చదువుతూ కనిపించేవారు. సైలెంట్ రీడింగ్ వల్ల పుస్తకం చదువుకుంటూ కనిపించేవారు అందరినీ ఆకర్షిస్తున్నారు. దానివల్ల పుస్తకాలు చదవాలన్న అభిలాష పెరుగుతోంది. మేము ఆశిస్తున్నది అదే' అని జుహూ రీడ్స్ నిర్వాహకులు అన్నారు.



దేశ, విదేశాల్లో...

బెంగళూరు కబ్బన్ పార్క్‌తో మొదలైన సైలెంట్ రీడింగ్ ఉద్యమం ఇప్పుడు ముంబైలో బాంద్రా, దాదర్, కొలాబా లాంటి ఐదారు చోట్లకు విస్తరించింది. ఇక మన దేశంలోని ఢిల్లీ, పూణె, చెన్నై, కొచ్చి, హైదరాబాద్‌లకు కూడా వ్యాపించింది. సోషల్ మీడియా ద్వారా కబ్బన్ రీడ్స్ గురించి తెలుసుకున్న వారు న్యూయార్క్, లండన్, దుబాయ్, మెల్‌బోర్న్‌లలో కూడా సైలెంట్ రీడింగ్ సమూహాలను తయారు చేస్తున్నారు. 'ఈ రీడింగ్స్‌కు వచ్చినవారు మంచి స్నేహితులుగా మారుతున్నారు. బిజీ లైఫ్‌లో మనిషి ఒంటరితనాన్ని ఫీలవుతున్నాడు. ఆ ఒంటరితనం పోగొట్టేందుకు సైలెంట్ రీడింగ్ గ్రూపులు సాయం చేస్తున్నాయి' అని నిర్వాహకులు అభిప్రాయ పడుతున్నారు.

వాట్సాప్ యూనివర్సిటీ నుంచి

వాట్సాప్ యూనివర్సిటీలో వచ్చే నానా చెత్త ప్రభావంలో పడి అనవసర భావోద్వేగాలకు లోను కావడం కన్నా వికాసం, జ్ఞానం, జీవితానుభవం, ఆహ్లాదం పంచే పుస్తకాన్ని అక్కున చేర్చుకోవడం నేటి తక్షణావసరం. పుస్తకాలు చదివే వారితోనే నాగరిక సమాజం ఏర్పడుతుంది. ఆ విధంగా సైలెంట్ రీడింగ్ గ్రూపులు సమాజాన్ని మరింత అర్థవంతం చేస్తున్నాయి. ఇలాంటి ఉద్యమాల్ని పుస్తకాభిమానులు ఎక్కడికక్కడ అందుకోవాల్సిన అవసరం ప్రతి ఊళ్లో, పట్టణంలో ఉంది.

కిచెన్‌టిప్స్



- పాలకూరలో టీస్పూను పంచదార, కాసిన్ని నీళ్లుపోసి పది నిమిషాలపాటు మరిగించి, తరువాత చల్లటి నీటిలో వేయాలి. చల్లారాక గ్రైండ్ చేసి గ్రేవీల్లోకి వాడుకుంటే పాలకూరలోని పోషకాలు బయటకు పోకుండా ఉంటాయి.



- కూరల్లో గ్రేవీ కోసం కొన్నిసార్లు నీళ్లు పోస్తుంటాము. అయితే ఇలా పోసే నీళ్లను కాస్త మరిగించి పోస్తే కూర వేడికి వేడినీళ్లు చక్కగా సరిపోయి గ్రేవీ మరింత రుచికరంగా వస్తుంది. చల్లటి నీళ్లుపోస్తే ఆ నీరు కూర ఉష్ణోగ్రతలకు చేరుకోవడానికి సమయం పట్టి గ్రేవీ అంత రుచిగా రాదు.



- ఆలు పరాటా చేసేటప్పుడు .. ఉడికించిన బంగాళదుంపలను ఇరవై నిమిషాలపాటు రిఫ్రిజిరేటర్‌లో ఉంచి చల్లారనివ్వాలి. పూర్తిగా చల్లారాక దుంపల తొక్కతీసి ఆలు పరోటా చేస్తే దుంపల మిశ్రమం అతుక్కోకుండా, జిగట లేకుండా పరాటాలు చక్కగా వస్తాయి.
- కూరలో కారం, మసాలా ఘాటు ఎక్కువైనప్పుడు, పెరుగు, ఫ్రెష్‌క్రీమ్, పాలు... వీటిలో ఏ ఒక్కటైనా కూరను బట్టి రెండు మూడు టేబుల్ స్పూన్లు వేసి కలిపితే ఘాటు తగ్గుతుంది.

బ్యూటిప్స్

ఈ ప్యాక్ వేసుకోండి... అందంగా మెరిసిపోండి

- అరకప్పు కీరదోస గుజ్జు తీసుకుని అందులో కోడిగుడ్డులోని తెల్లసొన, చెంచా నిమ్మరసం వేసి బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి పట్టించి చేసి 20 నిమిషాల పాటు ఆరనివ్వండి. ఆ తర్వాత గోరువెచ్చని నీటితో ముఖాన్ని శుభ్రం చేయండి. కీరాదోస పిగ్మెంటేషన్ సమస్యను దూరం చేస్తుంది. దీనితో పాటు ముడతలు, సన్నని గీతలు వంటి సమస్యలు దూరం అవుతాయి
- ఒక పాత్రలో బార్లీ గింజల పొడిని తీసుకుని అందులో కొద్దికొద్దిగా గోరువెచ్చటి నీళ్ల పోసుకుంటూ ముద్దలా కలుపుకోవాలి. ఈ పేస్ట్‌ను చక్కగా కలిపి ముఖానికి ప్యాక్‌లా అప్లై చేయండి. దీన్ని 15 నిమిషాల పాటు ఆరనివ్వాలి. ఆ తర్వాత గోరువెచ్చటి నీటితో శుభ్రం చేసుకోండి. ఇలా తరచు చేస్తుండడం వల్ల. మచ్చలు, మృత కణాలు తొలగిపోయి చర్మం ప్రకాశవంతంగా తయారవుతుంది
- పాలల్లో కొద్దిగా ఓట్స్ వేసి ఉడికించాలి. తర్వాత ఇందులో కాస్త పెరుగు, తేనె వేసి బాగా కలపాలి. ఇది కాస్త చల్లబడిన తర్వాత బ్లాక్‌హెడ్స్ ఉన్న చోట అప్లై చేసుకుని 20 నిమిషాలు అలాగే ఉంచుకోవాలి. బాగా తర్వాత తేలికపాటి క్లెన్సర్‌ను ఉపయోగించి ముఖాన్ని శుభ్రం చేసుకోవాలి. ఈ మాస్క్ వేసుకోవడం వల్ల చర్మంపై ఉండే బ్లాక్‌హెడ్స్ సులభంగా తొలగిపోతాయి.





కెరీర్ బెస్ట్ ఆరో ర్యాంక్‌లో ప్రణయ్

భారత స్టార్ షట్లర్ హెచ్‌ఎస్ ప్రణయ్ కెరీర్‌లో అత్యుత్తమ ర్యాంక్‌కు ఎగబాకాడు. ప్రపంచ బ్యాడ్మింటన్ సమాఖ్య (బీడబ్ల్యూఎఫ్) మంగళవారం విడుదల చేసిన తాజా ర్యాంకింగ్స్‌లో అతను పురుషుల సింగిల్స్‌లో మూడు స్థానాలు పురోగతి సాధించి తొమ్మిది నుంచి ఆరో ర్యాంక్‌కు చేరుకున్నాడు. గతవారం డెన్మార్క్‌లో జరిగిన ప్రపంచ చాంపియన్‌షిప్‌లో ప్రణయ్ కాంస్య పతకాన్ని సాధించడం అతని ర్యాంకింగ్స్‌పై ప్రభావం చూపింది. గత డిసెంబర్ నుంచి టాప్–10లో స్థిరంగా కొనసాగుతున్న ఏకైక భారత షట్లర్ ప్రణయే కావడం విశేషం.

యూఎస్ ఓపెన్ డబుల్స్ బరిలో సాకేత్



ఆంధ్రప్రదేశ్ టెన్నిస్ స్టార్ సాకేత్ మైనేని ఈ ఏడాది నాలుగో గ్రాండ్‌స్లామ్ టోర్నీలోనూ పోటీపడనున్నాడు. భారత్‌కే చెందిన యూకీ బాంబ్రీతో కలిసి 77వ ర్యాంకర్ సాకేత్ ఆస్ట్రేలియన్, ఫ్రెంచ్, వింబుల్డన్ టోర్నీలలో బరిలోకి దిగాడు. యూఎస్ ఓపెన్‌లో మాత్రం యూకీతో కాకుండా కరత్‌సెవ్ (రష్యా)తో సాకేత్ జత కట్టాడు. బ్రెజిల్ ప్లేయర్ డెమోలైనర్‌తో కలిసి యూకీ ఆడనున్నాడు. 35 ఏళ్ల సాకేత్ 2016 యూఎస్ ఓపెన్ సింగిల్స్ మెయిన్ 'డ్రా'లో ఆడి తొలి రౌండ్‌లో నిష్క్రమించాడు.

'ఆసియా' సమరానికి సై

- బరిలో ఆరు జట్లు
- నేటినుంచి ఆసియా కప్ వన్డే టోర్నీ
- తొలి పోరులో నేపాల్‌తో పాక్ 'ఢీ'
- భారత్, పాక్ 3 సార్లు తలపడే అవకాశం!
- మ్యాచ్‌లన్నీ మధ్యాహ్నం గం. 3.00 నుంచి స్టార్ స్పోర్ట్స్, హాట్ స్టార్‌లలో ప్రత్యక్ష ప్రసారం



ముల్తాన్: ప్రపంచ కప్ పోరుకు ముందు మరో ప్రధాన టోర్నీకి రంగం సిద్ధమైంది. నేటినుంచి జరిగే ప్రతిష్టాత్మక ఆసియా కప్ సమరంలో ఆరు జట్లు తమ సత్తాను పరీక్షించుకోనున్నాయి. భారత్, పాకిస్తాన్, శ్రీలంక, బంగ్లాదేశ్, అఫ్గానిస్తాన్‌లకు వరల్డ్ కప్‌కు ముందు ఇది ట్రయల్‌గా ఉపయోగపడనుండగా... వరల్డ్ కప్ బరిలో లేని నేపాల్ ఆరో టీమ్‌గా తన ఉనికిని ప్రదర్శించే ప్రయత్నం చేయనుంది. అన్నీ జట్లూ సహజంగానే టైటిల్ లక్ష్యంగా బరిలోకి దిగుతుండగా... ఈ టోర్నీలో భారత్, పాకిస్తాన్ మధ్య జరిగే సమరాలు అభిమానుల్లో ఆసక్తిని రేపుతున్నాయి. కనీసం రెండు సార్లు ఇరు జట్లు తలపడే అవకాశం ఉండగా, ఫైనల్ చేరితే మరోసారి దాయాదుల మధ్య పోరును చూడవచ్చు. నేడు సొంతగడ్డపై జరిగే టోర్నీ తొలి మ్యాచ్‌లో బాబర్ ఆజమ్ నాయకత్వంలోని పాకిస్తాన్ జట్టు రోహిత్ కుమార్ సారథ్యంలోని నేపాల్‌తో తలపడుతుంది. ఫైనల్ మ్యాచ్ సెప్టెంబర్ 17న కొలంబోలో జరుగుతుంది. ఆరు జట్లను రెండు గ్రూప్‌లుగా విభజించారు. లీగ్ దశలో అగ్రస్థానంలో నిలిచే రెండేసి జట్లు ముందంజ వేస్తాయి. సూపర్–4 దశలో మిగిలిన మూడు టీమ్‌లను ఎదుర్కొన్న తర్వాత టాప్–2 టీమ్‌లు ఫైనల్లో తలపడతాయి.

ఫేవరెట్‌గా రోహిత్ బృందం...

ఏడాది క్రితం కూడా యూఏఈలో ఆసియా కప్ జరగ్గా అప్పుడు రాబోయే వరల్డ్ కప్‌ను దృష్టిలో ఉంచుకొని టి20 ఫార్మాట్‌లో నిర్వహించారు. ఇప్పుడు వన్డే వరల్డ్ కప్‌కు సరిగ్గా నెల రోజుల ముందు వన్డే ఫార్మాట్‌లో ఈ టోర్నమెంట్ జరగబోతోంది. అన్ని రకాలుగా పటిష్టంగా ఉన్న భారత్ సహజంగానే ఫేవరెట్‌గా కనిపిస్తుండగా... వరల్డ్ నంబర్‌వన్ ర్యాంక్ హోదాలో పాకిస్తాన్ బరిలోకి దిగుతోంది. భారత్ తమ తొలి మ్యాచ్‌ను సెప్టెంబర్ 2న క్యాండీలో పాకిస్తాన్ జట్టుతో ఆడుతుంది. అనంతరం సెప్టెంబర్ 4న నేపాల్‌తో రెండో మ్యాచ్‌లో తలపడుతుంది. భారత జట్టు ఇటీవల ప్రదర్శన, వ్యక్తిగతంగా ఆటగాళ్ల రికార్డులు, టీమ్ కూర్పును బట్టి చూస్తే భారత్ చాలా పటిష్టంగా కనిపిస్తోంది. శ్రీలంక, బంగ్లాదేశ్ కూడా గట్టి పోటీనిచ్చే స్థితిలో ఉండగా, అఫ్గానిస్తాన్ కూడా సంచలనాలు ఆశిస్తోంది. అధికారికంగా ఆసియా కప్ నిర్వహణ హక్కులు పాకిస్తాన్ బోర్డుకే ఉన్నాయి. అయితే పాకిస్తాన్‌కు వెళ్లేందుకు భారత్ అంగీకరించకపోవడంతో హైబ్రీడ్ మోడల్‌లో టోర్నీని నిర్వహిస్తున్నారు. మొత్తం 13 మ్యాచ్‌లలో 4 మాత్రమే పాకిస్తాన్‌లో జరుగుతుండగా, శ్రీలంక 9 మ్యాచ్‌లకు ఆతిథ్యం ఇవ్వనుంది. శ్రీలంకలో జరిగే మ్యాచ్‌లకు వాన కొంత అంతరాయం కలిగించే అవకాశం ఉంది.

చరిత్ర మనదే...

1984 నుంచి 2022 వరకు 15సార్లు ఆసియా కప్‌ను నిర్వహించారు. 2018లో చివరిసారిగా వన్డే ఫార్మాట్‌లో నిర్వహించగా, నాడు ఫైనల్లో బంగ్లాదేశ్‌ను ఓడించి భారత్ విజేతగా నిలిచింది. ఓవరాల్‌గా భారత్ ఖాతాలో 7 టైటిల్స్ ఉండగా, శ్రీలంక 6 సార్లు ట్రోఫీ గెలుచుకుంది. పాకిస్తాన్ 2 సార్లు విజేతగా నిలిచింది. 2019 వన్డే వరల్డ్ కప్ తర్వాత ఈ ఫార్మాట్‌లో భారత్, పాకిస్తాన్ తలపడటం ఇదే మొదటిసారి కానుంది. గత ఆసియా కప్ (టి20)లో ఇరు జట్ల మధ్య జరిగిన రెండు మ్యాచ్‌లలో చెరో మ్యాచ్ గెలిచి సమంగా నిలవగా... వరల్డ్ కప్‌లో భాగంగా మెల్‌బోర్న్‌లో జరిగిన పోరులో కోహ్లి అద్భుత ఆటతో టీమిండియాను గెలిపించాడు. గత కొన్నేళ్లుగా ఆసియా కప్ సమరాలు కూడా ఆసక్తికరంగా మారాయి. ముఖ్యంగా అఫ్గానిస్తాన్ టీమ్ పురోగతి కారణంగా ఆ జట్టు శ్రీలంకతో, పాక్‌తో, బంగ్లాతో తలపడినప్పుడు ఉద్రిక్తభరిత వాతావరణం ఉంటోంది. అయితే భారత్ మాత్రం సహజంగానే తమ ఆధిపత్యాన్ని ప్రదర్శిస్తూ ఇతర జట్లకంటే ఎప్పుడూ ఒక మెట్టు పైనే ఉంటోంది. టీమిండియా కూడా తమ స్థాయికి తగినట్లుగా ఆడితే మరో టైటిల్ మన ఖాతాలో చేరడం ఖాయం.

జొకోవిచ్ శుభారంభం

- రెండో రౌండ్‌లోకి సెర్బియా స్టార్
- మళ్లీ నంబర్‌వన్ ర్యాంక్ సొంతం
- నాలుగో సీడ్ హోల్గర్ రూనె అవుట్



న్యూయార్క్: కెరీర్‌లో 24వ గ్రాండ్‌స్లామ్ టైటిల్ లక్ష్యంతో యూఎస్ ఓపెన్‌లో బరిలోకి దిగిన సెర్బియా దిగ్గజం నొవాక్ జొకోవిచ్ అలవోకగా రెండో రౌండ్‌లోకి అడుగు పెట్టాడు. మంగళవారం జరిగిన పురుషుల సింగిల్స్ తొలి రౌండ్‌లో రెండో సీడ్ జొకోవిచ్ 6–0, 6–2, 6–3తో అలెగ్జాండర్ ముల్లర్ (ఫ్రాన్స్)పై నెగ్గాడు. ఈ గెలుపుతో 36 ఏళ్ల జొకోవిచ్ యూఎస్ ఓపెన్ ముగిశాక తుది ఫలితంతో సంబంధం లేకుండా మళ్లీ ప్రపంచ నంబర్‌వన్ ర్యాంక్‌ను సొంతం చేసుకుంటాడు. ముల్లర్‌తో గంటా 35 నిమిషాలపాటు జరిగిన మ్యాచ్‌లో జొకోవిచ్ ఆరు ఏస్‌లు సంధించాడు. నెట్ వద్దకు 23 సార్లు దూసుకొచ్చి 20 సార్లు పాయింట్లు గెలిచాడు. ప్రత్యర్థి సర్వీస్‌ను ఎనిమిదిసార్లు బ్రేక్ చేసి తన సర్వీస్‌ను ఒకసారి కోల్పోయాడు. మరోవైపు నాలుగో సీడ్ హోల్గర్ రూనె (డెన్మార్క్) పోరాటం తొలి రౌండ్‌లోనే ముగిసింది. ఈ ఏడాది ఫ్రెంచ్ ఓపెన్, వింబుల్డన్ టోర్నీల్లో క్వార్టర్ ఫైనల్ చేరిన రూనె 3–6, 6–4, 3–6, 2–6తో కార్‌బెలాస్ బేనా (స్పెయిన్) చేతిలో ఓడిపోయాడు. ఏడో సీడ్ సిట్సిపాస్ (గ్రీస్), పదో సీడ్ టియాఫో (అమెరికా), తొమ్మిదో సీడ్ టేలర్ ఫ్రిట్జ్ (అమెరికా) రెండో రౌండ్‌లోకి ప్రవేశించారు.

మహిళల సింగిల్స్‌లో ఆరో సీడ్ కోకో గాఫ్ (అమెరికా) కష్టపడి రెండో రౌండ్‌కు చేరగా... రెండు సార్లు మాజీ రన్నరప్ వొజ్నియాకి (డెన్మార్క్) సులువుగా రెండో రౌండ్‌లోకి అడుగు పెట్టింది. కోకో గాఫ్ 2 గంటల 51 నిమిషాల్లో 3–6, 6–2, 6–4తో సిగెముండ్ (జర్మనీ)పై, వొజ్నియాకి 6–3, 6–2తో ప్రొజోరోవా (రష్యా)పై గెలిచారు.

రెండు మ్యాచ్‌లకు కేఎల్ రాహుల్ దూరం



బెంగళూరు: సుదీర్ఘ కాలం తర్వాత భారత జట్టులోకి పునరాగమనం చేసిన కేఎల్ రాహుల్ బరిలోకి దిగేందుకు మరికొంత సమయం వేచి చూడక తప్పదు. సెలక్టర్లు ఊహించినట్లుగానే స్వల్ప 'అసౌకర్యం'తో బాధపడుతున్న అతను ఆసియా కప్‌లో భారత్ ఆడే తొలి రెండు మ్యాచ్‌లకు దూరమయ్యాడు. గాయం నుంచి కోలుకున్న తర్వాత కూడా రాహుల్ పూర్తి ఫిట్‌గా మారలేదు. ఈ విషయాన్ని హెడ్ కోచ్ రాహుల్ ద్రవిడ్ నిర్ధారించాడు. భారత జట్టుతోపాటు శ్రీలంకకు ప్రయాణించకుండా రాహుల్ జాతీయ క్రికెట్ అకాడమీ (ఎన్‌సీఏ)లోనే ఉండిపోనున్నాడు. సెప్టెంబర్ 4న అతని గాయం పరిస్థితిని సమీక్షించి ఆపై నిర్ణయం తీసుకుంటారు. ఐసీసీ నిబంధనల ప్రకారం సెప్టెంబర్ 5 వరకు ప్రపంచ కప్ జట్టును ప్రకటించాల్సి ఉన్న నేపథ్యంలో రాహుల్ కోలుకోగలడా అనేది ఆసక్తికరం.

ప్రజ్ఞానంద జట్టుకు టైటిల్

హరికృష్ణ, హారిక, అర్జున్ జట్లకు కూడా పతకాలు • ప్రపంచ ర్యాపిడ్ టీమ్ చెస్ చాంపియన్‌షిప్



హారిక, అర్జున్, హరికృష్ణ


డసెల్‌డార్ఫ్ (జర్మనీ): గతవారం ప్రపంచకప్ టోర్నమెంట్‌లో రజత పతకం గెలిచి సంచలనం సృష్టించిన భారత యువ గ్రాండ్‌మాస్టర్ ప్రజ్ఞానంద మరోసారి ఆకట్టుకున్నాడు. ప్రపంచ ర్యాపిడ్ టీమ్ చెస్ చాంపియన్‌షిప్‌లో ప్రజ్ఞానంద రాణించి తన జట్టు విజేతగా అవతరించడంలో కీలకపాత్ర పోషించాడు. అంతర్జాతీయ చెస్ సమాఖ్య (ఫిడే) ఆధ్వర్యంలో స్విస్ ఫార్మాట్‌లో 12 రౌండ్లపాటు జరిగిన ఈ టోర్నీలో జర్మనీ వ్యాపారవేత్త, చెస్ ప్లేయర్ అయిన వాదిమ్ రోసెన్‌స్టీన్ (డబ్ల్యూఆర్) జట్టు 22 పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచింది. డబ్ల్యూఆర్ జట్టుకు గ్రాండ్‌మాస్టర్లు ప్రజ్ఞానంద, సో వెస్లీ (అమెరికా), నోదిర్‌బెక్ (ఉజ్బెకిస్తాన్), నిపోమ్‌నిషి (రష్యా), క్రిస్టాఫ్ (పోలాండ్), కీమర్ (జర్మనీ), హు ఇఫాన్ (చైనా), కోస్టెనిక్ (స్విట్జర్లాండ్), వాదిమ్ రోసెన్‌స్టీన్ (జర్మనీ) ప్రాతినిధ్యం వహించారు. ప్రజ్ఞానంద మొత్తం ఏడు గేమ్‌లు ఆడి ఆరు గేముల్లో గెలిచి, మరో గేమ్‌ను 'డ్రా'గా ముగించి 6.5 పాయింట్లు సాధించాడు. భారత దిగ్గజం విశ్వనాథన్ ఆనంద్, విదిత్ సంతోష్ గుజరాతి, డానిల్ దుబోవ్ తదితరులు సభ్యులుగా ఉన్న ఫ్రీడమ్ జట్టు 20 పాయింట్లతో రెండో స్థానంలో నిలిచి రజత పతకం సొంతం చేసుకుంది. పుణేకు చెందిన ఎంజీడీ1 జట్టు 18 పాయింట్లతో మూడో స్థానంలో నిలిచి కాంస్య పతకాన్ని సాధించింది. ఎంజీడీ1 జట్టు తరపున భారత గ్రాండ్‌మాస్టర్లు హరికృష్ణ, హారిక, అర్జున్, నిహాల్ సరీన్, రౌనక్, ఆదిత్య మిట్టల్, శ్రీనాథ్ నారాయణన్, గునే మమద్‌జాడా (అజర్‌బైజాన్) పోటీపడ్డారు. వ్యక్తిగత విభాగాల కొస్తే బోర్డు–1పై హరికృష్ణ కాంస్యం, బోర్డు–3పై విదిత్, అర్జున్ రజత, కాంస్య పతకాలను నెగ్గారు. బోర్డు–7పై హారిక రజత పతకం దక్కించుకుంది.



ప్రజ్ఞానంద

'సోల్డ్ అవుట్'

భారత జట్టు వరల్డ్ కప్ మ్యాచ్‌ల టికెట్లు ఫినిష్



న్యూఢిల్లీ: 'మీరు క్యూలో ఉన్నారు... దయచేసి కాసేపు వేచి ఉండండి'... ఈ కాసేపు కాస్తా గంట నుంచి 10 గంటల వరకు కూడా చూపించింది! చివరకు కొద్ది సేపట్లోనే అది కాస్తా 'సోల్డ్ అవుట్' బోర్డుతో ముగిసింది. వన్డే వరల్డ్ కప్ టికెట్ల కోసం మంగళవారం ఆన్‌లైన్‌లో ప్రయత్నించిన భారత అభిమానుల్లో ఎక్కువ మందికి ఇదే తరహాలో నిరాశ ఎదురైంది. భారత్ ఆడే 9 లీగ్ మ్యాచ్‌లకు సంబంధించి 'మాస్టర్ కార్డ్' వినియోగదారుల కోసమే ప్రత్యేకంగా సాయంత్రం 6 గంటల నుంచి 'బుక్ మై షో'లో టికెట్లు అందుబాటులో ఉంచారు. అయితే గంటల వ్యవధిలోనే అన్ని మ్యాచ్‌ల టికెట్లు అమ్ముడుపోయాయి. ఇప్పుడు 9 మ్యాచ్‌లకు కూడా 'సోల్డ్ అవుట్' అనే చూపిస్తోంది. నిజానికి గత బుధవారం బీసీసీఐ ఇచ్చిన సమాచారం ప్రకారం 31 ఆగస్టు నుంచి 3 సెప్టెంబర్ వరకు భారత లీగ్ మ్యాచ్‌లకు సాధారణ అభిమానుల కోసం దశలవారీగా టికెట్లు అమ్ముతారు. అయితే ఇప్పుడు 'సోల్డ్ అవుట్' అంటే పూర్తిగా అమ్ముడుపోయాయా లేక పరిమిత సంఖ్యలో 'మాస్టర్ కార్డ్' కోసం అందుబాటులో ఉంచి మిగతా టికెట్లు ఆపి ఉంచారా తెలీదు. అసలు టికెట్ల సంఖ్య విషయంలో ఎలాంటి స్పష్టత లేదు. ఈ నేపథ్యంలో ఫ్యాన్స్ ఆయా తేదీల్లో మరోసారి తమ అదృష్టాన్ని పరీక్షించుకోవాల్సిందే!

సినిమా



• మిర్నా మీనన్

• అనుపమా పరమేశ్వరన్

రాకేష్ మరిన్ని సినిమాలు చేయాలి

- మంత్రి రోజా సెల్వమణి



• రోజా, రాకేష్, సంతోష్‌కుమార్, తనికెళ్ల భరణి

'జబర్దస్త్' ఫేమ్ రాకింగ్ రాకేష్ హీరోగా పరిచయమవుతున్న చిత్రం ప్రారంభోత్సవం మంగళవారం హైదరాబాద్‌లో జరిగింది. తొలి సన్నివేశానికి ఆంధ్రప్రదేశ్ పర్యాటక శాఖ మంత్రి రోజా సెల్వమణి కెమెరా స్విచ్చాన్ చేయగా, తెలంగాణ ఎంపీ (రాజ్యసభ) సంతోష్ కుమార్ క్లాప్ ఇచ్చారు. నటుడు తనికెళ్ల భరణి గౌరవ దర్శకత్వం వహించగా, నటుడు సాయికుమార్ మేకర్స్‌కి స్క్రిప్ట్ అందజేశారు. గ్రీన్ ట్రీ ప్రొడక్షన్స్ పతాకంపై జయలక్ష్మీ సాయి కుమార్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి సినిమాటోగ్రాఫర్ అంజి దర్శకత్వం వహిస్తుండగా, అనన్యా నాగళ్ల హీరోయిన్‌గా నటిస్తున్నారు. ఈ సినిమా ప్రారంభోత్సవంలో రోజా మాట్లాడుతూ– ''రాకేష్‌కి ఎప్పట్నుంచో లీడ్ రోల్ చేయాలని ఉంది. ఈ సినిమాతో అది నెరవేరడం హ్యాపీగా ఉంది. ఈ సినిమా విజయం సాధించి, భవిష్యత్‌లో రాకేష్ మరిన్ని సినిమాలు చేసి, ప్రజలకు వినో దాన్ని పంచాలని కోరుకుంటున్నాను'' అన్నారు. ''నటుడిగా, నిర్మాతగా రాకేష్ మరెన్నో సినిమాలు చేసి, మంచి పేరు తెచ్చుకోవాలి'' అన్నారు ఎంపీ సంతోష్ కుమార్. ''చిన్న సినిమాలు పెద్దగా అవుతున్నాయి. ఈ సినిమా కూడా పెద్ద విజయం సాధించి, రాకేష్ మరో పది సినిమాలు చేసే స్థాయికి రావాలని కోరుకుంటున్నాను'' అన్నారు తనికెళ్ల భరణి. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్, గ్రీన్ ఇండియా ఛాలెంజ్ ఫౌండర్ రాఘవ తదితరులు పాల్గొన్నారు. ఈ సినిమాకు సంగీతం: చరణ్ అర్జున్.

ఈసారి పండక్కి.. నా సామి రంగ



• నాగార్జున

సంక్రాంతికి 'నా సామి రంగ' అంటున్నారు నాగార్జున. ఆయన హీరోగా నటించనున్న కొత్త సినిమాకు 'నా సామి రంగ' టైటిల్‌ను ఖరారు చేశారు. కొరియోగ్రాఫర్ విజయ్ బిన్నిని దర్శకుడిగా పరిచయం చేస్తూ, పవన్‌కుమార్ సమర్పణలో శ్రీనివాసా చిట్టూరి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. మంగళవారం (ఆగస్ట్ 29) నాగార్జున బర్త్ డే. ఈ సందర్భంగా 'నా సామి రంగ'ను ప్రకటించి, ఫస్ట్ లుక్‌ను రిలీజ్ చేసి, ఈ చిత్రాన్ని వచ్చే సంక్రాంతికి రిలీజ్ చేయనున్నట్లు మేకర్స్ వెల్లడించారు. 'ఈసారి పండక్కి నా సామి రంగ' అంటూ ఈ సినిమా అనౌన్స్‌మెంట్ వీడియోలో నాగార్జున పేర్కొన్నారు. ఈ సినిమాతో 'పలాస' ఫేమ్ దర్శకుడు కరుణకుమార్ నటుడిగా పరిచయం అవుతున్నారు. ''సంక్రాంతి సీజన్‌లో నాగార్జునగారికి చాలా హిట్ ఫిల్మ్స్ ఉన్నాయి. వినోదాత్మకంగా సాగే 'నా సామి రంగ' సినిమాను సంక్రాంతికి థియేట్రికల్ రిలీజ్ చేయనున్నాం. బెజవాడ ప్రసన్నకుమార్ ఈ సినిమాకు కథ, డైలాగ్స్ అందిస్తున్నారు'' అని చిత్ర యూనిట్ వెల్లడించింది. ఈ చిత్రానికి సంగీతం: ఎం.ఎం. కీరవాణి.

పవర్‌ఫుల్ రోల్: ధనుష్ హీరోగా శేఖర్ కమ్ముల దర్శకత్వంలో ఓ సినిమా రూపొందనున్న సంగతి తెలిసిందే. ఇందులో రష్మికా మందన్నా హీరోయిన్. సోనాలి నారంగ్ సమర్పణలో సునీల్ నారంగ్, పుస్కూర్ రామ్మోహన్‌రావు నిర్మించనున్న చిత్రం ఇది. ఈ చిత్రంలో నాగార్జున ఓ పవర్‌ఫుల్ రోల్ చేయనున్నట్లు యూనిట్ ప్రకటించింది.

కలర్‌ఫుల్ ఓనమ్



• ఇన్ని లాగించాలా అంటున్న అనుపమ

పంటలు ఇంటికి వచ్చిన వేళ..
వంటలు ఘుమఘుమలాడిన వేళ..
ఇంట్లో పండగ వేళ... ఇలా ఓనమ్ పండగను ఘనంగా జరుపుకున్నారు కొందరు తారలు. కేరళ ప్రాంతంలో పంటలు వచ్చే ఈ మాసంలో ఓనమ్ పండగ జరుపుకుంటారు. మంగళవారం పండగ సందర్భంగా పలువురు కథానాయికలు అందంగా ముస్తాబై, మెరిసిపోయారు. ఓనమ్ సాద్య పేరుతో దాదాపు 26 రకాల వంటకాలను అరిటాకులో వడ్డించుకుని, ఆరగించారు. పండగ ఫొటోలను సోషల్ మీడియా వేదికగా షేర్ చేశారు.



• అదా శర్మ



• అపర్ణా దాస్ • కళ్యాణి • మాళవికా మోహనన్

ఆ పాయింట్‌తో ఖుషి తీశామనేది అవాస్తవం

- దర్శకుడు శివ నిర్వాణ



''నిన్ను కోరి, మజిలీ' వంటి నా గత చిత్రాల్లో విఫలమైన ప్రేమకథలను చూపించాను. కానీ, ఈసారి పూర్తి స్థాయి వినోదం, ఉత్సాహంగా ఉండే ప్రేమ కథ తీయాలని 'ఖుషి' చేశాను'' అన్నారు శివ నిర్వాణ. విజయ్ దేవరకొండ, సమంత జంటగా నటించిన చిత్రం 'ఖుషి'. నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ నిర్మించిన ఈ సినిమా సెప్టెంబర్ 1న రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా చిత్రదర్శకుడు శివ నిర్వాణ చెప్పిన విశేషాలు.

• డైరెక్టర్ మణిరత్నంగారి ఫ్యాన్‌గా ఆయన దగ్గర చేరాలనుకుని చెన్నై వెళ్లాను. కానీ ఆయన్ను కలవడానికి కుదరలేదు. మణిరత్నంగారి సినిమాలను ఇష్టపడతాను కానీ ఆయనలా తీయాలనుకోను. ఆయన తీసిన 'సఖి' లాంటి పాయింట్‌తో 'ఖుషి' తీశామనే వార్తలు అవాస్తవం. • ప్రస్తుత సమాజంలోని ఒక సమకాలీన అంశాన్ని విజయ్, సమంతలాంటి స్టార్స్ ద్వారా చూపిస్తే బాగుంటుందని నమ్మాను. ప్రేమకథను ఎంత కొత్తగా చెప్పాలనే ఆలోచన నుంచి పుట్టిందే కాశ్మీర్ నేపథ్యం. ఈ చిత్రంలో విజయ్ పాత్ర అమ్మాయిలకు, కుటుంబ ప్రేక్షకులకు బాగా నచ్చుతుంది. సమంత వాస్తవ జీవితానికి, ఈ చిత్రానికి ఎలాంటి సంబంధం లేదు. • నిర్మాతలు నవీన్, రవిశంకర్‌గార్లు డైరెక్టర్స్‌కు స్వేచ్ఛ ఇస్తారు కాబట్టి సంతోషంగా సినిమా చేసుకోవచ్చు. హేషమ్ అద్భుతమైన మ్యూజిక్ ఇచ్చాడు. నేను డైరెక్ట్ చేసిన 'నిన్ను కోరి, మజిలీ, టక్ జగదీశ్' సినిమాల్లో కొన్ని పాటలు రాశాను. కానీ, 'ఖుషి'కి అన్ని పాటలు రాయాల్సి వచ్చింది.. రాశాను. • మనం పాన్ ఇండియా సినిమా చేయాలని ముందే అనుకుని, కథ రాసుకోనవసరం లేదనేది నా అభిప్రాయం. 'బాహుబలి, పుష్ప, ఆర్ఆర్ఆర్, కార్తికేయ 2' వంటి సినిమాలన్నీ మన నేటివిటీకి నచ్చేలా చేసుకున్నవి. ఇతర భాషల వాళ్లు కూడా వాటిని ఇష్టపడ్డారు కాబట్టి పాన్ ఇండియా సినిమాలు అయ్యాయి. మనకు నచ్చే మన నేటివిటీ సినిమా బాగా చేసుకుంటే అది ఇతరులకు నచ్చి పాన్ ఇండియా మూవీ అవుతుందన్నది నా అభిప్రాయం.

ప్రేక్షకులు నవ్వితే వచ్చే తృప్తే వేరు

- సుప్రియ యార్లగడ్డ



• అనురాగ్, నితిన్ కృష్ణమూర్తి, సుప్రియ, శరత్

''థియేటర్‌లో ప్రేక్షకుల నవ్వులు చూస్తున్నపుడు వచ్చే తృప్తే వేరు. అలాంటి గొప్ప తృప్తి, మజాని ఇచ్చిన చిత్రం 'బాయ్స్ హాస్టల్'' అని నిర్మాత సుప్రియ యార్లగడ్డ అన్నారు. ప్రజ్వల్ బీపీ, మంజునాథ్ నాయక, రాకేష్ రాజ్‌కుమార్, శ్రీవత్స, తేజస్ జయన్న ఉర్స్ ప్రధాన పాత్రల్లో, రిషబ్ శెట్టి, పవన్ కుమార్, షైన్ శెట్టి, రష్మీ గౌతమ్, తరుణ్ భాస్కర్ అతిథి పాత్రల్లో నటించిన చిత్రం 'బాయ్స్ హాస్టల్'. నితిన్ కృష్ణమూర్తి దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని అన్నపూర్ణ స్టూడియోస్, చాయ్ బిస్కెట్ ఫిలింస్ ఈ నెల 26న తెలుగులో రిలీజ్ చేశాయి. ఈ సందర్భంగా సక్సెస్ మీట్‌లో నిర్మాత అనురాగ్ రెడ్డి మాట్లాడుతూ– ''బాయ్స్ హాస్టల్' చూస్తే కొత్త అనుభూతిని పొందుతారు'' అన్నారు ''విద్యార్థుల కోసం టికెట్ వన్ ప్లస్ వన్ ఆఫర్ పెట్టాం'' అన్నారు నిర్మాత శరత్. ''మా చిత్రాన్ని ఆదరిస్తున్న తెలుగు ప్రేక్షకులకు కృతజ్ఞతలు'' అన్నారు నితిన్ కృష్ణమూర్తి.

నరకాసురుడి యాక్షన్



• రక్షిత్

రక్షిత్ అట్లూరి, అపర్ణ జనార్థన్, సంకీర్తన విపిన్, శత్రు కీలక పాత్రల్లో సెబాస్టియన్ దర్శకత్వం వహించిన చిత్రం 'నరకాసుర'. ఆజ్జా శ్రీనివాస్, కారుమూరు రఘు నిర్మించిన ఈ సినిమా సెప్టెంబర్ రెండో వారంలో రిలీజ్ కానుంది. ''నరకాసుర' అనే రాక్షసుడి జననం నేపథ్యంలో యాక్షన్ థ్రిల్లర్‌గా ఈ చిత్రాన్ని తెరకెక్కించాం'' అన్నారు సెబాస్టియన్. ''మా సినిమా టీజర్ బాగుందని చాలామంది ప్రశంసించారు. తెలుగు, హిందీ, తమిళ, మలయాళ, కన్నడ భాషల్లో ఈ చిత్రాన్ని విడుదల చేస్తాం'' అన్నారు నిర్మాతలు.

సాక్షి బిజినెస్
బుధవారం
30-8-2023

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▲
79	37
65,076	19,343

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (సోమ రెండు రాత్రి 11.30 గంటలకు)

నాస్‌డాక్	13,923	▲	218
డోజోన్స్	34,794	▲	234
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,465	▲	126
డాక్స్	15,931	▲	138
షాంఘై	3,136	▲	37
నికాయ్	32,227	▲	57

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో

ముంబై	
బంగారం (99.9 స్వచ్ఛత)	58,869
బంగారం (99.5 స్వచ్ఛత)	58,633
వెండి (కిలో)	73,781

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	81.80	83.47
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	102.44	105.82
€	యూరో	ఎస్‌బీఐ	87.80	90.88
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	55.54	57.28
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	52.06	54.35
S$	సింగపూర్ డాలర్	ఎస్‌బీఐ	59.99	61.94
SAR	సౌదీ రియాల్	[illegible]	21.10	22.72
UAE D	యూఏఈ దిర్హామ్	[illegible]	21.602	23.34
¥	చైనా యువాన్	[illegible]	10.22	12.29

టయోటా నుంచి తొలి ఫ్లెక్స్ ఫ్యూయల్ వాహనం

ఆవిష్కరించిన కేంద్ర మంత్రి గడ్కరీ



న్యూఢిల్లీ: ఆటోమొబైల్ సంస్థ టయోటా తాజాగా ప్రపంచంలోనే తొలి 'బీఎస్ 6 (స్టేజ్ 2) ఎలక్ట్రిఫైడ్ ఫ్లెక్స్ ఫ్యూయల్' ఆధారిత వాహనాన్ని రూపొందించింది. దీని నమూనాను కేంద్ర రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ మంగళవారం ఆవిష్కరించారు. ఈ వాహనాన్ని రాబోయే రోజుల్లో మరింత మెరుగ్గా తీర్చిదిద్దుతారని ఆయన తెలిపారు. ఇటు విద్యుత్, అటు 20 శాతానికి మించి ఇథనాల్ మిశ్రమం ఉన్న ఇంధనంతో కూడా ఇది నడుస్తుంది. కాలుష్యాన్ని తగ్గించడంలోనూ, వ్యవసాయ రంగంలో మరిన్ని ఉపాధి అవకాశాలు కల్పించడంలోనూ తోడ్పడే టెక్నాలజీని రూపొందించిందని టయోటా కిర్లోస్కర్ సంస్థకు మంత్రి ఈ సందర్భంగా అభినందనలు తెలిపారు. వివిధ రకాల ఇంధనాలతో పని చేయగలిగే ఇంజిన్ గల వాహనాన్ని ఫ్లెక్స్ ఫ్యూయల్ వాహనంగా వ్యవహరిస్తారు. ఇన్నోవా హైక్రాస్ మోడల్ ఆధారంగా, కొత్త బీఎస్ 6 ఉద్గార ప్రమాణాలకు అనుగుణంగా టయోటా కిర్లోస్కర్ .. ఈ ఎలక్ట్రిక్ ఫ్లెక్స్ ఫ్యూయల్ వాహనాన్ని రూపొందించింది. మరోవైపు, దేశీయంగా ఇథనాల్‌కు డిమాండ్ పెరిగే కొద్దీ రైతులు 'అన్నదాతలు'గా మాత్రమే కాకుండా 'శక్తి దాతలు'గా కూడా మారగలరని గడ్కరీ వ్యాఖ్యానించారు. ఇథనాల్ ఎకానమీ రూ. 2 లక్షల కోట్ల స్థాయికి చేరిన రోజున .. ప్రస్తుతం 12 శాతంగా ఉన్న వ్యవసాయ రంగం వృద్ధి రేటు 20 శాతానికి చేరగలదని ఆయన పేర్కొన్నారు.

మార్కెట్లోకి మళ్లీ హీరో కరిజ్మా..

ధర రూ. 1.72 లక్షలు



న్యూఢిల్లీ: ద్విచక్ర వాహనాల తయారీ సంస్థ హీరో మోటోకార్ప్ తాజాగా కరిజ్మా బ్రాండ్‌ను మళ్లీ మార్కెట్లోకి ప్రవేశపెట్టింది. కరిజ్మా ఎక్స్ఎంఆర్ 210 సీసీ బైక్‌ను ఆవిష్కరించింది. దీని ప్రారంభ ధర రూ. 1.72 లక్షలుగా (ఎక్స్‌షోరూం) ఉంటుంది. ప్రీమియం సెగ్మెంట్‌లో తమ వాటాన్ని పెంచుకునే దిశగా తమకు ఇది మరో మైలురాయి అని హీరో మోటోకార్ప్ సీఈవో నిరంజన్ గుప్తా తెలిపారు. తాము ప్రస్తుతం ఈ విభాగంలో ఇప్పుడిప్పుడే కార్యకలాపాలు ప్రారంభిస్తున్నామని, మార్కెట్ వాటా 4–5 శాతం మాత్రమే ఉందని ఆయన పేర్కొన్నారు. ప్రీమియం ఉత్పత్తుల పోర్ట్‌ఫోలియోను పూర్తి స్థాయిలో వేగవంతంగా రూపొందించుకోనున్నట్లు గుప్తా చెప్పారు. ప్రస్తుతం 150 సీసీ లోపు సెగ్మెంట్‌లో అగ్రస్థానంలో ఉన్న హీరో మోటోకార్ప్ ఇకపై 150 సీసీ నుంచి 450 సీసీ వరకు బైక్‌ల సెగ్మెంట్‌లో స్థానాన్ని పటిష్టం చేసుకోవడంపై దృష్టి పెట్టనుంది. ఇందులో భాగంగా వచ్చే ఏడాది వ్యవధిలో ప్రతి మూడు నెలలకోసారి ఒక కొత్త ఉత్పత్తిని ప్రవేశపెట్టాలని యోచిస్తోంది.

రెండో రోజూ స్వల్ప లాభాలు

- 65 వేలపైకి సెన్సెక్స్
- నిఫ్టీ లాభం 37 పాయింట్లు
- మెరిసిన మెటల్, విద్యుత్ షేర్లు



ముంబై: ట్రేడింగ్‌ను ప్రభావితం చేసే కీలకాంశాలేవీ లేకపోవడంతో స్టాక్ సూచీలు రెండో రోజూ స్వల్ప లాభాలతో సరిపెట్టుకున్నాయి. ఇటీవల విదేశీ ఇన్వెస్టర్లు దేశీయ ఈక్విటీలను అమ్మేస్తుండటంతో ట్రేడర్లు ఆచితూచి వ్యవహరించారు. ఇంట్రాడేలో 232 పాయింట్ల పరిధిలో కదలాడిన సెన్సెక్స్ చివరికి 79 పాయింట్ల లాభంతో 65వేల స్థాయిపైన 65,076 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 37 పాయింట్లు పెరిగి 19,343 వద్ద నిలిచింది. మెటల్, రియల్టీ, యుటిలిటీ, విద్యుత్, కన్జూమర్ రంగాల షేర్లు రాణించాయి. ఎఫ్ఎంసీజీ, టెలికం, బ్యాంకింగ్ షేర్లు డీలా పడ్డాయి.

మార్కెట్లో మరిన్ని సంగతులు

- పిరమిడ్ టెక్నోప్లాస్ట్ షేరు లిస్టింగ్‌లో పర్వాలేదనిపించింది. ఇష్యూ ధర (రూ.166)తో బీఎస్ఈలో 11% ప్రీమియంతో రూ.185 వద్ద లిస్టయ్యింది. 13% ఎగసి రూ.188 వద్ద గరిష్టాన్ని తాకింది. లాభాల స్వీకరణతో చివరికి 6% లాభపడి రూ.176 వద్ద స్థిరపడింది.
- గార్మెంట్ తయారీ, ఎగుమతిదారు గోకుల్‌దాస్ ఎక్స్‌పోర్ట్స్ సంస్థ షేరు 20% ర్యాలీ చేసి రూ.736 వద్ద స్థిరపడింది. యూఎస్‌ఏకి చెందిన దుస్తుల తయారీ కంపెనీ అట్రాకోను 55 మిలియన్ డాలర్ల(దాదాపు రూ.455 కోట్లు)కు కొనుగోలు చేసేందుకు ఒప్పందం కుదుర్చుకోవడంతో ఈ షేరుకు డిమాండ్ లభించింది.
- బల్క్ డీల్ ద్వారా జామ్‌నగర్ యుటిలిటీస్ 5 కోట్ల ఈక్విటీలను కొనుగోలు చేసినట్లు వార్తలు వెలుగులో రావడంతో జియో ఫైనాన్సియల్ సర్వీసెస్ షేరు 5% ర్యాలీ చేసి రూ.222 వద్ద అప్పర్ సర్క్యూట్‌ను తాకింది.

మూడేళ్లలో 500 కొత్త స్టోర్లు

సెంచురీ మ్యాట్రెసెస్ ఈడీ ఉత్తమ్ వెల్లడి



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: వచ్చే మూడేళ్లలో ఎక్స్‌క్లూజివ్ స్టోర్స్ (ఈబీవో) సంఖ్యను 1,000కి చేర్చుకోనున్నట్లు సెంచురీ మ్యాట్రెసెస్ ఈడీ ఉత్తమ్ మలానీ తెలిపారు. ప్రస్తుతం 500 ఉండగా మరో 500 స్టోర్స్ ప్రారంభించనున్నట్లు వివరించారు. తెలంగాణలో 100 ఈబీవోలు ఉన్నాయని, ఈ ఏడాది చివరికి 200కు పెంచుకుంటున్నామన్నారు. మరోవైపు, దేశీయంగా మ్యాట్రెస్‌ల మార్కెట్ రూ. 10,000 కోట్లుగా ఉండగా సంఘటిత రంగ వాటా 40% అని, ఇందులో తమకు 10% వాటా ఉందని, దీన్ని మూడేళ్లలో 20%కి పెంచుకోనున్నామని వివరించారు. బ్యాడ్మింటన్ క్రీడాకారిణి పీవీ సింధును సంస్థ బ్రాండ్ అంబాసిడర్‌గా నియమించుకున్న సందర్భంగా మంగళవారమిక్కడ ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మలానీ ఈ విషయాలు చెప్పారు. ఆదాయాలకు సంబంధించి ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 35 శాతం వృద్ధి అంచనా వేస్తున్నట్లు చెప్పారు. ఆరోగ్యకరమైన స్లీప్ సొల్యూషన్స్ అందిస్తూ సెంచురీ అందరి నమ్మకాన్ని చూరగొందని సింధు తెలిపారు.

రూ. 45 వేల కోట్ల పెట్టుబడులు

- ఎనిమిదేళ్లలో రెట్టింపు ఉత్పత్తి లక్ష్యం
- ఏడాదికి 40 లక్షల వాహనాల తయారీ
- మారుతీ సుజుకీ భారీ విస్తరణ ప్రణాళిక



న్యూఢిల్లీ: ఆటోమొబైల్ దిగ్గజం మారుతీ సుజుకీ వచ్చే ఎనిమిదేళ్లలో తమ వార్షికోత్పత్తిని 40 లక్షల యూనిట్లకు పెంచుకోవాలని నిర్దేశించుకుంది. ఇందుకోసం రూ. 45,000 కోట్లు ఇన్వెస్ట్ చేయనుంది. సంస్థ వార్షిక సర్వ సభ్య సమావేశంలో (ఏజీఎం) పాల్గొన్న సందర్భంగా చైర్మన్ ఆర్‌సీ భార్గవ మంగళవారం ఈ మేరకు 'మారుతీ 3.0' వెర్షన్ భారీ విస్తరణ ప్రణాళికలను వెల్లడించారు. తమ సంస్థ 40 ఏళ్లలో వార్షికంగా ఇరవై లక్షల యూనిట్ల తయారీ, అమ్మకాలను సాధించిందని ఆయన చెప్పారు. కంపెనీ ప్రస్థానంలోని మూడో దశలో టర్నోవరును రెట్టింపు చేసుకోవాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వివరించారు. ఈ క్రమంలో ఎలక్ట్రిక్ వాహనాలు, హైబ్రిడ్‌లు, సీఎన్‌జీ మొదలైన టెక్నాలజీలన్నింటినీ పరిశీలించనున్నట్లు భార్గవ చెప్పారు. 2030–31 నాటికి మరో 20 లక్షల వార్షికోత్పత్తి, 28 మోడల్స్‌ను జోడించుకోవాలని భావిస్తున్నట్లు వివరించారు. 'తొలి దశలో మాది ప్రభుత్వ రంగ సంస్థగా ఉండేది. కోవిడ్ మహమ్మారితో మా రెండో దశ ముగిసింది. ప్రపంచంలోనే మూడో అతి పెద్ద కార్ల మార్కెట్‌గా భారత్ ఆవిర్భవించింది. రాబోయే రోజులు చాలా సవాళ్లతో, చాలా అనిశ్చితితో కూడుకున్నవిగా ఉంటాయి. కొత్తగా ఇరవై లక్షల కార్ల సామర్థ్యాన్ని సాధించేందుకు దాదాపు రూ. 45,000 కోట్ల వరకు ఇన్వెస్ట్ చేయాల్సి ఉంటుంది. అది కూడా ద్రవ్యోల్బణంపై ఆధారపడి ఉంటుంది' అని భార్గవ చెప్పారు.

మార్కెట్ వాటా మళ్లీ పెంచుకుంటాం..

చిన్న కార్లకు డిమాండ్ మందగించడంతో తగ్గిన తమ మార్కెట్ వాటాను .. వేగంగా వృద్ధి చెందుతున్న ఎస్‌యూవీ సెగ్మెంట్‌లో స్థానాన్ని పటిష్టం చేసుకోవడం ద్వారా మళ్లీ పెంచుకుంటామని భార్గవ ధీమా వ్యక్తం చేశారు. అటు ఎలక్ట్రిక్ వాహనాల విషయానికొస్తే.. దేశీయంగా విద్యుత్ వాహనాల పరిస్థితుల గురించి కంపెనీ యాజమాన్యం క్షుణ్నంగా అధ్యయనం చేసిందని పేర్కొన్నారు. 2024–25 నుంచి 2030–31 మధ్య కాలంలో ఆరు మోడల్స్‌ను ఉత్పత్తి చేయాలనే ప్రణాళికలు ఉన్నాయని భార్గవ తెలిపారు. ఇక రూ. 10,000కు చేరువకు షేరు ధర చేరిన నేపథ్యంలో స్టాక్‌ను విభజించే అంశాన్ని బోర్డు ముందు ఉంచే అవకాశం ఉందని ఆయన పేర్కొన్నారు.

ఆటోమోటివ్ రంగానికి పీఎల్ఐ స్కీము పొడిగింపు

ఆటోమోటివ్ రంగానికి సంబంధించిన రూ. 25,938 కోట్ల ఉత్పాదకత ఆధారిత ప్రోత్సాహక (పీఎల్ఐ) పథకాన్ని ఏడాది పాటు పొడిగిస్తున్నట్లు కేంద్ర భారీ పరిశ్రమల శాఖ మంత్రి మహేంద్ర నాథ్ పాండే తెలిపారు. వాస్తవంగా 2022–23 నుంచి 2026–27 వరకు ఉద్దేశించిన ఈ స్కీము.. తాజా నిర్ణయంతో 2027–28 వరకు అమల్లో ఉంటుందని పేర్కొన్నారు. సబ్సిడీలను మూడు నెలలకోసారి విడుదల చేయడం, విలువ జోడింపును పరీక్షించే ఏజెన్సీల సంఖ్యను ప్రస్తుతమున్న రెండు నుంచి నాలుగుకు పెంచడం వంటి చర్యలు తీసుకోవాలంటూ పరిశ్రమ వర్గాలు కోరాయని ఆయన చెప్పారు. వాటిని పరిగణనలోకి తీసుకోనున్నట్లు తెలిపారు. 2022 ఏప్రిల్ 1 తర్వాత నుంచి దేశీయంగా తయారైన నిర్దిష్ట అడ్వాన్స్‌డ్ ఆటోమోటివ్ టెక్నాలజీ (ఏఏటీ) ఉత్పత్తుల అమ్మకాలకు ఈ స్కీము వర్తిస్తుంది. దీని పనితీరును సమీక్షించిన సందర్భంగా మంత్రి తాజా వివరాలు వెల్లడించారు. కొత్త టెక్నాలజీ ఉత్పత్తులను దేశీయంగా తయారు చేయడాన్ని ప్రోత్సహించేందుకు ఉద్దేశించిన పీఎల్ఐ స్కీముకి 95 కంపెనీలు దరఖాస్తు చేసుకున్నాయి.

టాటా ఎలక్ట్రిక్ వాహనాలకు కొత్త బ్రాండింగ్



న్యూఢిల్లీ: వచ్చే మూడేళ్లలో పది బ్యాటరీ ఎలక్ట్రిక్ వాహనాలను (ఈవీ) ప్రవేశపెట్టనున్న నేపథ్యంలో టాటా మోటార్స్‌లో భాగమైన టాటా ప్యాసింజర్ ఎలక్ట్రిక్ మొబిలిటీ తమ విద్యుత్ వాహనాలకు సంబంధించి కొత్త బ్రాండ్ గుర్తింపును ఆవిష్కరించింది. 'టాటాడాట్‌ఈవీ' బ్రాండింగ్‌తో కొత్త శకంలోకి ప్రవేశిస్తున్నట్లు సంస్థ హెడ్ (మార్కెటింగ్) వివేక్ శ్రీవత్స తెలిపారు. కస్టమర్లకు మరింత వైవిధ్యమైన, అర్థవంతమైన అనుభూతిని అందించేందుకు ఇది దోహదపడగలదని ఆయన పేర్కొన్నారు. కంపెనీకి ప్రస్తుతం నాలుగు చక్రాల ఈవీల సెగ్మెంట్‌లో 70 శాతం పైగా మార్కెట్ వాటా ఉంది. నెక్సాన్, టియాగో, టిగోర్, ఎక్స్‌ప్రెస్–టీ పేరిట ఈవీలను విక్రయిస్తోంది. 2026 నాటికి పది కొత్త ఈవీలు ఆవిష్కరించే దిశగా 2 బిలియన్ డాలర్లు ఇన్వెస్ట్ చేయనుంది. 2030 నాటికల్లా తమ మొత్తం ప్యాసింజర్ వాహనాల అమ్మకాల్లో విద్యుత్ వాహనాల వాటా సగానికి పైగా ఉంటుందని టాటా మోటార్స్ భావిస్తోంది. ఈ ఏడాది 1 లక్ష పైచిలుకు ఈవీలు విక్రయించాలని లక్ష్యంగా పెట్టుకుంది.

టెక్నో పెయింట్స్ కలర్ బ్యాంక్స్



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: పెయింట్స్ కంపెనీ టెక్నో పెయింట్స్ కలర్ బ్యాంక్స్ టెక్నాలజీని ప్రవేశపెట్టింది. భారత్‌లో అతికొద్ది కంపెనీలే వీటిని వినియోగిస్తున్నాయి. సంస్థ ప్రయాణంలో మైలురాయిగా నిలుస్తుందని టెక్నో పెయింట్స్‌ను ప్రమోట్ చేస్తున్న ఫార్చ్యూన్ గ్రూప్ ఫౌండర్ ఆకూరి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. 'స్మార్ట్‌ఫోన్‌తోనూ ఆపరేట్ చేయగలిగే ఈ కలర్ బ్యాంక్స్‌తో 3,000 పైచిలుకు రంగులను నిమిషాల్లో అందించవచ్చు. ముందుగా 1,000 మంది డీలర్ల వద్ద ఇవి రానున్నాయి. బ్రాండ్ అంబాసిడర్‌గా సినీ నటుడు మహేశ్ బాబు రాకతో మారుమూల పల్లెలకూ కంపెనీ పాకింది. డీలర్ల నుంచి మంచి స్పందన ఉంది. మార్చికల్లా 250 ఎక్స్‌పీరియెన్స్ సెంటర్లను ప్రారంభిస్తున్నాం. హైదరాబాద్ సమీపంలోని పాశమైలారం, చేరియాల్‌తోపాటు ఆంధ్రప్రదేశ్‌లోని నడికుడి వద్ద రూ. 100 కోట్లతో ఏర్పాటవుతున్న ప్లాంట్లలో అక్టోబరులో ఉత్పత్తి మొదలవుతుంది' అని వివరించారు.

జాబ్ పాయింట్

చిత్తూరు జిల్లా ప్రభుత్వాసుపత్రుల్లో 17 పోస్టులు

చిత్తూరు జిల్లా డిస్ట్రిక్ట్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ సొసైటీ(ఎన్‌టీఈపీ) జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో.. కాంట్రాక్ట్ ప్రాతిపదికన వివిధ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 17
» **పోస్టుల వివరాలు:** సీనియర్ ట్రీట్‌మెంట్ సూపర్‌వైజర్–01, సీనియర్ ట్రీట్‌మెంట్ ల్యాబ్–సూపర్‌వైజర్–06, ల్యాబ్ టెక్నీసియన్–03, డీఆర్ టీబీ కౌన్సిలర్–01, అకౌంటెంట్–02, సీనియర్ మెడికల్ ఆఫీసర్–01, డీపీసీ–01, డీపీఎస్–01, పీపీఎం కోఆర్డినేటర్–01.
» **అర్హత:** పోస్టును అనుసరించి ఇంటర్, డీఎంఎల్‌టీ, డిప్లొమా, ఎంబీబీఎస్, పీజీ, డిగ్రీ, సర్టిఫికేట్ కోర్సు, ఎంబీఏ, పీజీ డిప్లొమా ఉత్తీర్ణులై ఉండాలి.
» **ఎంపిక విధానం:** అకడమిక్ మెరిట్, పని అనుభవం, రూల్ ఆఫ్ రిజర్వేషన్, డాక్యుమెంట్ వెరిఫికేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:**
ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
దరఖాస్తును జిల్లా లెప్రసీ ఎయిడ్స్ అండ్ టీబీ కంట్రోల్ ఆఫీస్, ఓపీ నెం. 24, జిల్లా హెడ్‌క్వార్టర్స్ హాస్పిటల్ క్యాంపస్, చిత్తూరు చిరునామకు పంపించాలి.
» **దరఖాస్తులకు చివరితేది:** 30.08.2023.
» **దరఖాస్తు పరిశీలన తేదీలు:** 01.09.2023 నుంచి 07.09.2023 వరకు
» **మెరిట్ జాబితా వెల్లడి తేది:** 08.09.2023 నుంచి 10.09.2023 వరకు
» **వెబ్‌సైట్:** https://chittoor.ap.gov.in

హైదరాబాద్ జిల్లా టీవీవీపీ హాస్పిటల్స్‌లో 69 పోస్టులు

తెలంగాణ వైద్య విధాన పరిషత్, హైదరాబాద్ జిల్లా కార్యాలయం.. ఒప్పంద ప్రాతిపదికన హైదరాబాద్ జిల్లాలోని టీవీవీపీ హాస్పిటల్స్‌లో సివిల్ అసిస్టెంట్ సర్జన్ స్పెషలిస్ట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 69
» **స్పెషాలిటీ:** ఓబీ అండ్ జీ, అనెస్తీషియా, పీడియాట్రిక్స్, రేడియాలజీ, జనరల్ మెడిసిన్, ఆర్థోపెడిక్స్, జనరల్ సర్జరీ, పాథాలజీ.
» **అర్హత:** సంబంధిత స్పెషాలిటీలో మెడికల్ పీజీ/డీఎన్‌బీ/డిప్లొమా ఉత్తీర్ణులై ఉండాలి.
» **వయసు:** 18 నుంచి 44 ఏళ్ల మధ్య ఉండాలి.
» **వేతనం:** నెలకు రూ.1,00,000 చెల్లిస్తారు.
» **ఎంపిక విధానం:** పీజీ/డీఎన్‌బీ/డిప్లొమా మార్కులు, ఉత్తీర్ణత సాధించిన సంవత్సరం ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును ప్రోగ్రామ్ ఆఫీసర్, హైదరాబాద్, నాలుగో అంతస్తు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్, ఖైరతాబాద్ చిరునామకు పంపించాలి.
» **దరఖాస్తులకు చివరితేది:** 06.09.2023.
» **వెబ్‌సైట్:** https://hyderabad.telangana.gov.in

జీజీహెచ్, గుంటూరులో 19 పోస్టులు

గుంటూరులోని ప్రభుత్వ జనరల్ హాస్పిటల్, ట్రామా కేర్‌సెంటర్ కాంట్రాక్ట్ ప్రాతిపదికన వివిధ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 19
» **పోస్టుల వివరాలు:** జనరల్ సర్జన్(న్యూరో సర్జన్)–02,ఆర్థోపెడిక్ సర్జన్–01, అనస్థటిస్ట్–02, క్యాజువాలిటీ మెడికల్ ఆఫీసర్–08, స్టాఫ్ నర్స్–05, ల్యాబ్ టెక్నీషియన్–01.
» **అర్హత:** పోస్టును అనుసరించి పదో తరగతి, ఎంఎల్‌టీ, డిప్లొమా, జీఎన్ఎం, ఎంబీబీఎస్, పీజీ, పీజీ డిప్లొమా ఉత్తీర్ణులై ఉండాలి.
» **వయసు:** 42 ఏళ్లు మించకూడదు.
» **ఎంపిక విధానం:** అకడమిక్ మెరిట్, పని అనుభవం, రూల్ ఆఫ్ రిజర్వేషన్, డాక్యుమెంట్ వెరిఫికేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును వ్యక్తిగతంగా లేదా పోస్టు ద్వారా సూపరింటెండెంట్ కార్యాలయం, ప్రభుత్వ జనరల్ హాస్పిటల్, గుంటూరు చిరునామకు పంపించాలి.
» **దరఖాస్తులకు చివరితేది:** 04.09.2023.
» **వెబ్‌సైట్:** https://guntur.ap.gov.in

యూఐఐసీ, చెన్నైలో 100 పోస్టులు

చెన్నైలోని యునైటెడ్ ఇండియా ఇన్సూరెన్స్ కంపెనీ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్(స్కేల్1) పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 100
» **పోస్టుల వివరాలు:** లీగల్ స్పెషలిస్ట్–25, అకౌంట్స్/ఫైనాన్స్ స్పెషలిస్ట్–24, కంపెనీ స్పెషలిస్ట్–03, యాక్చువరీలు–03, డాక్టర్–20, ఇంజనీర్–22, అగ్రికల్చర్ స్పెషలిస్ట్–03.
» **అర్హత:** సంబంధిత విభాగంలో సీఏ, డిగ్రీ, పీజీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» **వయసు:** 23.08.2023 నాటికి 21 నుంచి 30 ఏళ్ల మధ్య ఉండాలి.
» **ఎంపిక విధానం:** డాక్టర్ పోస్టులకు ఇంటర్వ్యూ ఆధారంగా మిగిలిన ఖాళీలను ఆన్‌లైన్ పరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ చివరితేది:** 14.09.2023.
» **వెబ్‌సైట్:** https://uiic.co.in

ఐఐటీలకు మరో దారి.. జామ్

» పీజీ, పీహెచ్‌డీ ప్రవేశాలకు జామ్ పరీక్ష
» 21 ఐఐటీల్లో మూడు వేలకు పైగా సీట్లు
» సెప్టెంబర్ 5 నుంచి దరఖాస్తుకు అవకాశం

ఐఐటీలంటే దేశంలో ఎంతో క్రేజ్. పదో తరగతి పూర్తవుతూనే ఐఐటీల్లో చేరాలని కలలు కనే వారెందరో!! ఇంటర్‌లో చేరి జేఈఈ మెయిన్, అడ్వాన్స్‌డ్ కోసం నిద్రాహారాలు మాని ప్రిపరేషన్ సాగిస్తారు. కాని పోటీ లక్షల్లో ఉంటే..సీట్లు వేలల్లోనే!! దీంతో ఐఐటీ కల చెదిరి నిరాశతో నిష్క్రమించే వారి సంఖ్యే ఎక్కువ!! అలాంటి వారు తమ ఐఐటీ కల నెరవేర్చుకునేందుకు మరో మార్గం.. జాయింట్ అడ్మిషన్ టెస్ట్ ఫర్ మాస్టర్స్..సంక్షిప్తంగా జామ్!! ఇది జాతీయ స్థాయిలో.. ఐఐటీల్లో ఎమ్మెస్సీ, ఎమ్మెస్సీ పీహెచ్‌డీల్లో ప్రవేశానికి నిర్వహించే పరీక్ష. తాజాగా.. జామ్-2024 నోటిఫికేషన్ విడుదలైంది. ఈ నేపథ్యంలో.. జామ్‌తో ప్రయోజనాలు, ప్రవేశం కల్పించే ఇన్‌స్టిట్యూట్‌లు-కోర్సులు, ప్రవేశ ప్రక్రియ, పరీక్ష విధానం, సిలబస్ విశ్లేషణ, ప్రిపరేషన్ గైడెన్స్..



ఇండియన్ ఇన్‌స్టిట్యూట్స్ ఆఫ్ టెక్నాలజీ(ఐఐటీ)లు.. ఇంజనీరింగ్, సైన్స్ విద్యాబోధనలో ప్రపంచ ప్రఖ్యాతి గడించిన ఇన్‌స్టిట్యూట్స్. వీటిలో బ్యాచిలర్ స్థాయిలో బీటెక్ ప్రోగ్రామ్‌లో అడుగుపెట్టాలని లక్షల మంది విద్యార్థులు ఆశిస్తారు.ఇలాంటి ప్రసిద్ధ ఐఐటీల్లో పీజీస్థాయిలో చేరే అవకాశం కల్పిస్తోంది.. జాయింట్ అడ్మిషన్ టెస్ట్ ఫర్ మాస్టర్స్(జామ్).

ఎమ్మెస్సీ కోర్సులు

జామ్ ద్వారా ఐఐటీలు, కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని ఇతర సాంకేతిక విద్యా సంస్థల్లో మ్యాథమెటిక్స్, సైన్సెస్ విభాగాల్లో ఎమ్మెస్సీ, ఎమ్మెస్సీ+పీహెచ్‌డీ కోర్సుల్లో ప్రవేశాలు కల్పిస్తారు. ఈ పరీక్షను ప్రతి ఏటా ఒక ఐఐటీ నిర్వహిస్తుంది. ఈ ఏడాది ఐఐటీ–చెన్నై నిర్వహిస్తోంది. పరీక్ష తేదీలను సైతం ఖరారు చేసింది.

కోర్సులివే

జామ్ స్కోర్ ద్వారా ప్రవేశం కల్పించే కోర్సులు.. ఎమ్మెస్సీ(రెండేళ్లు); మాస్టర్స్ ఇన్ ఎకనామిక్స్(రెండేళ్లు); జాయింట్ ఎమ్మెస్సీ–పీహెచ్‌డీ; ఎమ్మెస్సీ–పీహెచ్‌డీ డ్యూయల్ డిగ్రీ; పోస్ట్ బ్యాచిలర్ డిగ్రీ ప్రోగ్రామ్స్; ఇంటిగ్రేటెడ్ పీహెచ్‌డీ ప్రోగ్రామ్స్.

అర్హత

సంబంధిత సబ్జెక్టుల్లో బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణత ఉండాలి. డిగ్రీలో కనీసం 55 శాతం మార్కులతో ఉత్తీర్ణత లేదా 5.5 సీజీపీఏ సాధించాలి. 2024లో చివరి సంవత్సరం పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.

మూడు వేలకు పైగా సీట్లు

ప్రస్తుతం దేశంలోని 21 ఐఐటీల్లో.. ఎమ్మెస్సీ, ఇంటిగ్రేటెడ్ ఎమ్మెస్సీ–పీహెచ్‌డీ, ఎమ్మెస్సీ రీసెర్చ్, ఎమ్మెస్సీ–ఎంటెక్ వంటి పలు కోర్సులు అందుబాటులో ఉన్నాయి. వీటిలో మూడు వేలకుపైగా సీట్లకు జామ్ స్కోర్ ఆధారంగా ప్రవేశం కల్పిస్తారు. ఎన్ఐటీలు, ట్రిపుల్ ఐటీలు, కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని ఇతర సాంకేతిక విద్యా సంస్థలు సైతం జామ్‌తో ఎమ్మెస్సీలో ప్రవేశాలు కల్పిస్తున్నాయి. వీటిలో దాదాపు రెండు వేల సీట్లు అందుబాటులో ఉన్నాయి. అదే విధంగా ఐఐఎస్ఈఆర్–పుణె, భోపాల్ క్యాంపస్‌లు, ఐఐఎస్సీ–బెంగళూరు, ఐఐపీఈ, జేఎన్‌సీఏఎస్ఆర్ ఇన్‌స్టిట్యూట్‌లు కూడా జామ్ స్కోర్ ఆధారంగా ఎమ్మెస్సీ, ఇంటిగ్రేటెడ్ ఎమ్మెస్సీ–పీహెచ్‌డీ, ఎంఎస్ బై రీసెర్చ్ కోర్సుల్లో ప్రవేశాలు కల్పిస్తున్నాయి.

ఏడు పేపర్లు

జామ్–2024ను ఏడు టెస్ట్ పేపర్లుగా ఆన్‌లైన్ విధానంలో నిర్వహిస్తారు. అవి.. బయోటెక్నాలజీ, కెమిస్ట్రీ, ఎకనామిక్స్, జియాలజీ, మ్యాథమెటిక్స్, మ్యాథమెటికల్ స్టాటిస్టిక్స్, ఫిజిక్స్. అభ్యర్థులు గరిష్టంగా రెండు పేపర్లలో పరీక్షకు హాజరవ్వొచ్చు. ఈ విషయాన్ని దరఖాస్తు సమయంలోనే పేర్కొనాల్సి ఉంటుంది.

జామ్.. ఇలా

జామ్ పరీక్ష మొత్తం మూడు విభాగాల్లో జరుగుతుంది. వివరాలు..

- సెక్షన్–ఏ: ఇందులో 30 బహుళైచ్ఛిక ప్రశ్నలు (ఎంసీక్యూ) ఉంటాయి. ఇందులో 10 ఒక మార్కు ప్రశ్నలు, 20 రెండు మార్కుల ప్రశ్నలు ఉంటాయి.
- సెక్షన్–బీ: ఈ విభాగంలో 10 మల్టిపుల్ సెలక్ట్ కొశ్చన్స్(ఎంఎస్‌క్యూ) ఇస్తారు. ప్రతి ప్రశ్నకు 2 మార్కులు ఉంటాయి. వీటిలో ఒకటి కంటే ఎక్కువ సరైన సమాధానాలు ఉంటాయి. అభ్యర్థులు అడిగిన ప్రశ్నకు సరితూగే సమాధానాలను గుర్తించాల్సి ఉంటుంది.
- సెక్షన్–సీ: ఈ విభాగంలో 20 న్యూమరికల్ ఆన్సర్ టైప్ ప్రశ్నలు అడుగుతారు. వీటిలో 10 ప్రశ్నలకు 1 మార్కు చొప్పున, 10 ప్రశ్నలకు 2 మార్కులు చొప్పున కేటాయిస్తారు.
- మొత్తం మూడు గంటల వ్యవధిలో వంద మార్కులకు 60 ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వాల్సి ఉంటుంది.
- నెగెటివ్ మార్కింగ్ నిబంధన అమలవుతోంది. ప్రతి తప్పు సమాధానానికి 1/3వ వంతు మార్కు చొప్పున కోత విధిస్తారు.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తు తేదీలు:** సెప్టెంబర్ 5 – అక్టోబర్ 13, 2023
- **అడ్మిట్ కార్డ్ డౌన్‌లోడ్:** జనవరి 8, 2024
- **జామ్ తేదీ:** ఫిబ్రవరి 11, 2024
- **ఫలితాల వెల్లడి:** మార్చి 22, 2024
- **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** https://jam.iitm.ac.in

డిగ్రీ స్థాయి పుస్తకాల అధ్యయనం

జామ్‌లో విజయానికి అభ్యర్థులు తమ అకడమిక్ సబ్జెక్ట్‌లకు సంబంధించి బ్యాచిలర్ డిగ్రీ స్థాయి పుస్తకాలను లోతుగా అధ్యయనం చేయడం ఉపకరిస్తుంది. సబ్జెక్ట్/పేపర్ వారీగా ప్రధానంగా దృష్టి పెట్టాల్సిన అంశాలు..

బయోటెక్నాలజీ

ఇందులో రాణించేందుకు బయాలజీ, కెమిస్ట్రీ, మ్యాథమెటిక్స్‌ను ప్రిపేరవ్వాల్సి ఉంటుంది. బయాలజీ విభాగానికి సంబంధించి పదో తరగతి నుంచి డిగ్రీ స్థాయి వరకు అకడమిక్స్‌ను అభ్యసనం చేయాలి. జనరల్ బయాలజీ, బయోకెమిస్ట్రీ అండ్ ఫిజియాలజీ, బేసిక్ బయోటెక్నాలజీ, మాలిక్యులర్ బయాలజీ, సెల్ బయాలజీ, మైక్రోబయాలజీ చాప్టర్లను ప్రిపేరవ్వాలి. కెమిస్ట్రీకి సంబంధించి పదోతరగతి, ఇంటర్, డిగ్రీ పాఠ్యాంశాలను చదవాలి. మ్యాథ్స్, ఫిజిక్స్‌లను ఇంటర్ స్థాయిలో చదివితే సరిపోతుంది.

కెమిస్ట్రీ

ఫిజికల్ కెమిస్ట్రీ: బేసిక్ మ్యాథమెటికల్ కాన్సెప్టులు, అటామిక్ అండ్ మాలిక్యులర్ స్ట్రక్చర్, థియరీ ఆఫ్ గ్యాసెస్, సాలిడ్ స్టేట్, కెమికల్ థర్మోడైనమిక్స్, కెమికల్ అండ్ ఫేజ్ ఈక్విలిబ్రియా, ఎలక్ట్రోకెమిస్ట్రీ, కెమికల్ కైనటిక్స్, అబ్సార్ప్షన్, స్పెక్ట్రోమెట్రి; ఆర్గానిక్ కెమిస్ట్రీ అండ్ స్పెక్ట్రోమెట్రి బేసిక్ కాన్సెప్టులు, ఆర్గానిక్ రియాక్షన్ మెకానిజం, సింథటిక్ అప్లికేషన్స్, క్వాలిటేటివ్ ఆర్గానిక్ అనాలసిస్, ఆరోమాటిక్ అండ్ హెటిరో సైక్లిక్ కెమిస్ట్రీ. ఇనార్గానిక్ కెమిస్ట్రీలో పిరియాడిక్ టేబుల్, కెమికల్ బాండింగ్, షేప్స్ ఆఫ్ కాంపౌండ్స్, మెయిన్ గ్రూప్ ఎలిమెంట్స్, ట్రాన్సిషన్ మెటల్స్, బయో ఇనార్గానిక్ కెమిస్ట్రీ, అనలిటికల్ కెమిస్ట్రీ.

ఎకనామిక్స్

మైక్రో ఎకనామిక్స్, మాక్రో ఎకనామిక్స్, స్టాటిస్టిక్స్ ఫర్ ఎకనామిక్స్, ఇండియన్ ఎకానమీ, మ్యాథమెటిక్స్ ఫర్ ఎకనామిక్స్‌లను అధ్యయనం చేయాలి.

జియాలజీ

ప్లానెట్ ఎర్త్, జియో మార్ఫాలజీ, స్ట్రక్చరల్ జియాలజీ, పాలియోంటాలజీ, స్టాటిగ్రఫీ, మినరాలజీ, పెట్రోలజీ, ఎకనామిక్ జియాలజీ, అప్లయిడ్ జియాలజీలపై దృష్టి పెట్టాలి.

మ్యాథమెటిక్స్

సీక్వెన్సెస్ అండ్ సిరీస్ ఆఫ్ రియల్ నంబర్స్, ఫంక్షన్స్ ఆఫ్ వన్/టూ/త్రీ రియల్ వేరియబుల్, ఇంటిగ్రల్ క్యాల్కులస్, డిఫరెన్షియల్ ఈక్వేషన్స్, వెక్టార్ క్యాల్కులస్, గ్రూప్ థియరీ, లీనియర్ ఆల్జీబ్రా, రియల్ అనాలసిస్ పాఠ్యాంశాలను ప్రిపేరవ్వాలి.

మ్యాథమెటికల్ స్టాటిస్టిక్స్

ఈ పేపర్‌లో మ్యాథ్స్‌కు 40 శాతం, స్టాటిస్టిక్స్‌కు 60 శాతం వెయిటేజీ ఉంటుంది. మ్యాథ్స్‌కు సంబంధించి సీక్వెన్సెస్ అండ్ సిరీస్, డిఫరెన్షియల్ క్యాల్కులస్, ఇంటిగ్రల్ క్యాల్కులస్, మాట్రిసెస్ చాప్టర్లను అధ్యయనం చేయాలి. స్టాటిస్టిక్స్‌లో ప్రాబబిలిటీ, ర్యాండమ్ వేరియబుల్స్, స్టాండర్డ్ డిస్ట్రిబ్యూషన్, జాయింట్ డిస్ట్రిబ్యూషన్, సాంప్లింగ్ డిస్ట్రిబ్యూషన్, లిమిట్ థీరమ్స్, ఎస్టిమేషన్, టెస్టింగ్ ఆఫ్ హైపో థీసిస్‌లను అధ్యయనం చేయాలి.

ఫిజిక్స్

మ్యాథమెటికల్ మెథడ్స్, మెకానిక్స్ అండ్ జనరల్ ప్రాపర్టీస్ ఆఫ్ మేటర్, ఆసిలేషన్స్, వేవ్స్ అండ్ ఆప్టిక్స్, ఎలక్ట్రిసిటీ అండ్ మ్యాగ్నటిజం, కైనటిక్ థియరీ, థర్మోడైనమిక్స్, మోడ్రన్ ఫిజిక్స్, సాలిడ్ స్టేట్ ఫిజిక్స్, డివైజెస్ అండ్ ఎలక్ట్రానిక్స్ పాఠ్యాంశాలను అధ్యయనం చేయాలి.

క్లుప్తంగా...

సీఐఎంసీ ప్యానెల్ సభ్యుడిగా జస్టిస్ ఎన్వీ రమణ



సాక్షి, హైదరాబాద్: సింగపూర్ ఇంటర్నేషనల్ మీడియేషన్ సెంటర్ (సీఐఎంసీ) ప్యానల్ సభ్యుడిగా సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ నియమితులయ్యారు. సింగపూర్ కన్వెన్షన్ వీక్‌లో పాల్గొనడానికి వెళ్లిన ఆయన సీఐఎంసీ చైర్మన్ జార్జి లిమ్‌తో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా సభ్యుడిగా నియామక పత్రాన్ని అందుకున్నారు. అలాగే భారత్‌కు చెందిన నాలుగు ప్రముఖ కంపెనీలు టాటా, రిలయన్స్, మహీంద్రా, ఆదిత్య బిర్లా గ్రూప్‌లతోనూ జస్టిస్ రమణ సమావేశమయ్యారు.

యూఏఈలో అసిస్టెంట్ మెషీన్ ఆపరేటర్ ఉద్యోగాలు

సాక్షి, హైదరాబాద్: యూఏఈ (యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్)లో అసిస్టెంట్ మెషీన్ ఆపరేటర్‌గా పనిచేసేందుకు అర్హతగల అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు టామ్‌కామ్ (తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్‌పవర్ కంపెనీ లిమిటెడ్) మంగళవారం ఒక ప్రకటనలో తెలిపింది. ఐటీఐ ఫిట్టర్ పూర్తి చేసి ఐదేళ్ల అనుభవం ఉండాలని పేర్కొంది. పూర్తి వివరాలకు www.tomcom.telangana.gov.in వెబ్‌సైట్‌లో లేదా 7893566493/ 8247838789/ 9951909863 నంబర్లలో సంప్రదించాలని లేదా tomcom.adm@gmail.comకు దరఖాస్తు మెయిల్ చేయవచ్చని వెల్లడించింది.


సికింద్రాబాద్-కాకినాడకు ప్రత్యేక రైళ్లు

సాక్షి, హైదరాబాద్: ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకొని సికింద్రాబాద్-కాకినాడ మధ్య ప్రత్యేక రైళ్లు నడుపనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్వో సీహెచ్ రాకేశ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు సికింద్రాబాద్-కాకినాడ (07441/07442) స్పెషల్ ట్రైన్ ఈనెల 31వ తేదీ రాత్రి 9.25 గంటలకు బయల్దేరి మరుసటి రోజు ఉదయం 7.45కి కాకినాడకు చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో సెప్టెంబర్ 1వ తేదీ రాత్రి 8.10 గంటలకు కాకినాడ నుంచి బయల్దేరి మరుసటి రోజు ఉదయం 8.30 గంటలకు సికింద్రాబాద్ చేరుకుంటుంది.

వ్యవసాయ రంగంలో ఉత్పాదకత తగ్గిపోవడం పేదల సంఖ్య పెరిగేందుకు ఒక ప్రధాన కారణంగా నిపుణులు అంచనా వేస్తున్నారు. ఆర్థిక వ్యవస్థ మందగమనం, ఉపాధి అవకాశాలు తగ్గిపోవడం, ధరల పెరుగుదల అవిద్య వంటివి కూడా పేదరికం పెరిగేందుకు దోహదపడినట్లు అంచనా.

దేశంలో దారిద్ర్య రేఖకు దిగువన **10** కోట్ల మంది

- ప్రజల ఆదాయాలపై ప్రభావం చూపించిన కోవిడ్ మహమ్మారి
- ఉద్యోగాలు పోయాయ్..ఆదాయం తగ్గింది..నివాస వసతీ కరువు
- దేశ జనాభాలో 9.2 శాతం మంది పేదరికంలోనే..
- బిహార్, జార్ఖండ్, ఉత్తరప్రదేశ్ వంటి రాష్ట్రాల్లో ఎక్కువ.. కేరళ, పంజాబ్ వంటిచోట్ల తక్కువ



పేదరికం పైపైకి!

యూకేను దెబ్బతీసిన కోవిడ్, యుద్ధాలు
ప్రపంచదేశాలన్నింటి మాదిరిగానే యూకే కూడా కోవిడ్ వల్ల ఇబ్బందులు పడింది. ఇక అఫ్గానిస్తాన్ యుద్ధం, ప్రస్తుత రష్యా-ఉక్రెయిన్ల మధ్య నడుస్తున్న యుద్ధం వల్ల కూడా ఆర్థిక వ్యవస్థకు నష్టం జరిగింది. ఫలితంగా జీవన వ్యయం పెరిగిపోయింది. దీని ప్రభావం యూకేపై కూడా పడింది.
- గారెత్ ఓవెన్, బ్రిటిష్ డిప్యూటీ హైకమిషనర్, హైదరాబాద్



(కంచర్ల యాదగిరిరెడ్డి)

కోవిడ్ మహమ్మారి ప్రపంచాన్ని రకరకాలుగా మార్చేసిందనడంలో సందేహం లేదు! ప్రజల జీవనశైలి, ఆలోచనా విధానంలో మార్పు వచ్చింది. ఆర్థిక స్థితిగతుల్లో మార్పులు చోటు చేసుకున్నాయి. ఉద్యోగాల తీరుతెన్నులు మారిపోయాయి. కొందరికి కొత్త ఉద్యోగాలు వస్తే.. ఇంకొందరికి ఉన్నవి ఊడిపోయాయి. ఉద్యోగాలు ఉన్నా వేతనాలు తగ్గాయి. ముఖ్యంగా ప్రపంచం మొత్తమ్మీద పేదరికం పెరిగింది. ప్రపంచ బ్యాంకు మొదలుకొని అనేక అంతర్జాతీయ సంస్థలు దీన్ని ధ్రువీకరిస్తున్నాయి. మరి ఎందుకు పేదరికం పెరిగింది? ఎలా పెరిగింది? ఎందరు పేదలుగా మారిపోయారు?

పేదరికం పెంచిన కోవిడ్

కోవిడ్ మహమ్మారి కారణంగా అనేక మంది ఆదాయాలు పడిపోయాయని, ఫలితంగా దేశంలో 10 కోట్ల మంది దారిద్ర్య రేఖకు దిగువకు చేరారని తాజా లెక్కలు చెబుతున్నాయి. అయితే పేదరికం పెరగడం అనేది కోవిడ్ వల్ల మాత్రమే జరిగిన పరిణామం కాదని, లెక్కలు తప్పడం వల్ల నిన్నమొన్నటివరకూ పేదల సంఖ్య స్పష్టంగా ప్రపంచానికి తెలియలేదని ప్రపంచ బ్యాంకు అంటోంది. అనేక అభివృద్ధి చెందిన దేశాల్లో జీవన వ్యయాన్ని లెక్కవేయడంలో జరిగిన పొరపాట్ల కారణంగా పేదలు తక్కువగా ఉన్నట్లు కనిపించిందని, వాస్తవానికి వీరి సంఖ్య చాలా ఎక్కువని, గోరుచుట్టుపై రోకటిపోటు చందంగా కోవిడ్ వచ్చిపడటంతో పేదరికం మరింత పెరిగిపోయిందని చెబుతోంది.

ఉద్యోగాలు, ఆదాయంపై ప్రభావం

కోవిడ్ మహమ్మారి సమయంలో చాలామంది తమ ఉద్యోగాలు కోల్పోవడం తెలిసిందే. అయితే వరల్డ్ ఎకనమిక్ ఫోరమ్ అంచనాల ప్రకారం ఇది కేవలం ఉద్యోగాలు కోల్పోవడానికి మాత్రమే పరిమితం కాలేదు. చాలామందికి ఆదాయం తగ్గింది. మరికొంతమంది ఇళ్లూ కోల్పోయారు. ఫలితంగా పేదరికమూ పెరిగింది. పేదల్లోని దిగువ 40 శాతం మందికి 2021లో సగటు ఆదాయం 6.7 శాతం తగ్గిందని వరల్డ్ ఎకనమిక్ ఫోరమ్ అధ్యయనం తేల్చింది. అదే సమయంలో ధనికులైన 40 శాతం మందిలో ఈ తగ్గుదల కేవలం 2.8 శాతం మాత్రమే. కోవిడ్ దెబ్బ నుంచి కోలుకోలేకపోవడం పేదల ఆదాయం తగ్గేందుకు కారణమైంది. అయితే ధనికుల్లో సగం మంది తమ కష్టాల నుంచి బయటపడటం గమనార్హం. ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫిస్కల్ స్టడీస్ ప్రకారం యూకేలో కోవిడ్ దాదాపు ఏడు లక్షల మందిని పేదరికంలోకి నెట్టేసింది. కోవిడ్‌కు ముందు జనాభాలో 15 శాతం మంది పేదరికంలో మగ్గుతుండగా.. తదనంతర పరిస్థితుల్లో ఇది 23 శాతానికి చేరుకోవడం గమనార్హం. అమెరికన్ సెన్సస్ బ్యూరో అంచనాల ప్రకారం 2021లో పేదరికంలో ఉన్న జనాభా 11.6 శాతం. అంటే సుమారు నలభై లక్షల మంది. అయితే కోవిడ్ ముట్టడించిన 2020తో పోలిస్తే ఇందులో పెద్దగా తేడా ఏమీ లేకపోవడం ఆసక్తికరమైన అంశం. యూరప్ విషయానికి వస్తే, చాలా దేశాల్లో నిరుద్యోగ సమస్య బాగా ఎక్కువైంది. యూరోపియన్ కమిషన్ ప్రాంతంలో సుమారు కోటీ ఇరవై లక్షల మంది నిరుద్యోగులు ఉన్నట్లు డిబేటింగ్ యూరప్ సంస్థ చెబుతోంది. ఉద్యోగాల్లో ఉన్నవారిలోనూ మూడొంతుల మంది వేతనాలు తగ్గాయి. దీంతో ఇక్కడ కూడా పేదరికం పెరుగుతున్నట్లు తెలుస్తోంది.

అమెరికా లెక్క అలా.. మనది ఇలా

రోజుకు 1.90 డాలర్లు లేదా అంతకంటే తక్కువ ఆదాయం కలిగిన వారందరూ పేదలే అని ప్రపంచ బ్యాంకు చెబుతోంది. కోవిడ్ కంటే ముందు ఇంతకంటే ఎక్కువ ఆదాయమున్న వారు కూడా మహమ్మారి కారణంగా పేదలుగా మారిపోయారని అంటోంది. ప్రపంచ వ్యాప్తంగా పేదరికంలో ఉన్న వారి మోతాదు 7.8 శాతం నుంచి 9.1 శాతానికి చేరుకుందని లెక్క గట్టింది. ప్రపంచ బ్యాంకు లెక్కల ప్రకారం కూడు, గుడ్డ, నీడలకు కావాల్సినంత కూడా సంపాదించలేని వారే పేదలు. ఈ కనీస అవసరాలు తీర్చుకునేందుకు సగటున 1.90 డాలర్ల వరకూ ఖర్చవుతుందని అంచనా వేసింది. అయితే మన దేశంలో ఈ మూడింటితో పాటు ఆరోగ్యం, విద్య కూడా పొందలేని వారిని దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న వారిగా వర్గీకరిస్తున్నాం. భారత్‌లో పేదరికాన్ని కొలిచేందుకు 'టెండుల్కర్ మెథడాలజీ'ని ఉపయోగిస్తారు. దీని ప్రకారం మనిషి మనుగడ సాగించేందుకు కావాల్సిన కనిష్ఠ మోతాదు కేలరీలకు అయ్యే ఖర్చుతో పాటు, దుస్తులు, నివసించేందుకు పెట్టే వ్యయాన్ని బట్టి పేదలా? కాదా? అన్న వర్గీకరణ జరుగుతుంది. 2021 నాటి జనాభా లెక్కల ప్రకారం దేశ జనాభాలో 9.2 శాతం మంది పేదరికంలో మగ్గుతున్నారు. అయితే వీరి సంఖ్య అన్ని రాష్ట్రాల్లోనూ ఒకేతీరున లేదు. బిహార్, జార్ఖండ్, ఉత్తరప్రదేశ్ వంటి రాష్ట్రాల్లో ఎక్కువగానూ, కేరళ, పంజాబ్ వంటిచోట్ల తక్కువగానూ ఉంది. 2020లోనే పేదల సంఖ్య సుమారు ఏడు కోట్లకు చేరుకుందని రెండు, మూడేళ్లలోనే ఈ సంఖ్య తొమ్మిది కోట్లకు చేరుకుందని ప్రపంచ బ్యాంకు అంచనాలు చెబుతున్నాయి.

16.3 కోట్ల దిగువ మధ్యతరగతి?

రోజుకు 1.90 డాలర్ల కంటే తక్కువ సంపాదించే వారు పేదలైతే..5.5 డాలర్లు సంపాదించేవారిని దిగువ మధ్య తరగతి వారిగా పరిగణిస్తున్నారు. ఈ వర్గీకరణలోకి వచ్చేవారు దేశం మొత్తమ్మీద 16.3 కోట్ల మంది ఉన్నారని ప్రపంచ బ్యాంకు లెక్కలు చెబుతున్నాయి.

పేదరికంపై నడ్జ్ ఫౌండేషన్ పోరు

- సుధా శ్రీనివాసన్, సీఈవో, ద నడ్జ్ ఫౌండేషన్

'ద నడ్జ్ ఇన్‌స్టిట్యూట్' 2015లో బెంగళూరు కేంద్రంగా ప్రారంభమైన లాభాపేక్ష లేని సంస్థ. పేదరిక నిర్మూలన మా లక్ష్యం. ప్రభుత్వం, పౌర సమాజం, కార్పొరేట్ సంస్థలతో కలిసి పనిచేస్తున్నాం. యువతకు వేర్వేరు అంశాల్లో నైపుణ్యాలు అందించేందుకు ఒక డిజిటల్ ప్లాట్‌ఫామ్ ద్వారా కృషి చేస్తున్నాం. అలాగే గ్రామీణ ప్రాంతాల్లోని నిరుపేదల కోసం గ్రామీణాభివృద్ధి కేంద్రం కూడా నడుపుతున్నాం. వీరికోసం రూపొందించిన ప్రత్యేక కార్యక్రమం ఇప్పుడు కర్ణాటక సహా ఎనిమిది రాష్ట్రాల్లో అమలవుతోంది. సమాజ సేవ చేయాలనుకునే సీఈవో, సీఓఓలకూ అవకాశాలు కల్పిస్తున్నాం. ఇప్పటికే సుమారు 30 మంది సీఈవో, సీఓఓలు ఎనిమిది రాష్ట్రాల్లో ప్రభుత్వాల ప్రధాన కార్యదర్శులతో కలిసి పనిచేస్తున్నారు. స్వయం సహాయక బృందాల్లోని సభ్యులకు వ్యక్తిగతంగా రుణాలిచ్చేందుకు. వడ్డీ సబ్సిడీలు కల్పించేందుకు ఆలోచన చేసి అమలు చేయడం వీరు సాధించిన విజయాల్లో ఒకటిగా చెప్పవచ్చు.



ఎన్టీఆర్ స్మారక రూ.100 నాణేలకు భారీ డిమాండ్

మొదటి విడతగా 12 వేల నాణేలు మాత్రమే విడుదల



లక్డీకాపూల్: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావు స్మారక రూ.100 నాణేలకు భారీ డిమాండ్ ఏర్పడింది. కేంద్ర ప్రభుత్వం ఎన్టీఆర్ శతజయంతి సందర్భంగా ఆయన చిత్రంతో కూడిన రూ.100 నాణేన్ని ముద్రించింది. దీనిని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము సోమవారం విడుదల చేసిన సంగతి తెలిసిందే. మొదటి విడతగా 1,2000 నాణేలను ప్రభుత్వం విడుదల చేయగా, వీటి కోసం ఎన్టీఆర్ అభిమానులు పోటీపడుతున్నారు. తెలంగాణ, ఏపీ నుంచి హైదరాబాద్‌కు భారీగా తరలివస్తున్నారు. మంగళవారం సైఫాబాద్‌లోని మింట్ కాంపౌండ్ వద్ద నాణేల అమ్మకాలు ప్రారంభం కాగా, గంటల తరబడి క్యూలో ఉండి ఎన్టీఆర్ నాణేలను చేజిక్కించుకుంటున్నారు. రూ.4,850, రూ.4,380, రూ.4,050గా ధరలు నిర్ణయించిన అధికారులు గిఫ్ట్ బాక్స్‌తోపాటు వంద నాణేన్ని అమ్ముతున్నారు.

ప్రపంచ పోలీస్ గేమ్స్‌లో డీసీపీ శ్రీబాల ప్రతిభ

ఒక స్వర్ణం, ఒక రజతం, మూడు కాంస్య పతకాలు కైవసం

సాక్షి, హైదరాబాద్: కెనడాలోని విన్నిపెగ్‌లో జూలై 28 నుంచి ఆగస్టు 6 వరకు నిర్వహించిన వరల్డ్ పోలీస్, ఫైర్ గేమ్స్-2023లో బ్యాడ్మింటన్, టేబుల్ టెన్నిస్ విభాగాల్లో రాచకొండ పోలీస్ కమిషనరేట్ రోడ్ సేఫ్టీ వింగ్ డిప్యూటీ కమిషనర్ శ్రీబాల సత్తా చాటారు. ఒక స్వర్ణం, ఒక రజతం, మూడు కాంస్యాలు సాధించారు. అంతర్జాతీయ స్థాయిలో తెలంగాణ పోలీస్ ప్రతిభ చూపిన డీసీపీ శ్రీబాలను డీజీపీ అంజనీకుమార్ మంగళవారం తన కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. డీజీపీతోపాటు అడిషనల్ డీజీలు అభిలాషా బిస్త్, సంజయ్ కుమార్ జైన్.. శ్రీబాలకు అభినందనలు తెలిపారు. కాగా, ప్రపంచవ్యాప్తంగా 70 దేశాల నుంచి దాదాపు 8,000 అథ్లెట్లు, లా ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీలు, అగ్నిమాపక సిబ్బంది, పోలీసు అధికారులు 60 మంది ఈ క్రీడల్లో పోటీ పడ్డారు. టేబుల్ టెన్నిస్ మహిళల డబుల్స్ 40 విభాగంలో రజతం, 40+ మిక్స్‌డ్ డబుల్స్‌లో, మహిళల సింగిల్స్‌లో ఆమె కాంస్య పతకాలను గెలుచుకున్నారు. అలాగే బ్యాడ్మింటన్ మహిళల సింగిల్స్ 40+లో స్వర్ణం, 40+ మిక్స్‌డ్ డబుల్స్‌లో కాంస్య పతకాన్ని సాధించారు. వరల్డ్ పోలీస్ అండ్ ఫైర్ గేమ్స్-2022లో కూడా శ్రీబాల టేబుల్ టెన్నిస్‌లో రజత, కాంస్య పతకాలను గెలుచుకున్నారు.

మార్క్‌'ఫ్రాడ్'

➡ ఆయన ఓ మార్క్‌ఫెడ్ అధికారి...కొన్నాళ్ల క్రితం ఇంట్లో ఒక శుభకార్యం జరిగింది. ఆ సమయంలో ఒక ప్రైవేట్ ఫంక్షన్ హాల్ బుక్ చేశారు. అతిథులకు భోజన ఏర్పాట్లు చేశారు. దానికి లక్షల్లో ఖర్చు అయ్యింది. అయితే ఆ ఖర్చును ఒక ప్రైవేట్ బ్యాంకు భరించింది.

➡ మరో అధికారి మూడేళ్ల కాలంలోనే హైదరాబాద్‌లో ఒక విల్లా, మరో జిల్లాలో 10 ఎకరాల భూమి కొనుగోలు చేశారు. కమీషన్ల కారణంగానే ఆయనకు భారీగా సొమ్ము అందిందని సమాచారం.

జాతీయ బ్యాంకు నుంచి తీసుకున్న రుణాలు ప్రైవేట్ బ్యాంకులో జమ

- ఎరువులు అమ్మగా వచ్చిన సొమ్మూ... ప్రైవేట్‌లోనే
- రుణం తీసుకున్న బ్యాంకులోనే ఎందుకు జమ చేయడం లేదన్న ప్రశ్న
- వందల కోట్లపై మార్క్‌ఫెడ్ అధికారుల నిర్వాకం... కమీషన్ల కోసం కక్కుర్తి

సాక్షి, హైదరాబాద్: మార్క్‌ఫెడ్‌లో ఇష్టారాజ్యంగా అక్రమాలు జరుగుతున్నాయనడానికి పైరెండు ఘటనలు ఒక నిదర్శనం. ఒక ప్రైవేట్ బ్యాంకుతో మిలాఖతై ప్రభుత్వ సొమ్ముతో కమీషన్లు పొందుతున్నారు. ప్రభుత్వ సంస్థ అయిన మార్క్‌ఫెడ్ తన ఆర్థిక లావాదేవీలను ప్రైవేట్ బ్యాంకులతో జరుపుతుండటంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఏడాదికి దాదాపు రూ. 2 వేల కోట్ల వరకు లావాదేవీలు ప్రైవేట్ బ్యాంకుతో చేయడం భద్రత దృష్ట్యా సరైన పద్ధతి కాదని మార్క్‌ఫెడ్‌లోని కొందరు అధికారులే వ్యాఖ్యానిస్తున్నారు. ప్రభుత్వ పూచీకత్తుతో జాతీయ బ్యాంకుల నుంచి అప్పులు చేసి, రైతులకు ఇస్తున్న మార్క్‌ఫెడ్, ఆ సొమ్మును ఒకట్రెండు ప్రైవేట్ బ్యాంకుల్లో పెడుతోంది. ఈ ఒక్క యాసంగి సీజన్‌లోనే దాదాపు రూ.826 కోట్లు వివిధ జాతీయ బ్యాంకుల నుంచి అప్పుగా తెచ్చి, ఆ సొమ్మును ఒక ప్రైవేట్ బ్యాంకు ద్వారా రైతులకు అందజేసింది. వానాకాలం సీజన్‌కు చెందిన రూ.వందల కోట్లు, యాసంగి సీజన్‌కు సంబంధించి రూ. వందల కోట్లు ప్రైవేట్ బ్యాంకుల్లోనే పెడుతోంది.

ఒక్క ఏడాదిలోనే రూ.2400 కోట్లు

2022-23లో ఫెర్టిలైజర్స్ అమ్మగా వచ్చిన సొమ్ము దాదాపు రూ. 700 కోట్లు, పంట సేకరణకు తీసుకొచ్చిన దాదాపు రూ. 900 కోట్లు, పంట విక్రయాలకు వచ్చిన దాదాపు రూ. 800 కోట్లు కూడా ప్రైవేట్ బ్యాంకుతోనే లావాదేవీలు జరిపారు.

కమీషన్లు... బహుమతులు.. టూర్ ప్యాకేజీలు

వందలాది కోట్ల రూపాయలు ప్రైవేట్ బ్యాంకులో జమ చేసేందుకు అవకాశం కల్పించిన కొందరు కీలకమైన మార్క్‌ఫెడ్ అధికారులు, ఉద్యోగులకు సంబంధిత ప్రైవేట్ బ్యాంకు భారీ నజరానాలు, కమీషన్లు, బహుమతులు, స్వదేశీ, విదేశీ టూర్ ప్యాకేజీలు ఇస్తున్నట్టు సమాచారం. లక్షల్లో డబ్బు ముట్టజెపుతున్నట్టు తెలిసింది. వాస్తవంగా ప్రైవేట్ బ్యాంకులు షెడ్యూల్ట్ బ్యాంకు లిస్టులో ఉన్నా, జాతీయ బ్యాంకులను కాదని ప్రైవేట్‌లో పెట్టడం రిస్క్‌తో కూడిన వ్యవహారంగానే చెబుతుంటారు. అలాంటి రిస్క్ ఎవరికోసం మార్క్‌ఫెడ్ అధికారులు తీసుకుంటున్నారన్నది ప్రశ్న. ఒకప్పుడు ఆయిల్‌ఫెడ్‌లోనూ ప్రైవేట్ బ్యాంకులో డబ్బులు జమ చేసేందుకు అధికారులు ప్రయత్నించగా, అప్పట్లో ఒక ఎండీ దానిని తిరస్కరించారు. ప్రభుత్వ సొమ్మును ప్రైవేట్ బ్యాంకులో పెట్టడం శ్రేయస్కరం కాదంటూ నిర్ణయం తీసుకున్నారు. కానీ మార్క్‌ఫెడ్ మాత్రం ప్రభుత్వ సొమ్మును ప్రైవేట్ బ్యాంకుల్లో పెట్టి కొందరు అధికారులు కమీషన్ల కోసం కక్కుర్తి పడడం వల్లే ఇదంతా జరుగుతుందన్న చర్చ జరుగుతోంది. గతంలో ఇక్కడ పనిచేసిన ఇద్దరు అధికారులు, ప్రస్తుతం పనిచేస్తున్న ముగ్గురు అధికారులు అక్రమాల్లో పాలుపంచుకున్నట్టు తెలిసింది.

ఇక్కడ రుణాలు...అక్కడ జమ

- ➡ మార్క్‌ఫెడ్ ప్రభుత్వ పూచీకత్తుతో పంట ఉత్పత్తుల కొనుగోలుకు జాతీయ బ్యాంకులు, వివిధ ప్రభుత్వ సంస్థల్లో రుణాలు తీసుకొస్తుంది.
- ➡ అలా తీసుకొచ్చిన రుణాలను అవే జాతీయ బ్యాంకుల్లో జమ చేయకుండా, ప్రైవేట్ బ్యాంకుల్లో ఎందుకు జమ చేస్తున్నారన్నది ప్రశ్న.
- ➡ పోనీ డిపాజిట్లు జమ చేసిన ప్రైవేట్ బ్యాంకు ఏమైనా రుణాలు ఇస్తున్నాయా అంటే అదేమీ లేదు.
- ➡ కొనుగోలు చేసిన పంటలను తిరిగి టెండర్లు వేసి విక్రయిస్తారు. అలా విక్రయించగా వచ్చిన సొమ్మును కూడా ప్రైవేట్ బ్యాంకుల్లోనే జమ చేస్తున్నారు.
- ➡ ఇలా ఒక ప్రైవేట్ బ్యాంకులోనే అధికంగా జమ చేస్తుండటంపై ఆరోపణలు వస్తున్నాయి.
- ➡ ఎరువులను అమ్మగా వచ్చిన సొమ్ము కూడా ప్రైవేట్ బ్యాంకుల్లోనే ఉంచుతున్నారు. ఇలా వందల కోట్ల రూపాయలు ప్రైవేట్ బ్యాంకులో జమ అవుతున్నాయి. బ్యాంకుకు కోట్ల రూపాయల లాభాలు వస్తున్నాయి.

ఇన్‌స్టంట్ రిజిస్ట్రేషన్

75 గజాల్లోపు భవన నిర్మాణ అనుమతిపై అర్వింద్‌కుమార్ ట్వీట్



సాక్షి, హైదరాబాద్: ప్లాట్ ఏరియా 75 చదరపు గజాల లోపు ఉండే జీ+1 భవన నిర్మాణ అనుమతికి నాలుగు సులభమైన మార్గాలు ఉన్నాయని ప్రభుత్వ ప్రత్యేక ప్రధానకార్యదర్శి అర్వింద్‌కుమార్ పేర్కొన్నారు. టీఎస్ బీపాస్ ద్వారా ఈ రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేయవచ్చని తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన ట్వీట్ చేశారు. మొదట వివరాలు నమోదు చేసి, ఆ తర్వాత సెల్ఫ్ డిక్లరేషన్ ఇవ్వాలని, ఆపై ఎలాంటి రుసుము లేకుండా దరఖాస్తు అప్‌లోడ్ చేసి, పర్మిట్ డౌన్‌లోడ్ చేసుకోవడం ద్వారా 'తక్షణ భవన నిర్మాణ రిజిస్ట్రేషన్'ప్రక్రియ పూర్తవుతుందని చెప్పారు.

జూనియర్ అసిస్టెంట్ గ్రేడ్-2 పరీక్ష రద్దు

సింగరేణికి హైకోర్టు షాక్



సాక్షి, హైదరాబాద్: సింగరేణి యాజమాన్యానికి హైకోర్టు షాక్ ఇచ్చింది. గత సంవత్సరం నిర్వహించిన జూనియర్ అసిస్టెంట్ గ్రేడ్-2 పరీక్షను రద్దు చేసింది. నిర్వహణలో పలు అవకతవకల కారణంగా పరీక్షను రద్దు చేస్తున్నట్లు స్పష్టం చేసింది. అన్ని జాగ్రత్తలు తీసుకుని, నిబంధనలను కఠినంగా అమలు చేస్తూ పరీక్షను మళ్లీ నిర్వహించాలని తేల్చిచెప్పింది. అభ్యంతరాలన్నింటినీ పరిగణనలోకి తీసుకున్న తర్వాతే తుది కీ విడుదల చేయాలని సంస్థను ఆదేశించింది. ఈ మేరకు ప్రధాన పిటిషన్‌ను అనుమతిస్తూ తుది తీర్పు వెలువరించింది. అలాగే స్టే ఎత్తివేయాలంటూ దాఖలైన మధ్యంతర అప్లికేషన్లను కొట్టివేసింది. సింగరేణి వ్యాప్తంగా 177 జూనియర్ అసిస్టెంట్ గ్రేడ్-2 పోస్టులను భర్తీ చేసేందుకు 2022, సెప్టెంబర్ 4న నిర్వహించిన పరీక్షకు 79,898 మంది హాజరయ్యారు. ఆ తర్వాత సింగరేణి 'కీ'ని విడుదల చేయలేదు. ఈ నేపథ్యంలో పరీక్ష సందర్భంగా మాస్ కాపీయింగ్, ఇతర అవకతవకలు జరిగాయంటూ రామగుండంకు చెందిన అభిలాష్ సహా పలువురు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై గతంలో విచారణ జరిపిన న్యాయస్థానం, తీర్పు వెలువరించే వరకు ఫలితాలను వెల్లడించవద్దని సింగరేణి యాజమాన్యాన్ని ఆదేశించింది. ఈ పిటిషన్‌పై మరోసారి జస్టిస్ మాధవీదేవి విచారణ చేపట్టి.. తీర్పు వెలువరించారు. పరీక్షను పకడ్బందీగా నిర్వహించలేదని భావించిన న్యాయమూర్తి.. రద్దు చేస్తున్నట్లు స్పష్టం చేశారు.

చదువుకోవాలా..? బాత్‌రూంలు క్లీన్ చేయాలా?

- వైస్ ప్రిన్సిపాల్ మాకొద్దంటూ విద్యార్థినుల ఆందోళన
- ఉట్నూర్ గిరిజన సంక్షేమ కళాశాలలో ఘటన



కళాశాల బయట బైఠాయించి ఆందోళన చేస్తున్న విద్యార్థినులు


ఉట్నూర్‌రూరల్: 'మేము చదువుకోవాలా..? లేక బాత్‌రూంలు క్లీన్ చేయాలా'' అంటూ విద్యార్థినులు ఆందోళనకు దిగారు. ఈ ఘటన ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్‌లోని కేబీ ప్రాంగణంలోని గిరిజన సంక్షేమ గురుకుల బాలికల జూనియర్ కళాశాలలో మంగళవారం చోటు చేసుకుంది. వైస్‌ప్రిన్సిపాల్ తమను ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపిస్తూ ఆగస్టు15వ తేదీన ఐటీడీఏ పీఓకు వినతిపత్రం అందించినా, ఎలాంటి మార్పు రాలేదంటూ గేటు బయటకు వచ్చి నిరసన వ్యక్తం చేశారు.పోలీసులు, వైస్ ప్రిన్సిపాల్ భూలక్ష్మి విద్యార్థినులను ఎంత బతిమిలాడినా వారు వినిపించుకోకుండా ఆందోళన కొనసాగించారు. విషయం తెలుసుకున్న గురుకులాల రీజినల్ కోఆర్డినేటర్ గంగాధర్ అక్కడకు చేరుకున్నారు. విద్యార్థినులను సముదాయించే ప్రయత్నం చేశారు. చివరకు వారు కళాశాల ప్రాంగణంలోకి వచ్చి ఆందోళన కొనసాగించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు మాట్లాడుతూ, వైస్ ప్రిన్సిపాల్ భూలక్ష్మి తమతో బాత్‌రూంలు శుభ్రం చేయిస్తుందని, స్నానపు గదులకు తలుపులు లేకపోవడంతో తలుపులు బిగించాలని ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడం లేదన్నారు. మంచినీరు అందుబాటులో లేదని, అనారోగ్యానికి గురైతే సిక్‌రూం ఏర్పాటు చేయడం లేదని ఆరోపించారు. కొద్ది రోజుల క్రితం ఓ విద్యార్థిని తీవ్ర అనారోగ్యం పాలైనా చూసేవారు లేక ఇబ్బందులు పడ్డామని ఆరోపించారు. రీజినల్ కోఆర్డినేటర్ స్పందిస్తూ తక్షణమే పీఓ దృష్టికి తీసుకువెళ్లి వైస్ ప్రిన్సిపాల్‌పై చర్యలు తీసుకుంటామని ప్రకటించారు. వైస్ ప్రిన్సిపాల్‌ను ట్రాన్స్‌ఫర్ చేయాలని విద్యార్థినులు డిమాండ్ చేశారు. విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని గంగాధర్ చెప్పడంతో వారు శాంతించారు. ఈ విషయమై వైస్ ప్రిన్సిపాల్ భూ లక్ష్మిని వివరణ కోరగా.. తనపై కావాలని ఆరోపణలు చేస్తున్నారని ఎవరినీ ఇబ్బంది పెట్టలేదన్నారు.

రైతుల కోసం తన్నులు తిన్నా: ఎర్రబెల్లి



పామాయిల్ ఫ్యాక్టరీకి శంకుస్థాపన చేస్తున్న మంత్రి దయాకర్‌రావు

సాక్షి, మహబూబాబాద్: 'నేను రైతు కుటుంబం నుంచి వచ్చిన వాడిని.. రైతులకోసం.. గోదావరి జలాలకోసం బాబ్లీ ఆనకట్ట నిర్మాణం ఆపేందుకు పోరాటం చేసినం. మహారాష్ట్ర పోలీసులతో తన్నులు కూడా తిన్నా.. ఇప్పటికీ నడుస్తుంటే పోలీసులు కొట్టిన దెబ్బలు నొప్పి పెడతాయి' అని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలం గోపాలగిరి వద్ద రూ.200 కోట్లతో నిర్మించే పామాయిల్ ఫ్యాక్టరీకి మంగళవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కాంగ్రెస్ పాలకులు అరవై సంవత్సరాల్లో రాష్ట్రాన్ని, దేశాన్ని సర్వనాశనం చేశారని, ఇప్పుడు కూడా తిరిగి ప్రజలకు మాయ మాటలు చెబుతున్నారన్నారు. రాష్ట్రంలో అశ్వారావుపేట, సిద్దిపేటలో ఇప్పటివరకు పామాయిల్ ఫ్యాక్టరీలు ఉన్నాయని, ఇప్పుడు మహబూబాబాద్ జిల్లాలో మరో ఫ్యాక్టరీ నిర్మించడం ఇక్కడి రైతుల అదృష్టమన్నారు. కార్యక్రమంలో వరంగల్ ఎంపీ దయాకర్, మహబూబాబాద్ ఎమ్మెల్యే శంకర్ నాయక్, ఆయిల్‌ఫెడ్ చైర్మన్ రామకృష్ణారెడ్డి, ఎండీ సురేందర్, జీఎం సుధాకర్‌రెడ్డి, కలెక్టర్ శశాంక పాల్గొన్నారు.



మూసీ గేటు ఎత్తడంతో దిగువకు పోతున్న నీరు

'మూసీ'కి పెరిగిన ఇన్‌ఫ్లో.. ఒక గేటు ఎత్తివేత

కేతేపల్లి: నల్లగొండ జిల్లా కేతేపల్లి మండల పరిధిలోని మూసీ ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో పెరిగింది. దీంతో మంగళవారం అధికారులు ప్రాజెక్టు ఒక గేటును ఎత్తి దిగువకు నీటిని వదిలారు. హైదరాబాద్ నగరంతో పాటు మూసీ ఎగువ ప్రాంతాల్లో అక్కడక్కడ కురుస్తున్న వర్షాలతో మూసీ ప్రాజెక్టుకు 892 క్యూసెక్కుల వరదనీరు వస్తోంది. మూసీ గరిష్ట నీటిమట్టం 645 అడుగులు కాగా.. ప్రస్తుత నీటిమట్టం 644.10 అడుగులు ఉంది. దీంతో అధికారులు ఒక క్రస్టు గేటును ఒక అడుగు మేర ఎత్తి 609 క్యూసెక్కుల నీటిని దిగువకు వదిలారు. ఆయకట్టులో పంటల సాగు కోసం ప్రాజెక్టు కుడి, ఎడమ ప్రధాన కాల్వల ద్వారా 509 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. మూసీ రిజర్వాయర్‌లో పూర్తిస్థాయి నీటినిల్వ సామర్థ్యం 4.46 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 4.22 టీఎంసీల నీరు నిల్వ ఉందని అధికారులు తెలిపారు.

మోత్కుపల్లికి పోటీ చేసే అవకాశమివ్వాలి

తెలంగాణ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు ప్రసాద్ సగరపు

సాక్షి, హైదరాబాద్ : దళితుల అభివృద్ధికి నిరంతరం పరితపించే మోత్కుపల్లి నర్సింహులుకు ఉమ్మడి నల్లగొండ జిల్లాలో శాసనసభ్యుడిగా పోటీచేసే అవకాశం కల్పించాలని తెలంగాణ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సగరపు ప్రసాద్ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావును కోరారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ...దళితులను వ్యాపారవేత్తలుగా మార్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన దళితబంధు పథకం రూపకల్పనలో మోత్కుపల్లి కీలక పాత్ర పోషించారన్నారు. దళితవర్గానికి చెందిన నేతగా గత 45 ఏళ్లలో ఆరుసార్లు ఎమ్మెల్యేగా, మంత్రిగా బాధ్యతలు నిర్వహించారని చెప్పారు. అలాంటి నేతకు సీఎం కేసీఆర్ ఎమ్మెల్యేగా పోటీచేసే అవకాశం కల్పించి ఆయన సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇటీవల రాజ్యసభ, ఎమ్మెల్సీ ఎన్నికల్లో మోత్కుపల్లికి ప్రాధాన్యత ఇవ్వనప్పటికీ సీఎం కేసీఆర్‌పై పూర్తి నమ్మకంతో పార్టీలో కొనసాగుతున్నారని చెప్పారు.

Published and Printed by V. Murali, on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527, T.G., and Printed at Jagati Publications Limited Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527 T.G., Editor: V. Murali(Responsible for selection of News under the PRB Act), Phone No. 0878 - 2223017, Fax No. 0878 – 2223019. RNI Regn No. TELTEL/2008/23800.